

PSBH

# తెలుగు వారి వారసత్వం

ఈమని శివనాగిరెడ్డి

రాచర్ల గణపతి

394
గణప - తెలుగు
118756

118756

# తెలుగువారి వారసత్వం

# తెలుగువారి వారసత్వం

రచన

***ఈమని శివనాగిరెడ్డి***
***రాచర్ల గణపతి***


**PSBH ప్రజాశక్తి బుక్‌హౌస్**

*27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, రాఘవయ్యపార్కు వద్ద*

*విజయవాడ - 520 002. ఫోన్ : 9490099202*

394
గణపు - తెలుగు

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
ACC No. 118756
[illegible], హైదరాబాద్ - 5000[illegible]

PSBH

ప్రచురణ సంఖ్య : 1408

ప్రథమ ముద్రణ : ఏప్రిల్, 2016

వెల : ₹. 150/-

C. 12635

ప్రతులకు

PSBH

ప్రజాశక్తి బుక్‌హౌస్

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట,
విజయవాడ -2, ఫోన్ : 0866 -577533,

బ్రాంచీలు

విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు,
ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు

ముద్రణ

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ

website : www.psbh.in

psbhap@gmail.com

123483

# సందేశం

ఏ జాతికైనా ఒక చరిత్ర వుంటుంది. ఆ చరిత్ర ఒక సంస్కృతితో ముడిపడి వుంటుంది. ఒక్కో ప్రాంతంలో, ఒక్కో జాతి ఒక్కో భాష మాట్లాడుతుంది. సుత్తనిపాతంలోని పారాయణ వగ్గలోని బావరి అనే ముని ఇతివృత్తంలో బుద్ధుని కాలంలోనే 'అస్సక' అనే జనపదం తెలుగు జనపదంగా గుర్తింపు పొందింది. ఇప్పటి నిజామాబాద్ జిల్లా బోధన్ ఆనాటి అస్సక జనపదానికి రాజధాని. ఇది క్రీ.పూ. 5వ శతాబ్ది నాటి మాట. కరీంనగర్ జిల్లా కోటలింగాల త్రవ్వకాల్లో బయల్పడిన శాతవాహనుల కంటే ముందరి నాణేలపై గల పేర్లు తెలుగులో ఉండటం విశేషం. ఈ నాణేలు క్రీ.పూ. 4–3 శతాబ్దాలకు చెందినవి. క్రీ.పూ. 3వ శతాబ్ది నాటి భట్టిప్రోలు ధాతుపేటికలపైగల ప్రాకృత శాసనాల్లో అనేక తెలుగు పదాలున్నాయి. ఇలా చూస్తే తెలుగువారి లిఖిత చరిత్ర క్రీ.పూ.500ల సం॥ల నాడు ప్రారంభమైనా, క్రీ.పూ.50,000 సం॥ల నాటి రాతిపనిముట్లు, శిలాయుగపు చిత్రకళ, చరిత్ర పూర్వయుగంలో కూడా తెలుగువారు వెలుగులీనారని తెలిపే అనేక ఆధారాలు దొరికాయి.

ఏ ప్రాంత చరిత్ర, సంస్కృతుల పట్ల ఆ ప్రాంత ప్రజలకు మక్కువ వుంటుంది. మమకారం కూడా వుంటుంది. అయితే వారి పుట్టుపూర్వోత్తరాలు, సంస్కృతి, సంప్రదాయాల గురించి అందరికి అవగాహన ఉన్నపుడే ఘనమైన వారి వారసత్వాన్ని కాపాడుకోవాలన్న తపన పుడుతుంది. విద్యార్థిదశ నుంచే గ్రామాలు, పట్టణాలు, నగరాల చరిత్రను, కట్టడాలను,కళలను గురించి వివరించినప్పుడే వారసత్వ పరిరక్షణలో అందరూ భాగస్వాములౌతారు. విద్యార్థులను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే. అందుకనే ముందుగా ఉపాధ్యాయులకు వారసత్వ సంపద గురించి తెలియజెప్పి, వారి ద్వారా విద్యార్థులకు తెలియజేయాలన్న సంకల్పంతో ఉపాధ్యాయ, విద్యార్థులకు చేదివ్వెగా ఉపయోగపడాలన్న ఉద్దేశ్యంతో తెలుగు వారి వారసత్వం అన్న పుస్తకాన్ని తీసుకురావటం నాకెంతో సంతోషంగా వుంది.

అనుకోగానే ఆ ఆలోచనకు ఒక రూపాన్ని కల్పించి, ఆచరణకు పూనుకొన్న రచయితలు – ఈమని శివనాగిరెడ్డి, స్థపతి, డా.రాచర్ల గణపతికి నాఅభినందనలను తెలియజేస్తున్నాను. ఈ పుస్తకం మరింత ఆదరణ పొంది మరెన్నో ముద్రణలకు నోచుకోవాలని ఆశిస్తున్నాను.

**ఉగాది, 08.04.2016,**
**హైదరాబాద్.**

**చెన్నూరు ఆంజనేయరెడ్డి,** ఐ.పి.యస్.(రి)
అధ్యక్షులు, ధర్మదీపం ఫౌండేషన్

# ముందుమాట

తెలుగు భాష మాట్లాడేవారంతా తెలుగువాళ్ళే. తెలుగునేల సరిహద్దుల అవల వున్న పొరుగు వారి భాష కొన్ని సార్లు తెలుగులో వచ్చి చేరుతుంది. అంతేకాక, రాయలసీమలో తమిళ,కన్నడ భాషలు, తెలంగాణాలో ఉర్దూ, కన్నడ భాషలు, ఉత్తరాంధ్రలో ఒడిషా భాష, ఉత్తర తెలంగాణాలో మరాఠీ, హిందీ భాషల మాటలు కొన్ని చేరాయి. అయినా ఆ భాష తెలుగు భాషే. అలాగే రాయలసీమ, తీరాంధ్ర, తెలంగాణాల్లో మూడు ప్రాంతాల్లో మూడు రకాల యాసలతో తెలుగుభాషను మాట్లాడుతారు. తల్లిభాషగా తెలుగును మాట్లాడేవారంతా తెలుగువారే. శ్రీకాకుళం నుంచి చిత్తూరుదాకా, ఆదిలాబాద్ నుంచి అనంతపూర్ దాకా ఉన్న ప్రాంతమంతా తెలుగు ప్రాంతమే.

వారసత్వమంటే వరుసగా అందివచ్చిన సంస్కృతి. సంస్కృతి అంటే ఆచార వ్యవహారాలు, ఇల్లు, వాకిళ్ళు, కోటలు, గోడలు, ఆలయాలు, మండపాలు,గోపురాలు,స్థూపాలు,చైత్యాలు, గుహలు,గుడారాలు, శిల్పం, చిత్రలేఖనం, ముగ్గులు, వంటావార్పూ, నేతలు, రాతలు, పండుగలు, పబ్బాలు, గిరిజన, జానపద సంగీత, సాహిత్యాలు, ఆటలు, పాటలు, చేతికళలు ఇలా తెలుగువారి మొత్తం జీవన విధానమే తెలుగు సంస్కృతి. తరతరాలుగా ఈ అంశాలన్నీ కొనసాగుతూ,కొన్ని కొన్ని సందర్భాల్లో మార్పు చెందుతూ,కొత్త కొత్త రూపుల్ని సంతరించుకుంటూ, తెలుగు వారి వారసత్వ సంపదగా గుర్తింపు పొందాయి.

వారసత్వ సంపద రెండు రకాలు. ఒకటి ప్రకృతి పరంగా వున్న కొండలు,కోనలు, వాగులు, వంకలు,చెట్టూ చేమలు, గాలి, నీరు, పశువులు, పిట్టలు ఇతర జీవరాశిని కలిపి ప్రాకృతిక వారసత్వ సంపద అంటారు. మరొకటి, మనుషులు సృష్టించుకున్న సాంస్కృతిక వారసత్వ సంపద. సాంస్కృతిక వారసత్వ సంపద మళ్ళీ రెండు రకాలు.కంటికి కనిపించే కట్టడాలు, శిల్పాలు, వస్త్రాలు కనిపించే వారసత్వ

సంపద కిందకు వస్తాయి. రెండోరకంలో మనిషిలో వున్న నైపుణ్యాన్ని ప్రదర్శిస్తే గాని కంటికి కనిపించదు. సంగీతం, నృత్యం, ఇతర వృత్తిపరమైన నైపుణ్యాలు (కర్రసాము, కత్తిసాము, ఆటలు, పాటలు, విలువిద్య, వంటలు లాంటివి) ఈ కోవకు చెందుతాయి.

తెలుగునేలపై చరిత్ర పూర్వయుగం నుంచీ ఇటీవలి 100 సం॥ల క్రితం దాకా నిర్మించబడిన, సృష్టించబడిన కంటికి కనిపించే, ప్రదర్శిస్తే గాని కనిపించని వారసత్వం ఎంతో వుంది. ముందుగా ఆదిమానవుని అడుగుజాడలు, రాతియుగం నుంచి మధ్యానంతర యుగం దాకా జరిగిన చరిత్ర, సంఘటనలు, బ్రతుకు తెరువుల సమాహారమే ఈ ప్రయత్నం. అందరూ ప్రాంతాలకతీతంగా, భాషాబేధం లేకుండా ఈ తెలుగుల వారసత్వ పొత్తాన్ని పొత్తిళ్లలో పెట్టుకుంటారనీ, హృద్యంగా అమ్మలా ముద్దులిడతారనీ, లోపాలను నిర్మొహమాటంగాఎత్తిచూపుతారనీ,వినమ్రంగా వేడుకొంటూ.. ఈ పుస్తకాన్ని ముద్రించిన ప్రజాశక్తి బుక్‌హౌస్, యాజమాన్యం, వారికి ధన్యవాదాలు తెలుపుకొంటూ...

**ఉగాది, 08.04.2016**
**హైదరాబాద్.**

– ప్రొ. ఈమని శివనాగిరెడ్డి – స్థపతి
సీఈవో, ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ.

# కృతజ్ఞతలు

తెలుగువారి వారసత్వంపై అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులకు ఉపయోగకరంగా ఒక పుస్తకాన్ని తెస్తే బాగుంటుందని సూచించిన ప్రాథమిక విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి శ్రీమతి చందన ఖాన్, ఐ.ఎ.యస్.,గారికి, శ్రీ ఎ. సత్యనారాయణరెడ్డి, సంచాలకులు, యస్.సి.ఇ.ఆర్.టి. గారికి మరియు ప్రొ. యన్. ఉపేందర్‌రెడ్డి, శాఖాధిపతి, విద్యాప్రణాళిక పాఠ్యపుస్తక అభివృద్ధి విభాగం, యస్.సి.ఇ.ఆర్.టి. గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ పుస్తక రచనలో తమ అనుభవాలను క్రోడీకరించి సలహాలందించి సహకరించిన ఆత్మీయులు, చారిత్రక కట్టడాలు, ఆనవాళ్ళు, ఆలయాలు,శిల్ప సంపద మొదలైన పురాతత్వ సమాచారము మరియు చిత్రసంపదను అందించిన డా॥ జి.వి. రామకృష్ణారావు, సంచాలకులు, రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాలల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గారికి, శ్రీ ఎ. కృష్ణయ్య, పురాతత్త్వ సర్వేక్షణాధికారి, కేంద్ర పురాతత్త్వ సర్వేక్షణ, హైదరాబాద్ సర్కిల్ గారికి, ప్రొ. పి. చెన్నారెడ్డి, పూర్వ సంచాలకులు, పురావస్తుశాఖ, ప్రొ. జయధీర్ తిరుమల రావుగారికి, జానపద విజ్ఞానానికి సంబంధించిన సమాచారం, చిత్రాలనందించిన ప్రొ. భట్టు రమేష్, పీఠాధిపతి, జానపద గిరిజన పీఠం, శ్రీ ఎ.మల్లికార్జున్, ప్రాజెక్ట్ అసిస్టెంట్, శ్రీ సతీష్, ఫొటోగ్రాఫర్, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, వరంగల్ గార్లకు, డా. యం.సాంబయ్య, చరిత్ర శాఖాధిపతి, సి.కె.యం. కళాశాల, వరంగల్ గారికి, డా. బి. సుబ్రహ్మణ్యం, రాష్ట్ర పురావస్తుశాఖ విశ్రాంత ఉపసంచాలకులు (సాంకేతిక), శ్రీ కె.యస్.బి. కేశవ, ఉప సంచాలకులు (ప్రదర్శనశాలలు) గారికి, శ్రీ జి. వెంకటరత్నం, ఉప సంచాలకులు (శాసన విభాగం) గారికి, శ్రీ జి. నరసింహారావు, సీనియర్ ఫొటోగ్రాఫర్ గారికి ధన్యవాదాలు. రచనలో సహకారం అందించిన డా. పి.శంకర్, లెక్చరర్, శ్రీ టి. రవీందర్, లెక్చరర్, డైట్ వరంగల్, శ్రీ సువర్ణ వినాయక్, కోఆర్డినేటర్, శ్రీ యం. పావయ్య, లెక్చరర్, యస్.సి.ఇ.ఆర్.టి., శ్రీ యం. నరసింహారెడ్డి,

ప్రధానోపాధ్యాయులు, డా. సురేష్, స్కూల్ అసిస్టెంట్, శ్రీ అయాచితుల లక్ష్మణరావు, స్కూల్ అసిస్టెంట్, శ్రీ రథంగపాణిరెడ్డి, స్కూల్ అసిస్టెంట్, శ్రీ పి. శ్రీనివాస్, స్కూల్ అసిస్టెంట్, శ్రీ కె. కుమారస్వామి, స్కూల్ అసిస్టెంట్, శ్రీ ఉండేటి ఆనందకుమార్, స్కూల్ అసిస్టెంట్, రేమిడి బాపురెడ్డి మరియు శ్రీ జి. రాము, ప్రధానోపాధ్యాయులు, నా తోటి సహోపాధ్యాయులు, జడ్.పి. హెచ్.యస్., లాదెళ్ళ గార్లకు, నా సహరచయిత ప్రొ॥ ఈమని శివనాగిరెడ్డి గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ...

**ఉగాది, 08.04.2016** — *డా. రాచర్ల గణపతి*

**హైదరాబాద్.**

# ఈ పుస్తకంలో...


- సందేశం ...
- ముందుమాట...
- కృతజ్ఞతలు...

1 చరిత్ర పూర్వయుగం 15
పాతరాతియుగం - మధ్యరాతియుగం - కొత్తరాతియుగం - రాగిరాతియుగం
ఇనుపయుగం.

2 చారిత్రక తొలియుగం 26
మౌర్యులు - శాతావాహన ముందరి తెలుగురాజులు - శాతావాహనులు - ఇక్ష్వాకులు బృహత్ఫలాయనులు - తొలి పల్లవులు - ఆనందగోత్రినులు - శాలంకాయనులు - విష్ణుకుండినులు

3 చారిత్రక తొలిమధ్యయుగం 56
బాదామీ చాళుక్యులు - వెంగీ చాళుక్యులు - రేనాటి చోళులు - రాష్ట్రకూటులు వేములవాడ చాళుక్యులు - ముదిగొండ చాళుక్యులు - నోలంబులు - కళింగగాంగులు - బాణులు, వైదుంబులు

4 చారిత్రక మధ్యయుగం 88
కళ్యాణచాళుక్యులు - చాళుక్యచోళులు - వెలనాటిచోళులు - కందూరుచోడులు - నెల్లూరు తెలుగు చోడులు.

**5 కాకతీయులు** **98**

సామంత పాలకులు – స్వతంత్రరాజులు – రుద్రదేవ మహారాజు – గణపతిదేవ మహారాజు – రుద్రమదేవి – ప్రతాపరుద్రుడు – ముస్లింల దండయాత్రలు – సామ్రాజ్యపాలన – ప్రాంతీయపాలన – గ్రామపాలన – సామాజిక మత పరిస్థితులు – ఆర్థిక పరిస్థితులు – చెరువుల నిర్మాణం – సాహిత్యం – దేవాలయాలు

**6 కాకతీయుల తరువాతి రాజ్యాలు** **116**

ముసునూరి నాయకులు – రెడ్డిరాజులు – రేచర్ల వెలమనాయకులు.

**7 విజయనగర రాజులు–చక్రవర్తులు** **121**

సంగమవంశం – సాళువవంశం – తుళువ వంశం – అరవీటి వంశం – పరిపాలన –

ప్రాంతీయపాలన – అమరనాయకుల పాలన – గ్రామపాలన – తలవరులు – సాంఘిక మత పరిస్థితులు – ఆర్థిక పరిస్థితులు – ఓడరేవులు విదేశీ వ్యాపారం – నీటిపారుదల అభివృద్ధి చెరువుల నిర్మాణం – సాహిత్యం – దేవాలయాలు – కళలు.

**8 తరువాతి మధ్యయుగం** **137**

బహ్మనీ సుల్తానులు – పాలన – రాజ్యవిభాగాలు – ఇక్తాపద్ధతి.

కుతుబ్‌షాహీలు – పరిపాలన – సామాజిక, మత పరిస్థితులు – ఆర్థిక పరిస్థితులు – సాహిత్యం – కట్టడాలు – మొఘలుల పాలనలో తెలుగు ప్రాంతాలు – సర్వాయి పాపన్న – అసఫ్ జాహీలు – సామాజిక, మత పరిస్థితులు – ఆర్థిక పరిస్థితులు – కట్టడాలు.

సంస్థానాల పాలనలో తెలుగువారు.

9 తెలుగువారి వారసత్వ కట్టడాలు 166
దేవాలయాలు, చారిత్రక కోటలు

10 తెలుగు వారి శాసనాలు - లిపి 188

11 తెలుగువారి నాణేలు 202

12 తెలుగువారి వారసత్వానికి ప్రతిబింబాలు - ప్రదర్శనశాలలు 213
కేంద్ర ప్రభుత్వ పురావస్తుశాఖ మ్యూజియాలు
- రాష్ట్ర ప్రభుత్వ పురావస్తు మ్యూజియాలు.

13 తెలుగువారి శిల్పం 230

14 తెలుగువారి చేతికళలు 242

15 తెలుగువారి కళారూపాలు, ప్రదర్శనలు 256

16 తెలుగు వారి ఆటలు - పాటలు, నృత్యాలు 266

17 తెలుగువారి పండగలు, జాతర్లు 278

# 1 చరిత్ర పూర్వయుగం

## Prehistoric Period

మానవజాతి చరిత్రను చరిత్ర పూర్వ యుగం, చారిత్రక యుగంగా చరిత్రకారులు విభజించారు. లిపి అభివృద్ధి చెందని కాలాన్ని చరిత్ర పూర్వయుగంగానూ, లిపి వాడుకలోకి వచ్చిన తరువాతి కాలాన్ని చారిత్రక యుగంగా వివరించారు. పాతరాతి యుగం క్రీ.పూ. 1.5 లక్షల నుంచి 1.25 లక్షల సంవత్సరాలు, మధ్యపాతరాతి యుగం క్రీ.పూ. 1.25 లక్షల నుంచి 40 వేల సంవత్సరాలు, ఎగువ పాతరాతియుగం క్రీ.పూ. 40 వేల నుంచి 8000 సంవత్సరాలు, మధ్యరాతి యుగం క్రీ.పూ. 8000 నుంచి 3000 సంవత్సరాలు, కొత్తరాతి యుగం క్రీ.పూ.3000 నుంచి 1000 సంవత్సరాలు, ఇనుపయుగం క్రీ.పూ.1000-600 సంవత్సరాలుగా పురావస్తు ఆధారాల వల్ల విభజించారు. చరిత్ర పూర్వ యుగంలో మానవుడు అడవుల్లో జీవించాడు. అందుబాటులో ఉన్న వనరులతోనే జీవన పోరాటం సాగింది. ఆయా కాలాల్లో పనిముట్ల కోసం మనిషి ఉపయోగించిన ముడిసరుకు, పనిముట్ల స్వభావాలను బట్టి కాలాన్ని రాతి, రాగి, కంచు, ఇనుప యుగాలుగా విభజించారు. పురావస్తు పరిశోధనల్లో కర్నూలు, కడప, చిత్తూరు, నెల్లూరు, గుంటూరు, ఆదిలాబాద్, కరీంనగర్, నల్గొండ, అనంతపురం, కృష్ణా, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో రాతియుగపు ఆధారాలు లభించాయి. కడప జిల్లాలో సగిలేరు నదీలోయ ప్రాంతాలలోను, చిత్తూరు జిల్లాలో రాళ్ళ కాలువ నదీలోయ ప్రాంతాలలోను, గుంటూరు జిల్లాలోని కృష్ణా నదీలోయ ప్రాంతంలో, కారంపూడి, చేజెర్ల, నెల్లూరు జిల్లా వెంకటగిరి, అనంతపురం జిల్లా గుంతకల్లు, కర్నూలు జిల్లా వీరాపురం, సంగమేశ్వరం, బేతంచెర్ల, బిల్లసర్గం,

ప్రకాశంజిల్లా గిద్దలూరు, ఎర్రగొండపాలెం, గుంటూరు జిల్లా, కృష్ణా జిల్లా ఉస్తపల్లి, నల్గొండ జిల్లా ఏలేశ్వరం, నాగార్జునకొండ ప్రాంతాల్లో చేతి గొడ్డల్లతో పాటు, క్లీవర్లు, గోకుడు రాళ్లు, గులకరాతి పనిముట్లు లభించాయి. రేణిగుంట, ఎర్రగొండపాలెం ప్రాంతాల్లో బ్లేడ్, బ్యూరిన్ పరిశ్రమకు చెందిన గోకుడురాళ్ళు, పదునుపెట్టని అంచులున్న బ్లేడ్‌లు, బ్యూరిన్‌లు, బాణపు మొనలు లభించాయి. ఈ రాతి పనిముట్లతో పాటు, ఎముకలను చీల్చి ఆ ముక్కలతో చేసిన గోకుడు పనిముట్లు, బరమాలు, ఉలి అంచు మొనలు, సన్నని బరిశెల వంటి పనిముట్లు కూడా దొరికాయి. నాగార్జునకొండ, ఏలేశ్వరంలలో జరిపిన తవ్వకాల్లో పాతరాతి యుగం నుండి కొత్త రాతి యుగం వరకు నివసించిన మనుషుల నివాస స్థలాలు గుర్తించబడినాయి.

**రాతి పనిముట్లు చరిత్రను తెలియజేస్తాయి?**

అవును. ఆయా ప్రదేశాల్లో దొరికిన వివిధ రకాల పనిముట్లను, వాటి పరిమాణాలను బట్టి నాటి మానవుల జీవన విధానాన్ని అంచనావేయవచ్చు. ఆనాటి మానవులు నదీప్రవాహాల వెంట తిరుగుతూ సహజ సిద్ధంగా ఏర్పడిన కొండ గుహల్లో నివసిస్తూండేవారు. ఆహారం కోసం ఎక్కువగా జంతువులను వేటాడి సంచార జీవనం గడపటంతో, ఆ కాలాన్ని ఆహార సేకరణ దశ అన్నారు. వాతావరణం, జీవనగమనంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా స్థిరనివాసాలు ఏర్పరచుకొన్నారు. పంటలు పండించడం, జంతువులను మచ్చిక చేసుకోవడం, కొన్నింటిని వేటాడటం, చేపలు పట్టడం, తరువాత మట్టితో కుండలు చేయడం ద్వారా జీవించారు. మహబూబ్‌నగర్ జిల్లా, ఉట్నూరులో బంకమట్టితో నిర్మించిన గుండ్రని ఇండ్లు, గుంజలతో పశువుల కొట్టాలను కట్టుకున్నట్లు, పశువుల పేడను వంట చెరుకుగా వాడినట్లు తెలిపే ఆధారాలు లభించాయి. రాగి, కంచు, లోహ పరికరాలు వాడుతూ రంగులద్దిన మట్టికుండలను తయారుచేసుకొన్నట్లు కర్నూలు జిల్లాలో ఆధారాలు వెలుగుచూశాయి. నునుపైన పనిముట్లను వాడిన ఈ దశను తొలుత కొత్త రాతియుగంగాను, రాగి కూడా వాడకంలోకి రావటంతో తరువాత రాగి-రాతియుగంగాను పురావస్తు శాస్త్రజ్ఞులు పేర్కొన్నారు.

క్రీ.పూ. 1000 నుండి 600 సం॥ల మధ్య నివసించిన ప్రజలు రాక్షసగుళ్లుగా పిలువబడే సమాధులలో, అస్థికలతో పాటు చనిపోయిన వ్యక్తులు వారి జీవితకాలంలో వాడిన ఇనుప పనిముట్లు, బంగారు ఆభరణాలు, మట్టి పాత్రలు, రాగి పరికరాలను నిక్షిప్తం చేశారు. ఈ సమాధులను కట్టిన విధానాన్ని బట్టి వాటిని

కెయిర్న్‌లు, డాల్మెన్లు, మెన్హిర్‌లు, సిస్టులుగా పిలిచారు. ఉభయగోదావరి, కృష్ణా, ఖమ్మం, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, వరంగల్, కరీంనగర్, గుంటూరు, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఇటువంటి సమాధులు చాలా ఉన్నాయి. కొన్నిచోట్ల రాతి తొట్లలోనూ శవాలను పాతిపెట్టారు. ఏలేశ్వరంలో లభ్యమైన ఒక శవపేటికలో విచిత్రంగా స్త్రీపై పడుకొని ఉన్న పురుషుని అస్థిపంజరం బయల్పడింది. ఇలాంటి సమాధి ప్రపంచంలో మరెక్కడా బయల్పడలేదు. ఈ శవపేటికలో అస్థిపంజరాలతోపాటు బంగారు ఆభరణాలు, ఇనుప వస్తువులు, మట్టి కుండలు దొరికాయి. ఇప్పటివరకూ మనం చరిత్రను ఎలా విభజించిందీ, వాటి కాలాన్ని, నాటి మానవుల జీవన విధానాన్ని కొంత వరకు తెలుసుకోగలిగాం. ఇక పాత, మధ్య, కొత్తరాతియుగాలు, ఇనుపయుగం, మరియు చారిత్రక తొలియుగాల వివరాలను మరింత లోతుగా పరిశీలిద్దాం.

**పాతరాతి యుగం: (క్రీ.పూ.1.50 నుంచి 8 వేల సంవత్సరాలు)**

తెలుగు నేలపై ప్రాచీన మానవ నివాసాలు నదీతీరాలకు దగ్గరి ప్రాంతాల్లో ఎక్కువగా గుర్తించబడినాయి. గోదావరి, కృష్ణా ఉపనదులైన మంజీర, ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, కిన్నెరసాని, మూసీ, తుంగభద్ర, పాలేరు, సగిలేరు, మున్నేరు, పినాకిని, వంశధార నదీ తీరాలలో, కొండ ప్రాంతాల్లో ఆదిమ మానవుల ఆవాసాలు వెలుగులోకొచ్చాయి.


*పాతరాతి యుగపు రాతిగొడ్డళ్ళు*


చెకుముకి రాయి, స్ఫటికం, కురువింద శిలలతో బాణాలు, కత్తులు, బరిసెలు, గోకుడు రాళ్ళు, కొడవళ్ల తయారీకి ఉపయోగించారు. శరీరాన్ని కప్పుకోవడానికి, చెట్టుబెరళ్లను ఆకుల్ని, జంతువుల తోళ్లను ఉపయోగించారు. ఈ కాలంలో, ఎవరైనా చనిపోతే వారి శవాలను తామున్న ప్రదేశాల్లో అక్కడే పాతిపెట్టేవారు. తక్కువ నైపుణ్యంతో తయారైన రాతిగొడ్డళ్ల లాంటి పనిముట్లు ఎక్కువగా ఉపయోగించినందున, ఈ కాలాన్ని పాత రాతియుగం అన్నారు.


**మధ్యరాతి యుగం: (క్రీ.పూ.8 వేల నుంచి 3 వేల సంవత్సరాలు)**

దీనిని చిన్న (సూక్ష్మ) రాతి యుగమని కూడా అంటారు. ప్రాచీన శిలా యుగం కంటే పనిముట్లు, నునుపుగాను, పదునుగాను, ఉండేట్లు తయారు చేసుకొని,




శిలాయుగపు చిత్రకళ, కేతవరం




శిలాయుగపు చిత్రకళ



చిన్నరాతియుగపు పనిముట్లు


పాతరాతియుగం, కొత్తరాతియుగానికి మధ్యగల కాలానికి చెందిన ఈ దశను మధ్యరాతి యుగం అన్నారు. ఈ కాలంలోని మానవులు ఎత్తైన కొండ ప్రాంతాల్లో సురక్షిత స్థావరాలు ఏర్పర్చుకొని జంతువులను, చేపలను వేటాడుతూ కాలం వెళ్లబుచ్చారు.

**కొత్తరాతి యుగం: (క్రీ.పూ.3000-1000 సంవత్సరాలు)**



తెలుగు నేలపై ఈ కాలపు అవశేషాలు అనేక ప్రాంతాలలో గుర్తించబడినాయి. ముందు కొండగుహల్లోనూ, కొండచరియలకింద నివసించిన ఈ కాలపు ప్రజలు, తరువాత చుట్టిళ్లు కట్టుకొని స్థిరనివాసాలు ఏర్పరుచుకున్నారు. కొన్ని సందర్భాల్లు గుహల్లోనుంచి మైదానాల్లో నివసించేప్పుడు భూమిలో గుంటలను తవ్వుకొని వాటిలో కూడా నివసించారు. రాళ్లను చీల్చి నునుపుగాను, మెరుపు వచ్చేట్లుగా గొడ్డళ్లు, రెండు వైపులా పదును గల ఉలులు, సుత్తెలు, నాగటికర్రులు వంటి రాతిపనిముట్లు కొత్తగా తయారుచేసుకోవటంతో ఈ యుగాన్ని కొత్తరాతి యుగమన్నారు. పశువులను మచ్చికచేసుకొన్నారు. రాగులు, ఉలవలు, పెసలు మొదలైన పంటలను పండించి వండుకొని తిన్నారు. ఈ యుగంలో మానవులు ఆహార సేకరణ దశనుండి ఆహారాన్ని ఉత్పత్తి చేసే దశకు చేరుకొన్నారు.వెదుళ్ళ రాపిడితో నిప్పు పుట్టించేవారు. గుహల గోడల కప్పులపైన వేటాడే దృశ్యాలను ప్రకృతి సిద్ధంగా దొరికిన రంగులతో వేసుకొని తరువాత తరం వారికి వేటలో శిక్షణనిచ్చారు. కొత్తరాతియుగం తొలిదశలో చేతితోనూ, మలిదశలో సారెపైన అవసరాలకు తగ్గట్టు రకరకాల మట్టి పాత్రలను తయారుచేసుకొన్నారు. ఈ కాలానికి చెందిన గుంట ఆవాసాలు కాశ్మీర్‌లో బూర్జుహాంలోనూ, మహారాష్ట్రలోని ఇనాంగాంలోనూ, మనరాష్ట్రంలో నాగార్జునకొండ, గుండ్లూరులలోనూ బయల్పడినాయి.


**రాగి-రాతియుగం: (క్రీ.పూ.2000-1000 సంవత్సరాలు)**



మెదక్ జిల్లా
రిమ్మన్నగూడెంలో
దొరికిన రాగి మీసాల కత్తి
(యాంటెన్నాసోర్డ్స్)

కొత్తరాతి యుగపు చివరి రోజుల్లో మానవులు లోహన్ని కనిపెట్టి, లోహంతో రకరకాల పనిముట్లు తయారుచేసుకొన్నారు. మొదటిసారిగా రాగిని, అటుతరువాత కంచును కనిపెట్టి కత్తులు, గొడ్డళ్లు, చేపలను పట్టేగాలాలు, కాలికి తొడుక్కునే కడియాలు, చేతిగాజుల్లాంటి ఆభరణాలు తయారుచేసుకొన్నారు. ఇలాంటి ఆధారాలు మహబూబ్‌నగర్ జిల్లా చిన్నమారూరు, గుంటూరు జిల్లా నాగార్జునకొండ, గండ్లూరు, కర్నూలుజిల్లా రామాపురం బెలుంగుహలు మొదలైన చోట్ల దొరికాయి. ఈ కాలంలో మానవులు ఒకేచోట అనేక గుడిసెలలో కుదుళ్లుగా ఏర్పడి ఒక చిన్న గ్రామంగా ఏర్పరుచుకొన్నారు. మట్టిపాత్రల తయారీలో నైపుణ్యం సంపాదించి వాటిపై రంగులద్దుకొన్నారు. కుండ మెడభాగంలో తాడులాంటి డిజైన్‌లు వేసుకొన్నారు. రాగితో మధ్య ఈనె, రెండంచులూ సన్నగా ఉండే పొడవాటి కత్తులను కూడా తయారుచేసుకొన్నారు. పట్టుకోవడానికి వీలుగా పిడిభాగంలో అటూ ఇటూ రెండు కొనలుండటం వలన వీటిని మీసాల కత్తులనీ, యాంటెన్నా స్వోర్డులనీ పిలిచారు. క్రీ.శ. 2000-1000 సం॥ మధ్యకాలానికి చెందిన ఇలాంటి మీసాల కత్తులు గుంటూరు జిల్లా గుత్తికొండ బిలం లోనూ, కర్నూలు జిల్లా బెలుం గుహల్లోనూ, మెదక్‌జిల్లా ప్రజ్ఞాపూర్ దగ్గరలోని రిమ్మన్నగూడెం లోనూ గుర్తించబడినాయి. చనిపోయిన వారి అస్తికలను కుండల్లో పెట్టి, భూమిలో పాతిపెట్టేవాళ్లు, ఈ కాలపు ప్రజలు కూడా కొండ చరియల కింద నివసిస్తూ వీటిపై తాము వేటాడిన దృశ్యాలు, కొట్లాడిన సందర్భాలను సహజ సిద్ధమైన రంగులతో బొమ్మలను వేసుకున్నారు. మునుపటి కంటే మెరుగైన జీవితాన్ని గడిపిన రాగి-రాతి యుగపు ప్రజలు ఇనుమును కనుగొనడానికి కారకులైనారు.


**ఇనుప యుగం: (బృహత్ శిలాయుగం-క్రీ.పూ.1000-600 సంవత్సరాలు)**




రాతితో కప్పబడిన గుంత సమాధి, పోచంపాడు, నిజామాబాద్ జిల్లా

పెద్ద పెద్ద రాళ్లను గుండ్రంగా అమర్చి సమాధులను కట్టడం వల్ల ఈ యుగానికి బృహత్ శిలా యుగమని, ఇదే కాలంలో ఇనుమును కనిపెట్టడం వల్ల ఇనుపయుగమని కూడా పేరు వచ్చింది. ఇలాంటి సమాధుల్ని రాకాసిగుళ్ళు, రాక్షసబండలు, పాండవులగుళ్లని కూడా అంటారు. క్రీ.పూ. 1000 నుంచి 600 సంవత్సరాల కాలం వరకు ఈ సంస్కృతి తెలుగునేలపై విలసిల్లింది. చనిపోయిన వారి అస్తికలు గాని, శవాన్ని గాని సమాధిలో ఉంచి వారికి సంబంధించిన వస్తు సామాగ్రితో పూడ్చిపెట్టే వాళ్లు . రాతి పలకలతో సమాధులను నాలుగు వైపులా నిలిపి, దానిపైన ఒక పెద్ద రాతితో మూసేవారు. ఇలాంటి పెట్టెల్లో శవంతో పాటు వారువాడిన వస్తువులను కూడా ఉంచేవారు. ఇలా భూమిపై కట్టిన సమాధిని "డాల్మెన్" అంటారు. అలాకాకుండా గుంటను తవ్వి శవాలను భూమిలో పెట్టిన తరువాత పై భాగంలో చుట్టూ గుండ్రంగా పెద్ద పెద్ద రాతి గుండ్లను పేర్చి సమాధి ఆనవాళ్లను సురక్షితంగా ఉండేటట్లు చూస్తారు. దీన్ని "సిస్ట్ బరియల్" అంటారు. భూమిపైన పాతరలా గులకరాళ్లను అర్ధగోళాకారంగా ఏర్పరచేవాళ్లు. వీటిని కెయిర్న్ సర్కిల్లు అంటారు. కొన్ని సందర్భాల్లో ఈ సమాధుల దగ్గర మరణించిన వారికి గుర్తుగా రాతి స్థంభాలను కూడా నిలిపే వారు. చనిపోయిన వారు స్త్రీలైతే స్త్రీ బొమ్మను, పురుషులైతే పురుషుల బొమ్మలను కూడా ఈ నిలువు రాళ్లపై చెక్కారు.కొన్ని ప్రాంతాల్లో శిలువాకార రాతి స్థంభాలపై కూడా ఇలాంటి బొమ్మల్ని చెక్కారు. ఇలా సమాధులదగ్గర పాతిన నిలువు రాళ్లను మెన్‌హిర్లనీ, బొమ్మలు చెక్కిన నిలువురాళ్లను స్టాట్యూమెన్‌హిర్లనీ పిలిచారు. బ్రిటన్‌లోని స్టోన్‌హెంజ్, ఈస్టర్ ఐలాండ్‌లోని రాతి బొమ్మలు ఇనుపయుగంనాటివే.

ఇనుపయుగపు సమాధి, అందుగుల, మహబూబ్‌నగర్ జిల్లా (క్రీ.పూ. 1000)







గుంత సమాధిలో లభించిన ఎరుపు నలుపు రంగు మట్టిపాత్రలు మరియు అస్థిపంజరపు అవశేషాలు, ఉప్పేరు, మహబూబ్‌నగర్‌జిల్లా.



మట్టిశవ పేటిక, తెన్నేరు, కృష్ణాజిల్లా




అస్థికలుంచిన కుండ
శవపేటికలు, పెద్దమరూరు,
మహబూబ్‌నగర్‌జిల్లా



హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ఉన్న సమాధి, మెన్‌హిత్




శిలువ ఆకారంలో వున్న శిల (స్త్రీ), గలభ, గుండాల, ఖమ్మం జిల్లా



డాల్మెన్, దామరవాయి, వరంగల్ జిల్లా

తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో, డాల్మెన్‌లు, సిస్టులు వేల సంఖ్యలో వెలుగుచూశాయి. నల్లగొండ జిల్లా వాడపల్లి, శిరిపురం, వరంగల్ జిల్లా దామరవాయి, మల్లూరు, కొండవర్తి, చిట్యాలలో డాల్మెన్ రకం సమాధులు బయల్పడినాయి. కరీంనగర్ జిల్లా మెట్టపల్లి, నల్లగొండజిల్లా తిప్పర్తి, నల్లగొండ, ఏలేశ్వరం, రాయగిరి, తుమ్మల గూడెం, పాడిచేడు, సింగాపురం, దేవరుప్పుల, నడింపల్లి, కరీంనగరల్ జిల్లా వలిగొండ, హైదరాబాద్‌లోని మౌలాలి, కదంబాపురం, పెద్దమరూర్, వరంగల్ జిల్లా కొండపర్తి, దామరవాయి, మల్లూరు, మంగపేట, కాటారం కాటాపూర్ గంగారం తదితర ప్రాంతాల్లో సిస్ట్‌లతో పాటు కెయిర్న్ సర్కిల్లు కూడా బయటపడినాయి.

డాల్మెన్ సమాధుల పైకప్పు బండలకు రంధ్రాలుండుటవల్ల చనిపోయిన వారు సమాధి నుండి బయటికివచ్చి తిరుగాడి రంధ్రం ద్వారా లోనికి చేరుకుంటారని



బృహత్‌శిలాయుగపు శవపేటిక, కాటాపూర్, వరంగల్ జిల్లా

నాటి ప్రజలు విశ్వసించారు. సమాధి నిర్మాణ పద్ధతుల వలన అనాటి ప్రజలకున్న పితృదేవతారాధన గురించి తెలుస్తుంది. ఇనుముతోపాటు, ఈ కాలంలో బంగారం కూడా వాడకంలోకి వచ్చింది. ఇనుప పనిముట్లు, ఉక్కు పరికరాలు తయారు చేసి వ్యవసాయం, కమ్మరం, కుమ్మరం, వడ్రంగం లాంటి వృత్తులు ఏర్పడి ఆహారోత్పత్తి పెరిగి, మిగులకు దారితీసింది కూడా ఈ కాలంలోనే. స్థిరనివాసం ఏర్పరచుకొని నీటి వనరులకు దగ్గరగా నివసించడం అనాటి జీవన విధానాన్ని తెలియజేస్తుంది.

జనం ఎక్కువగా ఒకేచోట నివసించేవారని అవే మన దేశపు తొలి గ్రామాలనీ, వాటిని కలిపే బాటలు కూడా ఉండేవని, రవాణాకు బళ్లనువాడేవారని, భాషకూడా వృద్ధిచెంది చక్కటి సమాచార వ్యవస్థ ఉండేదని, మిగులు ఉత్పత్తులకు వస్తువినిమయ పద్ధతిలో అమ్ముకొనేవారని, అలా ప్రారంభమైన మార్కెటు స్థావరాలు పట్టణాలుగా ఏర్పడినాయనీ, రానూరానూ ఈ వ్యవస్థ కులపెద్ద, గ్రామ పెద్దరికాలకూ, తరువాత చారిత్రక తొలియుగంలో తొలి రాచరిక వ్యవస్థకు దారి తీసిందని పరిశోధనలు తెలియజేస్తున్నాయి.



*కొత్తరాతియుగం (తొలిదశ) చుట్టిళ్లు, హులికల్లు, అనంతపురం జిల్లా (క్రీ.పూ.**2100**)*

# 2 చారిత్రక తొలియుగం

(క్రీ.పూ. 600 - క్రీ.శ. 400 సంవత్సరాలు)

## Early Historic Period

రాతపూర్వక ఆధారాలున్న చరిత్రగల కాలాన్ని చారిత్రక తొలియుగం అన్నారు. ఇనుపయుగపు చివరి రోజుల్లో ప్రజలు పల్లెల్లోనేగాక పట్టణాల్లో కూడా నివసించారు. సరుకు రవాణాకూ, మనుషుల ప్రయాణానికి మొదలైన కాలిబాటలు రహదారులుగా మారాయి. దూరప్రాంతాలకు ప్రయాణం సులువైంది. ఎడ్లు, దున్నలు, గాడిదెలు, గుర్రాలతో బండ్లపై సరుకులతోపాటు మనుషులు కూడా ఒకచోటనుంచి మరొకచొటకు వెళ్లేవారు. వస్తువినిమయ పద్ధతి ఇబ్బందిగా ఉండటంతో మొదట గవ్వలు, ఆతరువాత లోహపు నాణేలు విలువకు మదింపుగా చెలామణిలోకి రావడం, మాట్లాడుకోవడానికి భాష పూర్తిగా ఏర్పడడమేగాక తొలిసారిగా అక్షరాలు కూడా రూపుదిద్దుకొని చరిత్రకు ఆనవాళ్లనందించిన కాలంగా దీనిని చారిత్రక తొలియుగం అన్నారు. ఈ యుగం క్రీ.పూ. 6వ శతాబ్దినుంచి క్రీ.శ.4వ శతాబ్దం మధ్యగల కాలాన్ని సూచిస్తుందని చరిత్రకారులు తేల్చారు.

ఈ కాలంలో ఉత్తర భారతదేశంలో మొత్తం 16 జనపదాలున్నాయని, మగధ తొలి రాచరికాన్ని అందించిందని, అదే సమయంలో తెలుగు నేలపై బోధన్ రాజధానిగా అస్మక జనపదం ఉండేదనీ, అటుతరువాత కరీంనగర్ జిల్లా కోటలింగాల ప్రముఖ రాజకీయ స్థావరంగా మారిందన్న ఆధారాలు దొరికాయి. ఈ కాలానికి వేదాలను ప్రమాణంగా భావించే బ్రాహ్మణమతం, వేదాలను, సృష్టికర్త దేవుణ్ణి అంగీకరించక ఆలోచనాస్వేచ్ఛ నిచ్చిన వైదికేతర మతాలైన చార్వాక, లోకాయత, ఆజీవక, శ్రమణ సంప్రదాయాలను ప్రజలు ఆదరించారు. శ్రమణ సంప్రదాయంలో భాగమైన జైన, బౌద్ధమతాలు మిక్కిలి ప్రజాదరణ పొందాయి.

చారిత్రక తొలి యుగంలో క్రీ.పూ. 4-3 శతాబ్దాల మధ్య పాలించిన మౌర్యులు, శాతవాహనులకంటే ముందరి తెలుగు రాజులు, శాతవాహనులు, ఇక్ష్వాకులు, తొలిపల్లవులు, విష్ణుకుండినులు, అనందగోత్రినులు, బృహత్పలాయనులు, శాలంకాయనులు వరుసగా తెలుగు నేలను పాలించారు.


**మౌర్యులు:**

దక్షిణాపథాన్ని జయించడంలో కృతకృత్యులైన మగధ రాజ్యపాలకుల్లో నందులు, మౌర్యులు మొదటివారు. క్రీ.పూ. 322 లో మౌర్య చంద్రగుప్తుడు మగధ సింహాసనాన్ని అధిరోహించిన తరువాత ఉత్తర భారతాన్నంతటిని తన ఆధీనంలోకి తెచ్చుకొని మైసూరు ప్రాంతాన్ని జయించినట్లు జైన సాహిత్యం ద్వారా తెలుస్తుంది. ఇదే కాలంలో పాటలీపుత్రంలోని గ్రీకు రాయబారి మొగస్తనీసు ఆంధ్రులకు (తెలంగాణతో కూడిన మొత్తం తెలుగువారికి) ముప్పై కోటలతో కూడిన నగరాలుండేవని, ఒక లక్ష మంది సైనికులు, గుర్రపు స్వారీలో ఆరితేరిన మరో రెండు వేల సైనికులతో పాటు, వెయ్యి ఏనుగుల దళం ఉండేదని తన గ్రంథంలో పేర్కొన్నాడు. అశోకుడి 13వ శిలాశాసనం, ఎర్రగుడి శాసనాల ప్రకారం ఆంధ్రులు మౌర్య సామ్రాజ్యంలో భాగంగా ఉన్నట్లు తెలియజేస్తున్నాయి. అశోకుడు పంపిన మహాదేవుడనే బౌద్ధాచార్యుడు మహిష మండలంలోని ధాన్యకటకం (అమరావతి)లో చైత్యవాద బౌద్ధాన్ని స్థాపించాడు. అక్కడి స్థూపం పునాదులు, దొరికిన శిలాశాసనం, భట్టిప్రోలు ధాతుపేటిక శాసనాలు ఇందుకు ఆధారాలుగా పేర్కొనవచ్చు. దంతపురం, అమరావతి తవ్వకాల్లో దొరికిన ఉత్తరాదికి చెందిన మెరిసే నల్లనిపాత్రలు (Northern Black Polished Ware) కూడా మౌర్యులపాలనను రుజువు చేసున్నాయి. మౌర్యుల తరువాత కొంచెం అటుఇటుగా, శాతవాహనులకంటే ముందు పాలించిన స్థానిక రాజులు, తరువాత శాతవాహనులు వరుసగా తెలుగునేలను పాలించారు.


**శాతవాహనుల ముందరి తెలుగు రాజులు:**

ఇంతకుముందు చెప్పుకున్నట్లు క్రీ.శ. 6వ శతాబ్దినాటికి ఉత్తరభారతదేశంలో 16 జనపదాలున్నాయని, వాటికి సమకాలీనంగా గోదావరి నది దక్షిణాన అస్మక జనపదముండేదనీ, దాని రాజధానిగా బోధన్ ఉండేదనీ, సాహిత్య మరియు చారిత్రక ఆధారాలున్నాయి. అంతేకాక, బుద్ధుని జీవితకాలంలోనే గోదావరితీరంలో వున్న బావరి అనే పండితుని 16 మంది శిష్యులు, బుద్ధుని కలిసి తెలుగునేలపై ధమ్మాన్ని వ్యాపింపజేశారని సుత్తనిపాతంలోని 'పారాయణవగ్గ' వల్ల తెలుస్తున్నది. కరీంనగర్,

నిజామాబాద్ ప్రాంతాలకు తొలిసారిగా బౌద్ధ ధమ్మం ప్రవేశించిందనటానికి ఇదొక ఉదాహరణ. నాణేల పరిశోధనలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన డా. దేమె రాజారెడ్డి పరిశోధనల్లో కృష్ణాజిల్లా సింగవరం, కరీంనగర్‌జిల్లా కోటలింగాల్లో దొరికిన నాణేలు ఇక్కడ క్రీ.పూ.6-5 శతాబ్దాల నాటికి స్థానిక జనపదాలున్నట్లు తెలియజేశాయి. అటుతరువాత రాష్ట్ర పురావస్తుశాఖ 1978లో కోటలింగాల వద్ద జరిపిన తవ్వకాల్లో శాతవాహనుల కంటే ముందు ఈ ప్రాంతాన్ని పాలించిన సమగోప, గోబధ, నరన, కంవాయ అనే రాజులుండేవారని వారు విడుదలచేసిన నాణేలు, చిముక శాతవాహనుని నాణేల దొరికిన పొరలకంటే కింది పొరల్లో దొరికినాయనీ, అందువల్ల శాతవాహన సామ్రాజ్య స్థాపకుడైన చిముకుని కంటే ముందు పాలించిన ఈ రాజులే తెలుగు నేల నేలిన తొలి రాజులని తేలింది.



శాతవాహనుల నొక్కుడు గుర్తులుగల నాణెములు, కోటలింగాల




మట్టికోటపై ఇటుక నిర్మాణాలు, కోటిలింగాల

తీరాంధ్ర ప్రాంతంలో శాతవాహనుల కంటే ముందే పాలించిన రాజాకుబిరక (భట్టిప్రోలు), రాజాసోమక (వడ్డమాను), రాజా ఐరమానసద (వేల్పూరు), రాజా అశోకు (శాలిహుండం)లను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించాలి. శాతవాహనుల కంటే ముందటి తెలుగు రాజులైన సమగోప, గోబధ, నరన, కంవాయులు తెలంగాణలోని కోటలింగాల నుంచి పాలించారనీ వారి తరువాత ఛిముక శాతవాహనుడు కూడా ఇక్కడి నుంచే శాతవాహన సామ్రాజ్యాన్ని స్థాపించినట్లు ఆధారాలున్నాయి. వీటి ఆధారంగా తెలుగువారి తొలి చరిత్రను నిర్మించడానికి వీలు చిక్కింది.

**శాతవాహనులు: (క్రీ.పూ. 1- క్రీ.శ. 3శతాబ్దాలు)**

మౌర్యుల తరువాత తెలుగునేలలోని తెలంగాణ ప్రాంతాన్ని సమగోప, గోబధ, నరన, కంవాయ అనే రాజులు శాతవాహనుల కంటే ముందరిగా కోటలింగాల రాజధానిగా పాలన సాగించిన విషయం తెలిసినదే. క్రీ. పూ. 1వ శతాబ్దంలో శాతవాహనుల పరిపాలన ప్రారంభం కావడంతో దక్షిణ భారతదేశం లో ముఖ్యంగా తెలుగునేలపై నిజమైన రాజకీయ చరిత్ర ప్రారంభమైందని భావించాలి.

శాతవాహనుడే వంశ మూలపురుషుడని ప్రారంభంలో అభిప్రాయపడినప్పటికీ, కోటలింగాలలో దొరికిన నాణేల ఆధారంగా ఛిముక శాతవాహనుడే ఆ రాజ వంశస్థాపకుడని తరువాత కాలంలో రుజువైంది. తొలి శాతవాహన రాజులలో ఎక్కువగా గుర్తింపు పొందిన రెండవ శాతకర్ణి, 50 సంవత్సరాలు పాలించి రాజ్యాన్ని విస్తరింపజేసి దక్షిణాపథపతి అనే బిరుదును కూడా పొందాడు. శాతవాహనుల్లో 15వ రాజైన పులుమావి సైనిక పాటవాన్ని పెంపొందించుకొని, క్రీ. పూ. 28వ సంవత్సరంలో మగధ పై దండెత్తాడు. శుంగ రాజ్యాన్ని నిర్మూలించి, పాటలీపుత్రంలో తెలుగు పతాకాన్ని ఎగరేశాడు. 17వ రాజైన హాలుడు



మెదక్ జిల్లా కొండాపూర్‌లో దొరికిన మట్టి చెవి దుద్దులు

సమకాలీన సామాజిక పరిస్థితులను ప్రతిబింబిస్తూ ప్రాకృత పద్యగాధలను గాథాసప్తశతి పేరిట సేకరించాడు. ఇతని కోలువులోని గుణాఢ్యుడు బృహత్కథను రచించాడు. శర్వవర్మ సంస్కృతంలో కాతంత్ర వ్యాకరణాన్ని రాశాడు.


శాతవాహన వంశంలో 23వ వాడైన గౌతమీపుత్రశాతకర్ణి (క్రీ.శ.78-క్రీ.శ102) శాతవాహన వంశ ప్రతిష్టను పునరుద్ధరించాడు. సైనిక విజయాలను వివరిస్తూ ఆయన తల్లి గౌతమి బాలశ్రీ వేయించిన నాసిక్ శాసనంలో వివరంగా పొందుపరచబడినాయి. తన విజయాలకు గుర్తుగా త్రిసముద్రాధిపతిగా బిరుదును ధరించాడు. శాతవాహనుల చివరి పాలకుల్లో యజ్ఞశ్రీశాతకర్ణి (క్రీ.శ.174-203) ప్రముఖుడు. ఆచార్య నాగర్జునునికి సమకాలికుడు. ఆచార్యనాగార్జునుడు మహాయానాన్ని ప్రోత్సహించి మాధ్యమిక వాదాన్ని ప్రచారం గావించాడు. నౌకముద్ర కలిగిన ఇతని నాణేలు నాటి విదేశీ నౌకా వ్యాపారానికి గుర్తు. శాతవాహనుల కాలం చరిత్రలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది. వీరి రాజధానులైన కోటలింగాల, ప్రతిష్ఠానపురం (పైఠాన్), కొండాపురం ధాన్యకటకం, శాతవాహన నాగరికతకు అద్దం పడుతున్నాయి.

**పరిపాలన**


మౌర్యుల రాజకీయ వారసత్వాన్ని కొనసాగించి పాలనాపరంగా వారి విధానాలనే అనుసరించారు. వంశపారంపర్య రాజరికాన్ని అనుసరించి సార్వభౌమ వంటి బిరుదులను పొందారు. సామ్రాజ్యాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం గోవర్ధన, సోపార, మామల వంటి ఆహారాలు లేదా రాష్ట్రాలుగా విభజించి, అమాత్య, మహాభోజ అనే అధికారులను నియమించారు. వీరితోపాటు రాజుకు పాలనలో మహాసేనాపతి, భాండాగారిక, మహామాత్య, లేఖక వంటి అధికారులు సహకరించేవారు. నిగమాలు (పట్టణాలు), గ్రామాలు చివరి పాలనలో విభాగాలు. భట్టిప్రోలు శాసనం ఆధారంగా నగరపాలన నిర్వహణకై ప్రత్యేకంగా పౌరులతో కూడిన నిగమ సభలున్నట్లు తెలుస్తుంది. ప్రతిష్టాన, తగర, సోపార, కొండాపూర్, ధాన్యకటక, వంటి పెక్కు వాణిజ్య కేంద్రాలు నగరాలుగా వృద్ధి చెందాయి. గ్రామపాలన కోసం గ్రామణి లేదా గ్రామిక, తలారి అనే ఉద్యోగి సహకారంతో స్వేచ్ఛాయుతంగా నిర్వహించారు.

**సాంఘిక, మత పరిస్థితులు**

సమాజంలో వర్ణ వ్యవస్థ బలపడింది. గౌతమీపుత్రశాతకర్ణి, వాసిష్టిపుత్రపులోమావి రాజులు మాతృ సంజ్ఞలతో పిలువబడినందున నాటి




బౌద్ధ స్థూపము, అమరావతి గుంటూరు జిల్లా



అమరావతి స్థూప ఫలకం



ధూళికట్ట శిలాఫలకం



ధూళికట్ట స్థూపము




చందవరం స్థూపము, ప్రకాశం జిల్లా

చందవరం స్థూప శిలా ఫలకం



సిద్ధార్థునిపైకి దేవదత్తుడు వదిలిన నలగిరి
అనే ఏనుగు, చందవరం



*ఫణిగిరి బౌద్ధ విహారం, నల్లగొండ జిల్లా*



*గుంటుపల్లి గుహలు, పశ్చిమగోదావరి జిల్లా*

మాతృస్వామ్య వ్యవస్థను సూచిస్తుంది. నాటి సమాజంలో బ్రాహ్మణులు వైదిక విద్యలను అభ్యసించి వైదిక క్రతువులు చేసేవారు. వైశ్యులు నగరపాలనలో నిగమ సభలద్వారా ముఖ్యపాత్ర పోషిస్తూ, బౌద్ధమతాన్ని ఆదరించి విహారాలు, చైత్యాలు నిర్మించారు. శాతవాహనుల కాలంలో బౌద్ధమతం ప్రజల అభిమతమైంది. రాజుల నుంచి గ్రామీణ రైతులదాకా బుద్ధుని బోధనల పట్ల ఆకర్షితులై బౌద్ధకట్టడాలకు తమ సహకారాన్ని అందించారు. శాతవాహన కాలంలో దాదాపు 200 వరకు బౌద్ధారామాలు తమ ఉనికిని చాటుకొన్నాయి. థేరవాద బౌద్ధం తొలినాళ్లలోనూ, మహాయానబౌద్ధం మలినాళ్లలోనూ ఆదరించబడింది. స్థూపాలు, చైత్యాలు, విహారాలు నాటి బౌద్ధ కట్టడాలకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. కొండలమీద, మైదానాల్లోనూ ఆరామాలు బౌద్ధధార్మిక కార్యకలాపాలను కొనసాగించగా, వస్సావాసంలో బౌద్ధభిక్షువులుండటానికి కొండలను తొలచి గుహలను మలచారు. ఈకాలంలో బౌద్ధం తరువాత వైదిక మతం రాజాదరణ పొందింది. రెండవ శాతకర్ణి వైదిక క్రతువులైన అశ్వమేధ, రాజసూయ

యాగాలు, నిర్వహించినట్లు ఆయన భార్య నాగానిక వేయించిన నానేఘట్ శాసనం వివరిస్తుంది. గౌతమీపుత్రశాతకర్ణికి గల ఏకబ్రహ్మణ, ఆగమ నిలయ బిరుదుల వలన, యజ్ఞశ్రీశాతకర్ణి వంటిపేర్లు, వారి వైదిక మతాభిమానాన్ని సూచిస్తున్నాయి. శాసనాలల్లో కనిపించే ఇంద్ర, వాసుదేవ, సూర్య, చంద్ర, హాలుని గాథాసప్తశతిలోని గౌరి, పశు పతి, రుద్రుడు,పార్వతిల ప్రస్తావన ద్వారా వైదిక మత ప్రాముఖ్యతను తెలుసుకోవచ్చు. వీరు వైదిక మతాన్ని అనుసరించినప్పటికి పరమత సహనం పాటించారు, రాణులు, సాధారణ ప్రజలు బౌద్ధాన్ని ఆదరించి దానధర్మాలు చేశారు. ధాన్యకటక, అమరావతి, చంధవరం, గుడివాడ, శంకారం, గుంటుపల్లి, తొట్లకొండ, బావికొండ, పావురాలకొండ, ధూళికట్ట, కోటలింగాల, ఫణిగిరి, వర్ధమానకోట మొదలైన బౌద్ధవిహారాలు ఈకాలంలో నిర్మింపబడినాయి.

**ఆర్థిక పరిస్థితులు**

ప్రజలు అనేక రకాల వృత్తులను చేపట్టారు. నాడు వృత్తి సంఘాలు ఉండేవి. నాసిక్ శాసనం ద్వారా 17 వృత్తి శ్రేణులున్నట్లు తెలుస్తోంది. నాటి వృత్తి శ్రేణులు ఆర్థికంగా పటిష్టంగా ఉండి నేటి బ్యాంకుల వలె పనిచేశాయి. వీరు విడుదల చేసిన సీసం, రాగి, పోటీను, వెండి, బంగారు నాణేలు నాటి ఆర్థిక పరిస్థితులకు అద్దంపడుతాయి. ఇంకా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాయి. గోవర్ధనంలోని కొలిక శ్రేణి నాయకుడైన ఋషభదత్తుడు శ్రమణులకు వస్త్రదానం చేశాడు. ఆనాటి స్త్రీలు విద్యావంతులు. వీరికి సంఘంలో అత్యంత గౌరవంతోపాటు ఆర్థిక స్వేచ్ఛ ఉన్నట్లు, బౌద్ధ విహారాలకు వారిచ్చిన దానాల వల్ల తెలుస్తుంది. శాతవాహనుల పాలనలో ప్రజల ముఖ్యవృత్తి వ్యవసాయం. రజ్జువాహక అనే అధికారులు భూమిని సర్వేచేసి హద్దులు నిర్ణయించేవారు. అడవిభూములు, బంజరుభూములను సాగులోకి తెచ్చి మెట్టపోలాల్లో నీటిపారుదల కోసం యంత్రాలను ఏర్పాటుచేశారు. వరితో పాటు చెరుకు సమృద్ధిగా పండింది. రాజ్యానికి ప్రధాన ఆదాయం భాగ అనబడే భూమిశిస్తు. పండిన పంటలో ఆరోవంతు శిస్తు వసూలు చేసెవారు. దీనితోపాటు వృత్తిపన్నులు, రేవుసుంకాలు రాజ్యానికి ప్రధాన ఆదాయాలు. దేశీ, విదేశీ వ్యాపారాలు విస్తృతంగా సాగాయి. ధాన్యకటకం, విజయపురి, వినుకొండ, ప్రధాన వర్తక కేంద్రాలుగా వెలుగొందాయి. రోమ్‌తో విరివిగా విదేశీ వాణిజ్యం జరిగినట్లు నౌక చిహ్నాలు గల బంగారు నాణేలు దొరికిన రోమను పాత్ర సామాగ్రి, రోమను నాణేల వల్ల తెలుస్తుంది. ఘంటసాల, మైసోలియా (మచిలీపట్నం), తూర్పు తీరంలో నాటి ప్రధాన ఓడరేవులు.

వీరిశాసనాల్లో పలురకాల చేతిపనివాండ్ల ప్రస్తావనలున్నాయి. కొలిక(సాలి) తిలపిసక (తైలకులు) సువనక (స్వర్ణకార) వంటి వృత్తులవలన నాడు ఆయా పరిశ్రమలు వృద్ధిలోవున్నట్లు తెలుస్తుంది. కొండాపూర్, మస్కి, పైఠాన్, అమరావతిలలో బయల్పడిన మట్టి పాత్రలు, కంచు ఇత్తడి పాత్రలు, దీపస్తంభాలు నాటి పనితనాన్ని తెలుపుతున్నాయి. చేతివృత్తులవారు శ్రేణిగా ఏర్పడడం ద్వారా తమ వృత్తి శ్రేయస్సును పరిరక్షించడంతోపాటు, బ్యాంకింగ్ వ్యాపారాన్ని నిర్వహించేవి.

**సాహిత్యం:**

హాలచక్రవర్తి ప్రాకృత భాషలో జనజీవన విధానాన్ని క్రోడీకరించి **గాథాసప్తశతి** అనే గ్రంథాన్ని రచించి కవివత్సలుడిగా కీర్తించబడినాడు. అతని మంత్రి శర్మవర్మ **కాతంత్రం** అనే సంస్కృత వ్యాకరణ గ్రంథాన్ని రాశాడు. గుణాఢ్యుడు పైశాచి ప్రాకృతంలో **బృహత్కథను** రచించాడు. శాతావాహనుల మలికాలంలో వైదిక మత పునరుద్ధరణతో సంస్కృత భాషకు గుర్తింపు వచ్చింది. ఆచార్య నాగార్జునుడు బౌద్ధమతానికి కొత్త ఊపును, ఉత్తేజాన్ని కలిగించిన మహనీయుడు. చివరి దశలో నాగార్జునకొండ వద్ద గల విజయపురి, ధాన్యకటకాల్లో గడిపి అపర బుద్ధుడనే కీర్తిగడించాడు. **ప్రజ్ఞాపారమిత శాస్త్రం, శూన్యతాసప్తతి, మూలమాధ్యమికకారిక, రత్నావళి, సుహృల్లేఖ** ఆయన రచించిన ప్రామాణిక గ్రంథాల్లో కొన్ని.

**బ్రాహ్మణ ఆలయాలు**

శాతవాహనుల కాలంలోనే తెలుగు నేలపై ఇటుక ఆలయాల నిర్మాణాలు ప్రారంభమైనాయి. ఇవి క్రీ.పూ. ఒకటో శతాబ్దం నుంచి క్రీ.శ. మూడో శతాబ్దం వరకూ అంటే నాలుగు వందల సంవత్సరాలపాటు నిర్మింపబడినాయి. శాతవాహనులు బౌద్ధులైనా తర్వాత కొద్దిమంది రాజులు జైనం పట్ల కూడా మొగ్గుచూపారు. శాతకర్ణి భార్య నాగానిక మాత్రం వైదిక బ్రాహ్మణ మతాన్ని ఆదరించింది. ఇందుకు తార్కాణంగా నాసిక్, నానేఘాట్ శాసనాల్లో విష్ణువుకు సంబంధించిన అనేక పదాలున్నాయి. దీనినిబట్టి బౌద్ధం తెలుగు నేలంతా పరివ్యాప్తం అయినా, కొద్ది ప్రాంతంలో మాత్రం అప్పుడప్పుడే బ్రాహ్మణీయ వైదిక మతాలైన శైవం, వైష్ణవం కాలుమోపాయని చెప్పడానికి పురావస్తు ఆధారాలు కొద్దిగా దొరికాయి. కోస్తాంధ్ర అంతాకూడా తిసరణాలు మార్మోగుతుండగా, కృష్ణ-తుంగభద్ర సంగమ ప్రాంతంలో మాత్రం శైవ నామస్మరణం జరిగినట్లు అక్కడి శివాలయ శిథిలాలు తెలియజేస్తున్నాయి.

మహబూబ్‌నగర్ జిల్లా కృష్ణా తీరంలోని బ్రిడ్జి రంగాపూర్ గ్రామంలో క్రీ.శ. 1వ శతాబ్దంనాటి శివాలయం బయటపడింది. గద్వాల చౌరస్తా దాటి హైదరాబాద్ వస్తుండగా శ్రీశైలం ప్రాజెక్టు నీటిముంపునకు గురయిన ప్రాంతంలో ఉందీ ఆలయం. రాష్ట్ర పురావస్తు శాఖ ఇక్కడ తవ్వకాలు జరుపుతుండగా, క్రీ.శ. 1వ శతాబ్దానికి చెందినటువంటి శివాలయం బయటపడింది. అదికూడా పునాది వరకే. అతి సాధారణ నిర్మాణంతో ఉన్న ఈ ఆలయం మధ్యలో శివలింగం అతి ప్రస్ఫుటంగా కానవచ్చింది. దేవాలయ నిర్మాణానికి వాడిన రాళ్ల కొలతలను చూస్తే 50 సెం.మీ. పొడవు, 25 సెం.మీ.ల వెడల్పు, 7సెం.మీ.ల మందం కలిగి శాతవాహన వాస్తు శైలికి అద్దం పడుతున్నాయి. ఇవి శాతవాహనులవేనని చెప్పడానికి ఇంకా ఆధారాలేమిటంటే నలుపు తెలుపు, ఎరుపు మట్టిపాత్రలు ఆ దేవాలయం చుట్టుపక్కల జరిపిన తవ్వకాలలో బయటపడ్డాయి. వీటన్నిటి ఆధారంగానూ, ఇటుకల సైజుల ఆధారంగానూ చూస్తే క్రీ.శ. 1వ శతాబ్దం నాటికే ఈ ప్రాంతంలో శైవం వేళ్లూనుకుందని చెప్పవచ్చు.



*గుడి మల్లం శివలింగం*

1973-74 కాలంలో ధాన్యకటకం (ప్రస్తుత అమరావతి)లో జరిపిన తవ్వకాలలో చిన్న శివలింగం బయటపడింది. క్రీ.పూ.2వ శతాబ్దం నాటికే శైవం కోస్తాంధ్రలో కూడా కొద్దికొద్దిగా తన ప్రభావాన్ని చూపుతోందని తెలుస్తోంది. ఇంకా లోతుగా చూసినట్టయితే, చిత్తూరు జిల్లా, రేణిగుంట విమానాశ్రయానికి సమీపాన గల గుడిమల్లంలో క్రీ.పూ. 2-1వ శతాబ్దాల నడుమ కాలానికి చెందిన శివలింగం ఉంది. అది బాగా పాలిష్ పట్టినట్టుగా ఉంటుంది. ఈ శివలింగంపై రుద్రుడు ఒక జింకను పట్టుకుని ఉన్నాడు. దాని చుట్టూ మౌర్యులు కాలంలో బౌద్ధ స్తూపాల చుట్టూ అమర్చిన విధంగానే రాతి కంచెను అమర్చారు. దీనినిబట్టి అప్పటి వరకూ వస్తున్న శాతవాహన వాస్తు శైలిని కేవలం బౌద్ధానికి మాత్రమే కాక శైవ, వైష్ణవ, మతాలు కూడా అనుసరించాయని వెల్లడవుతోంది.

## బౌద్ధాన్ని ఆదరించిన శాతవాహనులు

అశోకునికంటే ముందే బుద్ధుని శరీర అవశేషాలపై ధాన్యకంటకం వద్ద (అమరావతి) స్థూపం నిర్మించబడింది. అశోకుని కాలంలోనే స్థూపం చుట్టూ రాతికంచె కూడా నిర్మించబడింది. శాతవాహనులు స్తూపానికి బౌద్ధ దృశ్యాలు చెక్కిన శిలఫలకాలను అతికించారు. మహాస్థూప ప్రాకారం బయటి భాగంలో జంతువుల బొమ్మలు, స్తంభాలపై బోధివృక్షం, ధర్మచక్రం, నాగ, యక్ష, పూర్ణ, అర్థ కలశములు, పూర్ణఘటం, త్రిరత్నములు, మహాభినిష్క్రమణం, అస్త్రవిద్యా ప్రదర్శనం వంటి శిల్పాలు చెక్కారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ అధికార చిహ్నమైన పూర్ణఘటం ఈ శిల్పం నుండి తీసుకొన్నారు. పూర్ణ ఘట శిలాఫలకాన్ని అమరావతి స్థూపానికి బహూకరించింది విధికుడనే ఒక చర్మకారుడు.

## చాబోలులో శాసనం

మరో విశేషమేమిటంటే, కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని వీరాపురం అనే గ్రామంలో జరిపిన తవ్వకాలలో శైవానికి సంబంధించిన ఆనవాళ్లు లభ్యమయ్యాయి. అలాగే, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులరేటర్ వద్ద అంటే తెలుగుగంగ కాలువ ప్రారంభమయ్యే 'చాబోలు' అనేచోట రాష్ట్ర పురావస్తు శాఖలోని డాక్టర్ సుబ్రహ్మణ్యం ఈమని శివ నాగిరెడ్డి తవ్వకాలు జరపగా ఆశ్చర్యకరంగా శాతవాహనుల కాలానికి చెందిన ఇటుకతో నిర్మించబడిన శివాలయం బయటపడింది. చాబోలులో చక్కగా పానవట్టంపై చెక్కిన శివలింగం కానవచ్చింది. ఆ ఆలయానికి వాడిన ఇటుకలు, రాళ్లన్నీ కూడా శాతవాహనుల కాలంనాటివే. ఇంకా ఆ కాలం నాటి నాణెంకూడా లభ్యమైంది. ఇంకా విశేషమేమిటంటే, అక్కడ క్రీ.శ. 1వ శతాబ్దం నాటి 'కశ్యగంభో' అనే శాసనం దొరికింది. నిర్మాణానికి వాడిన ఇటుకలు, నాణెం, శిలాశాసనాల ఆధారంగా అది శాతవాహనుల కాలం నాటిదని నిర్ణయించబడింది

## కొండమోటులో తొలి నరసింహావతార విగ్రహం

అటు తర్వాత కేవలం శైవమే కాకుండా వైష్ణవానికి సంబంధించిన శాతవాహన కాలంనాటి ఆనవాళ్లుకూడా దొరికాయి. గుంటూరు జిల్లా పిడుగురాళ్ల దగ్గర కొండమోటు అనే గ్రామంలో నరసింహావతారంలో విష్ణువు విగ్రహం చెక్కబడి ఉంది. ఈ విగ్రహం కూర్చున్న భంగిమలో ఉంటుంది. క్రీ.పూ. 1వ శతాబ్ది కాలంలో బుద్ధ విగ్రహాలను ఏరకంగానైతే సున్నపురాతిలో చెక్కారో అదేపద్ధతిలో నరసింహావతారస్వామి విగ్రహాన్నికూడా సున్నపురాతిలో మలిచారు. ఒక్కసారి పరిశీలించి

ఆలోచిస్తే క్రీ.పూ. 1వ శతాబ్దంలో ఆలయ నిర్మాణం ఆరంభమై క్రీ.శ. 1వ శతాబ్దం నాటికి విలసిల్లిందని తెలుస్తుంది. నానేఘాట్ శాసనంద్వారాగానీ, కొండమోటులో లభ్యమైన నరసింహావతార విగ్రహంద్వారాగానీ పరిశీలించినట్టయితే... బౌద్ధుల ప్రాబల్యం సాగుతున్న శాతవాహనుల కాలంలోనే శైవ, వైష్ణవాలు కూడా ఆరంభమై కొద్దికొద్దిగా ఆదరణ పొందుతూ ఆలయ నిర్మాణాలకు దారితీశాయని చెప్పవచ్చు. ఆ తర్వాత బౌద్ధం సన్నగిల్లినపుడు రాజులందరూకూడా శైవాన్ని అవలంబించారు. శాతవాహనుల అనంతరం ఇక్ష్వాకుల కాలం నుంచి శైవం ఉధృతంగా వ్యాప్తి చెందింది.

సుమారు మూడున్నర శతాబ్దాల శాతవాహనుల పాలనలో మతం, సాహిత్యం, కళా, ఆర్థిక విదేశీ వ్యాపార రంగాలలో అత్యున్నత స్థితిని పొందిన తెలుగుజాతి ప్రపంచవ్యాప్త కీర్తిని గడించింది. శిల్పం, చిత్రం మొదలైన లలితకళలను ఆదరించి, పోషించి తెలుగువారి కీర్తి ప్రతిష్ఠలు దిగంతాలకు వ్యాప్తి చేశారు. వీరి ఆదరణతో రూపుదిద్దుకొన్న శిల్పం అమరావతి శిల్పమనే శైలిగా ప్రపంచఖ్యాతి పొందింది.

దక్షిణ భారతదేశాన్ని రాజకీయంగా ఎక్కువ తెలుగు, కన్నడ, మరాఠీ భూభాగాలను ఒక్కతాటిపైకి తెచ్చి ఉత్తర, దక్షిణ భారతదేశముల మధ్య సంస్కృతికి వారధిగా నిలిచారు శాతవాహనులు. విశాల సామ్రాజ్యాన్ని ఏర్పరచి మూడున్నర శతాబ్దాల పాటు శకుల దండయాత్రల నుండి కాపాడి దక్షిణాపథంలో శాంతిభద్రతలు నెలకొల్పి ప్రజా సంక్షేమానికి కృషి చేసి సాంస్కృతిక ప్రగతిని సాధించారు.

**శాతవాహనుల తరువాతి రాజవంశాలు**

శాతవాహనుల తరువాత తెలుగు నేలపై అనేక చిన్న చిన్న రాజ్యాలు పుట్టుకొచ్చాయి. శాతవాహనుల సామంత మాండలీకులు, స్వతంత్ర రాజ్యాలను స్థాపించారు. వారిలో ఇక్ష్వాకులు, తొలిపల్లవులు, బృహత్ఫలాయనులు, శాలంకాయనులు, ఆనందగోత్రినులు ముఖ్యులు.

**ఇక్ష్వాకులు: (క్రీ.శ.3వ.శతాబ్దం)**

శాతవాహనుల తర్వాత కృష్ణానది దిగువ ప్రాంతాన్ని వశం చేసుకున్నవారు ఇక్ష్వాకులు. వీరు శ్రీపర్వత - విజయపురి (నాగార్జునకొండ) నుంచి పరిపాలన సాగించారు. ఇక్ష్వాకు వంశాన్ని ఛాంతమూలుడు స్థాపించినట్లు రెంటాల, దాచేపల్లి శాసనాలు తెలియజేస్తున్నాయి. అతని తరువాత అతని కుమారుడైన వీరపురుషదత్తుడు

రాజ్యానికొచ్చినట్లు నాగార్జునకొండ, జగ్గయ్యపేట, అల్లూరు, ఉప్పుగొండూరు శాసనాలవల్ల తెలుస్తుంది. వీరపురుషదత్తుని, తరువాత అతని కుమారుడు ఎహువల ఛాంతమూలుడు, అతని తరువాత రుద్రపురుషదత్తుడు రాజ్యం చేసినట్లుగా నాగార్జునకొండ, గురజాల శాసనాలు రుజువు చేస్తున్నాయి. రుద్రపురుషదత్తుని తరువాత రాజ్యాన్ని పాలించిన రెండో ఛాంతమూలుడు ఇక్ష్వాకు వంశపు చివరిరాజు. క్రీ.శ. 3వ శతాబ్దిలో మాత్రమే సాగిన వీరి పాలనలో శాతవాహన కాలంనాటి జీవన శైలినే కొనసాగించి బౌద్ధంతోపాటు బ్రాహ్మణీయ మతాన్నికూడా ఆదరించారు.

**పరిపాలన, సాంస్కృతిక విశేషాలు**

రాజ్యపాలన వ్యవహారాలలో రాజుకు **మహాదండనాయక, మహాసేనాపతి, మహాతలవరులు** సహకరించేవారు. రాజ్యాన్ని పరిపాలన సౌలభ్యం కోసం అనేక పాలన విభాగాలుగా ఏర్పరచారు. అనేక గ్రామలతో కూడిన పాలన విభాగాన్ని **'గ్రామపంచిక'** లేదా **'మహాగ్రామ'**గా పిలిచారు. పాలన వ్యవహారంలో పాల్గొన్న అధికారులకు ప్రతిఫలంగా భూములు లేదా గ్రామాలపై శిస్తువసూలు అధికారం కల్పించారు.

వీరి రాజ్యం సారవంతమైన కృష్ణానదిలోయ పరిసరాల్లో విస్తరించినందున వ్యవసాయం, నీటిపారుదల అభివృద్ధిచెందడం వలన రాజ్యం సుభిక్షంగా ఉంది. పండిన పంటలో ఆరోవంతు ఉత్పత్తిని శిస్తుగా వసూలు చేసేవారు. రాజ్యం ఆర్థికంగా వృద్ధిసాధించినట్లు రోమ్‌తో విదేశీ వర్తకాన్ని చేసినట్లు నాగార్జునకొండ తవ్వకాల్లో బయల్పడిన రోమన్ బంగారు నాణేలవల్ల తెలుస్తుంది. వీరు శాతవాహనుల మాదిరి తమ పేర్లకు ముందు మాతృసంజ్ఞను చేర్చినట్లు **మాధరిపుత్ర** అన్న పేర్లద్వారా తెలుస్తుంది. స్త్రీలు గౌరవప్రదమైన స్థానాన్ని పొందినట్లు, బౌద్ధమతాభివృద్ధికి విరివిగా దానాలుచేసి విహారాలు, చైత్యాలు, స్థూపాలు నిర్మించినట్లు శాసనాలు తెలుపుతున్నాయి. నాటి స్త్రీలు సతిసహగమనాన్ని పాటించినట్లు నాగార్జునకొండలో చెక్కిన శిల్పాల ద్వారా తెలుస్తుంది.

నాగార్జునకొండ మహాయానబౌద్ధమత కేంద్రంగా విరాజిల్లినట్లు తవ్వకాల్లో లభ్యమయిన ఆధారాలు తెలుపుతున్నాయి. రాజవంశ స్త్రీలు బౌద్ధాన్ని ఆదరించగా, పురుషులుమాత్రం బ్రాహ్మణీయ మతానికి పెద్దపీట వేశారు. వీరు బ్రాహ్మణమతాన్ని ఆదరించి అశ్వమేధ, వాజపేయ యాగాలు నిర్వహించినట్లు మొదటి ఛాంతమూలుడు, రెండవ ఛాంతమూలుడు, రెండవ వీరపురుషదత్తుడి శాసనాల ద్వారా తెలుస్తుంది.

ఎహువల ఛాంతమూలుడికి మహాసేనుడు (కార్తికేయుడు) ఆరాధ్యదైవం. ఇతడు నాగార్జునకొండలో కార్తికేయ, పుష్పభద్ర, నొదగీశ్వర, దేవీ ఆలయాలను, అష్టభుజస్వామి పేరిట వైష్ణాలయం కూడా నిర్మించాడు. కొన్ని ఆలయాలు గజపృష్టాకారంలో బౌద్ధ చైత్యాలయాలుగానూ, మరికొన్ని మండపాలుగానూ నిర్మించబడినాయి.

## సర్వదేవాధివాసం

ఆంగ్ల అక్షరం 'ఎల్'మాదిరిగా రెండు దీర్ఘ చదరాలను కలిపినట్లుగా ఉండే పెద్ద ఆలయం ఇది. ఆలయంలోని ఒక స్థంభంపైగల శాసనంలో ఎహువల ఛాంతమూలుని 11వ పాలనా సంవత్సరంలో సర్వసైన్యాధ్యక్షుడైన అతని మనుమడు 'తలవర' ఎహువల ఎలిసిరి, కార్తికేయుని కృపతో శ్రీవిలాసమనే సర్వదేవాధివాసాన్ని నిర్మించాడని ఉంది. సర్వదేవుడనగా శివుడని పరిశోధకులు గుర్తించారు. మొదటి దేవాలయానికి వెనుక ఆరు స్థంభాల మంటపం, దేవాలయానికి ముందర 9 స్థంభాల మంటపం, దానికి పక్కగా పడమరవైపున 24 స్థంభాల మంటపం, ఉత్తరంగా 66 స్థంభాల మంటపం, దానికి తూర్పుగా 27 స్థంభాల మరో మంటపం నిర్మింపబడి నాగార్జునకొండలో బయల్పడిన బ్రాహ్మణీయ ఆలయాల్లో అతి పెద్ద దేవాలయంగా 'సర్వదేవాధివాసం' గుర్తింపు పొందింది.

## పుష్పభద్రస్వామి ఆలయం

నాగార్జునకొండ కింద వాయవ్యంలో కృష్ణానది ఒడ్డున నిర్మించబడిన పుష్పభద్రాలయం, చుట్టూ ప్రాకారం, నాలుగు వైపులా నాలుగు ద్వారాలు, లోపల గజపృష్టాకారంలో గర్భాలయం, ముందు స్థంభాలతోనున్న మంటపం, దానిముందు ధ్వజస్థంభం, దాని ముందు గోపురాన్ని పోలిన కట్టడ పునాదులు వెలుగుచూశాయి. ధ్వజస్థంభం పైన ఎహువల ఛాంతమూలుని 16వ రాజ్య సంవత్సరంలో వేయించిన శాసనం ఉంది. అందులో కుపనసిరి, ఆమె కొడుకు రెండో వీరపురుషదత్తుని విజయాలు, వారిరువురికి దీర్ఘాయువుకోసం ఈ దేవాలయాన్ని నిర్మించినట్టు వుంది. దక్షిణ భారతదేశంలోనే గర్భాలయ, ముఖ మంటపం, ధ్వజస్థంభం, నాలుగుద్వారాలుగల ప్రాకారమున్న తొలి ఆలయంగా ఈ ఆలయాన్ని పేర్కొనవచ్చు.

## దేవసేనాలయం

పెద్దకుందేల్లగుట్టకు దక్షిణంగా ఇటుకరాయి ప్రాకారంలోపలి మంటపం మాదిరిగా నిర్మించబడిందీ దేవసేనాలయం. దాని ముందు వేదికమీద మరో మంటపం ఉంది. దేవాలయంలో పీఠంమీద దేవసేన (కార్తికేయుని భార్య) ప్రతిమ

ప్రతిష్ఠించబడింది. 36 స్థంభాల మహామంటపం ఈ దేవాలయానికి ఒక ఆకర్షణ, స్థంభాలన్నీ అందంగా మలచబడి శిల్పుల పనితనాన్ని తెలియజేస్తున్నాయి. స్థంభాలపై యక్షులు, సింహం, దున్న, గుర్రం, ఖడ్గమృగాల బొమ్మలున్నాయి.

**కార్తికేయాలయం**

మూడు భాగాలుగా నిర్మింపబడిన ఈ ఆలయం వెనుక గర్భాలయం, ముందు ముఖమంటపం (రెండింటిలోనూ స్థంభాలు లేవు), దాని ముందు 36 స్థంభాల మహామంటపం ఉంది. ఎదురుగా ప్రవేశ ద్వారముంది. ఈ ఆలయం వద్ద జరిపిన తవ్వకాల్లో కార్తికేయుని చిన్న కంచుబొమ్మ దొరికింది. పక్కనే తలలేని రెండు కార్తికేయ (కుమార స్వామి) రాతి శిల్పాలు దొరికాయి. ఈ ఆలయ ప్రాకారం దగ్గర బయల్పడిన 'చలికి రమ్మణక' అన్న శాసనం చాళుక్య ఉనికిని తెలియజేస్తుంది.

**అష్టభుజస్వామి దేవాలయం**

ఒక ప్రాకారంలో తూర్పున ద్వారంతో స్థంభమంటపాలు, గోడలతోనున్న విడి కట్టడాలు, గజపృష్ఠాలంకార దేవాలయం కలిపి గజిబిజిగా ఉంది. ఆలయం లోపల కొన్ని సాధారణ కట్టడాలుకూడా ఉన్నాయి. తవ్వకాల్లో ఇక్ష్వాకు నాణేలు, రెండు శంఖాలు దొరికాయి. శంఖాలపై చక్రధ్వజ, ఖడ్గధ్వజ అనీ, కింద 'భగవతో అఠభుజసముస', 'ఉచ్చిట కనసరో' అన్న శాసనాలున్నాయి. అక్కడ దొరికిన ఒక శాసనంలో అభీర రాజైన వాసిష్ఠపుత్ర వసుసేనుని 13వ రాజ్య సంవత్సరంలో సేతగిరిపైన **మహాగ్రామిక, మహాతలవర, మహాదండనాయక, శివసేపుడు, సంజయపర యవనరాజు అవంతీపుర శకరుద్రదాముడు,** వనవాసికి చెందిన విష్ణురుద్రశివలానంద **శాతకర్ణిలు కలిపి అష్టభుజస్వామి** కొయ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించి, మహానంద అనే బావిని పునరుద్ధరించి, మరో రెండు బావులను తవ్వించి తాటి వనాన్ని పెంచారని ఉంది. భరద్వాజ గోత్రానికి చెందిన అమాత్య తిష్యశర్మ రాసిన, ఈ శాసనాన్ని పెంబక కుటుంబానికి చెందిన వర్థమానకుడనే శిల్పి చెక్కాడని శాసనం చివర్లో ఉంది.

**నవగ్రహాలయం**

నాగార్జునకొండవద్ద కోటకు వాయవ్యంగా జరిపిన తవ్వకాల్లో నవగ్రహ, శివపార్వతి, యక్ష, కుబేరాలయాలు బయల్పడినాయి. నవగ్రహాలయంలో రెండు గజపృష్టాకార దేవాలయాలు, రెండు మంటపాలు బయల్పడినాయి. ఈ ఆలయ సముదాయాన్ని నవగ్రహాలయంగా తవ్వకాలు చేపట్టిన రాయప్రోలు సుబ్రహ్మణ్యం గుర్తించారు.

### కుబేరాలయం

నాగార్జునకొండవద్ద జరిపిన తవ్వకాల్లో అతి పెద్ద దేవాలయ సముదాయం కుబేరాలయం. ఇందులో ఒక గజపృష్ఠాలయం, దీని ముందు 100 స్థంభాల మంటపం ఉన్నాయి. ఇక్కడ ఒక యక్షుని తల దొరికింది. దక్షిణాన ఒక చిన్న బావికూడా ఉంది. దానిమీద దధి సరస్ అనే శాసనముంది.

నాగార్జున కొండలో జరిపిన తవ్వకాల్లో మాత్రం బౌద్ధ కట్టడాలతోపాటు శివ, కార్తికేయ, దేవసేన, అష్టభుజ నారాయణులకు గల దేవాలయాలు కూడా బయటపడినాయి. శాతవాహనుల తరువాత ఆలయ నిర్మాణంలో ఇటుకలు, ఇటుకల స్థానంలో రాతిని వాడటమే కాక, బౌద్ధుల మాదిరిగా అలయాలకు ఎదుట శిలా మంటపాలను నిర్మించటం, దేవాలయాల్లో పూజలు, ఆరాధనలు పెరిగి, ఇంకా నిర్మాణపరంగా ఎంతో వికాసాన్ని తెలియజేస్తున్నాయి. క్రీ.శ. 3వ శతాబ్దికే దక్షిణాదిన అన్ని హంగులతో కూడిన దేవాలయం ఉన్న సంగతి తెలిసి ఈ దిశగా పరిశోధనలు ముమ్మరమైనాయి.


### బౌద్ధారామాలు

నాగార్జునకొండ ఆచార్య నాగార్జునుడు నివసించిన ప్రదేశంగా, ఒక బౌద్ధ స్థావరంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఇంతకుముందు చెప్పినట్లు ఇక్ష్వాకురాజులు బౌద్ధమతాన్ని ఆదరించగా అంతఃపుర స్త్రీలు బౌద్ధానికి చేయూతనిచ్చారు. దాదాపు 30 బౌద్ధారామాలు శ్రీపర్వత విజయపురి తవ్వకాల్లో బయల్పడినాయి. వీటిలో మహాస్థూపం, సింహళవిహారం, చుల్లధమ్మగిరి విహారం ముఖ్యమైనవి. మహాచైత్యంనుంచి బుద్ధుని ధాతువులున్న రాతి, మట్టి, రాగి, వెండి, బంగారు కరండాలు బయల్పడినాయి. నాగార్జునకొండ మహాయానకేంద్రంగా విలసిల్లింది. అమరావతి శిల్పశైలి కొనసాగి అందమైన బుద్ధప్రతిమల రూపకల్పన జరిగింది. సింహళవిహారంలోని బుద్ధచైత్యం, నాగార్జునకొండ మ్యూజియంలోనున్న బుద్ధునివిగ్రహం ఇక్ష్వాకుల బౌద్ధశిల్పానికి చక్కటి ఉదాహరణ. విహారాలు, స్థూపాల గోడలకు అలంకరించిన శిలాఫలకాల్లో సిద్ధార్థగౌతముని జీవితగాథలు, జాతకకథలు, ఇంకా సమకాలీన జీవన విధానం చెక్కబడినాయి. చినగంజాం, గోలి, జగ్గయ్యపేట, గాజులబండ, అదుర్రు, ఘంటసాల, ఫణిగిరి, ఏలేశ్వరం, నేలకొండపల్లిలలో అనేక బౌద్ధ స్థావరాలు వెలుగుచూశాయి.



స్థూపం
నాగార్జునకొండ,
గుంటూరు జిల్లా

స్థూపం
జగ్గయ్యపేట,
కృష్ణాజిల్లా





స్థూపం అదుర్రు,
తూర్పుగోదావరి జిల్లా

**బృహత్పలాయనులు (క్రీ.శ. 3వ శతాబ్దం)**

క్రీ.శ. 3వ శతాబ్దం చివరన కృష్ణానదికి ఉత్తరానవున్న తెలుగు ప్రాంతాలను పరిపాలించారు. చరిత్రకు సంబంధించినంతవరకు జయవర్మ ప్రాకృత భాషలోని కొండముది శాసనమొక్కటే ఆధారం. ఇక్ష్వాకుల సామంతునిగా పల్లవులను ఎదుర్కొని సుమారు 15 సంవత్సరాల పాటు నేటి రేపల్లె, మచిలీపట్నం, తెనాలి, గుడివాడ ప్రాంతాలను కోడూరు రాజధానిగా రాజ్యపాలన గావించాడు. ఈ కాలంలో కొస్తాలోని ఘంటసాల, అవనిగడ్డ, మచిలీపట్నం ఓడరేవులుగా ప్రసిద్ధిగాంచినవి. జయవర్మ వైదిక మతాభిమానియైన శైవభక్తుడు. కుడూరుహారంలోని పాంతూర గ్రామాన్ని 8 మంది బ్రాహ్మణ పండితులకు బ్రహ్మదేయంగా ఇచ్చాడు. జయవర్మ మరణాంతరం దక్షిణాంధ్రాన్ని పల్లవులు, కృష్ణామండల ప్రాంతాలను శాలంకాయనులు ఆక్రమించడంతో బృహత్పలాయన రాజ్యం అంతరించింది.




శిలాఫలకం, ఫణిగిరి,
నల్లగొండ జిల్లా

**తొలి పల్లవులు: (క్రీ.శ.3-4 శతాబ్దాలు)**


ఇక్ష్వాకులకు సామంతునిగా ధాన్యకటకప్రాంతాన్ని పాలించిన సింహవర్మ స్వతంత్రించి తరువాత కంచి నగరం రాజధానిగా పల్లవ రాజ్యాన్ని స్థాపించాడు. సింహవర్మ, ధాన్యకటకం (అమరావతి)తో పాటు తొండైమండల ప్రాంతాన్ని కూడ పాలించాడు. సింహవర్మ మంచికల్లు శిలాశాసనం ఆధారంగా గుంటూరు, ప్రకాశం, కర్నూలు ప్రాంతాలు వీరి పాలనలో ఉన్నాయని తెలుస్తుంది. తొలి పల్లవ రాజులలో శివస్కందవర్మ మైదవోలు శాసనం, హిరహడగల్లిశాసనం ద్వారా కృష్ణా, తుంగభద్ర, కావేరినదుల మధ్య ప్రాంతానికి రాజ్యాన్ని విస్తరించాడని తెలుస్తుంది. తన సార్వభౌమత్వానికి సూచనగా అశ్వమేధ, వాజపేయ యాగాలు చేసి ధర్మమహరాజుగా కీర్తిపొందాడు. ఇతని పాలన చివరిలో కదంబ మయూరశర్మ విజృంభించాడు.



చైత్యాలయం, చేజర్ల, గుంటూరు జిల్లా



గజప్రష్టాకార చైత్యాలయం, చేజర్ల



ద్వారగోపురం, చేజర్ల

సముద్రగుప్తుడి దండయాత్రానంతరం పల్లవరాజు విష్ణుగోపుడు రాజ్యత్యాగం చేసి సమర్థుడైన కుమారవిష్ణువుకు రాజ్యాన్ని అప్పగించాడు. కుమారవిష్ణువు కదంబుల తిరుగుబాట్లను అణచి పల్లవుల ప్రతిష్టను మరింత పెంచాడు. అతని మనుమడైన విజయస్కందవర్మ చేబ్రోలు శాసనం ప్రకారం కుమార విష్ణువు కదంబులను ఓడించి కర్మరాష్ట్రంలో అధికారాన్ని మళ్లీ స్థాపించాడు. తరువాత విజయస్కంధవర్మ కుమారుడైన రెండో సింహవర్మ అధికారం చేపట్టి విష్ణుకుండిన గోవిందవర్మ ఆక్రమించిన పల్లవరాజ్యభూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకొన్నాడు. ఆ తరువాత పాలించిన నందివర్మ, అశ్వమేధయాగాలను చేసి, తన అధికారాన్ని ఉత్తరాన కృష్ణానది నుండి దక్షిణాన పెన్నా నది వరకు, పశ్చిమాన బళ్లారి, నుంచి తూర్పున బంగాళఖాతం వరకు విస్తరించాడు.

**ఆనంద గోత్రినులు (క్రీ.శ.3వ శతాబ్దం)**

శ్రీ పర్వత-విజయపురి (నేటి నాగార్జునకొండ) రాజధానిగా పాలించిన ఇక్ష్వాకుల తరువాత పలనాడు ప్రాంతం ఆనంద **గోత్రినులు** అనే రాజుల వశమైంది. నరసరావు పేట-నకరికల్లు మధ్యన పశ్చిమంగా ఉండే కందరపురం (చేజెర్ల) నుంచి పాలించిన ఆనందగోత్రిన రాజుల్లో కందరుడు (క్రీ.శ. 270-285), అత్తివర్మ (క్రీ.శ. 285-310), దామోదరవర్మ (క్రీ.శ.310-315) ముఖ్యులు. వీరిలో దామోదరవర్మ సర్వస్వతంత్రుడై మొత్తం కమ్మనాటినంతా పాలించాడు. ఇతని మట్టెపాడు తామ్రశాసనం, అత్తివర్మ గోరంట్ల తామ్రశాసనం, చేజెర్ల రాతి శాసనాలు ఆనందగోత్రినుల వివరాలు అందిస్తున్నాయి. చేజెర్ల శాసనం ప్రకారం 'కందర రాజు శత్రువుల ఏనుగుల గుంపులచేత సంకులమైన ధాన్యకటక యుద్ధంలో శత్రురాజులను జయించి **కృష్ణవేణ్ణానాథుడని, త్రికూటపతి'** అని పిలువబడినాడు. ఇతడు తన పేరుమీదుగానే కందరపురాన్ని నిర్మించగా, అది చేజెర్లగా మారింది. ఇతడు రెండు జనపదాలుగల రాజ్యాన్ని పాలించినట్లు **(కందరపుర వర జనపద ద్వితీయాధిపతి)** చెప్పబడింది. ఇతనికి అవని తలాంతవతి అనే కూతురుంది. దామోదరవర్మ మట్టెపాడు శాసనంలో ప్రాకృతంతోపాటు సంస్కృత భాషకూడ ఉండడం ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ఇతడు బుద్ధపాదానుధ్యాతుడైనా, గోవులను, హిరణ్యగర్భ దానాలను చేశాడు. తన రెండో విజయ రాజ్య సంవత్సరంలో కార్తీక శుద్ధ త్రయోదశినాడు, బ్రాహ్మణులకు పన్నులేమీ లేకుండా కంగూరు అనే గ్రామాన్ని దానం చేశాడు. తాను **సంయక్సం బుద్ధస్య పాదానుధ్యాతస్య** అని చెప్పుకుని చేజెర్లలోని చైత్యానికి మరమ్మతులు చేయించాడు. బుద్ధదేవుని స్మృతి చిహ్నంగా అత్యున్నత చైత్యంగా దాన్ని తీర్చిదిద్దాడు.

దామోదర వర్మ తరువాత అత్తివర్మ రాజ్యమేలాడు. ఇతడు కూడా అనేక మహాదానాలను చేశాడు. కొట్టిశర్మ అనే బ్రాహ్మణునికి తాడికొండ గ్రామంలో కొంత భూమిని, అతుకూరు అనే గ్రామాన్ని దానం చేశాడు.

చేజర్లలో కేంద్ర పురావస్తు శాఖ చేపట్టిన తవ్వకాల్లో తరువాత శాతవాహనకాలపు గజపృష్ఠాకార ఆలయ (చైత్య) పునాదుల్లో అధిష్ఠానం బయల్పడింది. అధిష్ఠానం మొదటి వరుస మట్టానికి నేలంతా రాతితో పరిచి, గర్భాలయంలోని అభిషేక జలం బయటకెళ్లడానికి ప్రణాళాన్ని ఏర్పాటు చేశారు. 7.5 మీటర్ల పొడవు, 2.64 మీటర్ల వెడల్పుతోగల గజపృష్ఠాకార ఆలయం పైన చక్కటి చైత్యాలయం ఉంది. అధిష్ఠానంలో ఉపానం, జగతి, కంపము, కంఠము, కంపము ప్రతివర్గాలు ఉన్నాయి. 45×24 7 సెం.మీల కొలతలుగల ఇటుకలతో నిర్మించిన ఈ ఆలయం ఆనందగోత్రినుల కాలంలో శైవాలయంగా మార్చబడింది. కాలక్రమంలో అర్ధ మంటపం, మహా మంటపం, నంది మంటపం, ధ్వజస్థంభం, గోపురాలు నిర్మింపబడినాయి.

అలెగ్జాండర్ రీ అనే బ్రిటీష్ అధికారి 1889లో చేజెర్ల వెళ్లి అక్కడి బౌద్ధ ఆనవాళ్ల గురించి తెలుసుకున్నాడు. 1917-18ఓ లాంగ్‌హార్స్ట్ అనే అధికారి అక్కడి పురాతన కట్టడాలను బాగా పరిశీలించి, ప్రాచీన బౌద్ధాలయం శివాలయంగా మార్చబడిందని చెప్పాడు. ఊరికి వాయవ్యంగానున్న మేఘాల మల్లయ్య కొండమీద గుహలున్నాయి. చేజెర్లలోని కపోతేశ్వరాలయంలో మొత్తం 78 దేవాలయాలున్నాయి. 1973-74లో తవ్వకాలు చేపట్టిన ఐ.కె.శర్మకు 25 దేవాలయాలు, 26 లింగపీఠాలు, నాలుగు నాగస్తంభాలు, 18 చిన్నరాతి నమూనా దేవాలయాలు, 4 సహస్రలింగాలు, 8 సప్త మాతల శిల్పాలు, 5 శాసనస్తంభాలు 4 కొత్తగా వెలుగుచూసిన ఇటుకరాతి ఆలయాలు కనిపించాయి. చేజెర్లలోని శాసనాలనుబట్టి అక్కడ చేజెర్ల, బిత్తలపురం, కపోతపురం అనే మూడు ఊళ్లుండేవనీ; కందరపురం, కపోతపురం, కందర కపోతపురమనికూడా చేజెర్లకు పేర్లుండేవని తెలుస్తోంది. ఆనందగోత్రినుల తరువాత, విష్ణుకుండిన, తొలి పల్లవ, తూర్పు చాళుక్య, యాదవ గజపతి, విజయనగర రాజుల కాలంలో గొప్ప శైవక్షేత్రంగా విరాజిల్లినట్లు చేజెర్ల శాసనాలు చెబుతున్నాయి. చేజెర్ల బౌద్ధ చైత్యంలోని స్థూపం స్థానంలో ప్రతిష్ఠించిన శివలింగం పేరు 'కపోతేశ్వరుడు'.

బౌద్ధ జాతక కథల్లోని కిరాతుడి నుంచి పావురాన్ని రక్షించడానికి తన తొడకోసి పావురమంత మాంసాన్ని దానం చేసిన ఇతివృత్తం ఆధారంగా,

మహాభారతంలోని అరణ్యపర్వంలో శిబిని శరణాగతవత్సలుడిగా చిత్రీకరించారు. కాశ్మీర రాకుమారుడైన శిబి చక్రవర్తి చేజెర్లలో బ్రహ్మత్వం కోసం 99 యాగాలు చేసి, వందోయాగం చేయడానికి సిద్ధమవుతాడు. త్రిమూర్తులు ఆ యాగాన్ని భగ్నం చేయాలనుకుంటారు. శివుడు విలుకాడుగా, బ్రహ్మ విల్లుగా, విష్ణువు పావురంగా మారి విప్పర్లకు చేరుకుంటారు. సభ తీరి ఉన్న శిబి చక్రవర్తి తొడపై పావురం వేగంగా వచ్చి వాలుతుంది. దానిని వేటగాడు చంపాలనుకుంటాడు. పావురమంత మాంసాన్ని ఇస్తానని శిబి చక్రవర్తి అనగా, వేటగాడు తిరస్కరిస్తాడు. శిబి తన శరీరాన్ని కత్తిరించుకుని వేటగానికి సమర్పించుకుంటాడు. త్రిమూర్తులు శిబి త్యాగానికి మెచ్చి వరమడగమంటారు. తాను లింగైక్యం చెందితే చాలన్న అతని కోరికను వారు మన్నించారు. పావురం పేరుమీదుగా ఆ లింగానికి 'కపోతేశ్వర లింగం' అనీ, ఆ వూరికి కపోత కందరపురం అని పేర్లు కలిగాయని స్థలపురాణం చెబుతోంది.

క్రీ.శ. 3వ శతాబ్దంలో కపోతేశ్వరాలయమైన బౌద్ధ చైత్యం అటు తరువాత శివాలయంగా స్థిరపడిపోయింది. ఈ ఆలయం గజ పృష్టాకారంలో ఉండి, అధిష్టానంకూడా బౌద్ధ చైత్యగృహం మాదిరిగా, శిఖరం చైత్య ముఖద్వారంగా తీర్చిదిద్దబడినాయి. బౌద్ధం సన్నగిల్లి బ్రాహ్మణమతం విస్తరిస్తున్న రోజుల్లో ఈ ఆలయం ముందు ఆనందగోత్రినులు, వెంటనే విష్ణుకుండిన, తొలిపల్లవుల ఆదరణ చూరగొంది. ఇక్కడి నుంచి తెలుగునేలపై ఆలయ నిర్మాణం ఊపందుకొంది.

**శాలంకాయనులు (క్రీ.శ. 3-4 శతాబ్దం)**

ఇక్ష్వాకుల తరువాత, ఆనంద గోత్రినులకు సమకాలికులుగా మధ్యకోస్తాంధ్రను పాలించిన వారు శాలంకాయనులు. శాలంకాయన గోత్రానికి చెందిన ఈ రాజవంశీకులు శాలంకాయనులనీ, వేంగి (ఏలూరు సమీపంలోని పెదవేగి)ని రాజధానిగా పాలించినందున వీరిని 'వైంగేయకుల'ని పిలిచారు. గుప్త వంశానికి చెందిన రెండవ సముద్రగుప్తుని అలహాబాద్ స్తంభ శాసనంలో వేంగి హస్తివర్మ ప్రస్తావన ఉండడంతో ఈ వేంగి పాలకులు ప్రాధాన్యతను సంతరించుకొన్నారు. ఇప్పటివరకూ వేంగి శాలంకాయనులకు చెందినవి తొమ్మిది రాగి రేకు శాసనాలు, ఒక శిలాశాసనం లభించాయి.

క్రీ.శ. 320 ప్రాంతంలో హస్తివర్మచే ప్రారంభమైన శాలంకాయనుల చరిత్ర తెలుసుకోవటానికి హస్తివర్మ పెదవేగి శాసనం, పెనుగొండ శాసనం, కొనుకొల్లు సంస్కృత శాసనం, మహారాజ నందివర్మ కొనుకొల్లు ప్రాకృత శాసనం, విజయ దేవవర్మ

ఏలూరు ప్రాకృత శాసనం, చండవర్మ కొల్లేరు శాసనం, నందివర్మ కంతేరు శాసనం, విజయస్కందవర్మ కంతేరు శాసనం, యువ మహారాజు అచండవర్మ ధారికాంటూరు శాసనం, రెండో స్కందవర్మ గుంటుపల్లి శిలాశాసనాలు ముఖ్యమైనవి.

వీటిద్వారా శాలంకాయనుల వంశావళి, పాలనా భూభాగం, దానాలు, దేవాలయ నిర్మాణాలకు సంబంధించిన వివరాలను అందిస్తున్నాయి. శాసనాల్లో ఈ రాజులు తాము శాలంకాయన గోత్రానికి చెందామని, తమ రాజధాని విజయ వేంగీపురమని పేర్కొన్నారు. వీరి రాగిరేకు, శిలా శాసనాలు రాజధాని అయిన విజయవేంగీపురం నుంచే విడుదలయ్యాయి. వీరి కాలంలో బౌద్ధం కొనసాగినా వైదికమత విజృంభణాన్నికూడా గమనించవచ్చు. వీరు అనేక అశ్వమేధ యాగాలనుచేసి వైదిక సంప్రదాయాలను ఆదరించారు. శాసనాల్లో తాము చిత్రరథస్వామి పాదానుధ్యాతులమని, బప్ప భట్టారక పాదభక్తులమనీ చెప్పుకోవడం చేత, చిత్రరథ (చైత్రరథ) శబ్దం సూర్యుని సూచించటంవల్ల, వీరు సూర్యదేవునికి ఆలయాలు కట్టించి ఆరాధించారనటానికి వీలు చిక్కింది. వీరి రాగిరేకు వాసనాలపైగల ముద్రికపై నంది ఉండటంవల్ల కొందరు, వీరిని శైవులనికూడా తేల్చి చెప్పారు.

వేంగీ శాలంకాయనుల శాసనాలు కొన్ని ప్రాకృతంలోను, కొన్ని ప్రాకృత-సంస్కృత మిళితంగాను, మిగిలినవి సంస్కృతంలోనూ ఉన్నాయి. దొరికిన మూడు ప్రాకృత శాసనాలను యువరాజైన అచండవర్మ, దేవవర్మ, నందివర్మలు వేయించినవి. సంస్కృత శాసనాల్లో వీరి వంశ వివరాలను తెలిపే శాసనాలను అచండవర్మ కుమారుడు నందివర్మ, రెండవ నందివర్మ, స్కందవర్మలు వేయించారు. పెదవేగిలో శాలంకాయనుల కాలంనాటి బౌద్ధస్థూపం బయల్పడింది. క్రీ.శ. 1888లో రాబర్ట్ సివెల్ పెదవేగిని సందర్శించి 'ధనం దిబ్బ' అనే బౌద్ధ స్థావరాన్ని కనుగొనగా, 1902లో పెదవేగికి వచ్చిన అలెగ్జాండర్ రీ అనే పురాతత్వవేత్త మరికొన్ని పురాతన స్థలాలు, శకలాలను గుర్తించాడు.

1985-87 మధ్య కాలంలో కేంద్ర పురావస్తు సంస్థకు చెందిన డాక్టర్ ఐ.కె.శర్మ ఆధ్వర్యంలో జరిగిన తవ్వకాల్లో ధనం దిబ్బ, పరమేశ్వర దేవాలయం, కోటకు పశ్చిమంగా మూడు చోట్ల ఆసక్తికరమైన విషయాలు బయల్పడినాయి. ధనందిబ్బ దగ్గర జరిపిన తవ్వకాల్లో ఒక స్థూపం బయల్పడింది. గుంటుపల్లిలో దొరికిన స్తంభ శాసనంలో 'పరమ భాగవతుడైన నందివర్మ బౌద్ధ విహారానికి విరివిగా దానాలు చేసినట్లు పేర్కొనటం మూలాన, రెండో నందివర్మ పెదవేగిలో బౌద్ధ స్థూప, విహారాలను నిర్మించాడని చెప్పవచ్చు.

ఈ స్థూపానికి ఉత్తరంగా జరిపిన తవ్వకాల్లో 19.40×176.0 మీటర్ల ఇటుకరాతి కట్టడం బయల్పడింది. రెండున్నర అడుగుల ఎత్తుగల అధిష్ఠానంపైన పంచాయతన దేవాలయ సముదాయమున్న ఆధారాలు దొరికాయి. 42×21×8 సెం.మీ.ల కొలతలతోనున్న ఇటుకలతో నిర్మించిన ఈ అధిష్ఠానంలో జగతి, కుముదం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. అభిషేక జలం బయటకు వెళ్లటానికి ప్రణాళాన్నికూడా ఏర్పాటు చేశారు. పంచాయతనం అంటే మధ్యలో ప్రధాన దేవుడు, నాలుగు మూలలా నలుగురు దేవతలకు కలిపి మొత్తం ఐదు దేవాలయాలను ఒకేచోట నిర్మించటం. మధ్యలో శివుణ్ణి ప్రతిష్ఠిస్తే శివ పంచాయతనమని, విష్ణువును ప్రతిష్ఠిస్తే విష్ణు పంచాయతనం అనీ పిలుస్తారు. దక్షిణం వైపు గోడ 2.35 మీటర్ల ఎత్తు ఉండగా, మిగతా వైపు 1.60 మీటర్ల ఎత్తు ఉంది. గర్భాలయ గోడలు– బయటి గోడలమధ్యలో కోష్ఠాలున్నాయి. ఐదు దేవాలయాలు చదరంగా ఒకే కొలతలతో ఉన్నాయి. ఆలయాల లోపల ఎలాంటి విగ్రహాలు లభ్యం కాలేదు. చుట్టూ 2.0 మీటర్ల వెడల్పుతో ఇటుకరాతి ప్రదక్షిణాపథం ఉంది.

క్రీ.శ. 8వ శతాబ్దికి చెందిన ఆదిశంకరులు పంచాయతన పద్ధతిని ప్రవేశపెట్టాడని చారిత్రకులు నమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో వేంగిపురంలో బయల్పడిన పంచాయతన దేవాలయ సముదాయం క్రీ.శ.5వ శతాబ్దినాటిదని తేలడంవల్ల మొత్తం భారత దేశంలోనే తొట్ట తొలి పంచాయతన దేవాలయాన్ని అందించిన ఘనత శాలంకాయనులకే దక్కింది. శాలంకాయనుల రాజముద్రపైన, రాగిరేకు శాసనాల ముడిపైన నందిగుర్తు ఉండటంచేత వీరు శైవులని; గుంటుపల్లి వేంగిలలో బౌద్ధ స్థూపాలను నిర్మించి దానాలను చేయటంవల్ల బౌద్ధులని; వేంగిపురంలోనే బయల్పడిన విష్ణు దేవాలయంవల్ల వీరిని వైష్ణవులని అనేకంటే... వీరు అప్పటికి ప్రచారంలోనున్న భిన్న మతాలను ఆదరించినట్లు చెప్పుకోవచ్చు. పెదవేగి, హస్తివర్మ శాసనంలో వివిధ ధర్మ ప్రధానస్య అని పేర్కొనటం పైవిషయాన్ని రూఢి చేస్తుంది.

ఇంకా ఇక్కడ జరిపిన తవ్వకాల్లో దాదాపు 6 కి.మీ. వైశాల్యంలో చుట్టూ కట్టిన మట్టికోటనుబట్టి వేంగిపురం శాలంకాయనుల రాజధాని అని శాసనాల్లో పేర్కొన్న విషయాన్ని ఋజువు చేస్తుంది. మట్టికోట చుట్టూ కందకంకూడా ఉండటం గమనించాల్సిన విషయం. కోటగోడకు వాయవ్యం, దక్షిణ దిక్కుల్లో నున్న చిన్నసైజు గేట్లకు వాడిన ఇటుకల సైజు... స్థూపం, పంచాయతన దేవాలయ సముదాయానికి వాడిన ఇటుకల సైజు ఒకటే కావటంవల్ల వేంగి (విజయవేంగి) పురాన్ని రాజధానిగా

చేసుకున్న శాలంకాయనులు కోటగోడనుకూడా కట్టారని తెలుస్తోంది. ఇక్కడ ఇంకా క్రీ.శ. 2, 3 శతాబ్దాలనాటి బ్రాహ్మీ అక్షరాలున్న బౌద్ధ శిలాస్తంభాలు, మాచర్ల సున్నపురాతిలో చెక్కిన శివ-పార్వతి బొమ్మ, ఒక శిలపై వరుసగా చెక్కిన ఐదు శివలింగాలు, మహిషాసురమర్దిని శిల్పాలు, ఎరుపు రంగు మట్టిపాత్రలు, మట్టిబొమ్మలు, శాలంకాయనుల చరిత్రకు, సంస్కృతికి అద్దం పడుతున్నాయి.

అలహాబాద్ ప్రశస్తిలోని హస్తివర్మ అనంతరం అతని కొడుకు నందివర్మ (క్రీ.శ. 350-380) సింహాసనం చేపట్టి రాజ్యవిస్తరణ గావించాడు. నందివర్మ తరువాత అతని సోదరుడు దేవవర్మ, తరువాత అచండవర్మ రాజులయ్యారు. వీరి అనంతరం విజయనందివర్మ రాజైన పరమ భాగవతుడు. ఇతడే శాలంకాయన చిట్టచివరిరాజు. తెలుగునాట ఇటుకరాతితో దేవాలయాల నిర్మాణ ఒరవడిని కొనసాగించటంద్వారానూ, మొట్టమొదటసారిగా పంచాయతన దేవాలయ నిర్మాణాన్ని చేపట్టడంద్వారానూ శాలంకాయనులు తమ ప్రత్యేకతను చాటుకొన్నారు.


**విష్ణుకుండినులు (క్రీ.శ.375-612)**

ఇక్ష్వాకుల తరువాత తెలుగునేలలో అధికభాగాన్ని పాలించిన శాలంకాయనుల భూభాగాన్ని విష్ణుకుండినులు ఆక్రమించి రాజ్యవిస్తరణ గావించారు. వీరు రంగారెడ్డి జిల్లా కీసరగుట్ట, నల్లగొండ జిల్లా ఇంద్రపాలనగరం (తుమ్మలగూడెం) రాజధానిగా రాజ్యాన్ని పాలించారు.

విష్ణుకుండినుల శాసనాలు ఇప్పటివరకూ పదికి పైగా దొరికాయి. గోవింద వర్మ- తుమ్మలగూడెం, చైతన్యపురి శాసనాలు; మాధవవర్మ- ఈపూరు, ఖానాపూర్, పాలమూరు రాగిరేకు శాసనాలు, వేల్పూరు శిలా శాసనం; రెండో మాధవవర్మ- ఈపూరు శాసనం, ఇంద్ర వర్మ రామతీర్థం శాసనం, విక్రమేంద్ర భట్టారకవర్మ- తుండి, చిక్కుళ్ళు, తుమ్మలగూడెం, పాతగండిగూడెం శాసనాలు దొరికినవాటిల్లో ఉన్నాయి. విష్ణుకుండినుల వంశక్రమంలో గోవిందవర్మ, మాధవవర్మ, మంచణ్ణ భట్టారక, దేవవర్మ, రెండో మాధవవర్మ, విక్రమేంద్రవర్మ, ఇంద్ర వర్మ, రెండో విక్రమేంద్ర వర్మలు ఉన్నట్టు చరిత్రకారులు తేల్చారు.

విష్ణుకుండినులు వినుకొండ, తిరువూరు, వేల్పూరుల నుంచి పాలించారని చరిత్రకారుల మధ్య అభిప్రాయబేధాలున్నాయి. అయితే ఇటీవల రాష్ట్ర పురావస్తు శాఖ హైదరాబాద్‌కు 32 కి.మీ.ల దూరంలోనున్న కీసరగుట్ట వద్ద జరిపిన తవ్వకాలలో బయల్పడిన ఇటుకరాతి రాజప్రాసాదం, ఇటుక రాతి దేవాలయాలు, పాతిన రాతి

సౌందర్య గ్రంథాలయ ACC No. 118756



*ఇటుక రాతి ఆలయాలు, గదులు, కీసరగుట్ట, రంగారెడ్డి జిల్లా*

శివలింగాలు, మాతృదేవత శిల్పం, విష్ణుకుండినుల నాణేలు, మట్టిపాత్రలు, అన్నింటికీ మించి స్థావరం చుట్టూగల రాతి కోటగోడ, అక్కడొక బండపైగల క్రీ.శ. 4వ శతాబ్ది అక్షరాల్లో నున్న 'తులచు వాన్రు (రాతిని తొలిచేవారు)' అనే చిన్న శాసనం విష్ణుకుండినులు కీసరగుట్ట నుంచే పాలించారని చెప్పడానికి వీలయ్యింది.

విష్ణుకుండినుల కులదైవం శ్రీపర్వత స్వామి. ఎందుకంటే వారు శాసనాల్లో శ్రీపర్వతస్వామి పాదానుద్యాతులమని చెప్పుకొన్నారు. ఇక్ష్వాకుల నుంచి అధికారం స్వీకరించిన విష్ణుకుండినులు శ్రీపర్వత-విజయపురిని (నాగార్జునకొండను)కూడా వారి ఆధీనంలోకి తెచ్చుకొని ఇక్ష్వాకుల దేవుడైన భగవాన్ బుద్ధుడినే శ్రీపర్వత స్వామిగా పేర్కొని ఉంటారని ప్రముఖ పురావస్తు పరిశోధకులు కీ.శే. బి.ఎస్.ఎల్.హనుమంతరావు అభిప్రాయం.

**పరిపాలన**

వీరు తమ పూర్వీకులైన ఇక్ష్వాకుల రాచరిక వ్యవస్థనే కొనసాగించారు. పరిపాలనలో రాజుకు మంత్రిపరిషత్ సహకరించేది. సామ్రాజ్యాన్ని రాష్ట్రాలుగా, విషయాలుగా విభజించారు. పల్కీరాష్ట్ర, కమ్మరాష్ట్ర, వంటి పాలనావిభాగాల ప్రస్తావన, సైన్యం చతురంగబలాలు కలిగి హస్తికోశ (గజబలాధ్యక్ష) వీరకోశ (పదాతి దళపతి) వంటి సైనిక పదవుల ప్రస్తావన శాసనాల్లో ఉంది. న్యాయపాలనా విషయంలో శిక్షలు కఠినంగా ఉండేవి. నిష్పాక్షికంగా తీర్పునివ్వడంలో వారికి వారే సాటి.

## సాంఘిక మత, పరిస్థితులు


వీరు వైదిక మతాన్ని ఆచరించినప్పటికి పరమత సహనం పాటించారు. గోవిందవర్మ భార్య బౌద్ధమతాన్ని ఆదరించింది. వీరి కాలంలో పౌరాణిక దేవతలు బహుళ ప్రాచుర్యం పొందారు. రెండవ మాధవవర్మ పాలనా కాలంలో వైదిక మతం విజృంభించింది. రాజసూయ, అశ్వమేధ వంటి యాగాలు నిర్వహించారు. వీరి కులదైవం శ్రీ పర్వతస్వామి అయినా మాధవవర్మ, గోవిందవర్మ పేర్లు వైష్ణమాభిమానాన్ని తెలుపుతున్నాయి.

## సాహిత్యం

సంస్కృత భాషకు రాజాదరణ లభించింది. విక్రమేంద్రవర్మ స్వయంగా కవి. మహా కవిగా శాసనాలలో వర్ణించబడినాడు. నాల్గవ మాధవ వర్మ సంస్కృత అలంకార శాస్త్రం జనాశ్రయఛందో విచ్ఛిత్తి గ్రంథాన్ని రాసినట్లు ప్రతీతి. ఇతడు కుమారిల భట్టు పూర్వమీమాంసపై వ్యాఖ్యానం కూడా రాశాడు.

## దేవాలయాలు

విష్ణుకుండినుల కాలంలోకూడా బౌద్ధం విలసిల్లినా... తుమ్మలగూడెం శాసనంలో పరమ భట్టారికాదేవి మహావిహారాన్ని నిర్మించి అనేక దానాలు చేసిందని చెప్పబడింది. విష్ణుకుండిన రాజుల్లో ఇద్దరు (ఇంద్రభట్టారక వర్మ, విక్రమేంద్రవర్మలు)మాత్రం పరమ మాహేశ్వరులుకాగా, మిగిలినవారు వైష్ణవులు. మాధవవర్మ గుంటూరుజిల్లా వేల్పూరులో భూతగ్రాహకస్వామి (యుముడు)కి,



ఉండవెల్లిలోని నాలుగంతస్తుల బౌద్ధ గుహాలయం, గుంటూరు జిల్లా

దంతిముఖస్వామి (గణపతి)కి ఆలయాలను నిర్మించినట్టు వేల్పూరు శాసనం తెలియజేస్తుంది. ఇతడు ఏకాదశాశ్వమేధావబృథ స్నానములతో జగత్కల్మషాన్ని ప్రక్షాళన చేశాడనీ, సువర్ణ, పౌండరీక, పురుషమేధ, సర్వమేధ, ప్రాధిరాజ్య, ప్రాజాపత్య, రాజసూయాది క్రతువులను చేశాడ'ని శాసనాలు పేర్కొంటున్నాయి. విజయవాడ, ఉండవెల్లి, మొగల్రాజపురం గుహాలయాలు విష్ణుకుండినుల కాలానివేనని చరిత్రకారులు నిర్ధారించారు. వీటిలో ఉండవెల్లిలోని నాలుగంతస్తుల గుహాలయం తొలుత బౌద్ధ గుహ కాగా, తరువాత బ్రాహ్మణ మతానుయాయులు ఆక్రమించి విష్ణు గృహంగా మార్చుకొన్నారు. ఇక్ష్వాకుల చివరి రోజులలో ప్రారంభమైన కృష్ణ, వాసుదేవ, సంకర్షణ, బలరామ, అనిరుద్ధులనే పంచవీరులను ఆరాధించడం విష్ణుకుండినుల కాలంలో ప్రాచుర్యం పొందింది. గుంటూరు జిల్లా పిడుగురాళ్ల సమీపంలోని కొండమోటులో లభించిన క్రీ.శ.2వ శతాబ్దినాటి పాలరాతి శిల్పం మధ్యలో నరసింహుడు, రెండువైపులా పంచవీరున్న శిల్పం, ఈ కాలంలో పంచవీరారాధనకు తోడ్పడింది.

1975-79 మధ్యకాలంలో రాష్ట్ర పురావస్తు శాఖ కీసరగుట్ట పశ్చిమభాగాన జరిపిన తవ్వకాల్లో ఇటుకరాతితో నిర్మించిన శివాలయాలు బయల్పడినవి. రెండు దేవాలయాలు దీర్ఘ చదరంగా, రెండు మీటర్ల ఎత్తుతో అధిష్ఠానం వరకూ ఉన్నాయి. మరో దేవాలయం మూడు గర్భాలయాలు, మూడు అర్ధ మంటపాలు, ద్వారాలు, ముందు మెట్లు, చంద్రశిలలు కలిగిన 'తొలి త్రికూట దేవాలయం'గా గుర్తింపు పొందింది. గర్భాలయం 2.0×2.65 మీటర్ల కొలతలతో ఉంది. మరో దేవాలయం 2.8×1.9 మీటర్ల కొలతలుగల గర్భాలయం, 2.35×2.20 మీటర్ల కొలతలున్న అర్ధ మంటపం కలిగి ఉంది. అధిష్ఠానంలో ఉపానం, జగతి, కుముదం, కంపం, కంఠం, పట్టిక వర్గాలున్నాయి. గర్భాలయంలో దేవతామూర్తిని ప్రతిష్ఠించడానికి, ఒక ఇటుకరాతి అరుగు ఉంది. గర్భాలయ గోడల బయటి గోడల మధ్య భాగంలో దేవతలకోసం కోష్టాల అమరిక ఉంది. ఈ ఆలయానికి విడిగా ఒక ప్రాకారంకూడా ఉంది.

ఈ దేవాలయ అర్ధమంటప నైరుతి దిశన నేలమట్టంలో ఒక అందమైన మట్టికుండను పాతారు. ఈ కుండ మధ్యభాగంలో ఐదు స్త్రీ ప్రతిమలున్నాయి. మూతపై మరో స్త్రీమూర్తి ప్రతిమగలిగి, కుండపై మొత్తం ఐదు పాము బొమ్మలున్నాయి. ఇలాంటి బొమ్మలున్న కుండ లేక మట్టికలశం ఆ కాలపు మరే దేవాలయంలోనూ బయల్పడలేదు. తవ్వకాలు చేపట్టిన డాక్టర్ వి.వి.కృష్ణశాస్త్రి ఈ కలశాన్ని గర్భాపాత్ర అని పిలిచారు. తవ్వకాల్లో పాలరాతి లింగాకారాలు కూడా దొరికాయి. అంతేకాక, తవ్వకాల్లో 9×9

సెం.మీ.ల కొలతలుగల ఒక రాతి ఫలకం లభించింది. మధ్యలో మాతృదేవత, తన రెండు చేతుల్లో శివ, విష్ణుమూర్తుల గుర్తులైన లింగం, సింహాలను ధరించి ఉంది.

కొంచెం అవలగా జరిపిన తవ్వకాల్లో విశాలమైన ప్రాంగణంలో అనేక గదులతో నిర్మించిన రాజప్రాసాద పునాదులు బయల్పడడంతో, కీసరగుట్ట విష్ణుకుండినుల రాజధానిగా విలసిల్లిందని చెప్పవీలైంది. ఇంకా కొంచెం దూరంలో నీటి మడుగుకు అవల రోడ్డు పక్కగా చదరపు శివాలయం, చుట్టూ ప్రదక్షిణాపథంతోనూ, గర్భాలయంలోని అభిషేక జలం బయటకు వెళ్లడానికి ఇటుకరాతి కాలువ ఒకటి ఉంది.

తవ్వకాల్లో విష్ణుకుండినుల కాలంనాటి శాసన శకలం, మట్టి, విలువైన రాళ్లతో చేసిన పూసలు, మట్టిపాత్రలు, మట్టి, సున్నపు బొమ్మలు, ఇంకా సింహం, దీపపు సెమ్మె బొమ్మలుగల నాణేలు బయల్పడినాయి. మహబూబ్‌నగర్ జిల్లా గుమ్మడంలో ఒక చదరపు గర్భాలయంగల ఆలయం బయల్పడింది. విష్ణుకుండిన కాలపు ఇటుకలతో నిర్మించిన ఈ ఆలయానికి నాలుగు వైపులా నాలుగు ద్వారాలున్న ఆధారాలు లభించి అప్పటికే సర్వతోభద్ర ఆలయ నిర్మాణం ప్రారంభమైందని చెప్పడానికి అవకాశం దొరికింది.

నల్లగొండ జిల్లా ఏలేశ్వరం (నాగార్జునసాగర్ జలాశయంలో మునిగిపోయింది) వద్ద జరిపిన తవ్వకాల్లో ఇటుకలతో నిర్మించిన చదరపు శివాలయం బయల్పడింది. విజయవాడ పరిసరాల్లోగల మొగల్రాజపురంలో బ్రాహ్మణ మత దేవతలకుద్దేశించి తొలిచిన గుహలు విష్ణుకుండినుల కాలంలోనే తొలిచారని, 'తొలుచువాన్రు' అన్న శాసనం దీనిని ఋజువు చేస్తుందని ప్రముఖ పురావస్తు పరిశోధకులు డాక్టర్ ఐ.కె.శర్మ తెలియజేశారు.

పరిశీలించి చూడగా, ఇక్ష్వాకుల కాలంలో ప్రారంభమైన ఆలయ నిర్మాణం, విష్ణుకుండినుల కాలానికి కొంచెం వృద్ధిచెంది, విడి ఆలయాలు, సముదాయాలుగా, గర్భాలయ అర్ధమంటప, మహామంటపాలుగా రూపాంతరం చెంది, గర్భాలయం చుట్టూ కోష్టాలు, అలానే ప్రదక్షిణాపథం నిర్మించబడ్డాయి. వాస్తుపరంగా కొన్ని కార్యక్రమాలు చేపట్టేవారని, ఎక్కువగా శివుణ్ణి ఆరాధించినా, మాతృదేవత, గణపతి, విష్ణుమూర్తులనుకూడా ఆరాధించేవారని తెలుస్తోంది. గుమ్మడంలో బయల్పడిన ఆలయ పునాదులు మాత్రం అది నలువైపులా ద్వారాలుండి, జైన తీర్థంకరులకుద్దేశించిన సర్వతోభద్ర ఆలయమని తేలింది. ఈ విధంగా విష్ణుకుండినుల కాలంలో ఇటుకరాతితో

శివాలయాలు, వాటికి అందమైన అధిష్ఠానాలు, పాదవర్గం ఉండేవని తెలుస్తోంది. పై కప్పు ఉండేదని భావిస్తున్నా అది ఎలా ఉండేదో తెలిపే ఆధారాలు లేవు. ఇంకా కొండలను తొలిచి ఇటుక, గుహాలయాలను త్రికూట పద్ధతిలో తీర్చిదిద్దారని చెప్పవచ్చు.



త్రవ్వకాలలో బయల్పడిన ఇటుక రాతి శివాలయం, ఏలేశ్వరం, నల్లగొండ జిల్లా

# 3 చారిత్రక తొలిమధ్యయుగం

## (క్రీ.శ. 6 – 9 శతాబ్దాలు)

## Early Medieval Period

### బాదామీ చాళుక్యులు (క్రీ.శ.6–8 శతాబ్దాలు)

విష్ణుకుండిన రాజులు బలహీనపడడంతో కర్నాటకలోని బాదామీ (వాతాపి)ని రాజధానిగా జేసుకొని పాలించిన పశ్చిమ లేక బాదామీ చాళుక్యులు పశ్చిమాంధ్రదేశాన్ని (ఇప్పటి తెలంగాణను) వశపరచుకొన్నారు. క్రీ.శ.543లో బాదామీ రాజధానిగా మొదటి పులకేశి, కోటను నిర్మించుకొని చాళుక్య రాజ్యాన్ని స్థాపించాడు. తరువాత, క్రీ.శ.566లో సింహాసనమెక్కి క్రీ.శ. 597 వరకు పాలించిన మొదటి కీర్తివర్మ రాజ్యాన్ని సుస్థిరపరచటమేకాక, కాదంబులు, నళులను జయించి సామ్రాజ్యాన్ని బాగా విస్తరించాడు. అతని తరువాత సింహాసనాన్ని అధిష్ఠించిన మంగళేశుడు క్రీ.శ.602లో బుద్ధరాజును జయించి రాజ్యాన్ని మరింత విస్తరించాడు. తరువాత క్రీ.శ. 609లో రాజ్యాధికారాన్ని చేపట్టిన రెండో పులకేశి వనవాసినుంచి పాలిస్తున్న కాదంబులను, అలూపులను, మాళవరాజులను, పశ్చిమ గాంగులను, కొంకణ మౌర్యులను, లాటులను, ఘూర్జరులను జయించి చాళుక్య సామ్రాజ్యాన్ని మరింత విస్తృతపరిచాడు. కనోజ్ నుంచి పాలిస్తున్న హర్షుని ఓడించిన రెండో పులకేశి కోసల, కళింగ, ఆంధ్ర దేశాలపై దండెత్తి వాటిని వశపరచుకొన్నాడు. క్రీ.శ. 621లో తీరాంధ్రాన్ని స్వాధీనపరచుకొని, వేంగి రాజధానిగా, తన తమ్ముడైన కుబ్జవిష్ణువర్ధనుని పాలకునిగా చేసి, వేంగీ లేక తూర్పు చాళుక్య రాజ్యాన్ని స్థాపించాడు. తరువాత, రెండో పులకేశి బాదామికి వెనుదిరిగిపోయాడు. రెండో పులకేశి తుమ్మెయనూరు రాగిరేకు శాసనంలో మహబూబ్‌నగర్– కర్నూలు ప్రాంతాలు కలిసిన చాళుక్య విషయం, ఇంకా కృష్ణా–తుంగభద్ర నదుల సంగమ స్థానమైన కూడల సంగమేశ్వర ప్రస్తావన

లున్నాయి. అతడు అనంతపురం ప్రాంతాన్ని పాలిస్తున్న బాణులను, కడప, చిత్తూరు ప్రాంతాలను పాలిస్తున్న రేనాటి చోళులనుకూడా జయించాడు. అంతకంటే మించి, ఆగ్నేయాంధ్ర ప్రాంతంలో పల్లవ రాజైన మొదటి మహేంద్రవర్మ (క్రీ.శ. 600-630)ను జయించి తమిళదేశంపైకూడా తన ఆధిపత్యాన్ని చెలాయించి అటు మధ్య భారతంలోనూ, ఇటు దక్షిణ భారతంలోనూ విజయ పతాకాన్నెగరేశాడు. బాణులు, తెలుగు చోళులు, పల్లవులతో జరిగిన ఎడతెగని యుద్ధాల్లో, పల్లవ నరసింహవర్మ చేతిలో క్రీ.శ.642లో ఓటమి పాలవటమేకాక, అప్రతిహతవైరి వీరశిరోమణిగా గుర్తింపుపొందిన రెండో పులకేశి పల్లవ నరసింహవర్మ చేతిలో చనిపోయాడు.

కొన్నాళ్ల అరాచకం తరువాత క్రీ.శ.655లో విక్రమాదిత్యుడు రాజ్యానికొచ్చాడు. ఈ సమయంలో తెలుగునేలపైగల చాళుక్య ప్రాంతాన్ని విక్రమాదిత్యుని సోదరుడైన ఆదిత్యవర్మ ఏలుతుండేవాడు. ఇదే సమయంలో అలంపురం సీమను బాలాదిత్య మహారాజు, కర్నూలు - మహబూబ్‌నగర్ (అప్పటి ఏఱువసీమ) ప్రాంతాన్ని, గొగ్గి బట్టారుడు, ప్రకాశం జిల్లా తురుకటక నగరం (తురుమెళ్ల) నుంచి పాలించేవారు. క్రీ.శ. 674 నాటి గద్వాల రాగిరేకు శాసనం విక్రమాదిత్యుని రాజ్య విస్తరణ, సుస్థిరతల గురించి పేర్కొంది. మరో గమ్మత్తైన సంగతేమిటంటే, విక్రమాదిత్యుని స్తబ్దపాలనా కాలంలో అతని కొడుకు వినయాదిత్యుడు, మనుమడు విజయాదిత్యుడు వరుసగా చాళుక్య రాజ్యాన్ని పాలించారు.

విక్రమాదిత్యుని తరువాత అతని కొడుకు వినయాదిత్యుడు క్రీ.శ.681లో సింహాసనమెక్కి క్రీ.శ.696 వరకూ రాజ్యమేలాడు. వినయాదిత్యుడు తన భార్య పేరుమీద అలంపురంలోని స్వర్గ బ్రహ్మాలయాన్ని (నవబ్రహ్మాలయాల్లో ఒకటి) నిర్మించాడు. విజయాదిత్యుడు క్రీ.శ.696లో సింహాసన మెక్కటంతో చాళుక్య పాలన సుస్థిరమవటమేకాక, శాంతియుతంగా కూడా సాగింది. క్రీ.శ.718వ సంవత్సరంలో విజయాదిత్యుడు అలంపురాన్ని సందర్శించినట్టు అక్కడి శాసనంవల్ల తెలుస్తోంది. ఇతని కాలంలో కర్ణాటకలోని పట్టడకల్ ప్రాశస్త్యాన్ని సంతరించుకొంది. విజయాదిత్యుని అనంతరం రెండో విక్రమాదిత్యుడు క్రీ.శ.733లో సింహాసనమెక్కి క్రీ.శ. 744 వరకూ పాలించి, అరబ్బుల దండయాత్రను సమర్థవంతంగా తిప్పికొట్టాడు. వీరికాలంలోనే గుజరాత్‌లో మరో చాళుక్య రాజ్యవంశం పాలించడం ప్రారంభమైంది. రానురాను ఈ చాళుక్యులే సోలంకులైనారు.

ఇదే సందర్భంలో, రెండో కీర్తివర్మ పల్లవులపై మూడుసార్లు దండెత్తి

విజయాన్ని సాధించాడు. పల్లవ నందివర్మను కీర్తివర్మ ఓడించినట్లు తెలిపే శాసనాలు కంచి, పట్టడకల్‌లలో ఉన్నాయి. క్రీ.శ.744లో సింహాసనమెక్కిన రెండో కీర్తివర్మ కేవలం పదేళ్లపాటే పాలించి రాష్ట్రకూటరాజైన దంతిదుర్గుని చేతిలో ఓడిపోయాడు. దీంతో చాళుక్య వంశం అంతరించి క్రీ.శ.755లో రాష్ట్రకూటుల పాలన ప్రారంభమైంది.

ఈ విధంగా జయసింహుడు, రణరాగుడు, అతని కొడుకు మొదటి పులకేశి (క్రీ.శ.544–566), కీర్తివర్మ (క్రీ.శ.567–597), మంగళేశుడు (క్రీ.శ.598–609), రెండో పులకేశి (క్రీ.శ.609–642), మొదటి విక్రమాదిత్యుడు (క్రీ.శ.655–680), వినయాదిత్యుడు (క్రీ.శ.680–696), విజయాదిత్యుడు (క్రీ.శ.696–733), రెండో విక్రమాదిత్యుడు (క్రీ.శ.733–744), చివరగా రెండో కీర్తివర్మ (క్రీ.శ.744–755) వరుసగా పాలించారు.

బాదామీ చాళుక్యుల్లో రెండవ పులకేశి గొప్పవిజేత. నర్మదానది మొదలు కావేరి నది వరకు రాజ్యవిస్తరణ గావించాడు. నర్మదానది తీరాన ఉత్తరాధిపతియైన హర్షున్ని ఎదిరించి విజయం సాధించి, దక్షిణాపథసార్వభౌమునిగా కీర్తిని పొందాడు. క్రీ.శ. 642 లో రవికీర్తి ఐహొళే శాసనం పులకేశి దిగ్విజయ యాత్రలను వర్ణిస్తుంది. అలంపూరు, పాణ్యం, మహానంది, కూడలి, కడమరకాలువ, సత్యవోలు, తేరాల, ఐజ మొదలైన చోట్ల రేఖానాగర పద్ధతిలో ఎత్తైన ఆలయాలను నిర్మించారు.

### పాలనా వ్యవస్థ

వీరు గుప్త, వాకాటకుల పాలనా విధానాన్ని అనుకరించి, వంశపారంపర్యమైన రాజరిక వ్యవస్థను కొనసాగించారు. రాజు సర్వాధికారి దైవాంశసంభూతుడనే భావం ప్రజల్లో ఉండేది. పాలనా సౌలభ్యం కొరకు సామ్రాజ్యాన్ని, **రాష్ట్రాలు, విషయాలు, నాడులు,** గ్రామాలుగా విభజించారు. రాజకుమారులను **యువరాజులుగా** నియమించారు. **విషయ** పాలకుడుగా **మహత్తరుడు** వుండేవాడు. మహాజనులైన పెద్దల సహకారంతో **గాముండ, కరణం,** అనే ఉద్యోగులు గ్రామ పాలన నిర్వహించారు.

### సాంఘిక, మత పరిస్థితులు

చాళుక్యులు వైదిక మతాన్ని ఆచరించి అశ్వమేధ, వాజపేయాది క్రతువుల్ని చేశారు. భక్తి భావం పెరిగి వ్రతాలు, తీర్థయాత్రలు బహుళ ప్రాచుర్యం పొందాయి. బాదామీ, ఐహోలె, పట్టడక్కల్‌లలో త్రిమూర్తులకు ఆలయాలను కట్టారు. పరమత

సహనం వహించి జైనాన్ని కూడా ప్రోత్సాహించారు. రెండవ పులకేశి సేనాని, ఐహోలే శాసన కర్త అయిన రవికీర్తి జైనమతానుయాయుడే. రెండో పులకేశి పరమభాగవతుడుగా అభివర్ణించబడినాడు. మొదటి విక్రమాదిత్యుడు గొప్ప శివభక్తుడు. తన గురువైన సుదర్శనాచార్యుల పర్యవేక్షణలో శివమండల దీక్షను తీసుకొన్నట్లు మగ్రూరు (మహబూబ్‌నగర్ జిల్లాలోని చిన్నమారూరు) గ్రామ శాసనం తెలుపుతుంది. విజయాదిత్యుడి షిగ్గావ్ రాగిరేకు శాసనాల ఆధారంగా జైన ఆలయాలకు కానుకలను సమర్పించాడు. అలంపురం ప్రశస్తిలో ఇతను పేదలకు, జబ్బుపడిన పశువులకోసం ఆశ్రమాలు, ఆస్పత్రులు నిర్మించి, చెరువులు త్రవ్వించి, ఎన్నో దానధర్మాలు చేసినట్లుగా ఉంది. రెండో విక్రమాదిత్యుడు అన్ని మతాలనూ సమాదరించాడు. ధవళజినాలయానికి మరమ్మతులు, నైవేద్యాలు, ఆలయ నిర్వహణ కోసం బాహుబలి శ్రేష్టి కోరికపై మూలసంఘం, దేవగణలోకకు చెందిన జైన ఆచార్యుడు విజయదేవపండితాచార్య ధర్మకర్తృత్వ నిర్వహణలో భూమిని కానుకగా సమర్పించాడు. హ్యుయాన్‌త్సాంగ్ చాళుక్యరాజ్యాన్ని సందర్శించే నాటికి చాళుక్యులు వంద బౌద్ధ విహారాలు నిర్మించి ఐదువేల మంది బౌద్ధ భిక్షువులకు ఆశ్రయం కల్పించినట్లు అతని రచనలు తెలుపుతున్నాయి.

### సాహిత్యం

సంస్కృతం రాజభాషగా గౌరవాన్ని పొందింది. సంస్కృత వ్యాకరణ గ్రంథమైన శబ్దరత్నాకరాన్ని గంగ దుర్వినీకుడు అనే చాళుక్య సామంత రాజు రచించాడు. జినేంద్ర వ్యాకరణాన్ని పూజపాదుడు, నీతి వాక్యామృతాన్ని సోమదేవసూరి సంస్కృతంలోనే రచించారు. ఆదిపురాణం, విక్రమార్జునవిజయం, పంపభారతం కన్నడ భాషలోని ప్రముఖ గ్రంధాలు కూడా ఈ కాలంలో వెలువడినాయి. తెలుగు, కన్నడ భాషలకు మూలమైన కొన్ని దేశీయ పదాలు వీరి శాసనాల్లో ప్రస్తావించ బడినాయి.

### దేవాలయాలు

చాళుక్యులు రేఖానగరశైలిలో అనేక దేవాలయాలను నిర్మించారు. కర్నాటకలోని ఐహోలు, బాదామి, పట్టడకల్, మహాకూటలలోనూ; ఆంధ్రప్రదేశ్‌లో అలంపురం, కూడలి సంగమేశ్వరం, పాణ్యం, మహానంది, కడమర కాలువ, సత్యవోలు, తేరాల, ఐజలో రేఖానగర ప్రాసాదాలను నిర్మించి దక్షిణ భారత దేవాలయ నిర్మాణంలో ఒక కొత్త (శైలి) ఒరవడిని సృష్టించారు.


అలంపురం దేవాలయాలను నిర్మించడానికి తుంగభద్ర నదికి ఆవలిగట్టున

ఉన్న సాతానికోట గ్రామంలోని రాతిగని నుంచి ఎర్ర ఇసుకరాతిని ఈవలవైపునకు తరలించారనడానికి ఇప్పటికీ అక్కడ కనిపిస్తున్న సగం చెక్కిన స్తంభాలు, ఇతర దేవాలయ భాగాలు రుజువు చేస్తున్నాయి.

అలంపురంలోని తొమ్మిది బ్రహ్మ ఆలయాలు చాళుక్య దేవాలయ వాస్తుకు అద్దం పడుతున్నాయి. ఒక్క తారక బ్రహ్మాలయం మాత్రం రాష్ట్రకూటుల కాలంలో వారి శైలిలోనే నిర్మించబడింది. దేవాలయాలు సాధారణంగా గర్భాలయం, అర్ధమంటపం, మహామంటపాలతోనూ, వీటిచుట్టూ ప్రాకారంతోనూ నిర్మించబడినాయి. కొన్ని గర్భాలయాల్లో నాలుగు స్తంభాలుకూడా ఉన్నాయి. గర్భాలయానికి అధిష్ఠానం, పైన సాదా పాదవర్గం, ప్రస్తరం (మంటపం కప్పుతో కలిసిపోతుంది), దానిపైన పలు అంతస్తుల రేఖా నాగర విమానం, గుండ్రటి కంఠం, ఉసిరికాయను పోలిన శిఖరం, పొడవాటి కలశం ఉన్నాయి. ప్లాన్ పరంగా చదరపు గర్భాలయం, దీని ముందు దీర్ఘచతురస్రాకార అర్ధమంటపం, ముందు దీర్ఘ చదరపు మహామంటపం, చుట్టూ ప్రదక్షిణాపథం దానిచుట్టూ గోడ ఉంటాయి.(ఇలా వున్న దేవాలయాన్ని సాంధార దేవాలయం అంటారు). ద్వారాలు కొన్ని సాధారణంగానూ, మరికొన్ని గంగ, యమున శిల్పాలు, ద్వారపాల శిల్పాలు, పైన లలాటబింబంతోనూ అలంకరించబడి ఉన్నాయి. స్తంభాల కింద పూర్ణకుంభం, అందులోంచి వెలువడుతున్న తీగలు, మధ్యలో పట్టం, దానిపైన మళ్లీ పూర్ణఘటం, చివరగా పోదిక ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో, స్తంభం మీద బౌద్ధ స్తంభాల మాదిరిగా రెండు అర్ధపద్మాలు ఉండడం గమనించాల్సిన అంశం. ఆలయాలకు ముందు ముఖచతుష్కి అనే పోర్టికో లాంటి కట్టడం ఉంది. గర్భాలయానికి ముందు, అర్ధమంటపంపైన విమానం నుంచి ముందుకు పొడుచుకొచ్చిన శుకనాసి అనే కట్టడం చాళుక్య దేవాలయ వాస్తు ప్రత్యేకత. కూడలి సంగమేశ్వరాలయం బయటి గోడలమీద కూడ అనేక శిల్పాలు ఉన్నాయి.

చాళుక్య దేవాలయాల బయటి గోడ మీద కోష్టాలు, కిటికీలు, దంపతి శిల్పాలున్నాయి. మహానంది, కడమర కాలువ, సత్యవోలు, పాణ్యం, అయిజ, తేరాలలోనూ ఇలాగే ఉన్నాయి. క్రీ.శ.7వ శతాబ్దిలో కృష్ణ - తుంగభద్ర నదుల సంగమస్థానంలో నిర్మించిన కూడలి సంగమేశ్వరాలయానికి భూమిలోపల 10 అడుగుల పునాదులను నిర్మించారు. చాళుక్యుల కాలంలోనే ఆలయాలకు పునాదులు నిర్మించారు. తరువాత ఈ సంప్రదాయం కొనసాగిన ఆధారాలు దొరకలేదు. మాచర్ల సమీపంలోని తేరాలలోని రూపులమ్మ గుడి కేవలం గర్భాలయం, దానిమీద నాగర విమానం మాత్రమే ఉంది గానీ, మంటపం లేదు. పాణ్యంలోని భీమేశ్వర, ఫణికేశ్వర

దేవాలయాలుకూడా అలంపురం దేవాలయాల మాదిరే నిర్మించబడినాయి. మహానందిలోని మహానందీశ్వరాలయం, చాళుక్య వాస్తుకు మరో ఉదాహరణ. సత్యవోలులోని రామలింగేశ్వర, భీమలింగేశ్వర స్వామి దేవాలయాలు చాళుక్య దేవాలయాలే. సత్యాశ్రయుని కాలంలో నిర్మించినందున ఈ ఊరుకు సత్యవోలు అని పేరు వచ్చింది. కొన్ని దేవాలయాలు చిన్నగానూ, మరికొన్ని దేవాలయాలు పెద్దగానూ ఉండి మొత్తం సముదాయం మరమ్మతులు గావించవలసి ఉంది. అమరావతి శిల్పం తరువాత మళ్లీ తెలుగు శిల్పాన్ని తెలంగాణాలో బాదామీ చాళుక్యులే ప్రారంభించారు. చాళుక్యల కాలపు శైవ, శాక్త, వైష్ణవ శిల్పాలు, మహాభారత, రామాయణ దృశ్యాలను అలంపూరు మ్యూజియంలో చూడవచ్చు. కర్నాటకలోని ఐహోలు, బాదామీలలో నున్న చాళుక్య శిల్ప సంప్రదాయమే అలంపూరు, కూడలి సంగమేశ్వరాలయాల వద్ద



అలంపురంలోని చాళుక్య ఆలయం

కూడా కొనసాగింది.

### వేంగి చాళుక్యులు (క్రీ.శ.7-11 శతాబ్దాలు)

వేంగి (పశ్చిమగోదావరి జిల్లాలోని పెదవేగి) రాజధానిగా కుబ్జవిష్ణువర్ధనుడు రాజప్రతినిధిగా ప్రారంభమైన వేంగి చాళుక్యులు తీరాంధ్రలో విశాఖపట్నం నుండి

నెల్లూరు వరకు గల ప్రాంతాలను పాలించారు. కుబ్జవిష్ణువర్ధనుని అనంతరం అతని పెద్దకొడుకైన జయసింహవల్లభుడు రాజ్యాధికారం చేపట్టి కళింగ, ఆంధ్ర ప్రాంతాలపై అదుపు సాధించాడు. తరువాత రెండో విష్ణువర్ధనుడు, తరువాత మూడవ విష్ణువర్ధనుడు రాజ్యాధికారం చేపట్టి కాంచిపురం, నెల్లూరు ప్రాంతాలపై దాడులు చేసి, ఆశ్వమేధయాగాన్ని కూడా నిర్వహించారు. మొదటి విజయాదిత్యుని పాలనా కాలంలో బాదామీ చాళుక్య రాజ్యాన్ని రాష్ట్రకూట రాజైన దంతిదుర్గుడు ఆక్రమించిన తరువాత వేంగి రాజ్యంపై దండయాత్ర చేయగా మూసి, కృష్ణా నదుల సంగమ స్థానమైన వాడపల్లి వద్ద జరిగిన యుద్ధంలో వేంగిసేనలు ఓడిపోయాయి. మొదటి విజయాదిత్యుడు సంధిచేసుకొని నష్టపరిహారం చెల్లించి రాష్ట్రకూటుల ఆధిపత్యాన్ని అంగీకరించాడు. ఆ తరువాత రాష్ట్రకూట ధృవుడు వేంగిపై దండ్రయాత్ర చేయగా నాల్గవ విష్ణువర్ధనుడు అతనితో సంధి చేసుకొని కుమార్తె శీలమహాదేవినిచ్చి పెళ్లి చేశాడు. కుమారుల వారసత్వ పోరుతో రెండవ (గుణగ) విజయాదిత్యుడు అధికారం చేపట్టి గాంగులతో, రాష్ట్రకూటులతో యుద్ధాలు చేశాడు. తాను చేసిన 108 యుద్ధాల జ్ఞాపకార్థం 108 దేవాలయాలు నిర్మించాడు.

వేంగిచాళుక్య రాజుల్లో గుణగ విజయాదిత్యుడు సమర్థుడైన పాలకుడు. నలభైనాలుగు సంవత్సరాలు పాలించి ప్రకాశం జిల్లా కందుకూరు నుండి చిత్తూరు జిల్లా నారాయణవనం వరకూ అరణ్య ప్రాంతంలో గల బోయకొట్టాలపై దండయాత్రలు చేశాడు. అతని సేనాని అద్దంకి పండరంగడు నెల్లూరు జిల్లాలోని పులికాట్ సరస్సు వరకూ ఆక్రమించి పండరంగపట్టణం, పండరంగ మహేశ్వరాలయాలను నిర్మించాడు. కొత్తగా సొంతం చేసుకొన్న ప్రాంతాలను రాజప్రతినిధిగా పండరంగడు కందుకూరు రాజధానిగా పాలించాడు. పండరంగని నాయకత్వంలో చాళుక్య సైన్యాలు కళింగ, కోసల, వేములవాడ చాళుక్య రాజ్యాల గుండా వెళ్ళి రాష్ట్రకూటరాజైన రెండోకృష్ణుడిపై విజయం సాధించటంతో వేంగి సామ్రాజ్యం ఉత్తరానున్న శ్రీకాకుళం జిల్లాలోని మహేంద్రగిరి నుండి దక్షిణాన పులికాట్ సరస్సు వరకూ, పశ్చిమాన ఖమ్మం జిల్లా వరకు విస్తరించింది.

గుణగ విజయాదిత్యుని తరువాత రాజ్యానికొచ్చిన మొదటి భీముని పాలనలో, రాష్ట్రకూట రెండో కృష్ణుడు వేములవాడ చాళుక్య రాజైన బద్దెగతో కలిసి వేంగిని ఆక్రమించి భీమున్ని బంధించాడు. ముదిగొండ చాళుక్య రాజైన కుసుమాయుధుని సహాయంతో భీముడు ఎలాగో తప్పించుకున్నాడు. చాళుక్య భీముడు ద్రాక్షారామం, భీమవరాలలో భీమేశ్వరాలయాలను నిర్మించాడు. తరువాత రెండో అమ్మరాజు, రెండో

చాళుక్య భీముడు, దానార్ణవుడు, మొదటి శక్తివర్మ, విమలాదిత్యులు వరుసగా వేంగి రాజ్యాన్ని పాలించారు. విమలాదిత్యుడికి చోళ రాకుమార్తె అయిన కందవైకి పుట్టిన మొదటి రాజరాజు మేనమామ మొదటి రాజేంద్ర చోళుని సహాయంతో సింహాసనాన్ని అధిష్టించాడు. తరువాత చోళ రాకుమార్తె అమ్మంగదేవిని వివాహం చేసుకున్నాడు. సవతి సోదరుడైన విజయాదిత్యుడు కళ్యాణ చాళుక్యుల రెండో జయసింహుని సహాయంతో సింహాసనాన్ని ఆక్రమించగా, మొదటి రాజేంద్రుడి కొడుకైన చోళరాజాధిరాజు దండయాత్ర చేసి వేంగిని ఆక్రమించి, కళ్యాణ చాళుక్యుల అధీనంలో నున్న కొల్లిపాక (కొలనుపాక) నగరాన్ని తగులబెట్టాడు. ఫలితంగా రాజరాజనరేంద్రుడు పున:ప్రతిష్టుడై సత్యాశ్రయ కులతిలక, సమస్త భువనాశ్రయ అనే బిరుదుల్ని పొందాడు. రాజరాజనరేంద్రుడు చనిపోయిన తరువాత ఏడవ విజయాదిత్యుడి పాలనతో వేంగి సామ్రాజ్యం అంతరించింది.

రాజరాజనరేంద్రుడి చివరి పాలనా కాలానికి చాళుక్య చోళుల మధ్య సత్సంబంధాలు లేని కారణంతో కళ్యాణ చాళుక్య మొదటి సోమేశ్వరునితో సంధి చేసుకొనగా అమాత్యుడు, అష్టభాషాప్రవీణుడైన నారాయణభట్టును వేంగి దేశానికి రాజప్రతినిధిగా నియమించాడు. ఇతని పాలనా కాలం తెలుగు భాషా చరిత్రలో ఒక మైలురాయి. నన్నయభట్టు రాజమహేంద్రవరంలో నారాయణభట్టు సహకారంతో మహాభారతంలోని రెండున్నర పర్వాలు తెలుగులోకి అనువదించాడు.

### పరిపాలన విధానం

సంప్రదాయబద్ధమైన వంశపారంపర్య రాజరిక వ్యవస్థ కొనసాగింది. పాలనలో సహకరించడానికి సప్తాంగాలతో కూడిన మంత్రిమండలి, మంత్రి, పురోహిత, సేనాపతి, యువరాజు, ప్రధాని, అధ్యక్ష మొదలైన 18 మంది ఉన్నతాధికారులుండేవారు. వీరిని తీర్థులని పిలిచేవారు. సౌలభ్యం కోసం రాజ్యాన్ని కొట్టాలు, నాడులు, విషయాలుగా విభజించారు. కర్మ రాష్ట్రం, బోయ కొట్టాలు ఈ కాలంలో చాలా ప్రాముఖ్యతను సంతరించుకొన్నాయి. రాజ్యంలో చాలాభాగం సామంతుల అధీనంలో ఉండేది. చాళుక్య భీముని మచిలీపట్నం శాసనం ప్రకారం గ్రామపాలనకై గ్రామణి అధ్యక్షతన గ్రామప్రజలతో కూడిన గ్రామ సభలున్నాయి. అగ్రహారాల పాలన వ్యవహారాలను బ్రాహ్మణపరిషత్‌లు చక్కబెట్టేవి.

### సాంఘిక, మత పరిస్థితులు

రాజుల్లో చాలా మంది వైదిక మత శాఖైన శైవాన్ని ఆదరించి శివునికి


ఎక్కువగా దేవాలయాలను నిర్మించారు. బ్రాహ్మణులు మంత్రులుగా పనిచేశారు. సమాజంలో గౌరవప్రదమైన స్థానాన్ని కలిగియుండినట్లు పండరంగడిని అందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు. రాజులు వేదపండితులైన బ్రహ్మణులకు అగ్రహారాలిచ్చి దానధర్మాలను చేశారు. శైవమత విజృంభణ ఫలితంగా జైనం, బౌద్ధం నిరాదరణకు గురై క్షీణించాయి. శైవమతంలో విప్లవధోరణి గల కాలాముఖులకు రాజాదరణ దక్కింది. కొందరు రాజులు ఇతర మతాలను కూడా ప్రోత్సహించారు. పరమత సహనం పాటించిన మూడో విష్ణువర్ధనుడు బెజవాడలో నడుంబిజైనవసతి నిర్మించి జైనులకు దానమిచ్చాడు. సమాజంలో అధిక సంఖ్యాకులైన శూద్రులు, వ్యవసాయం, ఇతర వృత్తులు చేసేవారు. తెలికులకు, సాలీలకు నకరాలనే వృత్తి సంఘాలుండేవి. శూద్రులు సైన్యంలో కీలక పాత్ర పోషించి రాజాభిమానంతో పాటు సామంతపదవులు కూడా పొందారు. అనాటి సమాజంలో బహుభార్యత్వం సర్వసాధారణం. భోగం స్త్రీలు, ఉంపుడు గత్తెల ప్రసావన శాసనాల్లోనూ, సమకాలీన సాహిత్యంలోనూ కనబడుతుంది. ఈ కాలంలోనే అనేక బౌద్ధరామాలు శైవాలయాలైనాయి. పంచారామాలే ఇందుకు ఓ మంచి ఉదాహరణ.

### ఆర్థిక పరిస్థితులు


రాజ్యానికి భూమిశిస్తుతోపాటు అనేక రకాల పన్నులద్వారా ఆదాయం సమకూరేది. పన్నులు ధన, ధాన్యరూపంలో చెల్లింపబడేవి. రానురాను బ్రాహ్మణులకు అగ్రహారాలు దానం చేయడం తగ్గిపోయి ఉద్యోగుల సేవలకు ప్రతిఫలంగా గ్రామాలను ఇచ్చే సాంప్రదాయం మొదలైంది. పశు సంపదను పెంపొందించుకోవటంలో ఆసక్తి కనబరచినట్లు, నాడు జరిగిన గోగ్రహణాల ద్వారా తెలుసుకోవచ్చు. స్వదేశీ విదేశీ వాణిజ్యం ఉన్నత స్థాయిలో నిర్వహించబడింది. వాణిజ్యం చేసే వర్తకులు నకరములు అనే వర్తక శ్రేణులు సంఘాలుగా ఏర్పడ్డారు. వీటికి శ్రేష్ఠి అధ్యక్షుడుగా ఉండేవాడు. సయాం లాంటి దేశాలతో విదేశీ వ్యాపారం సాగినట్లు శక్తివర్మకాలంనాటి నాణేల ద్వారా తెలుస్తుంది.

### సాహిత్యం

తెలుగు రాజభాషగా గౌరవాన్ని పొందినది. శాసనాల్లో తెలుగు పద్యాలు, తెలుగు పదాలకు చోటు దక్కింది. మొదటగా జైనకవులైన పద్మకవి తెలుగుభాషలో జినేంద్రపురాణాన్ని రాశాడు. ఆదికవి నన్నయభట్టు మహాభారతంలోని కొన్ని పర్వాలను తెనుగించి, ఆంధ్రశబ్ద చింతామణి అనే వ్యాకరణ గ్రంథాన్ని రచించాడు. నన్నయభట్టుతోపాటు కుమారసంభవాన్ని తెనిగించిన నన్నెచోడుడు, గణిత



సామర్లకోట భీమేశ్వరాలయం (భీమారామం), తూర్పుగోదావరి జిల్లా



చేబ్రోలులోని భీమేశ్వరాలయం, గుంటూరు జిల్లా

సారసంగ్రహం రాసిన పావులూరి మల్లనలు రాజరాజనరేంద్రుని కొలువులో మంచి గౌరవాన్ని పొందారు.

**దేవాలయాలు**

సుమారు 450యేండ్లపాటు పాలించిన వేంగి చాళుక్యులు తమ ప్రధాన శాఖయైన బాదామీ చాళుక్య శైలికి భిన్నంగా తమదైన శైలిలో దేవాలయాలను నిర్మించి ప్రత్యేకతను చాటుకొన్నారు. ద్రావిడ శైలికి ప్రాధాన్యతనివ్వటంతోపాటు స్థానిక సంప్రదాయాల్ని జోడించి కట్టిన తొలితరం వేంగీచాళుక్య దేవాలయాల్లో పల్నాడులోని కృష్ణాతీరంలోనున్న పొందుగులలోని జలపేశ్వరాలయం ముఖ్యమైంది. క్రీ.శ. 8వ శతాబ్దంలో నిర్మించిన ఈ ఆలయం గర్భాలయం, అర్ధమండపం, మహామండపాలతో ఎత్తైన అధిష్టానం, పాదవర్గం, ప్రస్తరం పైన ద్రావిడ విమానం ఉన్నాయి. చాళుక్య భీముడు (క్రీ.శ. 892-922) ద్రాక్షారామం, సామర్లకోట (చాళుక్య భీమవరం)లలో భీమేశ్వరాలయాలను నిర్మించాడు. ఇదేకాలంలో చేబ్రోలులోని భీమేశ్వరాలయం, అమరావతిలోని అమరేశ్వరాలయం, పాలకొల్లులోని క్షీరారామేశ్వరాలయం, క్రీ.శ. 10-11 శతాబ్దాల్లో నిర్మించబడినాయి.

ద్రాక్షారామం, సామర్లకోట, పాలకొల్లు, భీమవరం, అమరావతి దేవాలయాలకు పంచారామాలని పేరు. ఇవి గర్భాలయ, అర్ధమండప, మహామండపాలతో ఉండి రెండో అంతస్తు వరకూ, గర్భాలయంలోని శివలింగం ప్రతిష్టించబడి ఉంటుంది. ద్రాక్షారామం, సామర్లకోటలో చుట్టూ ఉన్న ప్రాకారానికి రెండంతస్తుల మండపాలున్నాయి. ద్రాక్షారామంలో చిన్న పరిమాణంలో ఉన్న నమూనా దేవాలయాలు తూర్పు చాళుక్య దేవాలయ వాస్తుకు ప్రతీకలు. వేంగీ (తూర్పు) దేవాలయ వాస్తులో బిక్కవోలులోని కంచరగుడి, నక్కలగుడులు పేర్కొనదగినవి. గర్భాలయ, అర్ధమండపాలతో నున్న ఈ ఆలయాలు రాష్ట్రకూట-పల్లవ శైలుల సమ్మిశ్రమంగా కనిపిస్తాయి. మొత్తానికి బాదామీ చాళుక్యులు నిర్మించిన అలంపూరులోని దేవాలయాలు, వేంగీచాళుక్యులు పంచారామాల్లో నిర్మించిన ఆలయాలు రెండు వేర్వేరు శైలులను కలిగి ఉన్నాయి.

**రేనాటి చోళులు (క్రీ.శ.6-10 శతాబ్దాలు)**

కృష్ణానదికి దక్షిణాన రేనాడు 7000 దేశమును నేటి రాయలసీమ ప్రాంతములో క్రీ.శ. 6వ శతాబ్దం అర్ధభాగం నుండి 8వ శతాబ్దం వరకు పాలించారు. నేటి కడప జిల్లాలోని అధికభాగం, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాలోని



చిలమకూరులోని అగస్త్యేశ్వరాలయం, కడప జిల్లా

కొన్ని భాగాలు, కర్ణాటకలోని కోలారు జిల్లా రేనాడు ప్రాంతముగా పిలువబడినది. వీరు కొంతకాలం విష్ణుకుండిన, పల్లవ, చాళుక్య సామంతులుగా పాలించారు. ఈ ప్రాంతానికి మహారాజవాడి లేదా మార్జవాడి అనే పేరుంది. వీరు కొన్ని శాఖలుగా విడిపోయి ఏరువ, పొత్తపి, నెల్లూరు, కొణిదెన, నిడుగల్లు, కందూరు చోడులుగా ప్రసిద్ధినొంది ఆయా ప్రాంతాలనేలినారు. నేటి మదనపల్లికి సమీపంలోని చిప్పిలి వీరి రాజధానియని శాసనాలు తెలుపుతున్నాయి. పెన్నానది, చిత్రావతి, చెయ్యేరులకు మధ్యగల ప్రాంతమే రేనాడు లేక రేనాండు. కడప జిల్లా మొత్తం, ఇంకా చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాలోని కొన్ని భాగాలు, కర్నాటకలోకి కోలారు జిల్లాను కలిపితే రేనాడు భూభాగమౌతుందని ఈ దిశగా పరిశోధనలు జరిపిన డాక్టర్ పి.భాస్కరరెడ్డి తెలియజేశారు. రాజు లేక రేడుకు చెందిన నాడు (ప్రాంతం) గాబట్టి ఈ ప్రాంతానికి 'రేనాడు' అని పేరు. శాసనాల్లో ఈ రేనాడును ఇదే అర్థంలో 'మహారాజపా(వా)డి'గా పిలిచారు. ఈ రేనాడును పాలించిన వారి గురించి దొమ్మరనంద్యాల, మాలెపాడు, పెద్ద చిప్పిలి, మద్రాస్ మ్యూజియంలోనున్న రాగిరేకు శాసనాలు, దాదాపు 50కి పైగా గల రాతి శాసనాలు తెలియజేస్తున్నాయి.

కరికాళ చోళుడు మూలపురుషుడుగా ఎదిగిన చోళ వంశాల్లో తెలుగు చోళులుగా పేరుగాంచిన రేనాటి చోళులు తొలి మధ్యయుగంలో తెలుగు నేలచరిత్రలో తమకంటూ ఒక స్థానం సంపాదించుకొన్నారు. కావేరీ ప్రాంతంనుంచి వలస వచ్చిన తొలి చోళుల్లో కొంతమంది ఈ ప్రాంతానికి వలస వెళ్లారనీ, ముందుగా వారు చిత్తూరు

జిల్లా మదనపల్లి దగ్గరలోని చిప్పిలి, అటు తర్వాత కడప జిల్లా కమలాపురం తాలూకాలోని పెద్ద చిప్పిలికి వచ్చి, రాజధానిగా పాలించారు. పెద్ద చిప్పలిలోని శ్రీకంఠచోళుని రాగిరేకు శాసనాలు ఈ విషయాన్ని ఋజువు చేశాయి.

రేనాటి చోళ వంశ స్థాపకుడు నందివర్మ అనీ, అతనికి సింహవిష్ణువు, సుందరనంద, ధనుంజయవర్మ అనే ముగ్గురు కొడుకులున్నారని, ఈ ముగ్గురు కొడుకులూ ఒకేసారి పరిపాలించారని మాలెపాడు శాసనం చెబుతోంది. నందివర్మ క్రీ.శ.525 ప్రాంతంలో చిప్పిలిని రాజధానిగా చేసుకొని పాలించాడు. క్రీ.శ.585 నుంచి పాలించి ధనుంజయుని కలమళ్ల (తొలి తెలుగు శాసనంగా గుర్తించారు) శాసనంలో ఇతనిని **ఎరికల్ ముత్తురాజు** అని పేర్కొనడంవల్ల ఇతడు పల్లవుల సామంతుడుగా ఉండేవాడనీ తెలుస్తుంది. ధనుంజయుని మనుమడైన పుణ్యకుమారుడు క్రీ శ.645లో రాజ్యాధికారం చేపట్టాడు. అతనికిగల **గణ్యపృథ్వీవల్లభ, మరుద్రపిడుగు, మదముదితుగ్రస** అనే బిరుదుల మూలంగా అతని విక్రమ, పరాక్రమాలను తెలియవస్తున్నాయి. పుణ్యకుమారుడు తన శక్తియుక్తులతో బాణుల భూభాగాన్నికూడా జయించాడు. పుణ్యకుమారుని తరువాత అతని కొడుకు, మనుమలైన విక్రమాదిత్య, శక్తికుమారుల గురించి మనకేమీ తెలియకపోయినా, శక్తికుమారుని కొడుకైన రెండవ విక్రమాదిత్యుని కాలంలో (క్రీ.శ.720-745) సుందర నందుడి కుటుంబానికి చెందిన నాలుగో తరంవాడైన కొక్కిలి (ప్రకాశం జిల్లా) పిటికాయగుళ్లలో వేయించిన శాసనం (క్రీ.శ.745) దొరికింది. దీనినిబట్టి పిటికాయగుళ్లలోని కొన్ని ఆలయాలు ఇతని కాలంలో నిర్మించినవేనని చెప్పడానికి వీలు చిక్కింది. ఇతడు పెద్ద చిప్పిలి రాగిరేకు శాసనాలను వేయించాడు. (ఇవి ప్రస్తుతం చెన్నై మ్యూజియంలో ఉన్నాయి). అయినా చివరి కాలంలో బాణులు చేసిన దండయాత్రల్లో అధికారాన్ని పోగొట్టుకున్నాడు. రేనాటి చోళుల భూభాగాలను వైదుంబులు, బాణులు ఆక్రమించడంతో రేనాటి చోళుల పాలన అంతమైంది.

## దేవాలయాలు

రేనాటి చోళులు కడప జిల్లాలోని ముత్తుకూరులోని శిధిలాలయం, చిలమకూరులోని అగస్త్యేశ్వరాలయం, ప్రొద్దుటూరు దగ్గర తాళ్ల రామేశ్వరంలోని మూలస్థానేశ్వరాలయం, ప్రకాశం జిల్లాలోని పిటికాయగుళ్ల దగ్గరున్న పిటకేశ్వరాలయాన్ని నిర్మించి దేవాలయ వాస్తు వికాసానికి తోడ్పడినారు. దేవాలయాలు చదరం, దీర్ఘచదరం, ఆయతాశ్రం (గజపృష్ఠాలయం)గా నిర్మించబడినాయి. ఆలయ గోడలు సాధారణంగా ఉన్నా, ద్వారబంధాలు, విమానాలను అందంగా తీర్చిదిద్దారు

చిలమకూరులోని అగస్త్యేశ్వరాలయం గర్భాలయ-అర్ధ మంటపాల వరకూ గజపృష్ఠాకారంలో ఉంది. దీనికి శిఖరం లేదుగానీ గణేశాలయానికి శిఖరం ఉంది. రేనాటి చోళుల ఆలయాలు ద్వారాలు, స్థంభాలపై శిల్పాలకు ప్రసిద్ధి. కొన్ని ఆలయాలు పూర్తిగా ఇటుకలతోనూ, మరికొన్ని ఆలయాలు రాళ్లతోనూ నిర్మింపబడినాయి. చిత్తూరు జిల్లా కలకడలోని పల్లీశ్వరాలయం రేనాటి చోళుల దేవాలయానికి మరో ఉదాహరణ. ఇక్కడ భువన త్రినేత్ర ఇరుగేయ మహారాజు (క్రీ.శ.972-1000) శాసనమొకటుంది. ఈ ఆలయం గర్భాలయ, అర్ధమంటప, మహామండపాలతో మూడంతస్తుల విమానాన్ని కలిగి ఉంది. ద్వార శాఖలపై గంగా యమున శిల్పాలు ఉన్నాయి.

కడప జిల్లాలోని అత్తిరాలలో పరశురామేశ్వరాలయం కూడా గజపృష్టాకారంలోనే ఉంది. గర్భాలయం లోపల అర్ధవృత్తంగానూ, వెలుపల చదరంగానూ ఉంది. ఆలయ గోడలపైన, విమాన కోష్ఠాల్లోనూ ఉన్న శిల్పాల్లో ఉమామహేశ్వర, దక్షిణామూర్తి విగ్రహాలు చాలా అందంగా రేనాటి చోళ శిల్ప సంప్రదాయాన్ని తెలియజేస్తుంది. ముఖ మంటపం దక్షిణంలోగల ద్వారం, గర్భగృహ ద్వారాలపై ద్వారపాలక, గజలక్ష్మి శిల్పాలతోపాటు, పైనున్న తోరణంమీద యుద్ధ వీరుల శిల్పాలున్నాయి.

రేనాటి చోళుల రాజ్యం చిన్నదే అయినా ఉన్న కొద్దిపాటి ఆర్థిక వనరులతో గజపృష్ఠ పద్ధతిని ప్రత్యేకంగా ఎంచుకొని, అధిష్ఠాన, పాదవర్గ, ప్రస్తర, విమానాలతోనూ, కుడ్య, ద్వార, స్థంభ శిల్పాలతోనూ ఒక ప్రాంతీయ ఆలయ వాస్తుశైలికి అద్దం పడుతుంది.

**రాష్ట్రకూటులు (క్రీ.శ.8-10 శతాబ్దాలు)**

బాదామీ చాళుక్యులలో చివరి రాజైన విజయాదిత్యుని (క్రీ.శ. 753-770) కాలంలో రాజ్యంలో అంతర్గత కుమ్ములాటలు మొదలైయ్యాయి. బాదామీ చాళుక్య సామంతుడైన దంతిదుర్గుడు చివరి బాదామీ చాళుక్య ప్రభువైన రెండో కీర్తి వర్మ నుంచి అధికారాన్ని స్వీకరించి స్వతంత్రుడై రాష్ట్రకూట రాజ్యాన్ని స్థాపించాడు. మొత్తం తెలంగాణా, రాయలసీమ ప్రాంతంలో ఎక్కువభాగం రాష్ట్రకూటుల అధీనంలోకి వచ్చింది. క్రీ.శ.756లో దంతిదుర్గుడు మరణించగా, అతని పినతండ్రి కృష్ణుడు రాష్ట్రకూట రాజైనాడు. తూర్పు చాళుక్యులతోగల వైరంతో కృష్ణుడు అతని కొడుకు, యువరాజైన గోవిందునితో వేంగిపై దాడి చేయించాడు. అప్పటి తూర్పు చాళుక్యరాజైన విజయాదిత్యుడు ఈ యుద్ధంలో ఓడిపోయి, రాష్ట్రకూటులతో సంధి కుదుర్చుకొన్నాడు.

క్రీ.శ.772లో కృష్ణుడు మరణించగా, గోవిందుడు రాష్ట్రకూట సింహాసనమెక్కాడు. ఈలోగా గోవిందుని తమ్ముడైన ధ్రువుడు వేంగి చాళుక్యరాజైన విష్ణువర్ధనునితో చేయికలిపి గోవిందునిపై కుట్రలు పన్నాడు. విష్ణువర్ధనుడు గోవిందునికి బాసటగా నిలిచాడు. అయినప్పటికీ ధ్రువుడు రాష్ట్రకూట సింహాసనాన్ని ఆక్రమించి క్రీ.శ. 780 నుంచి 793 వరకూ పాలించాడు. ఓడిపోయిన విష్ణువర్ధనుడు ధ్రువునికి తన కుమార్తె శీలమహాదేవినిచ్చి పెళ్లి చేశాడు. ధ్రువుడు క్రీ.శ. 794లో మరణించగా అతని కొడుకైన మూడో గోవిందుడు రాజైనాడు. వేంగిలో అంతర్గత కలహాల మూలంగా మూడో గోవిందుడు, విజయాదిత్యుని సింహాసనం నుంచి దించి, భీమసలుకి అధికారం కట్టబెట్టాడు. క్రీ.శ.814లో మూడో గోవిందుడు మరణించగా, చిన్నవాడైన అతని కొడుకు అమోఘవర్షుడు సింహాసనమెక్కాడు. ఇదే అదనుగా విజయాదిత్యుడు రాష్ట్రకూట రాజ్యంపై దండెత్తి స్థంభపురిని నాశనం చేశాడు. అమోఘవర్షుడు ప్రతీకారంతో చేసిన యుద్ధంలో వేంగిని పాలిస్తున్న గుణగ విజయాదిత్యుడు ఓడిపోయాడు. క్రీ.శ.880లో అమోఘవర్షుడు మరణించగా అతని కొడుకైన రెండో కృష్ణుడు సింహాసనమెక్కాడు. ఈలోగా గుణగ విజయాదిత్యుడు రాష్ట్రకూటులపై దండెత్తి రెండో కృష్ణున్ని ఓడించాడు.

రెండో అమోఘవర్షుని తొలగించిన రాష్ట్రకూట రాజైన నాలుగో గోవిందుడు (క్రీ.శ.930) వేంగి అంతర్గత కలహాల్లో యుద్ధమల్లునికి సహకరించగా, యుద్ధమల్లుడు చాళుక్యభీముని చంపాడు. క్రీ.శ.956లో రాష్ట్రకూటరాజైన మూడో కృష్ణుడు (నాలుగో గోవిందుని తరువాత) వేంగిని ఆక్రమించాడు. క్రీ.శ.972 నాటికి రాష్ట్రకూటుల ప్రాబల్యం తగ్గింది. రాష్ట్రకూట సామ్రాజ్యం పతనమైన తరువాత క్రీ.శ.972-73లో చాళుక్య వంశానికి చెందిన రెండో తైలపుడు కళ్యాణనగరం నుంచి పాలన ప్రారంభించాడు.

### పరిపాలన వ్యవస్థ

రాష్ట్రకూటులు పటిష్టవంతమైన పాలనావ్యవస్థను రూపొందించుకొని ప్రజా శ్రేయస్సు లక్ష్యంగా పాలించారు. రాజులు **మహారాజాధిరాజ, పరమభట్టారక, విక్రమావలోక** బిరుదులు ధరించారు. రాజ్యపాలనలో మంత్రులైన **ప్రధాని, మహామాత్య, పురోహిత, సంధివిగ్రహి, సేనాని**, రాజుకు సలహాలిచ్చేవారు. రాజ్య శ్రేయస్సు దృష్ట్యా కొన్ని సందర్భాల్లో పెద్ద కొడుకుల్ని కూడా కాదని సమర్థులైన వారినే యువరాజుగా నియమించేవారు. పాలనా సౌలభ్యంకోసం రాజ్యాన్ని **రాష్ట్రం, విషయం, గ్రామాలుగా** విభజించి, అధిపతులుగా **రాష్ట్ర మహారట్టులు, విషయ మహారట్టులు,**

గ్రామమహారట్టులను నియమించారు. ఎన్నుకోబడిన ఒక గ్రామ ప్రతినిధి గ్రామాధికారిగా ఉండేవాడు.

**అర్థికాభివృద్ధి**

రాష్ట్ర కూటుల కాలంలో సామంతులు చెల్లించే కప్పంతో పాటు భూమి శిస్తు కూడా పెద్ద మొత్తంలో (పంటలో 1/4వ వంతు) వసూలు చేసేవారు. వీటిని భాగ, కర అనేవారు. దేవదేయ, అగ్రహార భూములపై కూడా పన్ను విధించేవారు. పండ్లు, కూరగాయల వ్యాపారుల నుండి, గనులు, అడవులు, విదేశీ వ్యాపారులపై సుంకాలు వసూరు చేశారు.

**సామాజిక, మత పరిస్థితులు**

రాజ్యంలో బౌద్ధమతం క్షీణదశకు చేరింది. జైనం, బ్రాహ్మణమతాలు ప్రజాదరణ పొందాయి. బోధన్, దానవులపాడులను జైనకేంద్రాలుగా వృద్ధిచేశారు. మొదటి కృష్ణుడు ఎల్లోరాలోని కైలాస దేవాలయాన్ని, ఎలిఫెంటా గుహాలయాలను నిర్మించాడు. వీరి పాలనా కాలంలోనే హిందుమతోద్ధారణకై కుమారిలభట్టు, శంకరాచార్యులు కృషి చేశారు. వీరు వైదిక సాంప్రదాయాలైన యజ్ఞయాగాదిక్రతువులను పునరుద్ధరించారు. సంఘంలో వర్ణవ్యవస్థ ప్రబలంగా ఉండేది. బ్రహ్మణులకు అత్యంత గౌరవం దక్కింది. శూద్రుల పరిస్థితి కొంతమెరుగై సైనికాధికారులుగా, చిన్నపాలకులుగా నియమించబడినారు. దేవాలయాల్లో దేవదాసీలు నాట్యంచేస్తూ గౌరవప్రదంగా జీవించేవారు. అనులోమ వివాహాలు ఆచరణలో ఉండేవి.


**సాహిత్యం**


రాజభాషగా సంస్కృతం గౌరవాన్ని పొందింది. జైనవాఙ్మయంలో హరిభద్రుడు, అకళంకదేవుడు ప్రసిద్ధులు. జినసేనుడు **హరివంశం, ఆదిపురాణాలను** రచించాడు. అమోఘవర్షుడు కన్నడ భాషలో **కవిరాజమార్గం** అనే గ్రంథాన్ని రాశాడు. ఇదే మొట్ట మొదటి **అలంకార గ్రంథం**. వీరి సామంతులైన వేములవాడ చాళుక్యులు కన్నడ కవిత్రయంలోని పంపకవిని పోషించారు. ఇతడు **విక్రమార్క విజయం, అరికేసరి విజయాలను** రాశాడు. పొన్నకవి **శాంతిపురాణాన్ని**, రన్నకవి **అజిత తీర్థంకర పురాణాన్ని** రాశారు.

**దేవాలయాలు**

రాష్ట్రకూటుల పాలనలో దేవాలయ వాస్తు, శిల్ప నిర్మాణం అత్యున్నత

కైలాసనాథ దేవాలయం, ఎల్లోరా, మహారాష్ట్ర





కైలాసనాథాలయం, ఎల్లోరా, మహారాష్ట్ర

ప్రమాణాలను అందుకొంది. రాష్ట్రకూట రాజైన మొదటి కృష్ణుడు (క్రీ.శ.756 నుంచి క్రీ.శ. 773వరకూ) అనేక దేవాలయాల నిర్మాణానికి పూనుకొన్నాడు. బాదామి చాళుక్య విక్రమాదిత్యుడు పట్టడకల్‌లో నిర్మించిన విరూపాక్ష లోకేశ్వర దేవాలయాన్ని చూచిన, మొదటి కృష్ణుడు తన శిల్పులతో మంతనాలాడాడు. 'ఇప్పటివరకూ తొలచిన, తొలచి మలచిన గుహలు, గుహాలయాలే కాదు, రాళ్లతో కట్టిన మరే దేవాలయమూ సరితూగనట్లు నాకొక నమూనాను చూపించండ' ని ఆజ్ఞాపించాడు. శిల్పులు తమ ప్రతిభకు పట్టంగట్టి ఒక్కొక్కరు ఒక్కొక్క నమూనాను పలు చిత్రాల ద్వారా రాయి, కొయ్య, సున్నాలతో చేసి ప్రదర్శించారు. అప్పటిదాకా తెలిసిన గుప్త, వాకాటక, విష్ణుకుండిన, పల్లవ, పశ్చిమ చాళుక్య, తూర్పు చాళుక్య ఆలయ నమూనాలకు మెరుగులు దిద్ది మరికొన్ని మార్పులు చేసి కొత్తదనం ఉట్టిపడేలా, చూపరులను కట్టిపడేసేలా ఒకటికి మరొకటి పోటీ అన్నట్లు, తమ తమ నైపుణ్యాలను ప్రదర్శించి, ప్రతిభకు గుర్తింపు దక్కుతుందనుకొని, ఉత్కంఠభరితులై రాజు నిర్ణయంకోసం ఉవ్విళ్ళూరుతున్నారు. ప్రతి క్షణం మరో క్షణాన్ని అధిగమించడానికి వేగంగా ముందుకు సాగుతుంటే, అదే వేగంతో అంతకు ముందరి క్షణం మందగమనంతో ఒక యుగాన్ని తలపింపజేస్తున్నది. రాజు, ప్రదర్శనకుంచిన ఒక్కో నమూనాను చూస్తూ, పరికిస్తూ, పరిశీలిస్తూ, నిర్మించిన తరువాత ఈ ఆలయం ఎలా ఉంటుందో ఊహిస్తూ, సహచరుల వంక చూస్తున్నాడు. 'నిర్ణయం మీదేన'ని వారు మిన్నకుండిపోయారు. ప్రదర్శనలో మరోమారు కలియదిరిగాడు. అన్నీ అద్భుతంగానే ఉన్నాయి. నిర్ణయం తీసుకోలేకపోతున్నాడు. జైత్రయాత్రల్లో తాను చూచిన వివిధ ఆలయ రూపురేఖల్ని మదిలోకి తెచ్చుకున్నాడు. మొదటి కృష్ణుని మదిలో పట్టడకల్‌లోని విరూపాక్షాలయం, కంచిలోని కైలాసనాథస్వామి దేవాలయాలు కదలాడుతున్నాయి. ఒకదానితో మరొకటి పోటీపడుతున్నాయి.

సరిగ్గా అదే క్షణంలో విడిగా ప్రదర్శనలో ఉన్న ఒక దేవాలయ సముదాయ నమూనా తన దృష్టినాకర్షించింది. శిల్పులను ప్రశ్నించాడు 'మీరెక్కడివార'ని. 'మేము కన్నడ దేశస్తులం. మా పూర్వీకులు పల్లవరాజుల పోషణలో శిల్పకళకు పాటుపడి బాదామీ చాళుక్యుల ఆహ్వానంపై తొలి చాళుక్యుల మూడో రాజధాని పట్టడకల్ ఆలయాల నిర్మాణ సందర్భంగా వలస వచ్చి స్థిరపడ్డాం. మాకు దాక్షిణాత్య (ద్రావిడ) వాస్తుశిల్పంతోపాటు ఉత్తర భారత వాస్తుశిల్పంలోకూడా ప్రావీణ్యం ఉంది' అని తెలిపారు. 'అంతేకాదు, కొండలను తొలచి గుహలుగా మలచగలం. రాళ్లను విరగగొట్టి వాటిని చక్కగా చెక్కి వరుసలుగా పేర్చి ఆలయాలుగా, మండపాలుగా తీర్చిదిద్దగలం.

విడి శిల్పాలతోపాటు గోడలపై, స్తంభాలపై, కప్పులపై, దూలాలపై మీరు కోరుకున్న భారత, భాగవత, రామాయణం మొదలైన ఇతిహాసాలేకాక, పురాణాలు వర్ణించిన అనేక ఘట్టాలను కళ్లకు కట్టినట్లుగా చెక్కగలమ'నికూడా మనవి చేసుకున్నారు.

మొదటి కృష్ణునికి ఆ ఆలయ నమూనా నచ్చింది. తమ పూర్వీకులు కొలువు చేసిన బాదామీ చాళుక్య ప్రభువుల ఋణం తీర్చుకోవడానికి, చాళుక్య సంప్రదాయాలకు నూత్న, వినూత్న ప్రక్రియలకు ఆద్యులైన పల్లవుల సంప్రదాయాలను జోడించి 'ఇదొక్కటే. ఇలాంటిది మరెక్కడా లేదన్న'ట్లుండాలన్న తన తలంపే, ఈ ఆలయం. ఆలయ నిర్మాణంలో నేర్పరులు, కవులైన ఆ శిల్పుల సామర్థ్యం తన కలను నిజం చేస్తాయన్న నమ్మకం కుదిరి ఆ నమూనాను ఎంపిక చేసి త్వరలో పనిప్రారంభించమని ఆజ్ఞాపించి, వారితోపాటు ఇతర నమూనాలను ప్రదర్శించిన శిల్పులనుకూడా గొప్ప కానుకలతో సత్కరించి పంపించాడు మొదటి కృష్ణుడు.

## పర్వత శ్రేణుల్లో అద్భుతాలయం

ఆలయ నిర్మాణానికి అనువైన ప్రదేశాన్ని ఎన్నుకోవడానికి శిల్పులను పురమాయించి 'ఎలాపుర పర్వత శ్రేణుల్ని' ఎంపిక చేయించాడు. అప్పటికి గుహలు వెయ్యేళ్ల నుంచే ఉన్నాయి. ఆలయాలు కనీసం 400 సంవత్సరాల నుంచి ఉన్నాయి. ప్రాచీన సంప్రదాయిక గుహలకూ, కట్టుబడి ఆలయాలకూ భిన్నంగా, రెండింటి కలగలుపుగా కొండను పైనుంచి తొలచుకుంటూ పోయి; ఆలయం, మంటపం, ధ్వజస్తంభం సమకూరేలా పథకాన్ని రూపొందించి ఆరంభించారు శిల్పులు.

కొండపై నేలను తొలగించారు. ఎగుడు దిగుడు రాతినేలను చదును చేశారు. ఆలయాన్ని కల్పించడానికి అవసరమైన 270×50×100 అడుగుల కొలతలతో ఒకచోట, 150×30×100 అడుగుల కొలతలతో మరొకచోట పనిని ప్రారంభించారు. ప్రధాన స్థపతి సూచనల మేరకు సూత్రగ్రాహి, వర్ధకి, తక్షకుల పర్యవేక్షణలో రోజూ దాదాపు 300మంది నేర్పరులైన శిల్పులు రంగంలోకి దిగారు. వీరికి కమ్మర్లు, వడ్రంగులు, కుమ్మర్లు, ఇతర సహాయకులు సహకరించారు.

తొలగించిన రాతిని బయటకు తీసుకెళ్లడానికి, శిల్పులు, వారి కుటుంబసభ్యులు ఉండడానికి శిబిరాలను ఏర్పాటు చేసి నిత్యావసరాలను సరఫరా చేయడానికి సైనికులతోపాటు పౌర అధికారులను నియమించారు. వేతనాలు లేవు. సమష్టి కృషికి వారి అవసరాలను తీర్చడం, బహుమతులివ్వడం, జీవితాలు సాఫీగా సాగిపోవడానికి కావలసినవన్నీ ఏర్పాటు చేయడం రాజు తన బాధ్యతగా గుర్తించాడు.

శిల్పులుకూడా సంతోషంగా పనిలో నిమగ్నమై పైనుంచి ముందుగా విమానశిఖరాన్ని, కప్పులను, గర్భాలయ గోడల్ని, అర్ధమంటప, మహామంటపాల్ని తీర్చిదిద్దారు. తరువాత మూడువైపులా ద్వారాలను తొలచి లోపలి రాతిని తొలగించి స్తంభాలను, ద్వారాలను, దూలాలను, వాటిపై అలంకార శిల్పాన్ని కల్పించారు. ఇందుకు దాదాపు 10 నుంచి 12 ఏళ్లు పట్టి ఉంటుంది.

ఆలయ అధిష్ఠానంపై మహాభారత రామాయణ దృశ్యాలతోపాటు చక్కటి శార్దూలాలను, ఏనుగులను చెక్కారు. తరువాత ప్రవేశద్వారాన్ని తీర్చిదిద్ది, దానిని నందిమంటపానికి కలిపారు. తరువాత మొదటి కృష్ణుడు ఇతర ప్రాంతాలను జయించినందులకు తీపిగుర్తుగా జయస్తంభాన్ని చెక్కి రాజు అభిమానాన్ని చూరగొన్న శిల్పులు. ఒక్కోసారి రాజు, మరోసారి కుటుంబసభ్యులు, ఎక్కువసార్లు ఉన్నతాధికారులు పనులను పర్యవేక్షిస్తూ, శిల్పుల, ఇతర పనివాళ్ల అవసరాలను తీర్చేవారు.

ప్రవేశం దగ్గర ఏనుగులు స్నానం చేయిస్తున్న లక్ష్మి, నంది మంటపంలోని గజాసుర వధ మూర్తి, యోగముద్రలోనున్న శివుడు అత్యంత రమణీయంగా మలచబడినాయి. అలాగే మార్కండేయానుగ్రహమూర్తి శిల్పం, రామాయణ దృశ్యాలైన వాలి-సుగ్రీవ యుద్ధం, రావణాసురుని జటాయువు ఎదుర్కోవడం, ఇంకా విష్ణు, వరాహమూర్తి, రతీ-మన్మథ శిల్పాలు, మహిషాసురమర్దని శిల్పం, ఇతర శిల్పాలు ముఖ్యమైనవి.

ఇవన్నీ ఒక ఎత్తైతే, తన మొర ఆలకించక శివుడు పార్వతీదేవితో ఉన్న కైలాసపర్వతాన్ని రావణాసురుడు ఊపిన శిల్పం అత్యద్భుతం. శివుని దృష్టినాకర్షించడానికి తన బలాన్నంతా కూడగట్టుకొని పర్వతాన్ని కదిలిస్తుండగా, పార్వతి భయంతో శివునిపై పడడం, ఆ వూపును తట్టుకోవడానికి శివుడు తన కాలితో కైలాస పర్వతాన్ని తొక్కి పట్టి ఉంచడం కథన శిల్పానికి చక్కటి ఉదాహరణ.

ప్రవేశద్వారానికి ఇరువైపులా గంగ, యమున శిల్పాలు గోడలపై త్రివిక్రమ, బ్రహ్మ, లింగోద్భవ మూర్తి, ఇంద్రుడు, అగ్ని, వాయువు, వరాహ, నరసింహ శిల్పాలు శిల్పుల పనితనాన్ని ఋజువు చేస్తున్నాయి. ఇంతటి అద్భుత సదనాన్ని చూచి శివుడు తన కైలాసాన్ని వీడి ఇక్కడే ఉండాలనుకొన్నందునే ఈ ఆలయానికి 'కైలాసనాథ ఆలయం' అని పేరు కలిగిందంటారు. మహాబలిపురంలో పల్లవుల కాలంలో ప్రారంభమైన గుహాలయ ప్రక్రియ రాష్ట్రకూటరాజైన మొదటి కృష్ణుని కాలానికి పరాకాష్ఠకు చేరిందనడానికి కైలాసనాథ ఆలయం ఒకే ఒక్క ఉదాహరణ.

కేవలం ఆలయ వాస్తు శిల్పానికేకాక, కైలాసనాథాలయం వర్ణచిత్రాలకు కూడా పేరు గాంచింది. సభా మంటప పశ్చిమభాగానగల సరస్సులోనున్న ఏనుగులు, నటరాజ, లింగోద్భవ చిత్రాలు, శార్దూలం, విద్యాధరులు, శివుడు, పార్వతి, గణేశ, కార్తికేయ చిత్రాలు ముఖ్యమైనవి దేవతలను నిశ్చేష్ట పరచిన కట్టడం.

నిజంగా నేలమీదే కాదు, నింగిలోనూ ఇదొక అద్భుత కట్టడం. దేవతలు పుష్పక విమానంలో విహరిస్తున్నప్పుడు ఒక్కసారిగా ఈ అద్భుత కట్టడం వైభవకాంతులు చూసి నిశ్చేష్టులయ్యారట! రూపలావణ్యంతో కడు రమణీయమైన వాస్తు శిల్ప విన్యాస పరాకాష్టకు మచ్చుతునక అనదగిన కైలాసనాథాలయం తమ మనోగమనాన్ని కట్టిపడేసి కదలకుండా చేసిందని, దేవశిల్పి విశ్వకర్మకూడా అచ్చెరువొందుతాడని దేవతలు తలపోశారట! ఇది తనంతటతానుగా పుట్టుకొచ్చిన స్వయంభూ శివధామం తప్ప వేరొకటి కాదనుకున్నారట!

దేవతలే విస్తృతంగా చర్చించుకునేటట్టు తొలచిన ఈ ఆలయ శిల్పి తన పేరు శాశ్వతం గావించుకున్నాడని కర్కరాజు బరోడా రాగిరేకు శాసనం చెబుతుంది. ఒక్కసారి ఆ శాసనాన్ని చూస్తే...

*"ఈలాపుర గతాద్భుత సన్నివేశం యద్వీక్ష్యావిస్మిత విమాన చరామరేంద్రా హే తత్ స్వంభుశివధామ సకృత్రిమమ్ శ్రీ దృష్టేదృష్టతి బహుచర్చయంతి భూయస్తథా విధాకృతౌ వ్యవసాయహాని ఏతాన్మయాకథా మహోకృతం ఇత్యకస్మాత్ కర్తపియస్వఖిలు విస్మయ రూపశిల్పీ తన్నామ కీర్తనమ్ అకార్యత యేన రాజ్ఞా "* (ఇండియన్ యాంటిక్వరీ వాల్యూం 12, పేజీ 59) ఈ ఆలయ గొప్పదనం తెలుస్తోంది. ఈ ఆలయంలో ఒక్క రాయికూడా చెక్కి అమర్చిన దాఖలాలు లేవు గాబట్టి, స్వయంభువు అనే భ్రమ లు కలగటం నిజమే.

## ప్రపంచ వారసత్వ కట్టడం

మొత్తం భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా దేవాలయ వాస్తులోనూ, హిందూ ప్రతిమాలక్షణాలలోనూ, వ్యూహాత్మక నిర్మాణంలోనూ, గుహాలయాల్లోనూ, కట్టడాలయాల్లోనూ చూడని ప్రణాళికాబద్ధమైన, అంకితభావంతో తీర్చిదిద్దిన కైలాసనాథాలయం... అమోఘవర్షునిగా పేరుగాంచిన మొదటి కృష్ణునికీ, అతని ఆజ్ఞకు రూపకల్పన గావించిన శిల్పుల పనితనానికీ గౌరవంగా యునెస్కో వారి గుర్తింపుకు నోచుకొని... ప్రపంచ వారసత్వ కట్టడాల జాబితాలో చేరింది. ఆలయ నిర్మాణంలో

తాను చూసిన ఆధిపత్య కాంక్ష ఇంతటి ఘనతను సాధిస్తుందనిగానీ, ప్రపంచ పర్యాటక క్షేత్రమౌతుందనిగానీ మొదటి కృష్ణుడు అనుకొన్నాడో లేదో!

**అలంపూరులోని తారక బ్రహ్మాలయం రాష్ట్రకూటులదే!**

తెలుగునాట రాష్ట్రకూటులు నిర్మించిన దేవాలయాలు చాలా ఉన్నాయి. అలంపురం నవబ్రహ్మాలయాల్లో తారక బ్రహ్మాలయం వీరు నిర్మించిందే. ఇంకా వీరు నిర్మించిన ఆలయాలు మహబూబ్‌నగర్ జిల్లా మియాపూరు, మల్లేశ్వరం, సోమశిల, బెక్కెం, మీనాంబరం అనే చోట్ల; కర్నూలు జిల్లా రూపాల సంగమేశ్వరం, బండతాండ్రపాడు, వెల్దుర్ది; కడప జిల్లా జ్యోతివద్ద ఉన్నాయి. గర్భాలయ, అర్ధమంటప, మహామంటపాలతోనూ, కొన్నిచోట్ల మహామంటపం మూడువైపులా ద్వారాలు, ముందు వైపు మెట్లతోనూ, అలాగే అధిష్ఠానం, పాదవర్గం, ప్రస్తరం, శిఖరాలతోనూ, అర్ధమంటపం మీద శుకనాసితోనూ ఉంటాయి. రాష్ట్రకూటుల ఆలయాలు మహాబలిపురంలోని రాతిరథాలవలె ఉండడమే కాక పల్లవుల వాస్తును ప్రతిబింబిస్తాయి. ఏది ఏమైనా, బాదామీ చాళుక్యుల తరువాత రాజ్యమేలిన వీరు, వారిని అనుకరించక తమదైన శైలిలోనే ఆలయాలను నిర్మించి రాష్ట్ర కూట శైలికి ఒక గుర్తింపు తెచ్చారు.

**వేములవాడ చాళుక్యులు (క్రీ.శ.7-10 శతాబ్దాలు)**

కరీంనగర్ - నిజామాబాద్‌జిల్లాలు కలిసిన ప్రాంతాన్ని సపాదలక్ష, సవలక్షె, సవలక్కె అనీ, కొసవం సవలక్షకె అని శాసనాలు పేర్కొంటున్నాయి. ఈ ప్రాంతాన్ని బోధన్, వేములవాడల కేంద్రాలుగా పాలించిన సూర్యవంశ చాళుక్యులను వేములవాడ చాళుక్యులని పిలిచారు. రెండో అరికేసరి కొల్లిపర రాగిరేకు శాసనం, కురవగట్టు, వేములవాడ, పర్భనీ, కరీంనగర్ రాతి శాసనాలు, విక్రమార్జున విజయం, వేములవాడ చాళుక్యుల వంశ వివరాలనందిస్తున్నాయి. సత్యాశ్రయుని(క్రీ.శ.650-675 తో ప్రారంభమైన వీరి పరిపాలన, పృథ్వీపతి, మహారాజు, రాజాదిత్యుల తరువాత (ఈ రాజుల గురించిన వివరాలు అందుబాటులో లేవు) యుద్ధమల్లునిగా పేరుగాంచిన మొదటి వినయాదిత్యుని (క్రీ.శ.750-775) నుంచి మూడో అరికేసరితో (క్రీ.శ.946-968) అంతమైంది.

కొల్లిపర రాగిరేకు శాసనంలో వినయాదిత్య యుద్ధమల్లుడు అనేక దేశాల రాజులను జయించిన గొప్ప యోధుడనీ, సపాదలక్ష దేశాన్ని పాలించాడని చెప్పగా, బోధన్‌లోని ఒక నూనెతో నింపిన చెఱువులో తన ఏనుగులను స్నానంచేయించాడని, చిత్రకూట దుర్గాన్ని వశపరచుకొన్నాడనీ విక్రమార్జున విజయం, పర్భనీ శాసనం

తెలియజేస్తున్నాయి. రాష్ట్రకూటుల సామంతుడుగా నున్న విజయాదిత్యుడు తరువాత స్వతంత్రుడై బోధన్ నుంచి పాలించాడు.

యుద్ధమల్లుని తరువాత, అతని కొడుకు మొదటి అరికేసరి (క్రీ.శ.775-800) సపాదలక్ష దేశాన్ని పాలించి, వేంగీ, త్రికలింగ దేశాలపై దాడి జరిపాడని, శ్రీశైలం, ఏలేశ్వరం శాసనాల వల్ల తెలుస్తుంది. అరికేసరి తరువాత, అతని కొడుకు మొదటి నరసింహుడు, అతని తరువాత నరసింహుని కొడుకు రెండో యుద్ధమల్లుడు అధికారం చేపట్టారు. క్రీ.శ. 850-895 సం၊ల మధ్యకాలంలో పాలించిన బద్దెగ గొప్ప యుద్ధవీరుడు. ఇతడు తన రాజ్యాన్ని సుస్థిరం చేయడమేకాక, వేంగీ రాజైన మొదటి చాళుక్యభీముని బందీగా పట్టుకొన్నాడని కొరవి శాసనం తెలియజేస్తుంది. బస్తర్ వరకు రాజ్యాన్ని విస్తరించి, వేములవాడలో తనపేర బద్దెగేశ్వర (భీమేశ్వర) ఆలయాన్ని నిర్మించాడు. క్రీ.శ. 895-915 మధ్యకాలంలో పాలించిన రెండో యుద్ధమల్లుని తరువాత రెండో నరసింహుడు (క్రీ.శ. 915-930) అధికారానికొచ్చాడు. ఇతడు కూడా గొప్ప యుద్ధవీరుడే. ఇతడు రాష్ట్రకూట మూడోఇంద్రుని సామంతునిగా మొదట లాట దేశాన్ని జయించి సప్తమాళవులపైకి దండెత్తి పరాజితులను చేసాడు. కాలప్రియపై దాడిచేసి మహిపాలుని ఓడించి విజయశిలాస్తంభాన్ని నాటించాడు. నాటికాలప్రియయే నేటి కల్పి ప్రాంతం. తరువాత గంగా-యమునా తీరాల వరకు దండయాత్రలు జరిపి ఘూర్జరులను తరిమికొట్టి రాష్ట్రకూటుల పతిభక్తిని చాటుకొన్నాడు. అనంతరం కుమారుడైన రెండవ అరికేసరి రాజ్యానికి వచ్చి రాజధానిని వేములవాడకు మార్చాడు. వీరి రాజ్యం గోదావరికి దక్షిణాన మంజీరా నది నుండి మహాకాళేశ్వర పర్వతం వరకు వ్యాపించింది. ఇది తరువాత సబ్బినాడనియు, సబ్బిసాయిర మండలమనీ పిలువబడింది. రెండవ అరికేసరి సాహిత్యాభిమాని, కవి, పండితుడు.

రెండో నరసింహుని కొడుకైన రెండో అరికేసరి క్రీ.శ.930- నుంచి 941 వరకు పాలించి కవిపోషకుడుగా, పండితునిగా పేరుగాంచాడు. ఇతని కాలంలో పంపడు కన్నడంలో విక్రమార్జున విజయాన్ని రాశాడు. ఇతని కాలంలోనే వేములవాడలో ఆదిత్యాలయం నిర్మించబడినది. ఇతని తరువాత ఇతని కొడుకులైన నాగరాజు గంగాధర నుంచి, భద్రదేవుడు వేములవాడ నుంచి రాజ్యాన్ని రెండు భాగాలుగా పాలించారు. భద్రదేవుడు శుభదామ జినాలయాన్ని కట్టించాడు. తరువాత భద్రదేవుని కొడుకు మూడో అరికేసరి రాజ్యానికొచ్చి క్రీ.శ.946-968 వరకు పాలించాడని పర్బనీ, రేపాక శాసనాలవల్ల తెలుస్తుంది.

## దేవాలయాలు

వేములవాడ చాళుక్యులు వేములవాడలో భీమేశ్వరాలయం, కేదారేశ్వరాలయం, నగరేశ్వరాలయాలను నిర్మించారు. వీటిలో భీమేశ్వరాలయం చెప్పుకోదగ్గది. రాష్ట్రకూటుల సామంతులుగా నున్న వీరు, రాష్ట్రకూట శైలిలోనే ఆలయాలను నిర్మించారు. గర్భాలయ, అర్ధమండప, మహామండపాలతోనూ, నిలువుగా అధిష్టానం, పాదవర్గం, ప్రస్తరం, విమానాలతో స్థానిక సంప్రదాయవాస్తును కూడా తెలియజేస్తుంది. భేదాభేద అధిష్టానంపై శిల్పాలు చూడముచ్చటగా ఉన్నాయి. గర్భాలయ ద్వారబంధాలపై అంతగా అలంకార శిల్పం లేకపోయినా, గంగా, యమున శిల్పాలు వేములవాడ శిల్పశైలిని తెలియజేస్తున్నాయి. మండపస్తంభాలు భారీగా, ఉన్నా ఏమంత అలంకరణ లేకుండా సాదాగా ఉన్నాయి. ఆలయ శిల్పాల్లో మహిషాసురమర్దని, శంఖనిధి, పద్మనిధి, ముఖమండప ద్వారలలాటంపైనున్న మకరతోరణం గజలక్ష్మి శిల్పాలు వేములవాడ చాళుక్యల శిల్పకళకు అద్దం పడుతున్నాయి.

## ముదిగొండ చాళుక్యులు (క్రీ.శ 9-12 శతాబ్దాలు)

ఖమ్మం పట్టణానికి దగ్గరలోనున్న ముదిగొండ రాజధానిగా ముదిగొండ చాళుక్యులు ఖమ్మం, వరంగల్ జిల్లాలోని కురవి, కృష్ణాజిల్లాలోని మంచికొండ, కొండపల్లి పరిసరాలు, కలిసిన కృష్ణా గోదావరి నదుల మధ్య గల వేంగి చాళుక్య, రాష్ట్రకూట రాజ్యాల సరిహద్దులుగా పాలించారు. వీరు యుద్ధాల్లో తూర్పు చాళుక్యల పక్షాన రాష్ట్ర కూటులకు వ్యతిరేకంగా పోరాడారు. కొక్కిరాజు, రణమర్ద సోదరులు ముదిగొండ రాజధానిగా పాలన ప్రారంభించారు. రణమర్దుని కొడుకైన మొదటి కుసుమాయుధుడు, వేంగి చాళుక్య భీమునికి విశ్వాసపాత్రునిగా ఉంటూ రాష్ట్రకూటులతో జరిగిన యుద్ధంలో తన పరాక్రమాన్ని నిరూపించుకొన్నాడు. తరవాత జనాశ్రయుడు, రెండవ కుసుమాయుధుడు, రెండవ విజయాదిత్యుడు, మూడవ కుసుమాయుధుడు, నాల్గో కసుమాయుధుడు వరుసగా రాజ్యాపాలన గావించారు. నాల్గో కుసుమాయుధుని కొడుకైన బేతరాజు పాలనలో రాజ్యంలో అశాంతి నెలకొంది. కొరవి ప్రాంతం అన్యక్రాంతం కాగా, బేతరాజు గోదావరి అడవుల్లోని బొట్టు అనే ప్రాంతంలో అశ్రయం పొందినందున శాసనాలు ఇతన్ని బొట్టు బేతరాజుగా పేర్కొన్నాయి. అనంతరం విరియాల ఎర్రని సహాయంతో కొరవిని మళ్లీ ఆక్రమించాడు. బొట్టు బేతరాజు కొడుకైన ఐదో కుసుమాయుధుడు, తరువాత ఆరో



దొడ్డేశ్వరాలయం, హేమావతి, అనంతపురం జిల్లా



మల్లేశ్వరాలయాలు, హేమావతి, అనంతపురం జిల్లా

కుసుమాయుధుడు, నాగతి రాజులు వంశంలో చివరి పాలకులు. కాకతీయ రుద్రదేవుని విజయయాత్రలో వీరి ఇరువురు ఘోరంగా ఓటమి పాలైనారు. కాకతీయ మహాదేవుడు దేవగిరి యాదవుల దాడిలో మరణించగా, గణపతి దేవుడు బందీ కాగా, కాకతీయులపై పగ సాధించటానికి చేసిన యత్నాలను రేచర్ల రుద్రసేనాని తిప్పికొట్టాడు. ఈ ఓటమితో నాగతి రాజు గోదావరి లోయకు పారిపోయి కొలను నాయకుల కొలువులో ఆశ్రయం పొంది కొలని సోమయ్య సేవలో గడిపాడు.

**నొళంబులు లేక నొలంబ-పల్లవులు (క్రీ.శ 8-11 శతాబ్దాలు)**

కంచి పల్లవుల నుంచి విడిపోయిన ఒక శాఖ 'నొళంబ వంశం'గా గుర్తింపు పొందింది. నొళంబులు క్రీ.శ. 8-11 శతాబ్దాల మధ్య కాలంలో వాయవ్య రాయలసీమ, దాని చుట్టుపక్కల కర్ణాటకలోనున్న కొన్ని ప్రాంతాలను పాలించారు. ప్రస్తుత అనంతపురం జిల్లా అమరాపురం మండలంలోని హేమావతి (ఒకప్పటి హెంజేరు)ని రాజధానిగా పాలించిన వీరి భూభాగాలను నొళంబవాడి-32000 అని పిలిచారు. కళ్యాణి చాళుక్యుల సామంతులుగానున్న నొళంబుల చరిత్ర తెలుసుకోవడానికి హేమావతి స్థంభశాసనం, నేలపల్లి శాసనాలతోపాటు మోరిగెరి శాసనం ఎంతో ఉపకరిస్తాయి. నొళంబులలో మంగళుడు (క్రీ.శ. 785-805) సింహపోత, చారుపొన్నేర, మొదటి పొళల్‌చోరుడు, నొళంబాధిరాజ మొదటి మహేంద్రుడు, అయ్యపదేవుడు, అన్నగబీర నొళంబుడు, ఇరివనొళంబ దిలీపుడు, నన్నినొళంబుడు, రెండవ మహేంద్రుడు, ఇరివనొళంబ ఘటెయంకకారుడు, జగదేకమల్ల నొళంబ పల్లవ పెర్మనడి ఉదయాదిత్యుడు, జగదేకమల్ల ఇర్మడి నొళంబ పెర్మనడి, త్రైలోక్యమల్ల రెండో నన్నినొళంబ పల్లవ పెర్మనడి (క్రీ.శ. 1044-54) ముఖ్యులు. పల్లవ పెర్మనీడి తరువాత త్రైలోక్యమల్ల నొళంబ పల్లవ పెర్మనడి జయసింఘదేవుడు రాజైనాడు. శాసనాల్లో ఇతడు చాళుక్యరాజైన మొదటి సోమేశ్వరుని కొడుకునని, ఆరవ విక్రమాదిత్యుని తమ్ముడినని చెప్పుకొన్నాడు.

పశ్చిమ చాళుక్యులకు సామంతులుగానున్న నొళంబులు స్వతంత్రులై పల్లవులతో సఖ్యత గావించుకొని పాలించారు. తరువాత రాష్ట్రకూట, పశ్చిమ గాంగరాజులతో మైత్రితోనున్నారు. బాణులతో చేసిన యుద్ధాలోను గెలిచారు. అయ్యపదేవుని కాలంలో ఒకసారి వేంగీ చాళుక్యులతో యుద్ధం జరిగింది. అంతేకాదు రెండో మహేంద్రుని కాలంలో చోళులతో తలపడవలసి వచ్చింది. ఇరివనొళంబ ఘటెయంకకారుని కాలంలో రాజకీయ సమీకరణంలో భాగంగా, నొళంబులు కళ్యాణ చాళుక్యులకు దగ్గరైనారు. చాళుక్యుల బిరుదులనే వీరూ స్వీకరించారు.

రాజ్యాన్ని సుస్థిరం చేసుకోవడానికి నొళంబ రాజులు ఎక్కువకాలం యుద్ధాలు చేయటంతోనే సరిపోయింది. అనుకున్నంతగా ఆలయాలను కట్టలేక పోయారు. శివభక్తుడైన మొదటి మహేంద్రుడు, తన రాజప్రాసాదంలో శివుడిని ప్రతిష్ఠించి, తుంకూరు జిల్లాలోని సరినాడును దానంగా ఇచ్చాడు. తాను శైవుడినైనా జైన మతానికికూడా చేయూతనిచ్చాడు. ఇరివ నొళంబ దిలీపుడు (క్రీ.శ.941-968) 50 దేవాలయాలను నిర్మించినట్లు అవనిలోని లక్ష్మణేశ్వర ఆలయం గోడపైనున్న శాసనం తెలియజేస్తుంది. నన్నినొళంబుని (క్రీ.శ. 969-75) కాలంలో కంబదూరులోని జైన దేవాలయాన్ని నిర్మించినట్లు అక్కడే ఉన్న ధర్మోద్యోగ కీర్తి స్థంభ శాసనంలో ఉంది.

**దేవాలయాలు**

నొళంబుల కాలంలో కర్నూలు జిల్లాలోని చిప్పగిరి, అనంతపురం జిల్లాలోని హేమావతి, అమరాపురం, తమ్మడహళ్లి, కంబదూరు, రాయదుర్గం వద్ద గల జైనాలయాలు గొప్ప జైనకేంద్రాలుగా విలసిల్లి, భాసిల్లాయి.

నొళంబుల రాజధాని అయిన హేమావతిలో వారు నిర్మించిన దొడ్డేశ్వర, అక్కచెల్లెళ్ల గుడులు ప్రసిద్ధి నొందాయి. దొడ్డేశ్వరాలయం గర్భాలయం, అర్ధమంటపం, అంతరాళం, మహా మంటపాలతో విశాలంగా ఉంది. ప్రతిబన్ధాధిష్ఠానం, స్థంభాలతో అలంకరించిన గోడలు, పల్లవరీతిన చెక్కిన కపోతం, దానిపై ఎత్తయిన వ్యాళవర్గం ఉన్నాయి. గోడలకు అలంకారంతో కూడిన కిటికీలున్నాయి. ద్వారబంధాలపై గంగ, యమున, ద్వారపాలక శిల్పాలు, పైన దేవతామూర్తులు, చాళుక్య-రాష్ట్రకూట శిల్పశైలిని ప్రతిబింబిస్తున్నాయి. వీటితోపాటు భూతగణాలు, హంసలు వరుసలు, వరుసలుగా చెక్కబడినాయి. మహామంటపం లోపల స్థంభాలు మిక్కిలి అందంగా చెక్కబడినాయి. వాటిపై దేవతలు, శృంగారదృశ్యాలు, నర్తకులు వాద్యకారులు, పురాణ గాథలు, రామాయణ, మహాభారత దృశ్యాలు ఉన్నాయి. అత్యంత రమణీయంగా చెక్కిన పెద్దనంది వారి శిల్ప నైపుణ్యాన్ని తెలియజేస్తుంది.

అక్కడే ఉన్న విరూపాక్షాలయ స్థంభాలపై అనేక శిల్పాలున్నాయి. ఆలయ మంటపం ద్వారానికి అటూ ఇటూ చెక్కిన మెట్లవరుస, గజహస్తాలు, కీర్తిముఖాలు, ఇతర శిల్పాలు హృద్యంగా ఉన్నాయి. ఇంకా ఇక్కడ సిద్దేశ్వరాలయం, మల్లేశ్వరాలయాలు పేర్కొనదగినవి. గమ్మత్తేమిటంటే, జైత్రయాత్రలో భాగంగా చోళ రాకుమారుడు రాజేంద్రుడు హేమావతిపై దండెత్తినప్పుడు అక్కడి దేవాలయాలకున్న కిటికీని చూచి మైమరచిపోయి, తంజావూరుకు తరలించి తన తండ్రి నిర్మించిన

బృహదీశ్వరాలయ గోడకు బిగించినట్లు ఒక రాజరాజచోళుని శాసనం తెలియజేస్తుంది.

1937లో హేమావతిని సందర్శించిన ప్రఖ్యాత చరిత్రకారులు సి.శివరామమూర్తి, అక్కడి ఆలయాలను, శిల్పాలను చూచి మంత్రముగ్ధులై, తరువాత మద్రాస్ మ్యూజియంలోనున్న నొళంబ శిల్పాలపై 'నొళంబ స్కల్ప్చర్' అనే పుస్తకాన్ని రాశారు. హేమావతిలోని హెంజేరప్ప దేవాలయం నుంచి తరలించిన మహేంద్రాధిరాజు కాలపు శాసనాలున్న ఆలయ స్థంభం మద్రాస్ మ్యూజియంలో ఉంది. దేవాలయ శిల్పాలతోపాటు వీరగల్లు శిల్పాలుకూడా ముఖ్యమైనవి. శిద్దేశ్వరాలయంలోని దక్షిణామూర్తి, ఆలింగన చంద్రశేఖరమూర్తి, వారాహి, దొడ్డేశ్వర దేవాలయ కిటికీపై చెక్కిన సుబ్రహ్మణ్యేశ్వర, అక్కడే విడిగా ఉన్న వైష్ణవి, బ్రహ్మ, సూర్య శిల్పాలు నొళంబ శిల్పుల పనితనాన్ని తెలియజేస్తున్నాయి.

ఇక, మద్రాస్ మ్యూజియంలోనున్న శిల్పాల్లో ఉమాసహిత శివుని (ఉమామహేశ్వర) శిల్పం నొళంబ శిల్పాల్లోకెల్లా తలమానికమని చెప్పవచ్చు. శివుడు ఒక కాలుమీద మరో కాలు ముడుచుకొని కూర్చోగా, ఆయన ఎడమ కాలిపై కుడిచేయిని పెట్టి వయ్యారంగా ఉత్కుటికాసనంలో కూర్చున్న ఉమాదేవి చక్కటి ప్రమాణంతో ఉండి నొళంబ శిల్ప ఒరవడికి అద్దం పడుతుంది. పీఠ భాగంలో క్రీ.శ. 9వ శతాబ్దినాటి 'స్వస్తిశ్రీ పొసనబ్బె...' అన్న కన్నడ శాసనముంది. మద్రాస్ మ్యూజియంలో ఇంకా, మరో ఉమామహేశ్వర శిల్పం, నటరాజ, సీతారాములు, సూర్య, వీణాధర దక్షిణామూర్తి, కాళి, కూర్చొని ఉన్న గణేశ, కప్పురాయి, తలుపుపైనుంచే దూలం, దానిపై చేప, సూర్యచంద్రులు, ఆలయ నమూనా, ఏనుగు, రాజప్రాసాదం, ఎద్దు, సింహం, చక్రం, చెట్లు, శంఖ-పద్మనిధుల శిల్పాలు నొళంబ శిల్పుల కళాకౌశలానికి మచ్చుతునకలని చెప్పవచ్చు. ఇంకా మూడు స్థంభాలు, శాసన స్థంభం, వీరగల్లు, మకరముఖంతోనున్న సోమసూత్రం చూడదగ్గర శిల్పాలు.

నొళంబుల గురించి వారి వాస్తు శిల్పం గురించి అంతగా ప్రచారం జరగనిమాట నిజం. వీరి దేవాలయ శిల్పం అటు పల్లవ, రాష్ట్రకూట, గాంగ సంప్రదాయాలను పుణికి పుచ్చుకొంది.

**కళింగ గాంగులు (క్రీ.శ. 8 - 11 శతాబ్దాలు)**

నేటి మహా నది నుండి గోదావరి నది వరకు ఉన్న తీరప్రాంతాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలతో పాటు ఒడిశా రాష్ట్రంలోని బరంపురం పూర్వం కళింగదేశంగా పిలువబడేది. గాంగ వంశీయులు ఈ ప్రాంతాలను చాలా కాలము కళింగనగరం (ముఖలింగం) రాజధానిగా పరిపాలించారు. క్రీ.శ.

5వ శతాబ్దం నుండి 15వ శతాబ్దం వరకు పూర్వగాంగులుగా (క్రీ.శ 5-10), తర్వాతి గాంగులుగా (క్రీ.శ 11-15 శతాబ్దాలు) నిరాటంకంగా పాలించారు. గుప్త వంశ పతనానంతరం కళింగ ప్రాంతంలో గాంగులు స్వతంత్రించారు. ఈ వంశపు వారిలో కొందరు కళింగనగరం నుండి, కొందరు సింహపురం, మరికొందరు దంతపురంలలో శాసనాలు వేయించారు. ఇంద్రవర్మ క్రీ.శ 537 గాంగవంశ మూలపురుషుడిగా సామంత స్థాయి నుండి స్వతంత్ర గాంగరాజ్యం దంతపురం రాజధానిగా స్థాపించినట్లు శాసనాలు తెలుపుతున్నాయి. దీనినే నేటి దంతావక్త్రునికోటగా గుర్తించారు. ఇతను మాఠరులను, కళింగులను జయించి త్రికళింగాధిపతి బిరుదు ధరించాడు. ఇతని తరువాత మహాసామంతవర్మ గాంగుల ప్రతిష్ట పెంచాడు. ఆ తరువాత హస్తివర్మ, అతని కుమారులే రెండో ఇంద్రవర్మ, మూడో ఇంద్రవర్మలు కళింగనగర రాజధానిగా పాలించారు. అచ్యుతపురం, సంతబొమ్మాలి, పర్లాకిమిడి శాసనాలు వీరి చరిత్రకు ఆధారాలు. వీరి తరువాత రాజ్యం కోసం జరిగిన అంతర్యుద్ధ కాలంలో దక్షిణ కళింగ ప్రాంతంపై రెండోపులకేశి దండెత్తి ఆక్రమించాడు. రెండో రాజేంద్రవర్మ ఈ వంశంలో ముఖ్యపాలకుడు. విశాల సామ్రాజ్యాన్ని స్థాపించినట్లు గాల్లవల్లి శాసనం ద్వారా తెలుస్తుంది.


వేంగి రాజ్యం అరాచక పరిస్థితుల్లో అర్వాచిన గాంగవంశ మూడో వజ్రహస్తుడు (క్రీ.శ 1038-1070) రాజ్యాన్ని విస్తరించి త్రికళింగాధిపతి బిరుదు పొందాడు. తరువాత అతని కుమారుడైన రాజరాజు అతని కుమారుడైన అనంతవర్మ రాజ్యాధికారాన్ని చేపట్టారు. అనంతవర్మ పాలనలో వీరి రాజ్యం దక్షిణాన గోదావరి నది నుండి ఉత్తరాన మిధునపురం వరకు, పశ్చిమాన కోసల నుండి తూర్పున బంగాళఖాతం వరకు విస్తరించింది. ఇతని తరువాత మొదటి నర్సింహావర్మ , మొదటి భానుదేవుడు, రెండవ నర్సింహావర్మ, రెండో భానుదేవుడు, మూడో నర్సింహావర్మలు రాజ్యానికొచ్చారు. చివరి ముఖ్య పాలకుడైన రెండో భానుదేవుడి పాలనలో ఉలుగ్‌ఖాన్ దండయాత్ర చేశాడు. మూడవ భానుదేవుడి కాలంలో ఢిల్లీ సుల్తాన్ ఒడిషాపై దండెత్తగా భానుదేవుడు లొంగిపోయాడు.

**దేవాలయాలు**

క్రీ.శ.8వ శతాబ్దం నుంచి ఎత్తైన ఆలయాలను నిర్మించారు. వీటిలో ముఖలింగం, సారపల్లి, జయతి, గాలవెల్లి, నారాయణపురం, శ్రీకూర్మం, సింహాచలం దేవాలయాలు ముఖ్యమైనవి. ముఖలింగంలోని మధూకేశ్వరాలయం, కళింగ గాంగుల విలక్షణ వాస్తుకు నిదర్శనం. మధ్యలో గర్భాలయం, అర్ధమండపం, మహామండపాలతో

నాలుగు మూలలా నాలుగు ఉప (పరివార) ఆలయాలున్నాయి. దాదాపు పంచాయతన రీతిలో నిర్మించిన ఈ ఆలయాలు కళింగ సంప్రదాయంలో నిర్మించిన ఉపపీఠం, పాదవర్గం, ప్రస్తరం, పైన రేఖానాగర పద్ధతిలో వరుసవరుసలుగా నిర్మించిన శిఖరం, పైన అమలకశిఖరం, స్థూపి ఉన్నాయి. మధ్య రంగమండపంలోపల పైకప్పు గమనించదగ్గ అంశం. ఆలయగోడలు, ద్వారబంధాలపై శిల్పం గాంగరీతిని తెలియజేస్తుంది. అన్ని దేవాలయాలకు చుట్టూ రాతిప్రాకారం, ఎదురుగా చిన్న ద్వారగోపురం చూడముచ్చటగా ఉంటుంది.

*మధూకేశ్వరస్వామి దేవాలయం, ముఖలింగం, శ్రీకాకుళం జిల్లా*



ముఖలింగంలోని సోమేశ్వరాలయం క్రీ.శ. 9వ శతాబ్దంలో నిర్మించబడింది. ఈ కోవలోనే సారపల్లి దిబ్బేశ్వరాలయం, అరసవెల్లి సూర్యనారాయణ దేవాలయం కూడా నిర్మించారు. తరువాత కాలంలో అంటే క్రీ.శ. 11వ శతాబ్దంలో కళింగ దేవాలయాల్లో కొన్ని మార్పులు చోటు చేసుకొన్నాయి. ముఖలింగంలోని భీమేశ్వరాలయం, నారాయణపురంలోని నీలకంఠేశ్వరాలయాలు రేఖానాగర పద్ధతిలోనే నిర్మించారు. అటుతరువాత శ్రీకూర్మం, సింహాచలం దేవాలయాలు కళింగ శైలికి భిన్నంగా ద్రావిడ విమాన పద్ధతిలో నిర్మించారు. మొదటి నరసింహదేవుడు నిర్మించిన సింహాచల దేవాలయం కళింగుల చివరిదశ దేవాలయ వాస్తును ప్రదర్శిస్తుంది.



*శివలింగం, ముఖలింగం దేవాలయం, శ్రీకాకుళం దేవాలయం*

**బాణులు**

బాణులు క్రీ.శ. 5వ శతాబ్దం నుండి గుత్తి, జమ్మలమడుగు. పెన్నానది దక్షిణ ప్రాంతాలలో మొదటి విక్రమాదిత్య జయమేరు, రెండవ విజయాదిత్య జయమేరు వరుసగా రాజ్యపాలన చేశారు. వరిలిపురి (అనంతపురం జిల్లా పరిగ) రాజధానిగా శ్రీశైలం, కాళహస్తి, పాలార్ నదుల మధ్య ప్రాంతాన్ని పాలించారు. వీరు మొదట పల్లవులకు, తరువాత రాష్ట్రకూటులకు, చివరగా చోళులకు సామంతులుగా ఉన్నారు. మూడవో విక్రమాదిత్యునీ పాలనాకాలంలో చోళ, రాష్ట్రకూట ఘర్షణల్లో బాణులు తమ అధికారాన్ని కోల్పోయారు.

**వైదుంబులు**

పశ్చిమ గంగ వంశ శాఖీయులగా చెప్పుకున్న వైదుంబులు బాణులకు సామంతులుగా మదనపల్లి నుంచి (చిత్తూరు) రేనాడును పాలించారు. వీరి గురించి క్రీ శ. 969 నాటి భువన త్రినేత్రమహారాజు తామ్రశాసనం, ఎగువ బండపల్లి శాసనం, కలకడ శాసనాల ఆధారంగా వీరి జన్మస్థానం చిత్తూరు జిల్లాలోని వైదుంబప్రోలుగా రేనాడు-7000 లను చిప్పిలి రాజధానిగా తొలిరాజైన రామరాజు గాంగరాజుల సామంతుడిగా పాలించినాడు. అనంతరం తన రాజధాని కడప జిల్లా పొత్తపికి మార్చాడు. తరువాత కలింగ త్రినేత్ర, శ్రీ శివమార, వీర మహారాజ గండత్రినేత్రుడు, బెజయిత, భువన త్రినేత్రఇరగయలు వరుసగా రాజ్యపాలన చేశారు. చివరి కాలంలో వీరు చోళుల సామంతులుగా చిత్తూరు, కడపలను పాలించారు.

# 4 చారిత్రక మధ్యయుగం

## *Medieval Period*

**కళ్యాణ చాళుక్యులు (క్రీ.శ.10-12 శతాబ్దాలు)**

బాదామీ చాళుక్య రాజవంశానికి చెందిన నాల్గవ విక్రమాదిత్యుని కొడుకు రెండవ తైలపుడు రాష్ట్రకూటరాజైన మూడవ కృష్ణుని సామంతుడిగా ఉండి, క్రీ.శ. 973లో స్వతంత్రుడై కళ్యాణ నగరం నుంచి పాలించి కళ్యాణచాళుక్య రాజవంశానికి మూల పురుషుడై క్రీ.శ. 997 వరకూ పాలించాడు. అప్పటివరకూ రాష్ట్రకూట, వేములవాడ చాళుక్యల అధీనంలో నున్న భూభాగమంతా తైలపుని వశమైంది. తరువాత, రెండవ తైలపుని పెద్దకొడుకు ఇరివ బెడంగ సత్యాశ్రయుడు క్రీ.శ. 998లో సింహాసనాన్నధిష్టించి క్రీ.శ. 1008 వరకూ పాలించాడు.

సత్యాశ్రయుని తరువాత, అతని మేనల్లుడైన ఐదో విక్రమాదిత్యుడు క్రీ.శ. 1009లో రాజ్యానికొచ్చాడు. అతని తరువాత రెండవ అయ్యణ క్రీ.శ. 1014లో రాజైనాడు. అతని తరువాత జయసింహుడు రాజై క్రీ.శ. 1015 నుంచి మాన్యఖేటం, కొల్లిపాక, యేతగిరి, పటాన్‌చెరువుల నుంచి పాలించాడు. తరువాత త్రైలోక్యమల్ల సోమేశ్వరుడు క్రీ.శ. 1068లో రాజై, క్రీ.శ.1076 వరకూ పాలించి తెలుగు చోడులను, కాకతీయులను, హొయసలులను, యాదవులను సామంతులుగా చేసుకున్నాడు. అతని తరువాత ఆరో విక్రమాదిత్యుడు త్రిభువనమల్ల బిరుదాంకితుడై క్రీ.శ. 1077లో రాజై సామంతులైన కాకతీయులు, హొయసలులు, కందూరిచోడుల సహకారంతో దండనాయకుడైన అనంతపాలయ్య నాయకత్వంలో వేంగిని ఆక్రమించి రాజరాజ నరేంద్రుని సామంతునిగా చేసుకొన్నాడు. కొరవి సీమను ముదిగొండ చాళుక్యులు, అనుమకొండ విషయాన్ని కాకతీయులు, సబ్బిసాయిర మండలాన్ని మేడ, దొమ్మ రాజులు, పానగల్లు రాజధానిగా కందూరి చోడులు కొలనుపాక 7 వేలు, కందూరు 11 వేలు ప్రాంతాలను పాలిస్తున్నారు. త్రిభువన మల్లుడు విశాల సామ్రాజ్యాన్ని

సమర్ధవంతంగా పాలించి సంస్కృతాంధ్ర కన్నడ భాషలను పోషించి, కవులను గౌరవించాడు. అతని పెద్ద కుమారుడు భూలోకమల్ల మూడో సోమేశ్వరుడు క్రీ.శ. 1127లో రాజై క్రీ.శ. 1138 వరకూ, తరువాత రెండో జగదేకమల్లుడు క్రీ.శ. 1139 నుంచి క్రీ. 1148 వరకూ, అటు తరువాత క్రీ.శ. 1149లో సింహాసనమెక్కిన మూడో తైలపుడు క్రీ.శ. 1162 వరకూ, ఆయన కొడుకు త్రిభువనమల్ల నాలుగో సోమేశ్వరుడు క్రీ.శ. 1163 నుంచి క్రీ.శ. 1189 వరకూ పాలించారు. అంతటితో కళ్యాణ చాళుక్య రాజ్యం అంతరించింది. కన్నడ కవిత్రయంలోని రన్నకవి తైలపుని ఆస్థానకవి. విక్రమాంక దేవ చరిత్రను రచించిన మహాకవి బిల్హణుడు, మితాక్షరి అనువాదకర్త విజ్ఞానేశ్వరుడు కళ్యాణ చాళుక్యుల ఆస్తాన కవులే.


**దేవాలయాలు**

కళ్యాణ చాళుక్యుల కాలంలో కరీంనగర్ జిల్లా చొప్పదండిలోని దివకేశ్వరాలయం (క్రీ.శ.992), ఇంకా, ధర్మపురిలోని రామలింగేశ్వరాలయం, రాయకల్‌లోని పంచముఖ లింగేశ్వరాలయం, చిలవ కోడూరులోని రామలింగేశ్వరాలయం, నగునూరులోని త్రికూటాలయం, నాంచెర్లలోని రామాలయం, తోటపల్లి శివాలయం, నందివైడారంలోని త్రికూటాలయం, పొలాసలోని



*త్రికూటాలయం, నగునూరు కరీంనగర్ జిల్లా*

పులస్తేశ్వరాలయాలు, మెదక్ జిల్లాలోని నందికందిలోని రామలింగేశ్వరాలయం (క్రీ.శ. 1015-42), నల్లగొండ జిల్లా పానగల్లులోని పచ్చల సోమేశ్వరాలయం (క్రీ.శ. 1015-42), మహబూబ్‌నగర్ జిల్లా మల్లేశ్వరంలోని అగస్త్యేశ్వరాలయ సముదాయం (క్రీ.శ. 1015-42), అదే జిల్లాలోని సోమశిలలోని సోమేశ్వరాలయం, అలంపూరులోని సూర్యనారాయణాలయం, గంగాపురంలోని చెన్నకేశవాలయం, పూడూరులోని చెన్నకేశవాలయం, బెక్కెంలోని బెక్కేశ్వరాలయం, వరంగల్ జిల్లాలోని ఐనవోలు మల్లికార్జునాలయం, ముప్పోలులోని కేశవాలయం, నిజామాబాద్‌లోని నీలకంఠేశ్వరాలయం, కర్నూలు జిల్లా పెదతుంబళం లోని కాలకంఠేశ్వరాలయాలు ముఖ్యమైనవి. పరిశీలించి చూస్తే కళ్యాణ చాళుక్యుల కాలంలో దేవాలయాలు రాష్ట్రకూటుల ఆలయాలకంటే విశాలంగా, ఎత్తుగా నక్షత్రాకారపు ఉపపీఠం, ద్వారబంధాలపై విశేషమైన శిల్పాలు, వెలుతురు రావటానికి మండపంలో కిటికీలు, బయటి గోడలమీదే కాక, కప్పులపై కూడా శిల్పం, విమానం నుంచి అర్ధమండపం వరకు ముందుకొచ్చిన శుకనాసి, మామిడిపిందెల మాదిరి డిజైన్లలో పై దూలమున్న తోరణాలు, మండప స్తంభాల నుంచి దూలాలను కలుపుతూ అమర్చిన శిల్పాలు,



*నక్షత్రాకారంలోనున్న రామలింగేశ్వరాలయం, నందికంది మెదక్ జిల్లా*

తొలి చాళుక్యుల రేఖానగర పద్ధతి కంటే భిన్నంగా కాదంబ నాగర విమానాలను చెప్పుకోవచ్చు.

**చాళుక్య - చోళులు (క్రీ.శ 11-12 శతాబ్దాలు)**

వేంగి పాలకుడైన రాజరాజనరేంద్రుని కుమారుడైన రాజేంద్రుడు చోళ రాజ్యాధినేతగా కుళుత్తొంగచోళుడన్న పేరుతో తమిళప్రాంతాన్ని పాలిస్తున్నప్పుడు విజయాదిత్యుడి మరణంతో చాళుక్యరాజ్యం చోళరాజ్యంలో విలీనమైంది. వీరు క్రీ.శ. 1075 నుండి సుమారు 125 సంవత్సరాల పాటు సామంతులైన నెల్లూరు, కొణిదెన, పొత్తపిచోళులు, కోనహైహేయులు, చందవోలు, నాదెండ్ల పాలకులైన దుర్జయ వంశీయులు, నతవాటి సీమనేలిన త్యాగి వంశీయులు పూర్తి స్వతంత్ర్య పాలకులుగా వ్యవహరించారు. కుమారుడైన రాజరాజముమ్మడి చోడుడు జననాధపురంలో వేంగి రాజ్యప్రతినిధిగా పట్టాభిషిక్తుడైనాడు. ఇతడు వెలనాటి గొంకయ సహాయంతో పశ్చిమ చాళుక్యులు, పాండ్యుల దాడులను తిప్పికొట్టాడు. తరువాత వచ్చిన వీరచోడుని రాజ్యపాలనలో పశ్చిమ చాళుక్యుల దాడులను, కళింగుల దాడులను గొంకయ అన్నకొడుకైన వెదురుని సహాయంతో తిప్పికొట్టాడు. ఇందుకు ప్రతిఫలంగా గౌతమి, వశిష్ఠ నదుల మధ్య ప్రాంతంపై వెదురుడిని పాలకుడిగా నియమించాడు. ఆతరువాత రాజరాజచోడగంగు రాజప్రతినిధిగా నియమించబడినట్లు మన్నేరు నుండి మహేంద్రగిరి (కళింగ) చాళుక్య -చోళుల అధికారం విస్తరించినట్లు టేకి శాసనం తెలుపుతుంది. వీరచోళుడు రెండోసారి వేంగి పాలకుడిగా నియమించిబడి చతుర్వేది మంగళమనే అగ్రహారాన్ని 563 మంది బ్రాహ్మణులకు ఇచ్చినట్లు పిఠాపురం శాసనం తెలుపుతుంది. వీరు ద్రావిడ బ్రాహ్మణుల రామానుజవైష్ణవం వ్యాప్తికి కృషి చేశారు. నాలుగో రాజప్రతినిధిగా వచ్చిన విక్రమచోడుడి పాలనలో కళింగ రాజైన అనంతవర్మచోడగంగ, పశ్చిమ చాళుక్య ఆరో విక్రమాదిత్యుని సహాయంతో వేంగిపై పలుమార్లు దండెత్తాడు. ప్రతీకారంగా చాళుక్యచోళ సైన్యం కళింగపై దాడి చేసి విజయం సాధించాడు. తరువాత విక్రమచోడుడు చోళసింహాసనం అధిష్ఠించగా పశ్చిమ చాళుక్య చక్రవర్తి ఆరో విక్రమాదిత్యుడు వేంగిని ఆక్రమించాడు. చాళుక్య-చోళ సామంతులందరూ పశ్చిమ చాళుక్యుల సార్వభౌమత్వాన్ని అంగీకరించారు. ఆరో విక్రమాదిత్యుని మరణానంతరం చాళుక్యచోళులు వేంగిని ఆక్రమించి, రెండో రాజరాజు సార్వభౌముడిగా అధికారం చేపట్టాడు. అనంతరం వచ్చిన రాజాధిరాజు పాలనలో ఉత్తరాంధ్రపై అధికారం కోల్పోగా, వేంగి సామంతులు చాలావరకు స్వతంత్రులైనారు.

## సాంస్కృతిక విశేషాలు

వేంగి చాళుక్య రాజ్యం పతనావస్థలో నుండగా అనేక సామంతపాలకులు స్వతంత్రంగా పాలించారు. వెలనాటి చోడులు పరిమిత ఆధిపత్యాన్ని పాటించినట్లు కనబడుతుంది. పశ్చిమాన కాకతీయులు, తూర్పున వెలనాటి చోడుల ప్రాబల్యం విస్తరించింది. నాటి సామంత రాజ్య పాలనావిభాగాల్లో పాకనాడు, వెలనాడు, వేంగి-14000, కొండపల్లి-300, కోటదేశం, కొలనువిషయాలు ముఖ్యమైనవి.

రాజు సర్వాధికారిగా, సప్తాంగాలతో కూడిన పాలనవ్యవస్థ ఉన్నట్లు శాసనాలు తెలుపుతున్నాయి. అమాత్య, మంత్రి, ప్రధాని, ప్రెగడ, సంధివిగ్రహి, మహానియోగాధిపతి వంటి అధికారులు శాసనాల్లో పేర్కొనబడినారు. పాలనా సౌలభ్యం కోసం రాజ్యాన్ని స్థలాలుగా విభజించారు. గ్రామపాలనకై గ్రామణి, తలారి వంటి పదవులున్నాయి. ప్రభువుల యుద్ధాలలో సామంతులైన కోట, హైహాయ, కొండపడమటి సైన్యాలు వెలనాటి చోళుల పక్షాన పాల్గొన్నాయి. సైనికుల సేవలకు ప్రతిఫలంగా గ్రామాలను ఇచ్చేవారు.


## వెలనాటి చోళులు

చాళుక్య చోళరాజైన కులోత్తుంగచోడుని సామంతులుగా వెలనాటిచోళులు బాపట్ల, తెనాలి, గుంటూరు, రేపల్లె ప్రాంతాలను ఆరువేలనాడు పేరుతో ధనుదపురం, సనదుప్రోలు (చందవోలు) రాజధానిగా పాలించారు. పిఠాపురం, ధాన్యకటకం, చేబ్రోలు, చందవోలు, ద్రాక్షారామం, త్రిపురాంతకం శాసనాల ఆధారంగా వెలనాటి చోళరాజ్య నిర్మాత మొదటి గొంకరాజు. అనంతరం కొడుకైన కుళుత్తొంగ రాజేంద్రచోడుడు రాజ్యపాలన చేపట్టాడు. ఇతని పాలనలో కళ్యాణి చాళుక్యులు, కళింగ గాంగులు వేంగీని ఆక్రమించగా, స్థానిక సామంతులందరూ కళ్యాణ చాళుక్యుల సార్వభౌమత్వాన్ని అంగీకరించారు. వెలనాటి రాజులలో చెప్పుకోదగిన రెండవ గొంకరాజు పాకనాడు, నెల్లూరి తెలుగు చోడ రాజైన నల్లసిద్ధిని, కొలనువీడు పాలిస్తున్న సారోనాథ కాటమనాయకులను ఓడించి సామంతులుగా చేసుకున్నాడు. గురజాల రాజధానిగా పాలిస్తున్న కోన హైహయుల్ని ఓడించి అనుగురాజును అల్లుడిగా చేసుకొని గొంకరాజు విశాల సామ్రాజ్యాన్ని పాలించాడు. తీరాంధ్ర రాజ్య విస్తరణ కాంక్షతో కాకతీయులు పిఠాపురం చాళుక్యులకు సహాయంగా వెలనాటి రాజ్యంపై దండయాత్ర చేయగా, గొంకరాజు కొడుకైన రాజేంద్రుడి చేతిలో కాకతీయ రెండవ ప్రోలరాజు మరణించాడు. రెండవ గొంకరాజును ఎదిరించి పిఠాపురం రాజధానిగా చాళుక్య

మూడవ విజయాదిత్యుడు కొత్తరాజ్యం స్థాపించాడు. గొంకరాజు మరణానంతరం వెలనాటి చోళుల ప్రాభవం తగ్గిపోయింది. రెండవ గొంకరాజు తరువాత నండూరి కొమ్మన మంత్రి సహాయంతో పిఠాపురం చాళుక్యులు కొలనుభీముడు, కొనహైహయులపై దండెత్తి విజయం సాధించాడు. వేంగీలోని స్థానిక చాళుక్యులు, పాకనాటి తెలుగు చోళులు, కాకతీయులు, కాలచుర్యులు రెండవ రాజేంద్రచోళునిపై కత్తికట్టి చందవోలు యుద్ధంలో వధించారు. పొత్తపి, కర్మ రాష్ట్రాలు తెలుగు చోడులు, త్రిపురాంతకం, శ్రీశైలం ప్రాంతాలు కాకతీయుల వశమైనాయి. తరువాత కుమారుడైన మూడవ గొంకరాజు పిరాపురంలో అధికారాన్ని స్థాపించాడు. అనంతరం పృథ్వీశ్వరుడు రాజ్యానికి వచ్చి కళింగ ప్రాంతాన్ని జయించి చోడుల ప్రతిష్టను పునరుద్ధరించాడు. అయితే పాకనాటిపై దండెత్తి చోడతిక్కన చేతిలో హతుడైనాడు. చివరి పాలకుడైన కులోత్తుంగ ముమ్మడి చోడుడు నెల్లూరు చోడతిక్కన చేతిలో ఓడించబడి చనిపోయాడు.

### పలనాటి హైహయులు

అనుగురాజు కుమారుడైన నలగామరాజు, మలిదేవరాజుల అంతఃకలహాల ఫలితంగా మలిదేవరాజు పలనాటి 90 గ్రామలతో కూడిన అర్థరాజ్యానికి మాచర్ల రాజధానిగా బ్రహ్మనాయుడు మంత్రిగాను, నలగాముడు గురజాల ప్రాంతానికి రాజుగాను, నాగమ్మ మంత్రిగాను రాజ్యపాలన నిర్వహించారు. బ్రహ్మనాయుడు పంచములనాదరించి వీరవైష్ణవ సిద్ధాంతాలను బోధించాడు. దాయాదుల పోరులో




*వీరులగుడి, కారంపూడి, గుంటూరు జిల్లా*

నలగామ రాజువైపు వెలనాటి చోడుల సామంతులైన కోటరాజులు, కాకతీయులు, హెూయసలుల సైన్యం పంపగా బ్రహ్మనాయుని రాజగు మలిదేవరాజుకు కాలచూరి రాజ్యసైన్యం సహకరించింది. ఈ యుద్ధం కారంపుడి వద్ద క్రీ.శ. 1182లో పల్నాటియుద్ధంగా చరిత్రకెక్కింది.

**కందూరు చోడులు (క్రీ.శ 11-13 శతాబ్దాలు)**

మహబూబ్‌నగర్ జిల్లాలో హైదరాబాద్-కర్నూల్ జాతీయ రహదారిపై నుంచి మూసాపేటకు ముందు లోపలి రెండు కిలోమీటర్ల దూరంలో నున్న కందూరు పేరుతో కందూరునాడు ఉండేది. కళ్యాణి చాళుక్యులు కాకతీయుల కాలంలో ప్రాముఖ్యతను సంతరించుకున్న కందూరునాడు, కందూరు-300, కందూరు-1000, 1100 అన్న పేర్లతో పిలవబడింది. మహబూబ్‌నగర్ జిల్లాలోని ముసాపేట, జడ్చర్ల, నాగరకర్నూలు, అచ్చంపేట, కల్వకుర్తి, మహబూబ్‌నగర్, తాలూకాలు, నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ, నల్లగొండ తాలూకాల్లో విస్తరించి కందూరు కేంద్రంగా తెలుగు చోడులు పరిపాలించినందున వారికి కందూరు చోడులని పేరు వచ్చింది. మొదట వీరి రాజధాని మహబూబ్‌నగర్ సమీపంలోని కోడూరు. ఈ వంశానికి చెందిన మూడో భీమచోడ, మొదటి గోకర్ణులకు వర్ధమానపురం (నంది వడ్డెమాన్), పానగల్లులు రాజధానులుగా ఉండేవి. క్రీ.శ. 1033 నుంచి క్రీ.శ. 1163 వరకూ 130 ఏళ్ళపాటు సాగింది. ఉదయనచోడుని కాలంలో క్రీ.శ. 1163లో కాకతీయ రుద్రదేవుని దండయాత్రతో సన్నగిల్లి తరువాత క్రీ.శ. 1248 వరకూ కొద్దిపాటి భూభాగాన్ని పాలించారు. ఈ రాజ్యాన్ని ఏరువభీముడు (క్రీ.వ. 1028-1050), తొండ (క్రీ.శ. 1050-1075), రెండో భీమదేవ చోడ (క్రీ.శ.1075 - 91), రెండో తొండరస (క్రీ.వ. 1077-1093), మల్లచోడుడు (క్రీ.శ. 1093 -1100), ఉదయనచోడుడు (క్రీ.శ.1100-1104), మూడో భీమచోడుడు (క్రీ.శ. 1104 -1157), భీమచోడుడు (క్రీ.శ.1104-1154), మొదటి గోకర్ణచోడుడు (క్రీ.శ.1122-28), రెండో ఉదయనచోడుడు (క్రీ.శ.1136-1176), నాలుగో భీమచోడుడు (క్రీ.శ.1176-1238), రెండో గోకర్ణచోడుడు (క్రీ.శ.1176-1248) పాలించారు.

ఈ వంశమునందు ఎరువ భీమదేవచోడుడు కృష్ణానదికి ఉత్తర, దక్షిణాన ఉన్న ప్రాంతాలతో పానుగల్లు రాజధానిగా రాజ్యాన్ని విస్తరింపచేశాడు. అనంతరం కుమారుడైన ఎరువ తొండయ చోడుడు సిరికొండ, నేలకొండపల్లి, రాచకొండ, భువనగిరి, దేవరకొండ ప్రాంతాలకు రాజ్యాన్ని విస్తరించాడు. కృష్ణానది తీరాన ఉన్న ఓడపల్లి దుర్గాన్ని అభివృద్ధిపరచాడు. తొండయచోళ మహారాజు కొలనుపాక



సోమేశ్వరాలయ సముదాయం, పానగల్లు ఛాయా, నల్లగొండ జిల్లా

రాజధానిగా కందూరు రాజ్యాన్ని పాలిస్తుండగా కాకతీయ మొదటి ప్రోలరాజు, రెండవ బేతరాజులు కళ్యాణ చాళుక్యులకు సామంతులై తెలంగాణ ప్రాంతాన్ని పాలించేవారు. ఉదయనచోడ మహారాజు, కాకతీయ రెండవ ప్రోలరాజు, కళ్యాణ చాళుక్య సామంతులుగా మహామండలేశ్వరులుగా గుర్తించబడినారు. రెండవ ప్రోలరాజు సహాయంతో పూర్వం కోల్పోయిన ప్రాంతాలను ఉదయనచోడ మహారాజు తిరిగి పొందాడు రెండవ ప్రోలరాజు మరణానంతరం ఉదయనచోడ మహారాజు, కాకతీయులు, కళ్యాణ చాళుక్యుల అధికారాన్ని ధిక్కరించి స్వతంత్రులైనారు. కుమారుడైన భీమదేవచోడుని పాలనలో కాకతీయ రుద్రదేవుడు విజృంభించి కందూరు రాజ్య రాజధాని వర్ధమానపురం ముట్టడించగా, భీమదేవచోడుడు కోటను విడిచి అడవులకు పారిపోయాడు. అనంతరం రుద్రదేవుని సామంతునిగా పనిచేయటానికి అంగీకరించి, సోదరి పద్మావతిదేవిని అతనికిచ్చి వివాహం చేశాడు.

### దేవాలయాలు

కందూరు చోడులు నల్లగొండ జిల్లా, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని మల్లేశ్వరం, సోమశిల, వర్ధమానపురం, ఒల్లాల, పానగల్లు, మామిళ్ళపల్లి, కొలనుపాక, పాములపాడు, వేములనెరవ, ఆలవానిపల్లి, నెక్కొండ, భూత్‌పూర్, రాచూరు, అనిమెల, గట్టుతుమ్మెన, ఉప్పరపల్లి, రామలింగాలగూడెం, తుమ్మేడు, పెద్దకదుంబూరు, పేరూరు, పరడ, ఎండబెట్ల, సిరికొండ, జూపల్లి, ఆగామోతుకూరులలో దేవాలయాలను నిర్మించి, చెరువులను త్రవ్వించి వాటి నిర్వహణకు భూముల్ని దానం చేశారు

కందూరు చోడులు తొలుత కళ్యాణ చాళుక్యులకు సామంతలుగా ఉన్నందువల్ల వారు కట్టిన దేవాలయాలు కళ్యాణ చాళుక్యుల వాస్తురీతినీ, స్వతంత్రులై పాలించిన తరువాత వర్ధమానపురం, పానగల్లుల్లో కాదంబ నాగర శైలి విమానాలతోనూ నిర్మించారు. పానగల్లులోని పచ్చల సోమేశ్వరాలయ సముదాయంలో ఒకవైపు మూడు, మరోవైపున ఒకటి దేవాలయాలు (చతుష్కుటం) ఒక మండపానికి కలుపబడినాయి. అన్ని దేవాలయాలు గర్భాలయ, అర్ధమండపాలతో ఉండి, ముందు భాగంలో 64 స్తంభాలతో ఒక మహామండపముంది. ఆలయాల శిఖరాలు శిధిలమైనాయి. అధిష్ఠానం, పాదవర్గం ప్రస్తరం, మూడంతస్తుల విమానాలతో నిర్మించబడి, పాదవర్గం పై కూట కోష్ఠాలతో, దేవతాశిల్పాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వాహనాలపై ఉన్న అష్టదిక్పాలకులు, ఉమామహేశ్వర, భైరవ, నటరాజ, గణేశ, అందగత్తెల శిల్పాలున్నాయి. లోని కెళితే గర్భాలయ ద్వారాలను అత్యంత రమణీయంగా చెక్కారు. కప్పులపై దిక్పాలకులు, మధ్యన నటరాజశిల్పం, కందూరు చోడుల కాలపు శిల్పుల పనితనాన్ని తెలియజేస్తున్నాయి. మూడు దేవాలయాలు ఒక వరుసలో నుండగా ఎదురుగా వున్న ఒక దేవాలయ గోడలపై అంతగా శిల్పం లేదు గానీ, ప్రస్తర కపోతం కిందగల ఉత్తర (దూలం) వర్గంపైన మైథున, శృంగార దృశ్యాలు లైంగికవిద్యనందిస్తున్నాయి. నందివడ్డెమానులోని త్రైపురుషదేవాలయం (త్రికూటం) మూడు దేవాలయాలతో రంగమండపానికి కలపబడినాయి. ఒక్కో ఆలయం గర్భాలయ, అర్ధమండపాలతోనూ, అధిష్ఠానం, పాదవర్గం, ప్రస్తరం, కంఠం, కపోతం వరుసలున్న విమానం, శిఖరాలతో కాదంబ నాగర శైలిలో ఉంది. నల్గొండ జిల్లా ఒల్లాలలో కందూరు చోడుల కాలపు సాదా శిలాతోరణముంది.

**నెల్లూరు తెలుగు చోడులు (క్రీ.శ.13 శతాబ్దం)**

వెలనాటి చోడుల సమకాలీకులుగా, ప్రత్యర్థులుగా నేటి నెల్లూరు, కడప, చిత్తూరు, చెంగల్‌పట్టు ప్రాంతాలను పాలించారు. వీరి వంశంలో చోళబిజ్జన ప్రధముడు. ఇతను కళ్యాణ చాళుక్య మొదటి సోమేశ్వరుని సామంతునిగా గుల్బర్గను పాలించాడు. ఆరో విక్రమాదిత్యుని పాలనలో పాకనాడును నెల్లూరు రాజధానిగా పాలించారు. ఆ తరువాత సిద్ధబేతుడు, నల్లసిద్ధి(మనుమసిద్ధి), తమ్ముసిద్ధి, చోడతిక్కనలు చాళుక్యచోళు లకు, కాకతీయులకు సామంతులుగా పాలించారు.

మొదటి మనుమసిద్ధి పాలనలో కుళోత్తుంగచోళుడు నెల్లూరుపై దండెత్తి ఓటమిపొందాడు. దీనిని అవమానంగా భావించిన తమ్ముసిద్ధి రాజ్యకాంక్షతో మొదటి

మనుమసిద్ధిని ఓడించి రాజ్యాన్ని ఆక్రమించాడు. అనంతరం మొదటి మనుమసిద్ధి కొడుకైన చోడతిక్కన పినతండ్రి కాజేసిన రాజ్యాన్ని తిక్కనసోమయాజి సహాయంతో రాజ్యాధికారం చేపట్టాడు. తరువాత రెండవ మనుమసిద్ధి వీరగండగోపాల బిరుదుతో రాజ్యపాలన చేశాడు. ఇతడు చాళుక్యచోళుల, హోయసలుల సహాయంతో దక్షిణప్రాంతాలను ఆక్రమించాడు. ఇదేసమయంలో వైదుంబరాజైన రక్కసగంగడు కడపను పాలించే రాజప్రతినిధి గంగయ సాహిణిని పారదోలి రాజ్యాన్ని ఆక్రమించాడు. మనుమసిద్ధి దాయాదులైన పడిహారి తిక్కన, బయ్యనలు నెల్లూరు ప్రాంతంపై విరుచుకుపడి మనుమసిద్ధిని పారద్రోలారు. ఈ పరిస్థితుల్లో మంత్రి, కవియైన తిక్కన సోమయాజి గణపతిదేవుని సహాయాన్ని అర్థించి, సామంతభోజుని నాయకత్వాన కాకతీయసేనలు తిక్కన బయ్యనలు వధించి రాజ్యాన్ని మనుమసిద్ధికి అప్పగించాడు. కడప, నెల్లూరు ప్రాంతాలపై గంగయసాహిణి, మనుమసిద్ధి కాకతీయసామంతులుగా పాలించారు. తరువాత కొంతకాలానికి మనుమసిద్ధిపై అద్దంకి పాలకుడైన యాదవ సారంగదేవుడు దండయాత్ర చేయగా సమర్థవంతంగా తిప్పికొట్టెను. కనిగిరి సీమలోని ఎర్రగడ్డపాడు నెలుతున్న కాటమరాజుతో పశువుల పుల్లరి గురించి జరిగిన పంచలింగాల యుద్ధంలో తిక్కన సోమయాజి పెద్దనాన్న కొడుకైన ఖడ్గతిక్కన ప్రాణాలొడ్డి విజయం చేకుర్చాడు. జటావర్మ సుందరపాండ్యుడు మనుమసిద్ధిపై దండెత్తగా కాకతీయ, బాణ, హోయసల సేనలు సహాయం రాగా క్రీ.శ. 1263 లో జరిగిన ముత్తుకూరు యుద్ధంలో మనుమసిద్ధిని చంపి నెల్లూరు ప్రవేశించి జటావర్మ సుందరపాండ్యుడు వీరాభిషేకం జరుపుకున్నాడు. ఆతరువాత నెల్లూరు రాజ్యం కాకతీయుల పాండ్యుల మధ్య మారుతూ చివరకు ప్రతాపరుద్రుని కాలంలో కాకతీయ సామ్రాజ్యంలో అంతర్భాగమైంది.


# కాకతీయులు (క్రీ.శ. 1052-1323)

## The Kakatiyas

కదనరంగంలోనే గాక, కళాపోషణలోను తమదైన ప్రత్యేకతను చాటుకున్న కాకతీయుల పాలనకాలం తెలుగు జాతి చరిత్రలో ఒక మహోజ్వల ఘట్టం. శాతవాహనుల తరువాత తెలుగు వారినందరినీ ఒక తాటి పైకి తేవడమేగాక, కవి పండితులను పోషించి, వాస్తు శిల్ప కళారంగాలను ప్రోత్సహించి, తెలుగు సాంస్కృతిక వికాసానికి విశిష్టమైన కృషిచేశారు.

**సామంత పాలకులుగా కాకతీయులు:**

కాకతీయ వంశమూల పురుషుడు వెన్నరాజు. వీరు మొదట రాష్ట్రకూటులకు, తరువాత కళ్యాణ చాళుక్యలకు సామంతులుగా నేటి తెలంగాణ



స్వయంభూ దేవాలయ శిధిలాలు, వరంగల్ కోట

ప్రాంతాన్ని పాలించారు. కాకర్త్య గుండన కుమారుడైన బేతరాజును చాళుక్య చక్రవర్తి అనుమకొండ విషయానికి (జిల్లాలాంటి భూభాగం) పాలకుడిగా నియమించాడు. ఇతని రాజ్యం వరంగల్ జిల్లా కొరవిసీమ నుండి కరీంనగర్ జిల్లా శనిగరం వరకు విస్తరించింది. తరువాత మొదటి ప్రోలరాజు గుణసాగరం, వేములవాడ ప్రాంతాల దాకా కాకతీయ రాజ్యానికి కలిపాడు. వేములవాడ పాలకుడైన భద్రగుడను చాళుక్యరాజును పారద్రోలి సబ్బిసాయిర (మెతుకు /మెదకు) మండలాన్ని ఆక్రమించాడు. ప్రోలరాజు కొడుకు, రెండో బేతరాజు పాలనలో ముదిగొండ చాళుక్య రాజ్యంలోని కొంతభాగం, సబ్బి సాయిర మండలం కాకతీయ రాజ్యంలో కలిసిపోయింది. రెండో బేతరాజు గొప్ప శివభక్తుడు. తన తండ్రి పేరున అనుమకొండలో ప్రోలేశ్వరాలయాన్ని నిర్మించాడు. విపత్కర పరిస్థితుల్లో సొంత అన్న దుర్గరాజును తొలగించి రెండవ ప్రోలరాజు తన ప్రభువైన రెండవ జగదేకమల్లుని ఆజ్ఞానుసారం కందూరు రాజ్యంపై దండెత్తాడు. తరువాత పొలవాస రాజ్యంపై రేచర్ల వంశ సామంతుడైన కామచమూపతితో విజృంభించి విజయం సాధించాడు. మేదరాజు, గుండరాజులను ఓడించి తెలంగాణ మొత్తాన్ని చాళుక్యుల ఆధీనంలోకి తేవడం ద్వారా సామంతుడుగా బలపడ్డాడు. తీరాంధ్రలోని పిఠాపురం చాళుక్యులకు సహకరించి వెలనాటి చోళులతో జరిగిన యుద్ధంలో హతుడైనాడు. ఓరుగల్లు కోటలో ఆరాధ్య దైవమైన స్వయంభూశివాలయాన్ని నిర్మించాడు.

## స్వతంత్రరాజులుగా కాకతీయులు

### రుద్రదేవ మహారాజు (క్రీ.శ. 1158-1195)

రెండవ ప్రోలరాజు కుమారుడైన రుద్రదేవుడు క్రీ.శ. 1158లో రాజ్యాధికారాన్ని చేపట్టాడు. స్వతంత్ర కాకతీయ రాజ్యాన్ని ప్రకటించుకొని పొలవాస ప్రాంతంపై అధికారాన్ని స్థాపించి గంగాధర మంత్రిని సబ్బిసాయిర మండలానికి సామంతునిగా నియమించాడు. కందూరు పాలకుడైన భీమదేవచోడుని జయించి అతని సోదరి పద్మావతిని పెళ్ళి చేసుకున్నాడు. ఈ యుద్ధంలో సహకరించిన రేచర్ల బేతిరెడ్డి, నామిరెడ్డి సోదరులను ఆమనగల్లు రాజ్యానికి, చెరుకు కేతసేనానిని, బొల్లయరెడ్డిని జమ్ములూరు రాజ్యానికి, కందూరు రాజ్యానికి భీమగోకర్ణుడుని సామంతులుగా నియమించాడు. పలనాటి హైహాయ యుద్ధంలో రుద్రదేవుడు నలగామ రాజుకు సహాయమందించి, అతనికి విజయాన్ని చేకూర్చాడు. తీరాంధ్రలోని కృష్ణానదికి ఇరువైపుల గల ప్రాంతాలను వెలనాటి రాజ్యంలోని కీలకప్రాంతాల పై జరిగిన దండయాత్రలలో చెరుకు, మల్యాల, రేచర్ల, విప్పర్ల, కొమురవెల్లి సామంత

దండనాయకులు పాల్గొన్నారు. క్రీ.శ.1195లో ఉత్తర సరిహద్దుల్లో నున్న యాదవ రాజులతో జరిగిన యుద్ధంలో రుద్రదేవుడు మరణించాడు. అప్పటికి ఉత్తరాన గోదావరి నది నుండి దక్షిణాన శ్రీశైలం వరకూ పడమర (బీదర్) బెదదకోట నుండి తూర్పున బంగాళాఖాతం వరకు కాకతీయ సామ్రాజ్యం విస్తరించింది. కాకతీయ సామ్రాజ్యం స్వాతంత్ర్యమునకు గుర్తుగా క్రీ.శ. 1162-63లో రుద్రదేవుడు హనుమకొండలో రుద్రేశ్వర, వాసుదేవ, సూర్యదేవులకు ఆలయాలను, మండపాన్ని కూడా నిర్మించాడు. 369 స్థంభాలున్న ఆ మండపం కళ్యాణ మండపంగానూ, వేయిస్థంభాల గుడి గానూ ప్రసిద్ధి పొందింది. తరువాత సోదరుడైన మహదేవుడు సింహాసనాన్ని అధిష్టించి దేవగిరి కోటను ముట్టడించినప్పుడు మరణించాడు. అతని కుమారుడైన గణపతి దేవుని యాదవరాజైన జైత్రపాలుడు బందీగా తీసుకెళ్లాడు.

### గణపతిదేవ మహారాజు (క్రీ.శ.1199-1262)

గణపతిదేవుడు బందీకాగా కాకతీయ రాజ్యంలోని సామంతుల విజృంభనను రేచర్ల రుద్రిరెడ్డిసేనాని చాకచక్యంగా అణచివేసి రాజ్యంలో శాంతిని నెలకొల్పాడు. ముదిగొండ చాళుక్య రాజైన నాగతి భూపాలుడు కొరవి ప్రాంతాన్ని ఆక్రమించడానికి పూనుకున్నాడు. వెలనాటి పృధ్వీశ్వరుడు మాండలిక రాజులతో కలిసి కాకతీయ రాజ్యభాగాలను ఆక్రమించి స్వాతంత్రాన్ని ప్రకటించుకొన్నాడు. మూడవ కుళుత్తోంగ చోళుడు కాకతీయ రాజ్యాన్ని ఆక్రమించాలని సామంతులను, మాండలీకులను జయించి ఓరుగల్లుకోటను ముట్టడించాడు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో రేచర్ల రుద్రసేనాని ఇతర సామంతుల అండదండలతో దండయాత్రను సమర్థవంతంగా అణచివేశాడు. అంతేకాకుండా రేచర్ల రుద్రసేనాని, విరియాల, మల్యాల, సామంతులతో కలిసి గణపతిదేవున్ని బంధవిముక్తున్ని గావించాడు. అనంతరం గణపతిదేవుడు ప్రతీకారంతో వెలనాటి పృధ్వీశ్వరున్ని ఓడించి, అయ్య వంశీయుడగు పినచోడరాజును సామంతునిగా నియమించాడు. అతని కుమార్తెలైన నారమ, పేరమలను గణపతి దేవుడు వివాహం చేసుకొన్నాడు. అతని కొడుకు జాయపను తన కొలువులో గజసైన్యాధ్యక్షుడిగా నియమించాడు. నెల్లూరు రాజ్యపోరులో తిక్కభూపాలునికి సైన్యసహాయం చేసి, నల్లసిద్ధిని తరిమికొట్టి సింహాసనంపై తిక్కభూపాలుని అధిష్టింపజేశాడు. అందుకు కృతజ్ఞతగా తిక్కభూపతి కడప మండలాన్ని కాకతీయ రాజ్యంలో విలీనం చేశాడు. గణపతిదేవుడు ఈ ప్రాంతానికి కాయస్థ గంగయ సాహినిని సామంత పాలకుడిగా నియమించాడు. రేచర్లరుద్రుని మంత్రియగు రాజానాయకుని నేతృత్వంలోని ఇందులూరి సోమన సహకారంతో గోదావరి ప్రాంతంలోని కొలను (కొల్లేరు) కోన

చాళుక్య, కళింగ రాజ్యాలను జాయపసేనాని కాకతీయ రాజ్యంలో విలీనం చేయగా ఆ ప్రాంతానికి ఇందులూరి సోమనను సామంతుడిగా నియమించాడు. చాళుక్య ఇందుశేఖరుడి కుమారుడైన వీరభద్రునికి రుద్రమదేవినిచ్చి వివాహం చేసి కొలనుపాక రాజ్య పాలకుడిగా నియమించాడు. విపత్కర పరిస్థితుల్లో నెల్లూరు మనుమసిద్ధి రాజ్యాన్ని కోల్పోగా, ఆస్థానకవియైన తిక్కన సోమయాజి గణపతిదేవుని సహాయంతో మనుమసిద్ధికి తిరిగి రాజ్యాన్నిప్పించాడు. తరువాత, తమిళదేశంపై దండయాత్రచేసి కాంచీపురాన్ని ఆక్రమించి సామంతభోజుడిని పాలకుడిగా నియమించాడు. అదినచ్చని జటావర్మ సుందరపాండ్యుడు, సామంతభోజున్ని తొలగించి విజయగండ గోపాలున్ని నియమించాడు. నెల్లూరు పాలకుడైన మనుమసిద్ధిని పాండ్యులకు సామంతులుగా ఉండమని ఒత్తిడిచేశాడు. మనుమసిద్ధి ఈ విషయాన్ని గణపతిదేవునికి తెలియజేయగా కాకతీయ సైన్యం పాండ్యుల సేనాని కొప్పెరుంజింగనిపై యుద్ధాన్ని ప్రకటించి ఓడించారు. ఈ వార్త తెలిసిన జటావర్మ సుందరపాండ్యుడు సైన్యంతో నెల్లూరును ముట్టడించగా, ముత్తుకూరు వద్ద పాండ్య, కాకతీయ సేనలకు జరిగిన యుద్ధంలో మనుమసిద్ధి మరణించాడు. జటావర్మ సుందరపాండ్యుడు కాంచీనగరంలో పట్టాభిషేకం చేసుకొన్నాడు.

### రుద్రమదేవి (క్రీ.శ.1262-1289)

రుద్రదేవ మహారాజు పేరుతో క్రీ.శ. 1259లో పాలనాధికారం చేపట్టి తండ్రి గణపతిదేవుని మరణానంతరం క్రీ.శ. 1262లో పట్టాభిషేకం జరుపుకున్నట్లు గుంటూరు జిల్లా మల్కాపురం మందడం శాసనంలో ఉంది. ముత్తుకూరు యుద్ధ పరాజయంతో కాకతీయ సైన్యం పేరు ప్రతిష్టలు మసకబారాయి. దానికితోడు స్త్రీ పరిపాలన సహించని సామంతుల నుండి, దాయాదుల నుండి ప్రతిఘటన ఎదుర్కోవలసి వచ్చింది. దేవగిరి యాదవ మహాదేవుడు కాకతీయ రాజ్యంపై దండెత్తి వరంగల్ కోట ముట్టడికి యత్నించగా, యాదవరాజును బంధించి సైన్యాన్ని రాజ్య సరిహద్దుల వరకు తరిమివేసి బీదర్ కోటను ఆక్రమించుకొని భైరవున్ని తన ప్రతినిధిగా నిలిపింది. తరువాత, మహాదేవుడు యుద్ధపరిహారం క్రింద కోటి నిష్కాలు చెల్లించి సంధిచేసుకొన్నాడు. కడప



రుద్రమదేవి

ప్రాంతంలో వైదుంబరాజగు కేశవదేవ, సోమిదేవులను ఓడించి పూర్వపు కాయస్థ రాజ్యాన్ని ఆక్రమించింది. కాయస్థ అంబదేవుడు పాండ్యుల సహకారంతో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించదలచి కాకతీయ రాజ్యభాగాలపై దండెత్తాడు. ఈ తిరుగుబాటును అణచడానికి రుద్రమదేవి క్రీ.శ. 1289లో స్వయంగా నాయకత్వం వహించి అంబదేవున్ని ఎదుర్కొంది. ఈ యుద్ధంలో కాకతీయ సైన్యంతో పాటు మహారాణి రుద్రమ, అంగరక్షకుడైన మల్లికార్జున నాయకుడు చనిపోయినట్లు నల్లగొండ జిల్లా చందుపట్ల శాసనం తెలియజేస్తుంది. విశాల సామ్రాజ్యాన్ని సమర్థవంతంగా ప్రజారంజకంగా పాలించిన రుద్రమదేవి తెలుగుమహిళాలోకానికి ఆదర్శప్రాయురాలైంది.

### ప్రతాపరుద్రుడు (క్రీ.శ.1290-1323)

రుద్రమదేవి మరణానంతరం ఆమె మనుమడైన ప్రతాపరుద్రుడు రాజ్యాధికారాన్ని చేపట్టాడు. కాకతీయ రాజ్యపతనాన్ని కోరిన యాదవులు, పాండ్యులు, అంబదేవులను అణచివేయడానికి సైన్యాన్ని పటిష్టపరచి నాయంకర విధానాన్ని ప్రోత్సహించాడు. అంబదేవుడు, యాదవులు, పాండ్యులపై ఒకే సారి దండయాత్రకు వ్యూహం పన్నాడు. ఇందులూరి అన్నయ అంబదేవుని ఎదుర్కొని వల్లూరు, గండికోటల దండయాత్రతో పాటు యాదవ, పాండ్యుల రాజ్యాలు ఒకే పర్యాయం ముట్టడించాడు. అంబదేవుడు యుద్ధాన్ని ఎదిరించలేక ఓడిపోయి చనిపోయాడు. అడిదం మల్లు సేనాని నెల్లూరు పాలకుడైన మనుమగండ గోపాలున్ని చంపి దక్షిణాంధ్రను కాకతీయ రాజ్యంలో విలీనం చేశాడు. కాకతీయ రాజ్యంలో గోనవంశీయులు ప్రముఖపాత్ర పోషించారు. గోన గన్నారెడ్డి వర్ధమానపురం పాలకుడిగా నియమించబడినాడు. యాదవులు ఆక్రమించిన అదవాని, తుంబళం, రాయచూరు దుర్గాలపై గోనగన్నారెడ్డి సోదరుడైన గోనవిఠలుడు దండయాత్ర చేసి కాకతీయ రాజ్యంలో విలీనం చేశారు.




మహమ్మద్ బీన్ తుగ్లక్

### ముస్లింల దండయాత్రలు

ఢిల్లీ సుల్తాన్ అల్లావుద్దీన్ ఖిల్జీ రాజ్యకాంక్షతో దక్షిణాది రాజ్యాలను కబళించ దలచి క్రీ.శ. 1303లో మాలిక్ ఫక్రుద్దీన్ జునా నాయకత్వంలో పెద్ద సైన్యాన్ని ఓరుగల్లు ముట్టడికి పంపగా కాకతీయ సేనాని పోతుగంటి మైలి, నేటి కరీంనగర్ జిల్లాలోని గొడిశాల (ఉప్పరపల్లి) ప్రాంతంలో జరిగిన యుద్ధంలో ముస్లిం సేనలు ఓడి పారిపోయాయి. క్రీ.శ. 1309లో రెండోసారి మాలిక్‌కాఫర్ నాయకత్వంలో కాకతీయ రాజ్య భాగమైన సిర్పూరు దుర్గం జయించి, అనుమకొండ పట్టణాన్ని స్వాధీనపర్చుకొని ఓరుగల్లు కోటను ముట్టడించి నెలరోజుల తరువాత అగడ్తను దాటి మట్టికోటలోనికి ప్రవేశించారు. ప్రతాపరుద్రుడు సేనల్లో ఉత్సాహం నింపి యుద్ధోన్ముఖులను చేస్తూ, తురుష్క సేనలను కంచుకోట వైపు రాకుండా నిలువరించగలిగాడు. అసహనానికి గురైన మాలిక్ కాఫర్ కోటలోకి ఆహారపదార్థాలు రాకుండా పరిసర గ్రామాలపై దోపిడీ చేసి తగులబెట్టాడు. ఈ దుర్మార్గాలను, ప్రజల బాధలను విన్న ప్రతాపరుద్రుడు మాలిక్ కాఫర్‌తో సంధి చేసుకొని ఆరువేల ధనం, వంద ఏనుగులతోపాటు ప్రతి యేటా కప్పం చెల్లించేందుకు అంగీకరించాడు.

ఢిల్లీలో ఘియాజుద్దీన్ తుగ్లక్ రాజ్యాధికారాన్ని చేపట్టి దక్షిణ దేశాల్లో కప్పం వసూలుకై కుమారుడైన ఉలుగ్‌ఖాన్‌ను పంపగా ప్రతాపరుద్రుడు సంధిని అతిక్రమించినందున కాకతీయరాజ్యంలోని బీదర్ కోటను ముట్టడించాడు. తరువాత ఓరుగల్లు దుర్గం ముట్టడికి యత్నించగా ఐదు నెలలు గడిచినా కోటవశం కాలేదు. ఉలుగ్‌ఖాన్ మిత్రుడు, జ్యోతిష్కుడైన ఉబేదు కోటవశం అయ్యే తేదీని నిర్ణయించాడు. కాని ఆ తేదీలోగా కోట వశం అయ్యే సూచనలు కనిపించనందున ఉబేదు ఘియాజుద్దీన్ తుగ్లక్‌ను దుండగులు సంహరించారనే వదంతిని పుట్టించాడు. ఉలుగ్‌ఖాన్ యుద్ధం ఆపేసి హుటాహుటిన ఢిల్లీచేరాడు. ఈ మోసాన్ని గ్రహించిన ఉలుగ్‌ఖాన్ కొంత కాలం తరువాత మరలా ఓరుగల్లు కోట ముట్టడి చేపట్టగా ఈ హఠాత్పరిణామాన్ని జీర్ణించుకోలేని ప్రతాపరుద్రుడు సైన్యాన్ని అప్రమత్తం చేయలేకపోయాడు. ఇదే అదనుగా ఉలుగ్‌ఖాన్ కోటను



స్వయంభూ దేవాలయ శిథిలాలు, వరంగల్ కోట

ముట్టడించి వేలకొలది సైన్యాన్ని చంపి భయానక వాతావరణం సృష్టించి కోశాగారం కొల్లగొట్టి ప్రతాపరుద్రున్ని బందీగా చేపట్టి ఢిల్లీకి తీసుకొనిపోయేప్పుడు ఆత్మాభిమానియైన ప్రతాపరుద్రుడు కారాగారం కన్నా ప్రాణత్యాగం మిన్నగా భావించి నర్మదానది తీరాన తనువుచాలించాడు.

**ఓరుగల్లు**

కాకతీయుల రాజధాని మొదట్లో హనుమకొండ కదా. తర్వాత ఓరుగల్లుకు రాజధానిని మార్చారు ఎందుకని ? అనే అనుమానం చాలా మందికి కలుగుతుంది. రెండో ప్రోలరాజు రాజ్యాన్ని పాలిస్తున్న కాలంలో ధాన్యరాసులను బస్తాలకెత్తి బళ్ల మీద ఇళ్లకు చేరుస్తుండగా ఒక బండి చక్రం నేలలో కూరుకుపోయింది. గ్రామస్తులంతా కలిసి ఎలాగో అతికష్టంమీద, చక్రాన్ని బయటకు లాగారు. అలా లాగిన చక్రం బంగారంలా మెరిసి పోతుండటంతో గ్రామస్తులందరూ ఆశ్చర్యపోయారు. ఈ వార్తను ప్రోలరాజు చెవిన వేశారు. ప్రోలరాజు ఈ వింత చూడ్డానికి వచ్చాడు. ప్రోలరాజు చూస్తుండగానే చక్రం దిగబడిన చోట బంగారు కాంతులు వెదజల్లుతూ ఒక శివలింగం పుట్టుకొచ్చింది. ఈ అపురూపమైన శివలింగాన్ని రాజధానిలో ప్రతిష్టించాలనుకున్నాడు ప్రోలరాజు, కానీ ఆ శివలింగాన్ని ఎవరూ అక్కడ నుండి కదిలించలేక పోయారు. దాంతో రామారణ్య శ్రీపాదుల వారనే ప్రసిద్ధ యోగి సలహా అడిగారు. అతను ఈ శివలింగం అత్యంత మహిమ కలదని, ఈ శివలింగానికి తగిలితే ఇనుమైనా బంగారంగా మారుతుందని, కాబట్టి అక్కడొక ఆలయాన్ని నిర్మించమని చెప్పాడు. అంతే కాకుండా భవిష్యత్తులో ఆలయం చుట్టూ పెద్ద పట్టణం ఏర్పడి, "ఓరుగల్లు" గా ప్రసిద్ధి చెందుతుందని, లింగానికి ఎటు చూసినా ఆమడ దూరం ఉండేటట్లు కోటకట్టించమని, అలా ఏడు కోటలు కట్టిస్తే కాకతీయ వంశం 300సంవత్సరాల పాటు దేదీప్యమానంగా వెలుగొందుతుందని చెప్పాడు. రెండో ప్రోలరాజు వెంటనే ఆ ప్రదేశంలో ఆలయం నిర్మించాడు. ఇదే స్వయంభూ దేవాలయంగా ప్రసిద్ధి గాంచింది. స్వయంగా శివలింగం ఆవిర్భవించటం వల్ల దానికా పేరు వచ్చింది. నేడు నాలుగు కీర్తితోరణముల మధ్యలోనున్న శిధిల శిల్పసంపద నాటి దేవాలయ సముదాయానిదే.

**సామ్రాజ్యం - పాలనా యంత్రాంగం:**

ప్రభుత్వ పాలనా వ్యవహారాలలో రాజు సర్వ స్వతంత్రుడు. పరిపాలనా విషయాలలో రాజుకు సహకరించుటకు మంత్రి మండలి ఉండేది. అమాత్య, మహామాత్య, మంత్రి, దండనాయక, అశ్వసాహిణి, గజసాహిణి, సర్వసైన్యాధ్యక్ష,

సామంత మండలీకులు, మహాసామంత మండలీకులు, బహత్తర నియోగాధిపతి వంటి వారు మంత్రులుగా బాధ్యతలు నిర్వర్తించేవారు. రుద్రదేవుని నీతిసారం, బద్దెన నీతి శాస్త్ర ముక్తావళి శివదేవయ్య పురుషార్థసారం వంటి గ్రంథాల ఆధారంగా పరిపాలన నిర్వహించబడేది. మంత్రి పదవులను తీర్థములనేడి వారు. నాడు మంత్రివర్గ సభ్యులు 18 నుండి 21 మధ్యన ఉండేది. మంత్రులను కులము ప్రాతిపదికగా కాకుండా సమర్థత ఆధారంగా నియమించబడినట్లు వెల్లంకి గంగాధర మంత్రి చిన్న స్థాయి ఉద్యోగం నుండి అమాత్య పదవిని పొందడం చక్కని ఉదాహరణ. రాజ్యం నందు అమాత్యులుగా ఉండి సైన్యాధ్యక్షులుగాను, సామంత పాలకులుగా బాధ్యతలను కూడా ఏకకాలంలో నిర్వహించారు. గణపతి దేవుని పాలనలో మల్యాల హేమాద్రిరెడ్డి, విశ్వేశ్వర శివదేశికులు, రేచర్ల రుద్రిరెడ్డి మరియు కాయస్థ గంగయసాహిణి వంటి మహామాత్యులు సామంత బాధ్యతలను కూడా నిర్వహించారు. రుద్రమదేవి సామంతులైన ఇందులూరి అన్నయ, మహాప్రధాని పొంకల మల్లయ్య ప్రెగ్గడ, రేచర్ల కాటసేనాని, ప్రసాదిత్యనాయక, వంటి వారు సైన్యాధ్యక్ష పదవులు ఏకకాలంలో సమర్థవంతంగా నిర్వహించినట్లు అదే కాలంలో పొన్నయ ప్రధాని, గజసాహిణిగా కూడా నున్నట్లు సదర్‌షాపూర్ శాసనం తెల్పుతుంది. ప్రతాప రుద్రుని సామంతులైన కొలను సోమయ, ముప్పిడినాయక, బొల్ల సేనాని, జుట్టయలెంక గొంకారెడ్డి వంటి వారు మహా ప్రధానులుగా దండనాయకులుగా, లెంకలుగా పనిచేశారు. పాలనావ్యవహారాలను నిర్వహించడానికి 72శాఖలతో ఉద్యోగులు బాధ్యతలు నిర్వహించారు. వీటిని బాహత్తర నియోగాలు అనేవారు. గణపతి దేవ మహారాజు సామంతుడైన కాయస్థ గంగయసాహిణి, రుద్రమదేవి సామంతుడైన కాయస్థ జన్నిగదేవుడు, త్రిపురాంతక దేవుడు, పొంకలమల్లయ్య ప్రెగ్గడ వంటి యోధులను బహత్తర నియోగాధిపతులుగా నియమించారు.

**ప్రాంతీయ పాలన- సామంత మాండలిక వ్యవస్థ**

కాకతీయ సామ్రాజ్యం పరిపాలనా సౌలభ్యం కొరకు మండలములుగా, నాడులుగా, స్థలములుగా, సీమలుగా విభజించారు. మండల పాలన వ్యవహారములను మహాసామంతాధిపతులు, సామంతులు, మహామండలేశ్వరులు నిర్వహించారు. కాకతీయుల సామంత పాలకులు పరిమిత స్వేచ్ఛతో కూడిన వికేంద్రీకరణ పాలనను కొనసాగించినట్లు శాసనాలు తెలుపుతున్నాయి.

కాకతీయ సామ్రాజ్యం స్థాపన ఆరంభం నుండి మహాసామ్రాజ్యంగా అవతరించే వరకు సమర్థులైన సామంత మాండలీకులు వెన్నుదన్నుగా నిలిచారు.

రేచర్ల రుద్రసేనాని, రేచర్ల ప్రసాదిత్య (వెలమ) నాయక రాజ్య రక్షణ కోసం అహర్నిశలు శ్రమించారు. విశాలమైన సామ్రాజ్య పరిపాలనలో రేచర్ల, చెరకు, మల్యాల, విరియాల, నతవాడి, కోట, ఇందులూరి, గోన, కాయస్థ, చాళుక్య, వెలమ వంశీయులు, గండికోట,వెంగినాడు, కమ్మనాడు, ములికినాడు, సబ్బిసాయిర మండలం, అనుమకొండ విషయ మొదలగు ప్రాంతాలకు సామంతులుగా వ్యవహరిస్తూ సామ్రాజ్యంలోని రాజ్య వ్యవహారాలలో కీలక పదవులలో కొనసాగారు. సామంత రాజులు కూడా తమ పాలనా విభాగాలపై పరిమిత స్వేచ్ఛ కల్పించబడినందువలన తాము వారి రాజధాని నగరాలలో కోటలు లేదా దుర్గములుగా నిర్మించి సైనికంగా సామ్రాజ్యాన్ని పటిష్టపరిచారు.

## నాయంకర వ్యవస్థ

కాకతీయ రుద్రమదేవి చివరిపాలనకాలమున సామంతమాండలీకుల నుండి సమర్థులైన నాయకులను ఎంపిక చేసి మారుచున్న సైనిక, రక్షణ అవసరాల దృష్ట్యా విస్తరిస్తున్న ఢిల్లీ సల్తనత్‌ల నుండి రాజ్య రక్షణలో భాగంగా పాలనావ్యవస్థను, రేచర్ల ప్రసాదిత్య నాయకుని సహకారంతో నూతన సైనిక విధానమైన నాయంకర విధానాన్ని ప్రయోగాత్మకంగానూ, ప్రతాపరుద్రుడు పూర్తి స్థాయిలోనూ అమలుపరిచారు.

సామంతులకు, సేనాపతులకు జీతాలకు బదులుగా వారి సేవలకు ప్రతిఫలంగా గ్రామాలను ఇచ్చారు. ఇలా పొందిన గ్రామాలపై వచ్చే ఆదాయంతో సైన్యాన్ని పోషించి రాజుకు యుద్ధసమయాలలో సైన్యాన్ని సమాయత్తపర్చడమే కాక తానుకూడా పాల్గొనే నిబంధనలతో కూడిన సైనిక విధానమే నాయంకర విధానం. ఈ విధానం ద్వారా భూములు పొందిన వారిని నాయకులుగా వారి పాలనావిభాగాన్ని నాయంకరంగా పిలిచారు. నాయంకర భూభాగాలు శాశ్వతంగా కాకుండా సమర్థత ఆధారంగా రాజు విశ్వాసం ఉన్నంతకాలం ఇవ్వబడేవి. వీరి పరిధిలోని భూభాగాలపై భూమి శిస్తుతో పాటు ఇతర పన్నులు వసూలు చేసి రాజు ఖజానాకు జమచేసేవారు. రాజ్యంలో 77 మంది నాయంకరులున్నట్లు 4వ వంతు భూభాగం వీరి ఆధీనంలో ఉన్నట్లు ప్రతాప చరిత్ర ద్వారా తెలియుచున్నది. ప్రతాపరుద్రుడు రాజ్యాన్ని నాయక స్థలాలుగా విభజించి ఎక్కువ సంఖ్యలో పద్మనాయకులకు అప్పగించినట్లు, పరిమితంగా మల్యాల, విప్పర్ల, కొమురవెల్లి నాయకులకు కేటాయించినట్లు శాసనాలు తెలుపుచున్నవి. ఒక్కొక్క నాయంకర పాలకుడు ఓరుగల్లు కోట యొక్క ఒక్కో బురుజు రక్షణ బాధ్యతలు కూడా నిర్వహించేవారు.

## లెంకలు

రాజు యొక్క అంగరక్షణ, వ్యక్తిగత సేవల బాధ్యతలు నిర్వహించే నాయకులను లెంకలు అనేవారు. కాకతీయశాసనాలలో లెంక పదవిని పొందిన వారి ప్రస్తావన కనబడుతుంది. వీరిలో జుట్టయ లెంక గొంకారెడ్డి ముఖ్యుడు. లెంకలు కూడా నాయంకర గ్రామాలు పొంది సైన్యపోషణ చేసేవారు. మాయిదేవ లెంక 18 గ్రామాలతో కూడిన కొండూర (తెనాలి) స్థలమును పొందినాడు. కొప్పెరం నాయంకర స్థల నలుగురి లెంకలకు తిక్కయ్య, రుద్రరాయ లెంక, మారయలెంక, పిచ్చయలెంక, రుద్రయ్య లెంక సేవలకు ప్రతిఫలంగా ఇవ్వబడినట్లు శాసనాలు తెలుపుతున్నాయి.

## గ్రామ పాలన

గ్రామాలు స్వయంసమృద్ధమై సాంప్రదాయ పరిపాలనా వ్యవస్థను కలిగియుండెను. గ్రామపరిపాలన ఆయగార్లు నిర్వహించే వారు. **కరణం, పెదకాపు లేదా రెడ్డి, పురోహిత, తలారి, కమ్మరి, కంసాలి, వడ్రంగి, కుమ్మరి, చాకలి, మంగళి, వెట్టి, చర్మకారుడు** మరియు నీరుకటుతో పాటు గ్రామోద్యోగి గ్రామ పాలన వ్యవహారాలను పర్యవేక్షించేవాడు. **కరణం, రెడ్డి, తలారి, నీరుకట్టులకు** ప్రభుత్వాధికారులతో ప్రత్యక్ష సంబంధాలుండేవి. ఆయగార్ల సేవలకు ప్రతిఫలంగా వ్రిత్తి మాన్యాలతోపాటు పంటలో ధాన్యం **మేరలు** రైతుల నుండి పొందేవారు. వీరు వంశపారంపర్యంగా తమ పదవులు పొందే అవకాశం ఉండేది. ఆయగార్లు గ్రామ సేవకులే గాని గ్రామాధికారులు కారు. అగ్రహారాలలో, దేవాదాయ, గ్రామాలలో ఆయగార్లు గ్రామస్థులకు, అలయాలకు లోబడి బాధ్యతలు నిర్వర్తించేవారు. పలనాటి సీమలోని సన్నిగండ్ల గ్రామ శాసనమున కరణము కొలగాడు భూమిని కొలచి సరిహద్దులు నిర్ణయించి భూసారం ఆధారంగా పన్నులు విధించి, గ్రామ బాధ్యతలు ప్రశంసనీయంగా నిర్వహించినట్లు శాసనం తెలుపుతుంది.

**క్రీ.శ. 1313 నాటి ప్రతాపరుద్రుడి శ్రీశైలం శాసనం ఆధారంగా పాలనా విభాగాలు, అధికారులు:**

| పాలనా విభాగం | అధికారి | ప్రాంతాల పేర్లు, విభాగం |
|---|---|---|
| నాడు | అమాత్య లేదా ప్రెగ్గడ | కన్నాడు,కమ్మనాడు, ఐజనాడు,సబ్బినాడు, వెంగినాడు, వెలనాడు మొ॥ |
| స్థలము | స్థలకరణం, స్థలసుంకరి, | గురిందల స్థల, మగతలస్థల, |

| | | |
|---|---|---|
| | స్థల తీర్పరి | గంగాపురస్థల, నాందేంఢ్ల స్థల మొ॥ ఇవి 20-60 గ్రామాలు కలిగియుండేవి |
| గ్రామము | ఆయగార్లు, 12 మంది (కరణం, రెడ్డి, తలారి మొ॥) | భాండారా గ్రామాలు బ్రహ్మదేయ గ్రామాలు, నాయంకర గ్రామాలు |

**సాంఘిక, మత పరిస్థితులు**

కాకతీయులు మొదట జైనమతాన్ని ఆదరించారు. వీరి కులదేవతగా చేప్పబడే 'కాకతి' కూడా జైనదేవతయని పండితుల అభిప్రాయం. స్వతంత్ర పాలకులైన తరువాత శైవమతాన్ని ఆదరించి రాజ్యమతంగా వ్యాప్తిచేశారు. గణపతిదేవుడు గురువైన విశ్వేశ్వరశివాచార్యుడు వద్ద దీక్ష పొంది పాశుపత శైవమతాన్ని వ్యాప్తిచేసి వీరశైవాన్ని అదుపులోనుంచాడు. వీరు పరమశైవులైనప్పటికి మత సహనాన్ని పాటించి దేవాలయ నిర్మాణాలలో వైష్ణవాలయాల నిర్మాణానికి కృషి చేశారు. సమాజంలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే నాలుగు వర్ణాల వ్యవస్థ కొనసాగింది. బ్రాహ్మణులు వెలనాటి, వెంగీనాటి, ముల్కినాటి వారని ప్రాంతాల ఆధారంగా పిలువబడినారు. బ్రాహ్మణులు, అమాత్యులుగా, సామంతులుగా నియమించబడి, రాజ్యపాలనలో ప్రముఖపాత్ర పోషించారు. వృత్తుల ఆధారంగా అనేక ఉపకులాలు ఏర్పడ్డాయి. ఈ కాలంలోనే సత్శూద్ర కుటుంబాలలో రెడ్లు, వెలమలు, కమ్మవారు సమాజంలో ప్రధానపాత్ర పోషించారు. వీరితోపాటు తెలిక, సాలె, బలిజ మొదలగు కులాలవారు నూనె, చెనేత, లోహం వంటి పరిశ్రమల్లో పనిచేస్తూ వైశ్య సంఘాలవలే వృత్తి సంఘాలుగా ఏర్పడి తమ సంక్షేమానికి కృషి చేశాయి. కులసంఘాలు పద్దెనిమిది సమయములుగా, ఊరుసమయము, స్థలసమయములుగా పిలువబడినాయి.

**ఆర్థిక పరిస్థితులు**

వీరి పాలనలో రాజ్యం సిరిసంపదలతో తులతూగినట్లూ విదేశీయుల రచనలబట్టి తెలుస్తుంది. వ్యవసాయం నాడు ప్రధాన వృత్తి అయినందున రాజులు, సామంతులు పెద్దపెద్ద చెరువులు, కాలువలు తవ్వించి నీటిపారుదల సౌకర్యాలు వృద్ధి చేశారు. రాజ్యానికి భూమిశిస్తు, వాణిజ్యపన్నులు ప్రధానాదాయ వనరులు కాగా పశ్చికబయల్లు, దరిశనం, అప్పనం, ఉపకృతి వంటి పన్నులు కూడా వసూలు చేశారు. బ్రాహ్మణుల అగ్రహారాలపై నామమాత్రంగా శిస్తు విధించారు. ఓరుగల్లు ప్రాంతంలో సువాసనలీనే బియ్యాన్ని, గోధుమలు, వరి, చెఱుకు విస్తారంగా పండించారు. నాడు

ప్రతి గ్రామంలో బెల్లం, పంచదార, నూనె పరిశ్రమలు సర్వసాధారణం. కలంకారి, నేతవస్త్రాలు, రత్నకంబళ్ళు, మఖ్మల్ వస్త్రాలకు ప్రపంచ ప్రసిద్ధి పొందింది. నిర్మల్ కత్తులకు, గొలకొండ వజ్రాలకు ప్రధాన వర్తక కేంద్రాలు. దేశీయ, విదేశీయ వాణిజ్యం ఉచ్ఛస్థితిలో ఉండెను. పానగల్లు, అలంపూర్, మాచర్ల, త్రిపురాంతకం, పెద్దగంజం, ఘంటసాల నాటి ప్రధాన వర్తక కేంద్రాలు. మోటుపల్లి, మచిలీపట్నం రేవుల ద్వారా విదేశీ వాణిజ్యం జరిగేది.

**గణపతి దేవుని క్రీ.శ. 1244 నాటి మోటుపల్లి అభయ శాసనం**

ఓడ దొంగలు, స్థానిక పాలన చేసే నాయకులతో కలిసి నౌకా వ్యాపారులను దోచుకొని పీడింపబడుచున్నారని గ్రహించిన గణపతి దేవుడు దేశాంతర, ద్వీపాంతర, నౌకా వ్యాపారం చేసుకునే వారికి రక్షణ కల్పించే నిమిత్తం ఎగుమతి, దిగుమతి వస్తువులపై నామమాత్రపు సుంకం విధిస్తూ వీరభద్రేశ్వర దేవాలయంలో అభయశాసనం వేయించాడు. విదేశీ వ్యాపారాభివృద్ధి కోసం కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తూ చేసిన చట్టాన్ని వ్యాపార నిబంధనలు పటిష్టంగా అమలు చేయుటకు సిద్ధయ దేవుడు అనే సేనానిని నియమించినట్లు ఈ శాసనం తెలుపుతుంది. నాడు ఈ పట్టణం దేశీయకొండ పట్టణంగా పేర్కొనబడింది. సాధారణంగా ఎగుమతి, దిగుమతికి గాను అన్ని వస్తువులపై ముప్పదిలో ఒక వంతు సుంకం విధించేవారు. విలాసవస్తువులైన రత్నాలు, ముత్యాలు, దంతాలు, పట్టు, నూలు చీరెలు మొదలగు వస్తువుల విలువలను బట్టి సుంకం విధించారు.

**మార్కోపోలో ప్రశంస**

రుద్రమదేవి పాలన చివరి కాలంలో కాకతీయ సామ్రాజ్యాన్ని క్రీ.శ.1293లో సందర్శించిన ఇటలీ దేశ యాత్రికుడు మార్కోపోలో మోటుపల్లి రేవు నుండి ఎగుమతి అయ్యే వజ్రాలు, సున్నితమగు నూలువస్త్రాలు సాలెపురుగుదారం కంటే సన్నని నూలుతో నేయబడినవని నాగరిక దేశాలలోని రాజులు, రాణులు ఈ వస్త్రాల పట్ల మోజుపడేవారని నాటి హస్తకళా నైపుణ్యాన్ని ప్రశంసించాడు.

**ప్రజోపయోగ కార్యకలాపాలు - చెరువుల నిర్మాణం:**

కాకతీయ ప్రభువులు, వారి సామంత, మాండలీకులు వ్యవసాయ ప్రాధాన్యతను గుర్తించి చెరువుల నిర్మాణం చేపట్టారు. ఈనాటి తెలంగాణ, రాయలసీమల్లో తరచుగా కరువుకుగురయ్యే ప్రాంతాల్లో వృధాగాపోయె వర్షపు నీటికి ఎత్తైన కొండలను కలుపుతూ మట్టికట్టలేసి పెద్దపెద్ద చెరువులను కట్టారు. వీటిని

సముద్రములు, సాగరములు చెరువులు, కుంటలు అనేవారు. మొదటి ప్రోలరాజు కేసరి సముద్రమనే చెరువును నిర్మించాడు. అదే నేడు వరంగల్ జిల్లాలోని కేసముద్రంగా పిలువబడుతోంది. రెండవ బేతరాజు అనుమకొండలో శివపుర అను చెరువును త్రవ్వించి వరుణ ప్రతిష్ట చేశాడు. గణపతి దేవుని కాలంలో సామంతులైన రేచర్ల, విరియాల, మల్యాల వంశస్థులు రామప్ప, పాకాల, లక్నవరం, ఘనపురం చెరువులను, చౌడ సముద్రం, గణవ సముద్రం, కుప్ప సముద్రం, నామనసముద్రం, విశ్వనాధసముద్రం, గౌర సముద్రం, బుద్ధునికుంట, పోలిరెడ్డి కాలువ, మూసేటికాలువ, కుడికుడి కాలువలను నిర్మించినారు. గణపతి దేవుని కాలంలో నెల్లూరు, గంగాపురం, ఏలూరు ప్రాంతాల్లో చెరువులు తవ్వారు. గణపతి దేవుని సోదరి మైలమ కొటగడ్డలో బయ్యారం చెరువును త్రవ్వించి తమ వంశానుక్రమణికను తెలుపుతూ శాసనం వేయించింది. ప్రతాపరుద్రుని కాలంలో సిరిలింగరాజు, వీడెలు కొమ్మయ్యలు కర్నూలు జిల్లాలో అడవులను నరికించి వ్యవసాయాభివృద్ధికి పాటుపడినారు. చెరువుల నిర్మాణాన్ని సప్త సంతానాల్లో ఒకటిగా భావించి తమ పూర్వీకుల పుణ్యలోక ప్రాప్తికొరకు నిర్మించినట్లు శాసనములు తెలుపుతున్నాయి. కాకతీయులు చెరువుల నిర్మాణానికి అణువైన స్థలాలను ఎంపిక చేసి అక్కడ ఒక దేవాలయం, ఒక పట్టణం, ఒక చెరువు (టెంపుల్, టాంక్, టౌను) నిర్మించినట్లు నేటికినీ నిలిచియున్న నిర్మాణాలు తెలియజేస్తున్నాయి.

చెరువులతో పాటు బావులు కూడా నిర్మించారు. గూడూరు శాసనంలో మల్లయ సేనాని, హన్మకొండ శాసనంలో మల్యాల కాట సేనాని బావులు తవ్వించి, నీటి యంత్రాలను, ఎతాంలను ఏర్పరిచినట్లు తెలుపుతున్నాయి. కపిలె, రాట్నం, ఎద్దులతో నీరును తోడి, పంట పొలాలకు అందించినట్లు దోసపాడు శాసనం తెలుపుతుంది. కాకతీయులు ఒక చెరువు నిండిన తరువాత మిగులు నీరు మరో చెరువుకు పోయేట్లు జాగ్రత్తలు తీసుకొన్నారు. వ్యవసాయాభివృద్ధికి లెక్కలేనన్ని సేద్యపు నీటి వనరులను కల్పించారు.


### సాహిత్యం

మొత్తం తెలుగు నేలపై ఏకచ్ఛత్రాధిపత్యం వహించిన కాకతీయులు సుమారు 300 సంవత్సరాల పాటు తెలుగు భాష, సంస్కృతి, కళారంగాలను పోషించారు. రాజులు, సామంతులు, మండలాధీశులు సాహిత్య రంగానికి ప్రోత్సాహాన్నందించారు. విద్యాభూషణ కాకతీయ రుద్రదేవుడు స్వయంగా కవి, నీతిసారమనే రాజనీతి గ్రంథాన్ని

రాశాడనే ప్రతీతి. అచించేంద్ర, నంది, అనంతసూరి వంటి శాసనకవులు వీరి కాలం వారే. గణపతి దేవుని పాలనా కాలంలో జాయపసేనాని **నృత్యరత్నావళి** గ్రంధాన్ని రాశాడు. గోన బుద్ధారెడ్డి తెలుగులో **ద్విపద రంగనాథ రామాయణం** రచించాడు. శివదేవయ్య రాసిన **పురుషార్థసారం** తెలుగులో నీతిశాస్త్ర గ్రంథంగా ప్రశంసలందుకొంది.

**దేవాలయాలు**


శాతవాహనుల తరువాత తెలుగు మాట్లాడే వారి ప్రాంతాలన్నీ ఏకంచేసిన కాకతీయులు అనేక దేవాలయాలను నిర్మించారు. కాకతీయ రుద్రదేవుని కాలంలో (క్రీ.శ.1163) నిర్మించిన వేయిస్తంభాల గుడి నుంచి, గణపతిదేవుని కాలంలో నిర్మించిన రామప్పగుడి, ఘనపురం దేవాలయాలు, కాకతీయుల దేవాలయ వాస్తుకు అద్దం పడుతున్నాయి. హనుమకొండలోని వేయిస్తంభాల గుడిగా పిలువబడుతున్న త్రికూటాలయం రుద్ర, వాసుదేవ, ఆదిత్యుల కోసం నిర్మించబడింది. నక్షత్రాకారపు చిన్న ప్రదక్షిణాపథం, దానిపైన ఒక అధిష్టానం, స్తంభవర్గం, దీని మీద గోడంతా స్తంభాలతో అమర్చినట్లు కనిపించే విన్యాసం, మధ్య మధ్య దేవతా శిల్పాలు, చిన్న కపోతము(చూరు)న్న ప్రస్తరంలో చూడముచ్చటగా వుంది. పైన ఇటుకలతో నిర్మించిన విమానాలు చాలావరకూ పడిపోయాయి. ఇక లోపలికెళితే, ప్రవేశద్వారానికి ఇరువైపులా కక్షాసనాలు, అద్భుతమైన శిల్పాలతో చెక్కిన రంగమండపం, కప్పు




*రుద్రేశ్వరాలయం, (వేయిస్తంభాలగుడి) హన్మకొండ*



**కాకతీయుల నంది**



రామప్ప దేవాలయం, పాలంపేట, వరంగల్ జిల్లా



నాగిని శిల్పాలు, రామప్పదేవాలయం

భాగాలు, అర్ధమండప ద్వారాలపై కిటికీలు, శిల్పాలు, పై దూలాలపై నటనమాడుతున్న నటరాజు, నరసింహుల శిల్పాలు తొలి కాకతీయ శిల్పుల పనితనానికి మచ్చుతునకలు. తరువాత, ఆలయానికి కొంచెం ముందుగా నంది, దాని తరువాత 369 స్తంభాలతో ఉన్న కళ్యాణ మండపం ఉన్నాయి. తరువాత నిర్మించిన కాకతీయ ఆలయాలకు రుద్రుని వేయిస్తంభాల గుడి నమూనా ఉపకరించింది.

గణపతిదేవుని కాలంలో అతని సైన్యాధ్యక్షుడు రేచర్ల రుద్రిరెడ్డి (రుద్రుడు) పాలంపేటలో (క్రీ.శ. 1213లో) నిర్మించిన రామప్పదేవాలయం, కాకతీయ దేవాలయ వాస్తుకు పరాకాష్టగా చెప్పుకోవచ్చు. ఆలయాన్ని పరిశీలించి చూస్తే, నక్షత్రాకారపు ఎత్తైన ఉపపీఠం ప్రదక్షిణాపథంగానూ, దానిపైన గర్భాలయం, అర్ధమండపం,



కోటగుళ్ళు, గణపురం, వరంగల్ జిల్లా

మహా(రంగ)మండపం, కొంచెం ముందుగా నందిమండపం, ఎడమవైపు అమ్మవారి ఆలయం, దానికి కుడివైపు మూలలో రేచర్ల రుద్రుని శాసనమున్న మండపం, మరో ఆలయం చుట్టూ ప్రాకారంతోనూ, ఇక ప్రదక్షిణాపథంపై నున్న ఆలయం అధిష్ఠానం, స్తంభవర్గం, విశాలమైన కపోతంతోనున్న ప్రస్తరం, దానిపై శుకనాసితోనున్న విమానం పేర్కొనదగిన అంశాలు. ఆలయ అధిష్ఠానం, కక్షాసనాల వెలుపలివైపు జైనతీర్థంకరులు, రుషులు, మైధున, శృంగార, రతికేళిలో నున్న శిల్పాలు, భైరవ, గణేశ శిల్పాలు చిన్నవైనా ముచ్చటగా ఉంటాయి. ఆలయం గోడలపై కూటకోష్ఠాలతోనూ, స్తంభికలతోనూ, మూడంచెల మంచెలతోనూ, పొడవాటి స్తంభాలతోనూ విలక్షణ వాస్తును ప్రతిబింబిస్తుంది. కప్పు భాగంలోనున్న కపోతం విశాలంగా అలంకార శిల్పంలో వద్రంగానికేమీ తీసుపోనట్లుంది. దూలాలకు, స్తంభాలనూ కలుపుతూ ఏటవాలుగా అమర్చిన నాగిని, మదనిక శిల్పాలు ఇక్కడ తప్ప మరెక్కడా కానరావు. ఆలయ రంగమండపంలోకెళితే కక్షాననంపై చిన్న దేవాలయాలు పరివారాలయాలుగానున్నాయి. రంగమండప స్తంభాలు, దూలాలు, కప్పుపైన చెక్కిన శిల్పాలు కాకతీయ శిల్పుల నైపుణ్యాన్ని తెలియజేస్తున్నాయి. ఇక అర్ధమండప ద్వార శాఖలను పరిశీలిస్తే 20కి పైగా నృత్యభంగిమల్లోనున్న శిల్పాలు, వాద్యకాండ్రు, చెలికత్తెలు, ద్వారదూలంపై నటరాజ శిల్పం, మధ్యరంగ కప్పుపై అష్టదిక్పాలకుల శిల్పాలు కంటికింపుగా ఉంటాయి.


పాలంపేటకు 6 కి.మీ. దూరంలో నున్న గణపురంలో గణపతిరెడ్డి కట్టించిన కోటగుళ్ళు కాకతీయ దేవాలయ వాస్తుకు మరో ఉదాహరణ. మధ్య ప్రధాన దేవాలయం, తూర్పున త్రికూటం, పడమరదిక్కున కళ్యాణ మండపం, ఉత్తరాన తొమ్మిది, దక్షిణాన మూడు, పశ్చిమాన నాలుగు మధ్యలో ఇంకా మూడు దేవాలయాలతో మొత్తం 22 దేవాలయాలున్న సముదాయం ఆనాటి కళింగ, ఆంధ్ర, ద్రావిడ, కర్ణాటక, ఘూర్జరశైలి దేవాలయాల నమూనాలుగా నిర్మించబడినాయి. ప్రధానాలయం గర్భాలయ, అర్ధమండపాలతోనూ, శిథిలమైన మహామండపాలతో ఉండి మొత్తం ఎత్తైన ఉపపీఠం,ప్రదక్షిణపథంపై ఉంది. రంగమండప స్తంభాలు, దూలాల మధ్య రామప్ప మాదిరిగా యువతులు, సింహ–వ్యాళ శిల్పాలున్నాయి. 2001లో ఈమని శివనాగిరెడ్డి జరిపిన త్రవ్వకాల్లో బయటపడిన నిలువెత్తు శివ, విష్ణు ద్వారపాలక శిల్పాలు కాకతీయ శిల్పుల పనితనాన్ని తెలియజేస్తున్నాయి.

తెలంగాణా రీతిని ప్రతిబింబిస్తున్న కాకతీయ దేవాలయాలు 1500లకు పైగానే ఉన్నాయి. తొలుత నిర్మించిన మొగలిచర్ల, సోమశిల దేవాలయాలు సాదాగా ఒక వరుస రాతితో నుండగా, తరువాత రెండు వరుసల గోడలతో విశాలంగా నిర్మించబడినాయి. దేవాలయాలు ఏకకూట, ద్వికూట, త్రికూట, పంచకూటాలయాలని, ఒకటి, ఎదురెదురుగా రెండు, ఒకటి మధ్యలో, అటూ ఇటూ చెరొకటి చొప్పున మూడు, ఒకటి మధ్యన ప్రక్కన అటూ ఇటూ ఎదురెదురుగా రెండు, రెండు చొప్పున మొత్తం ఐదు దేవాలయాలు నిర్మించబడినాయి. ఇంకా తోరణాలు (వరంగల్ కోటలోని కీర్తి తోరణాలు). ద్వార మండపాలు (రెండంతస్తుల ద్వారమండపం– రామానుజపురం), నందిమండపం (రామప్ప), శాసన మండపం (రామప్ప), కళ్యాణ మండపం (హనుమకొండ, గణపురం), కాకతీయ దేవాలయ వాస్తులో ప్రధానాంశాలు. తొలినాళ్ళలో కళ్యాణ చాళుక్య దేవాలయ వాస్తును అనుసరించినా, స్వతంత్రులైన తరువాత ఒక ప్రత్యేక శైలిలో ఆలయాలను నిర్మించి కాకతీయ శైలిగా గుర్తింపు నిచ్చారు.

కాకతీయ దేవాలయాల్లో హనుమకొండలోని వేయిస్తంభాల గుడి (క్రీ.శ.1163), మంథని, బెజ్జంకి, కొండపర్తి, నందివడ్డెమాను, ముత్తారం, గోదావరి ఖని, కాళేశ్వరం, నిడికొండ, చంద్రవల్లి, వరంగల్, కటాక్షపూరం, రామానుజపురం, బుద్ధపురం, పూటుకూరు ముఖ్యమైనవి.

నాడు వెలసిన శిల్పసంపద మహోన్నతమైంది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఓరుగల్లు కోట, స్వయంభూదేవాలయ తోరణాలు, వేయిస్థంబాల గుడి, రామప్ప

దేవాలయం, పిల్లలమర్రి, నాగులపాడు, గొడిశాల దేవాలయాలు అపూర్వ శిల్పసంపదలతో అలరారుతున్నాయి. పిలల్లమర్రి, మాచర్ల దేవాలయం దూలం, కప్పుల మీదగల రంగుల బొమ్మలు వీరి చిత్రలేఖన నైపుణ్యానికి నిదర్శనాలు. ఇలా కాకతీయుల కాలంలో అన్ని రంగాల్లో మునుపెన్నడూ లేనంతగా అభివృద్ధి కనిపించింది.



*వరంగల్ కోటప్లాను*
*(పుట్టకోట, మట్టి కోట, రాతికోట)*

# 6 కాకతీయుల తరువాతి రాజ్యాలు

## Dynasties after the Kakatiyas

**ముసునూరి నాయకులు (క్రీ.శ.1325-1368)**

కాకతీయ రాజ్యం పడిపోయిన తరువాత ఉలుఘ్‌ఖాన్ ఓరుగల్లును స్వాధీనం చేసుకొని అనగరానికి సుల్తాన్‌పూర్ అని పేరుపెట్టి పాలకులుగా అమీర్లను నియమించాడు. తరువాత తూర్పు కోస్తావైపు తన సేనలను నడిపి కొండపల్లి దుర్గాన్ని ముట్టడించాడు. ముందుకు సాగి కొలనువీడు, నిరవద్యపురం (నిడదవోలు), రాజమహేంద్రవరం ఇంకా కొండవీడు, నెల్లూరు కోటలను ఆక్రమించాడు. మాలిక్ మక్బూల్ నాయబ్‌ను సుల్తాన్‌పూర్ పాలకునిగా నియమించాడు.

మాలిక్ మక్బూల్ నాయకత్వంలో తెలుగు ప్రజలు అనేక బాధలకు గురైనారు పన్నులభారం మోయలేక చాలా మంది రాజ్యం విడిచిపోయారు. క్రీ. శ. 1326లో ఉలుఘ్‌ఖాన్ మహ్మద్‌బీన్ తుగ్లక్ బిరుదుతో ఢిల్లీ సింహాసనాన్ని అధిష్టించాడు. ఇదే అదనుగా తెలుగు ప్రాంతాలలో ముసునూరి ప్రోలయ నాయకుడు, రేచర్ల సింగమనాయకుడు, ప్రోలయ వేమారెడ్డి తిరుగుబాటు చేశారు.

ప్రోలయనాయకుడు గోదావరి తీరంలోని రేకపల్లిని రాజధానిగా చేసుకొని పాలించాడు. అద్దంకి రెడ్డిరాజులను కలుపుకొని స్వాతంత్రోద్యమాన్ని నడిపి కొంతవరకు విజయం సాధించాడు. అనంతరం సోదరుడైన కాపయనాయకుడు హోయసల మూడవ బల్లాలుడి సహాయంతో తెలుగు ప్రాంతాలపై ఆధిపత్యం సాధించి ఓరుగల్లు కోటను ఆక్రమించి **ఆంధ్రసురత్రాణ, ఆంధ్రదేశాధీశ్వర** బిరుదులు ధరించాడు. తరువాత అద్దంకి కేంద్రంగా రెడ్డిరాజులు, రాచకొండ కేంద్రంగా వెలమలు (పద్మనాయకులు) స్వతంత్ర రాజ్యాలు స్థాపించారు. సరిగ్గా ఇదే సమయంలో విద్యారణ్యుని సహకారంతో గుత్తి దుర్గం కేంద్రంగా సంగమ సోదరులు అనెగొంది

ప్రాంతంలో స్వతంత్ర రాజ్యం స్థాపించారు. అదే, తరువాత కాలంలో విజయనగర సామ్రాజ్యంగా అవతరించింది. కాపయ నాయకుడు ఢిల్లీ సుల్తాన్‌లు ఓరుగల్లుపై దండయాత్రలు చేయటాన్నీ నివారించి దక్కన్‌లో సుల్తాన్ అధికారాన్ని తగ్గించటానికి అల్లావుద్దీన్ హసన్‌గంగుకు క్రీ.శ. 1347లో గుల్బర్గా రాజధానిగా స్వతంత్ర్య రాజ్య స్థాపనలో సహకరించాడు. బహమనీ సామ్రాజ్యం స్థాపించిన తరువాత పూర్వపు స్నేహాన్ని మరచి, హసన్ గంగూ కాపయనాయకున్ని రెండు సార్లు ఓడించి కప్పం కట్టించుకున్నాడు. చివరకు బహమనీ మొదటి మహ్మద్‌షాతో సంధి చేసుకొని భువనగిరి, గోలకొండ కోటలను వశం చేసుకొన్నాడు. ఇదే సమయంలో రేచర్ల అనపోతా నాయకుడు, క్రీ.శ. 1356లో కాపయనాయకుడిని వరంగల్ జిల్లా భీమారం దగ్గర చంపి రాజ్యాన్ని ఆక్రమించడంతో, ముసునూరి వంశపాలన అంతరించింది.

**రెడ్డి రాజులు: క్రీ.శ. (1325-1424)**

కాకతీయుల తరువాత పుట్టుకొచ్చిన స్వతంత్ర రాజ్యాల్లో రెడ్డి రాజ్యమొకటి. రెడ్డిరాజులు అద్దంకి, కొండవీడు, రాజామహేంద్రవరం, కందుకూరులను రాజధానులుగా చేసుకొని తీరాంధ్రాన్ని పాలించారు. ఉత్తరాన సింహాచలం నుండి దక్షిణాన నెల్లూరు వరకు వందేళ్లకు పైగా పరిపాలించి తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి కృషిచేశారు. మొదట అద్దంకి, రాజధానిగా క్రీ.శ. 1324లో ప్రోలయ వేమారెడ్డి స్వతంత్ర్య రెడ్డిరాజ్యాన్ని స్థాపించాడు. పడమట అహోబిలం, తూర్పున బంగాళాఖాతం, ఉత్తరాన కృష్ణా నది, దక్షిణాన పెన్నానది వరకు రాజ్యాన్ని విస్తరించాడు. ధరణికోట, చందవోలు, వినుకొండ, కొండవీడు, బెల్లంకొండ మొదలైన ప్రాంతాలలో 84 దుర్గాలు నిర్మించి బంధువులను, సోదరులను దుర్గనాయకులుగా నియమించి రాజ్యాన్ని శత్రుదుర్భేద్యంగా తీర్చిదిద్దాడు. కొండలమీదున్న శ్రీశైలం, అహోబిలం ఆలయాలకు మెట్లు నిర్మించాడు. కవిత్రయంలోని ఎర్రాప్రెగడ ఇతని ఆస్థాన కవి. ఇతడు, హరివంశం, నృసింహపురాణం, ఆంధ్రమహాభారతంలోని అరణ్యపర్వాలను రచించాడు. ప్రోలయ వేమారెడ్డి తరువాత అనవోతారెడ్డి రాజ్యాధికారాన్ని చేపట్టాడు. రాచకొండ వెలమ నాయకుల రాజ్యవిస్తరణను, మరోవైపు విజయనగర, బహ్మనీల దండయాత్రలను నిలువరించే ప్రయత్నంలో అనేక యుద్ధాలు చేశాడు. రాజధానిని స్థలదుర్గమైన అద్దంకి నుండి గిరిదుర్గమైన కొండవీడుకు మార్చాడు.

సోదరుడైన అనవేమారెడ్డి రాజ్యాధికారం చేపట్టేనాటికి రాజ్యంలో చాలా భాగం ఇతరులచేతుల్లోకెళ్ళి రెడ్డిరాజ్య ప్రతిష్ట మసకబారింది. పూర్వప్రతిష్ట పునఃరుద్ధరణకై దిగ్విజయ యాత్రను చేపట్టి దివి దగ్గరిజల దుర్గాన్ని ఆక్రమించి కోటకు

మరమ్మత్తులు చేశాడు. కృష్ణా, గోదావరి నదుల మధ్యనున్న ఉండిపురం రాజధానిగా పాలిస్తున్న సూర్య వంశస్తుల నుండి వేంగీ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. కామవరపు కోట రాజధానిగా పరిపాలించే చోడవంశజులను, నిరవద్యప్రోలు (నిడదవోలు) రాజధానిగా పాలిస్తున్న చాళుక్యులను ఓడించి, అన్నింటా రెడ్డిరాజ్య పతాకాన్ని ఎగురవేశాడు. దక్షిణ కళింగాన్ని పాలిస్తున్న పిఠాపురం వీరసామంతులైన కొప్పుల వంశస్తులను జయించి విజయయాత్ర సాగించి రాజమహేంద్రవరం ముట్టడించి కొండవీటి రాజ్యంలో కలిపినట్లు ద్రాక్షారామ, పలివెల శాసనాలు తెలుపుతున్నాయి. కర్నూలు జిల్లాలోని శ్రీశైలం నుండి తూర్పు సముద్రం వరకు విశాఖపట్నం జిల్లాలోని సింహాచలం నుండి నెల్లూరు జిల్లాలోని కందుకూరు వరకు రాజ్యాన్ని విస్తరించాడు. రెడ్డిరాజులందరిలో అనవేముడు సమర్థుడైన పాలకుడిగా గుర్తింపుపొందాడు. ఆగిపోయిన వసంతోత్సవాలను అనవేమారెడ్డి మళ్లీ ప్రారంభించాడు. ఈ ఉత్సవ సందర్భంగా చందనం, పన్నీరు, కస్తూరి, కర్పూరాలను, ఉత్సవం చూడటానికొచ్చిన ప్రజలపై వెదజల్లేవాడు. ఈ ఉత్సవాలను ప్రతియేట నిర్వహించడం వలన అనవేముడు, కర్పూర వసంతరాయలుగా పిలువబడినాడు.

అనవేమారెడ్డి తరువాత అతని కొడుకు కుమార గిరిరెడ్డి, బావమరిది కాటయ వేమారెడ్డి సహకారంతో రాజ్యాధికారాన్ని చేపట్టాడు. కాటయ వేమారెడ్డి దండయాత్రలు చేపట్టి గజపతుల నుండి కప్పం, కానుకలను స్వీకరించాడు. ఆయా ప్రాంతాలను కొండవీటి రాజ్యంలో కలిపేసి రాజమహేంద్రవర రాజ్యమనే పేరుతో ప్రత్యేక రాజ్యాన్ని ఏర్పాటు చేసి, కుమారుడైన రెండవ అనవోతారెడ్డిని ప్రతినిధిగా నియమించాడు. రాజమహేంద్రవరం స్థానికులైన అల్లాడరెడ్డి అతని కొడుకులైన వేమ, వీరభద్ర, దొడ్డరెడ్లు, రెండో అనవోతకు పాలనలో సహకరించారు. కాటయవేమరెడ్డి తన కూతురైన అనితల్లిని అల్లాడరెడ్డి కొడుకైన వీరభద్రారెడ్డికిచ్చి పెళ్ళి చేయడంతో రెండు కుటుంబాల మధ్య సంబంధాలు బలపడి రాజ్య సుస్థిరతకు దారితీసింది. పినతండ్రియైన అనవేమారెడ్డి వలె కుమారగిరిరెడ్డి వసంతోత్సవ ప్రియుడు. కవులను, పండితులను సత్కరించి కళాపోషణ, సాహిత్య పోషణకు కృషిచేశాడు. లకుమాదేవి ఇతని ఆస్థాన నాట్యగత్తె. కుమారుడైన అనవోతారెడ్డి అకాల మృత్యువుకు గురికాగా కాటయవేమారెడ్డిని అతని సేవలకు కృతజ్ఞతగా రాజమహేంద్రరాజ్యానికి రాజుగా నియమించాడు. ఇది గిట్టని దాయాదులు ప్రతిపక్షంలో చేరి రహస్యంగా కుట్రలు పన్నారు. ఇదే సమయంలో తెలంగాణ, తీరాంధ్రలో పన్నెండేండ్లు కరువొచ్చింది. దేశంలో అశాంతి, అసంతృప్తి చెలరేగాయి. ఆర్థిక సంక్షోభం మూలంగా నిర్బందంగా

పన్నులు వసూలు చేయవలసి వచ్చింది. ఇదే అదనుగా బహ్మనీ సుల్తాన్ ఫిరోజ్‌షా, కళింగాధిపతి, విజయనగర రాజులు, రెడ్డిరాజ్యంపై దాడి చేయగా కాటయ వేమారెడ్డి ఓడిపోయాడు. కుమారగిరిరెడ్డి రాజ్యాధికారాన్ని నిలుపుకోవడానికి చేసిన ప్రయత్నాలు ఫలించక కాటయవేమారెడ్డితో కలిసి రాజమహేంద్రవరం వెళ్ళిపోయాడు.

కుమారగిరిరెడ్డి తరువాత పెదకోమటి వేమారెడ్డి సింహాసనాన్ని అధిష్ఠించాడు. విజయనగర రాజైన రెండవ హరిహరరాయలు చనిపోవటంవల్ల వారు ఆక్రమించిన భూభాగాలను తిరిగి ఆక్రమించాడు. తరువాత కాటయ వేమారెడ్డి రాజధానియైన రాజమహేంద్రవరం పై దండయాత్రలు నిర్వహించి విఫలమయ్యాడు. పెదకోమటి వేమారెడ్డి స్వయంగా విద్వాంసుడు. సర్వజ్ఞచక్రవర్తి బిరుదాంకితుడు. వామన భట్టబాణుడు, శ్రీనాథుడు ఇతని ఆస్థానంలో పండితులు. తరువాత రాజ్యానికి వచ్చిన రాచవేమారెడ్డి దుష్పరిపాలన, ప్రజాకంఠక పాలన వలన ప్రజల ఆగ్రహానికి గురయ్యాడు. ఇతని కాలంలోనే విజయనగర రాజులు, కళింగగాంగులు రాజ్యంపై దండెత్తి రాగా రాచవేమారెడ్డి ఎదుర్కోలేక పోవటంతో క్రీ.శ. 1424లో రెడ్డిరాజ్యం అంతరించింది.

**రేచర్ల వెలమ రాజులు: (పద్మనాయక)**


తెలుగునేలపై హిందూరాజ్య పునఃస్థాపన అనంతరం కాకతీయ గణపతి దేవుని సామంతులుగా ఉన్న రేచర్ల వెలమలు రాచకొండ రాజధానిగా స్వతంత్ర రాజ్య నిర్మాణానికి కృషి చేశారు. వీరి జన్మస్థలం నల్లగొండ జిల్లాలోని పిల్లలమర్రి, ఆమనగల్లు ప్రాంతాలు. ఓరుగల్లు ముస్లింల వశం అయిన తరువాత క్రీ.శ. 1335లో కాపయ నాయకుని నాయకత్వాన్ని బలపరచిన రేచర్ల సింగమనాయుడు తెలుగు నేల విముక్తికి సహకరించాడు. అనంతరం ఒక్కొక్కరు స్వతంత్రించి ప్రత్యేక రాజ్యాలను నిర్మించుకొని విస్తరింపజేసుకున్నారు. తెలంగాణలో సింగమనాయుడి నాయకత్వంలో రాచకొండ, దేవరకొండ రాజధానులుగా రెండు శాఖలుగా పరిపాలించారు. వీరినే పద్మనాయకులని కూడా పిలుస్తారు. సింగమనాయుడు కృష్ణా, తుంగభద్రా నదులమధ్య ప్రాంతాన్ని ఆక్రమించి గోలకొండ దుర్గాన్ని ముట్టడించాడు. అనంతరం కుమారుడైన అనవోతా నాయకుడు రాచకొండ రాజధానిగా పరిపాలన చేస్తూ శ్రీశైలం ప్రాంతాన్ని ఆక్రమించి తెలంగాణపై ఆధిపత్యం సంపాదించాడు. పరిపాలన సౌకర్యం కోసం తమ్ముడైన మాదానాయకున్ని దేవరకొండ రాజ్య ప్రతినిధిగా నియమించాడు. నాటి నుండి రెండు వెలమ రాజ్యాలు సహకరించుకుంటూ పరిపాలన నిర్వహించాయి. అనవోత నాయకుని కుమారుడైన సింగమనాయుని పాలనలో విజయనగర సైన్యాలు శ్రీశైలాన్ని

ఆక్రమించాయి. ఇతను రెడ్డి రాజుల నుండి గోదావరి ప్రాంతంతో పాటు సింహాచలాన్ని ఆక్రమించాడు. స్వతంత్ర పాలకులలో చివరివాడైన సర్వజ్ఞ సింగముడు, దేవరకొండ లింగమ నాయకులు చివరి రోజుల్లో, గజపతులకు, విజయనగర పాలకులకు సామంతులైనారు.

వీరి పాలన స్వల్ప కాలమే అయినప్పటికి, సాహితీ ప్రియులుగా, కవి పండిత పోషకులుగా ప్రసిద్ధి గాంచారు. సింగమనాయుడు అలంకార శాస్త్రంపై **రసార్ణవసుధాకరం** అనే సంగీత వ్యాఖ్యానాన్ని, రత్న పాంచాలిక అనే నాటకాన్ని సంస్కృతంలో రచించాడు. సర్వజ్ఞ సింగమనాయుని కొలువులో తెలుగు కవులైన నాగనాధుడు, అయ్యలార్యుడు ఉండేవారు. ఆంధ్ర మహాభాగవత కర్త పోతన, **నవనాథ చరిత్ర** రాసిన గౌరన, **సింహాసనాద్వాత్రింశిక** రాసిన కొరవి గోపరాజు ఇతని సమకాలికులే.



*రాచకొండ కోట, నల్లగొండ జిల్లా*



*దేవరకొండ కోట, నల్లగొండ జిల్లా*

# 7 విజయనగర రాజులు - చక్రవర్తులు

## (క్రీ.శ.1336-1678)

## The Vijayanagara Rulers

కాకతీయ సామ్రాజ్యమస్తమించిన తరువాత ప్రతాపరుద్రుని కోశాగార రక్షకులైన హరిహర బుక్కరాయలు ఓరుగల్లును విడిచి అనెగొంది రాజ్యపాలకుడైన జంబుకేశ్వరుని కొలువులో అమాత్యులుగా చేరారు. ఢిల్లీ సుల్తాన్ మహ్మద్‌బిన్ తుగ్లక్ అనెగొంది నాక్రమించినప్పుడు, వీరిరువురిని బంధించి ఢిల్లీ చెరసాలలో ఉంచాడు. అనెగొంది పాలకులుగా మాలిక్ నాయబ్‌ను నియమించగా శాంతిభద్రతలు క్షీణించిన నేపథ్యంలో హరిహర బుక్కరాయలకు ఇస్లాం మతం స్వీకరింపజేసి అనెగొంది పాలకులుగా పంపాడు. కాని ప్రజలు వీరిని పాలకులుగా విశ్వసించలేనందున వీరు గుత్తి ప్రాంతాన్ని ఆక్రమించి పాలించారు. విద్యారణ్య యతీంద్రుల ప్రేరణతో ఇస్లాం మతం వదిలి హిందూమతం స్వీకరించి హోయసల రాజైన మూడవ బల్లాలునితో పోరాడి అనెగొందిని ఆక్రమించారు. క్రీ.శ. 1336లో ఓరుగల్లును కాపయ నాయకుడు ఆక్రమించిన సమయంలోనే వీరు కూడా సుల్తాన్ అధికారాన్ని ధిక్కరించి స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారు. నాటి పరిస్థితుల్లో రాజధానిగా అనెగొంది సురక్షితం కాదని విద్యారణ్యుని సలహాతో తుంగభద్రానది దక్షిణ తీరంలో ప్రకృతిసహజమైన రక్షణవలయంలో నున్న విద్యానగరాన్ని నిర్మించారు. అదే తరువాత విజయనగరంగా ప్రసిద్ధిపొందింది. సుమారు 250 సంవత్సరాల పాటు వైదిక మత పరిరక్షణే ధ్యేయంగా సంగమ, సాళువ, తుళువ, అరవీటి వంశాల పాలనలో విజయనగర రాజ్యం కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలోని కొన్ని ప్రాంతాలకు విస్తరించి విశాల విజయనగర సామ్రాజ్యంగా రూపుదిద్దుకుంది.



ఉదయగిరి కోట, నెల్లూరు జిల్లా

**సంగమ వంశం (క్రీ.శ.1336-1386)**

రాజ్యస్థాపకుడైన హరిహర, బుక్కరాయలు సంగముని కుమారులైనందున వీరి వంశానికి సంగమ వంశమని పేరొచ్చింది. అధికారం చేపట్టిన తరువాత పెనుగొండ దుర్గాన్ని మూడవ బల్లాలుని నుండి వశం చేసుకున్నారు. క్రీ.శ. 1346 నాటికి హోయసల, కదంబులను నిర్మూలించారు. రాజ్యవిస్తరణకై కుమార కంపణ నాయకత్వంలో కడప, నెల్లూరు, ఉదయగిరి దుర్గాల్ని ఆక్రమించారు. రాజ్యరక్షణకై అనెగొంది, ఉదయగిరి, గుత్తి, దుర్గాలను పటిష్ఠం చేశారు. రెండవ హరిహర రాయల పాలనలో రెడ్డి రాజులతోను, వెలమలతోను యుద్ధం చేసి మహబూబ్‌నగర్ జిల్లాలోని పానుగల్లు దుర్గాన్ని ఆక్రమించారు. మొదటి దేవరాయలు పెదకోమటి వేమారెడ్డి నుండి ఉదయగిరి కోటను, మోటుపల్లి రేవు పట్టణాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. ఇతని పాలనలోనే ఇటలీ యాత్రికుడైన నికోలోకాంటి, సందర్శించి విజయనగర వైభవాన్ని కొనియాడాడు. సంగమ వంశంలో అగ్రగణ్యుడైన రెండవ దేవరాయల (క్రీ.శ 1426-1446) పాలనలో రాజ్యం మహోన్నత స్థితికి చేరింది. రెడ్డిరాజ్యం పతనం వల్ల తీరాంధ్రలో కృష్ణానది వరకు రాజ్యం విస్తరించింది. పారశీక రాయబారి అబ్దుల్ రజాక్ ఇతని కాలంలోనే విజయనగరాన్ని సందర్శించాడు. మహారాజాధిరాజ, రాజపరమేశ్వర అన్న బిరుదుల వలన అతను విశాల భూభాగంపై సార్వభౌమాధికారం పొందినట్లు శాసనాలు తెలుపుతున్నాయి. మత సహనాన్ని పాటించి రాజధానిలో తురకవాడ ఏర్పాటు చేశాడు. కవులను ఆదరించి, సాహిత్యాభివృద్ధికి విశేష కృషిచేశాడు. ఇతని తరువాత మల్లికార్జునరాయలు, రెండో విరూపాక్షరాయలు, ప్రౌఢరాయల

పాలనలో విజయనగర రాజ్యం పరాధీనమయ్యే పరిస్థితుల్లో పెనుగొండ రాష్ట్ర పాలకుడైన సాళువ నరసింహుడు తన సేనాని నరసనాయకున్ని విజయనగర రాజ్య ఆక్రమణకు పంపగా ప్రౌఢరాయలు రాజ్యాన్ని విడిచి పారిపోయాడు.

**సాళువ వంశం : (క్రీ.శ.1486-1505)**

విజయనగర రాజ్యం విచ్ఛిన్నమయ్యే దశలో రెండవ దేవరాయలను పారద్రోలి కర్నూలు, చంద్రగిరి ప్రాంతాల్లో ప్రాబల్యం అధికంగా ఉన్న సాళువ నరసింహ దేవరాయలు (క్రీ.శ.1486-91) అధికారాన్ని చేపట్టాడు. ఇతను మొదట చంద్రగిరి రాజప్రతినిధిగానూ, తరువాత పెనుగొండ అధిపతిగానూ ఉన్నాడు. ఇతడు పాలన చేపట్టేనాటికి ఉదయగిరి, కొండవీడు, రాయచూరు దుర్గాలు ఇతర రాజుల అధీనంలో వుండగా దండెత్తి ఆక్రమించాడు.. ఇతడు రాజనాథ డిండిముడు, పిల్లలమర్రి పినవీరభద్రుడు లాంటి తెలుగు, సంస్కృత కవులను ఆదరించి పోషించాడు. ఇతని తరువాత ఇమ్మడి నరసనాయకుడు గజపతుల, బహ్మనీల దాడుల్ని తిప్పికొట్టి చోళ, చేర, పాండ్యులతో స్నేహాన్ని కొనసాగించాడు.



శ్రీకృష్ణదేవరాయలు

**తుళువ వంశం : (క్రీ.శ 1505-1576)**

విజయనగర పాలకులందరిలో అగ్రగణ్యుడైన శ్రీకృష్ణ దేవరాయలు (క్రీ.శ 1505-29) విజయనగర గౌరవ ప్రతిష్టలు నలుదిక్కులు వ్యాప్తి చేశాడు. బహ్మనీ మహమూద్‌ను 'దోని' వద్ద జరిగిన యుద్ధంలో ఓడించాడు. కోయిలకొండ వద్ద యూసుఫ్ అదిల్‌ఖాన్‌ను వధించి రాయచూరు అంతర్వేది (కృష్ణా-తుంగభద్ర నదుల మధ్య ప్రాంతం)ని ఆక్రమించాడు. బీదర్‌లో బందిగా ఉన్న బహ్మనీ సుల్తాన్‌ను విడిపించి సింహాసనంపై అధిష్టింపజేసి యవనరాజ్య స్థాపనాచార్య బిరుదు పొందాడు. కళింగ దండయాత్రతో గజపతుల ఆధీనంలోనున్న తీరాంధ్రను, తెలంగాణాను జయించాడు. ఉదయగిరి, కందుకూరు, వినుకొండ, అద్దంకి, కేతవరం, నాగార్జునకొండ, బెల్లంకొండ, కొండవీడు దుర్గాలను జయించాడు. బెజవాడను వశపరచుకొని, కొండపల్లిని ఆక్రమించాడు. తెలంగాణలో అనంతగిరి, ఉండ్రుకొండ, కందికొండ, కపిలవాయి, అరవపల్లి, నల్లగొండ,

కంభంమెట్టు, కోటలను ఆక్రమించాడు. చివరి దశలో వేంగి, కోన, కొట్టాంలు ఆక్రమించి, పొట్నూరులో జయస్తంభం నాటాడు. తరువాత గజపతుల రాజధాని కటక్ చేరుకొన్న శ్రీకృష్ణదేవరాయలతో ప్రతాపరుద్ర గజపతి సంధి చేసుకొని తన కుమార్తెను రాయలకిచ్చి పెళ్లిచేశాడు. కృష్ణానదికి ఉత్తరాన ఉన్న భూభాగాలను తిరిగి గజపతికి అప్పగించాడు. ఇదే అదనుగా బీజాపూర్ సుల్తాన్ కృష్ణా-తుంగభద్ర నదుల నడిమి ప్రాంతాలపై దండెత్తి రాయచూరును ఆక్రమించాడు. శ్రీకృష్ణదేవరాయలు గొప్ప యోధుడేగాక పరిపాలనా దక్షుడు. సంగీత, సాహిత్యాలను ఆదరించి 'సమరాంగణ సార్వభౌముని' గా కీర్తించబడినాడు. 'భువనవిజయం' అనే ప్రత్యేక సమావేశాల్లో సంగీత, సాహిత్యాలను ఆదరించి, అష్టదిగ్గజాలను పోషించి ఆంధ్రభోజుడయ్యాడు. అతడు స్వయంగా కవి, తెలుగులో **ఆముక్తమాల్యదను** రచించాడు. రాజధానిలోని కృష్ణాలయం, హజారామాలయం, ఇంకా ఇతర ఆలయ గోపుర మంటపాలు రాయల వాస్తుశిల్ప అభిరుచికి నిదర్శనాలు. శ్రీకృష్ణదేవరాయల తరువాత సవతి తమ్ముడైన అచ్యుతదేవరాయలు అంతఃకలహాల్లో రాజ్యాధికారం చేపట్టాడు. ఆ తరువాత సదాశివరాయలను నామమాత్రపు పాలకుడిగా నియమించి, అళియ రామరాయలు రాజప్రతినిధిగా పాలన బాధ్యతలు చేపట్టాడు.

**అళియ రామరాయలు:**

శ్రీకృష్ణ దేవరాయల ప్రాపకం సంపాదించి తన శక్తి సామర్థ్యాలతో అతని మెప్పు పొంది కుమార్తె తిరుమలాంబను పెళ్ళాడిన రామరాయలు అళియ రామరాయలుగా ప్రసిద్ధుడయ్యాడు. అళియ అంటే అల్లుడని అర్థం. సైన్యంలో సేనానాయకుడిగా తెలుగు ప్రాంతాల అధికారిగా పనిచేశాడు. సదాశివరాయలకు రాజప్రతినిధిగా సర్వాధికారాలు పొందాడు. విశ్వాసపాత్రులైన పెమ్మసాని, వెలుగోటి, కటకం కుటుంబాల వారికి ఉన్నత పదవులిచ్చి మకుటం లేని మహరాజుగా వెలుగొందాడు. అళియ రామరాయలు దక్కన్ సుల్తాన్‌లపట్ల అనుసరించిన విధానం, సుల్తాన్‌ల పరస్పర అంతఃకలహాలు ముస్లిం రాజ్యాల శక్తిని నిర్వీర్యం చేశాయి. విజయనగరానికి



*పెనుగొండ కోట ద్వారం, అనంతపురం జిల్లా*

వ్యతిరేకంగా క్రీ.శ. 1564లో దక్కన్ సుల్తాన్‌ల కూటమి ఏర్పడింది. బీజాపూర్ సుల్తాన్ కృష్ణా, తుంగభద్ర అంతర్వేదిని తమ ఆధీనం చేయవలసిందని వర్తమానం పంపగా రామరాయలు తిరస్కరించాడు. దీంతో కూటమి సేనలు యుద్ధోన్మాదంతో తళ్ళికోట వద్ద విడిది చేశాయి. రామరాయలు 96 యేండ్ల వయస్సులో 6 లక్షల సైన్యాన్ని సమీకరించి సోదరుల సహాయంతో సర్వసైన్యాధ్యక్షుడిగా రక్కసి-తంగడి యుద్ధంలో క్రీ.శ. 1565, జనవరి 23వ తేదీన సుల్తాన్ సేనలతో తలపడ్డాడు. మొదట రామరాయలే విజయం సాధించాడు. ద్రోహబుద్ధితో సంప్రదింపులు జరుపుతూ, మరోవంక రాయల సైన్యంలోని ముస్లిం సేనా నాయకులతో కుట్రపన్నిన, దక్కన్ సుల్తాన్‌లు విజయనగర సైన్యం ఆదమరిచి ఉన్న వేళ అకస్మికంగా దాడిచేశారు. తమ ముస్లిం సేనానులు శత్రుపక్షం చేరడంతో విజయనగర సేనలు ఖంగుతిన్నాయి. ఈ అయోమయావస్థలో రామరాయలు గాయపడగా, అతన్ని బంధించి, శిరస్సును ఖండించి చంపారు. దీంతో విజయనగర సైన్యం చెల్లాచెదురై వెనుదిరిగింది. తిరుమలరాయలు విజయనగరం చేరి సదాశివ రాయల్ని బంధవిముక్తున్ని చేసి బంధుపరివారంతో 1500 ఏనుగులపై అపార సంపదలు, రత్నఖచిత సింహాసనంతో సహా తిరుపతికి తరలించాడు. విజయోన్మాదంతో నలుగురు సుల్తాన్‌లు తమ సైన్యాలతో విజయనగరంలో ప్రవేశించి ఆరు నెలపాటు విడిది చేశారు. ఆ సందర్భంగా ఆలయ శిల్ప సంపదకు అపార నష్టం కలిగింది. సుల్తాన్ సైన్యాలు మరలిన తరువాత తిరుమల రాయలు విజయనగరానికి పూర్వవైభవాన్ని తేవటానికి రెండేళ్లు కృషి చేశాడు. చివరకు నిరాశ, నిస్పృహలతో విజయనగరాన్ని విడిచి పెనుగొండ చేరి స్వతంత్రంగా అరవీటి పాలన ప్రారంభించాడు.

**అరవీటి వంశం : (క్రీ.శ.1569-1678)**

మునలివాడైన తిరుమల రాయలు పెనుగొండ కేంద్రంగా పూర్వ విజయనగర రాజ్యాధికారాలను పునరుద్ధరించడానికి ప్రయత్నించాడు. మూడు భాషా ప్రాంతాలపై కుమారులను రాజ ప్రతినిధులుగా నియమించాడు.



చంద్రగిరి కోట, చిత్తూరు జిల్లా

పెనుగొండ రాజధానిగా శ్రీరంగరాయలు తెలుగుభాష ప్రాంతాలను, శ్రీరంగపట్నం రాజధానిగా రామరాయలు కన్నడ భాష ప్రాంతాలను, చంద్రగిరి రాజధానిగా వెంకటపతిరాయలు తమిళ భాష ప్రాంతాలను పాలించారు. శ్రీరంగరాయలు మరణాంతరం రెండవ వెంకటపతిరాయలు రాజ్యాధికారం చేపట్టి కుతుబ్‌షాహిల నుండి కర్నూలు, అనంతపురం, కడప, గండికోట, ఉదయగిరిలను ఆక్రమించి రాజధానిని పెనుగొండ నుండి చంద్రగిరికి మార్చాడు.

**పోర్చుగీసు యాత్రికుడైన 'డామింగోపేస్' మాటల్లో విజయనగర వైభవం**

"ఆ నగరం ఒక అద్భుత కళాఖండం. శక్తి వంతమైన ప్రాకారాలతో, మహోన్నతమైన భవనాలతో సుందరంగా నిర్మించబడినది. దీని చుట్టుకొలత 24 మైళ్లు కఠిన శిలలమీద నగరం నిర్మించబడింది. నగరం అనేక రకాల పండ్లతోటలు, ఉద్యానవనాలు, నీటివనరులు, సరస్సులతో కళకళలాడుతుండేది. రోమ్ నగరాన్ని తలదన్నే విధంగా లక్ష ఇండ్లు ఉండవచ్చు" అని విజయనగర వైభవాన్ని కొనియాడాడు.

**పరిపాలన**

విజయనగర సామ్రాజ్య పాలనా వ్యవహారాలలో చక్రవర్తిదే అత్యున్నత స్థానం. అప్పుడప్పుడు యువ రాజులు కూడా పాలనావ్యవహారాల్లో పాల్గొనేవారు. యువరాజులు చిన్నవారైనప్పుడు సంరక్షకులుగా, రాజప్రతినిధులుగా ఉన్న వీర నరసింహరాయలు, అళియ రామరాయలు వంటి వారు స్వతంత్ర్యంగా పాలించారు. ప్రధాని, ఉపప్రధాని, దండనాయక, భాండాగారికులతో కూడిన మంత్రిపరిషత్ రాజుకు సహకరించేది. మంత్రులకు పాలనా వ్యవహారాలు చక్కదిద్దటానికి కార్యదర్శులు ఉన్నారు. శ్రీకృష్ణదేవరాయలు ప్రధానిగా పనిచేసిన తిమ్మరుసు తన ఉపప్రధాని సోమరస సహకారంతో సమర్థవంతంగా పరిపాలన నిర్వహించి రాజ్యంలో శాంతిభద్రతలు మెరుగుపర్చాడు. రెండో దేవరాయల కాలంలో లక్కన్న దండనాయకుడు సిలోన్ దండయాత్రలో పాల్గొని విజయాన్ని చేకూర్చిపెట్టాడు. ప్రాంతీయ పాలకులైన బసవన్న ఉడయార్‌ను బరుకూర్ రాజ్యానికి రాజప్రతినిధిగా రాయల అనుమతితో నియమించినట్లు శాసనాలు తెలుపుతున్నాయి. వీరు మంత్రులుగా పనిచేస్తూ రాష్ట్రాల పాలకులుగా అదనపు బాధ్యతలు కూడా నిర్వహించారు. శ్రీకృష్ణ దేవరాయలు రచించిన ఆముక్తమాల్యదలో రాజు ఏవిధంగా పరిపాలించాలో ప్రజా సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలేవో వివరించబడ్డాయి. సింహాసనం అధిష్టించిన ప్రతి పాలకుడు న్యాయశాస్త్రాన్ని ఆచరిస్తూ పరిపాలన కొనసాగించాలని శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నాడు.

## ప్రాంతీయ పాలన

విజయనగరరాజ్యం పరిపాలనా సౌలభ్యంకోసం రాజ్యాలుగా లేదా మండలాలుగా విభజించి ప్రముఖ సేనా నాయకులను రాజప్రతినిధులుగా నియమించారు. వీరు ఉదయార్, ఒడెయ బిరుదులు ధరించారు. ఒకటో బుక్కరాయల మంత్రియైన మాధవ మంత్రి కదంబ రాజ్యానికి, బనవాసి 12000 రాజ్యప్రతినిధిగా నియమించబడినాడు. రాష్ట్రంలోని ప్రధాన దుర్గం (కోట) పేరున ఆ పాలనా విభాగం పిలువబడేది. వీరిని దుర్గాధిపతిగా పిలిచారు. వీరు సాధారణంగా రాజధానిలోనే ఉంటూ పాలనా వ్యవహారాలు తమ కార్యకర్తల ద్వారా నిర్వహించారు. రాయలు సామ్రాజ్య పరిస్థితులను బట్టి వీరిని బదిలీలు కూడా చేసేవారు. సరిహద్దు రాష్ట్రాలలోని దుర్గాధిపతులను దసరా ఉత్సవాలకు సైతం వెళ్ళకుండా తమ కోటల్లోనే ఉండి రాజ్యాన్ని రక్షించేవారు. మహారాజ్యాలుగా పిలువబడిన చంద్రగిరి, పడయవీడు, అరగ విశాలంగా ఉండగా గుత్తి వంటి రాజ్యాలు చిన్నవవడం వల్ల శ్రీకృష్ణదేవరాయలు దీనిని పెనుగొండ రాజ్యంలో విలీనం చేశాడు. కందెనవోలు (కర్నూలు), చంద్రగిరి, రాయదుర్గ, గండికోట దుర్గపాలకులు, రాయల కొలువులో మంత్రుల బాధ్యతలను కూడా నిర్వర్తించారు.

## అమరనాయకుల పాలన

సమకాలీన రాజ్యాలైన దక్కన్ సుల్తాన్‌లు, రెడ్డి రాజ్యం మరియు ఢిల్లీ సుల్తాన్‌ల నుండి ఎదురయ్యే సైనిక వ్యూహాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి మరియు సైన్య సమీకరణ కోసం అమరనాయకులనే వారిని నియమించారు. విజయనగర రాజులు విశ్వాసపాత్రులైన, సమర్థులైన ముఖ్యనాయకులను ఎంపిక చేసి వారిని అమర నాయకులుగా నియమించి వారికి అమర గ్రామాలు సైన్యపోషణ నిమిత్తం ఇచ్చారు. అందుకు ప్రతిగా నాయకులు గ్రామాలపై వచ్చే ఆదాయంద్వారా సైన్యాన్ని పోషించి యుద్ధ సమయాల్లో రాయలకు సహాయంగా పంపించేవారు. ఇది కాకతీయుల కాలంనాటి నాయంకర విధానాన్ని పోలినప్పటికి కొన్ని సంస్కరణలతో అభివృద్ధిపర్చి అమలు చేశారు. అచ్యుతరాయల పాలనా కాలంలో తన అమర నాయకులకు 6 లక్షల కాల్బలాన్ని, 24 వేల అశ్వదళాన్ని సిద్ధపర్చమని అజ్ఞాపించాడు దక్షిణాధి రాజ్యాలైన మధుర, తంజావూర్, జింజి ప్రాంతాలలో అమరనాయక పాలన అమలు చేయబడింది. వీరు రాయలకు కప్పంతో పాటు పట్టాభిషేక సమయంలో, వివాహాది శుభకార్యాలలో రాజధానికి వెళ్ళి బహుమానాలు, కానుకలు సమర్పించేవారు. వీరు తమ పరిధిలోని గ్రామాల్లో శాంతిభద్రతలు కాపాడి దొంగతనాలు, దోపిడీలను నివారించారు.విధి నిర్వహణలో అలసత్వం వహించిన, లోపం జరిగినా రాయలచే

శిక్షింపబడేవారు. ప్రతి నాయకుడు రాజధానిలో ఇద్దరు అధికారులను నియమించేవారు. ఒకరు సైన్యం వ్యవహారాలు చూసుకుంటే మరొకరు స్థానపతిగా తన నాయకుని అవసరాలు తీర్చేవాడు.మధుర నాయకుడైన విశ్వనాథనాయకుడు 'స్థానపతి'గా రాయల కొలువులో ఉండి శ్రీకృష్ణదేవరాయల కాలంనాటి పరిస్థితులు తెలిపే రాయవాచకం రచించాడు. రాజుకు విశ్వాసపాత్రుడిగా పనిచేసినంత కాలం అమరనాయకులు పరిమిత స్థాయిలో స్వతంత్రంగా పరిపాలన చేసుకొనుటకు అనుమతి లభించేది. అరవీటి వంశపాలనలో తంజావూర్ నాయకరాజు తప్ప మిగిలిన దక్షిణ దేశ నాయకరాజులందరూ రాయల అధికారాన్ని ధిక్కరించడమే కాక ఒక్కోసారి శత్రువులతో చేరి కుట్రలు సాగించారు. వీరి ప్రవర్తన తరువాత జరిగిన రాక్షసతంగడి యుద్ధంలో విజయనగర సామ్రాజ్య పతనానికి కారణమైంది.

**పాలెగార్లు**

సామంతులతో పాటు రాయల ఆధీనంలో పాలెగార్లు అనబడే చిన్న హోదా గల నాయకులు సైన్యాన్ని పోషిస్తూ యుద్ధసమయాల్లో సహకరించేవారు. వీరి సేవలకు గాను పొందిన గ్రామాల్లో పన్నులు వసూలు చేసుకుంటూ, తమ సైన్య పోషణ కోసం కొంత ఉంచుకొని మిగతాది ఖజానాలో జమచేసేవారు. వీరికి రెండు రకాల బాధ్యతలుండేవి. వీరికి ఇవ్వబడిన గ్రామాల్లో పన్నులు వసూలు చేయడం, అమర నాయకులులాగా సైన్యాన్ని పోషిస్తూ అధికారాన్ని చెలాయించటం. రాజ్యంలో తిరుగుబాట్లను అణచివేయడంతో పాటు బందిపోట్లను రూపుమాపడంతో పాటు శాంతిభద్రతలు కాపాడేవారు. విజయనగర రాజులు చివరికాలంలో శిస్తు వసూలుతో పాటు కావలిగార్ బాధ్యతలు నిర్వహించినందుకు ప్రతిఫలంగా పన్ను మినహాయింపుతో కూడిన గ్రామాలను ఇచ్చారు. అళియరామరాయలు విప్పపెంటసీమలో 14 గ్రామాలకు, సిద్ధవటం సీమలో 84 గ్రామాలకు పెద్దబుచ్చినాయుడుని కావలిదారుగా నియమించినట్లు శాసనాలు తెల్పుతున్నాయి.

**గ్రామపాలన**

అనాదిగా గ్రామ పరిపాలన సాగిస్తున్న గ్రామ సభల ప్రాధాన్యత వీరి కాలంలో కనుమరుగైంది. కొన్ని అగ్రహార గ్రామాల్లో మాత్రం గ్రామసభలు పనిచేశాయి. గ్రామాలు, భాండార వాడలు, అమర గ్రామాలు, మాన్య గ్రామాలుగా ఉండేవి. గ్రామ పాలనలో 12 మంది ఆయగార్లు పాలన నిర్వహించారు. వీరు గ్రామసేవకులుగా భావించబడ్డారు. వీరిలో రెడ్డి, కరణం, తలారి ప్రభుత్వ ఉద్యోగులు కాగా మిగతా

వారు సేవకులు. వీరికి జీతభత్యాలుండేవి కావు. 'వ్రిత్తి' మాన్యాలతో పాటు గ్రామ రైతులు ఇతర వృత్తుల వారు 'మేర' ధాన్యం చెల్లించేవారు. గ్రామ పాలన వ్యవస్థలో పన్నుల భారం అధికంగా ఉన్నట్లు సమకాలీన రచనలు తెలుపుతున్నాయి. రక్కసి తంగడి యుద్ధం తరువాత పాలెగార్ల పాలనలో రైతులు అనేక కష్టాలు పడినారు.

### తలవరులు

పట్టణాలలో మరియు గ్రామాలలో శాంతిభద్రతలు కాపాడడానికి రాత్రులు గస్తీతిరిగే సేవకులైన తలారులు నేటి పోలీసుల మాదిరి బాధ్యతలు నిర్వహించారు. విజయనగరంలో శాంతిభద్రతలు కాపాడడానికి 12వేల మంది తలవరులు ఉండేవారట.

### రాయల పర్యవేక్షణ

శ్రీకృష్ణదేవరాయలు పాలనా కాలంలో జంగమయ్య తలవరుల అధిపతిగా ఉండేవాడు. వారి పనివిధానాన్ని చూడడానికి రాయలు మారువేషంలో రాత్రులు సంచరించేవాడు. అలా సంచరిస్తూ ఒకనాడు ఒక ఇంట్లో ఒక దుర్మార్గం జరుగడాన్ని చూశాడు. ఆ విషయం జంగమయ్య ఎరుగడు. మరుసటి దినం తన నివేదికలో ఆ విషయం చెప్పలేదు. రాయలు తను గత రాత్రి ప్రత్యక్షంగా చూసిన విషయంపై అడిగాడు. ఫలానా వీధిలో, ఫలానా ఇంట్లో జరిగిన విషయం అంటూ.... అంతఖచ్చితంగా రాయలకు ఎలా తెలిసిందో జంగమయ్యకు అర్థం కాలేదు. నాటి నుండి జంగమయ్య తన క్రింది అధికారులు జాగ్రత్త వహించేలా చర్యలు తీసుకున్నట్లు రాయవాచకం కథనం. నాటి పరిపాలనా వ్యవహారాలలో శ్రీకృష్ణ దేవరాయలు ఎంత అప్రమత్తంగా వ్యవహరించాడో ఈ సంఘటన ద్వారా అర్థం చేసుకోవచ్చు.

### సాంఘిక, మత పరిస్థితులు

విజయనగర సామ్రాజ్యం హిందుమతోద్ధరణ లక్ష్యంతో అవతరించినప్పటికి రాజ్యంలో పరమతసహనం పాటించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. హిందు మతంలో అనేక శాఖలు ఏర్పడగా, శంకరాచార్య అద్వైతమతం స్మార్థమతంగా శృంగేరిపీఠం ప్రధానకేంద్రంగా వెలుగొందింది. రెండో దేవరాయలు ముస్లింల ప్రార్థనకై మసీదు నిర్మించి, తన దర్బార్‌లో ఖురాన్ ప్రతిని ఉంచుకొని ముస్లింల పట్ల తన గౌరవాన్ని ప్రకటించాడు. ఇతను జైనమతాన్ని ఆదరించగా, సాళువ, తుళువ, అరవీటి రాజులు వైష్ణవాన్ని ఆదరించారు. వీరశైవమతం కూడా ప్రజాదరణ పొంది, తలలు

నరుక్కోవడం, నాలుకలో దబ్బనాలు కుచ్చుకోవడం వంటి క్రూరాచారాలు ప్రబలంగా ఉండేవి. యుద్ధంలో చనిపోయినవారిని వీరులుగా కీర్తించి వారిపేరున వీరగల్లులనే శిల్పాలు మలిచారు. గ్రామదేవతలైన అంకాళమ్మ, పోలేరమ్మ, గంగమ్మ వంటి దేవతలకు జంతు బలులతో పూజించే ఆచారం ఉండేది.

సమాజంలో వర్ణవ్యవస్థ ప్రబలంగా ఉండెడిది. 18 కులాల ప్రస్తావన శాసనాల్లో కనబడుతుంది. నాడు వర్ణవ్యవస్థ కఠినంగా లేనందున శూద్రవర్ణాలు ఉన్నతస్థానాన్ని పొందాయి. రెడ్డి, వెలమల ప్రాధాన్యత తగ్గి కమ్మలు పాలనలో ప్రముఖ సేనానులుగా వెలుగొందారు. సంఘంలో స్త్రీలకు సముచిత స్థానం కల్పించబడి సంగీత, సాహిత్య రంగాలలో గుర్తింపుపొందారు. సతీ సంప్రదాయం, బాల్యవివాహాలు, కన్యాశుల్కం వంటి దురాచారాలు కూడా అమలులో ఉండేవి. వేశ్యా వృత్తి గుర్తింపు పొంది ప్రధాన ఆదాయవనరుగా మారింది. సమాజంలో అట్టడుగు వర్గాల వారు దారిద్ర్యాన్ని అనుభవించినట్లు సమకాలీన రచనలు తెలుపుతున్నాయి.

**ఆర్థిక పరిస్థితులు**

నాడు రాజ్య ఖజాన ఎప్పుడు నిండుగా ఉండేదని ప్రౌఢదేవరాయల ఖజానాలో 80 కోట్ల సువర్ణకాసులు నిలువ ఉండేవని, బంగారాన్ని కరిగించి ముద్దచేసి భద్రపరిచినట్లు అబ్దుల్ రజాక్ రచనలు తెలుపుతున్నాయి. సామ్రాజ్యంలో రాజులు, సామంతులు అనేక చెరువులు నిర్మించి వ్యవసాయాభివృద్ధిని ప్రోత్సహించారు. పరిశ్రమలైన లోహం, దంత, వజ్రం, ఆటవస్తువులు రాయదుర్గం, గుత్తి, వెంకటగిరి ప్రాంతాలలో వెలిశాయి.

**ఓడరేవులు – విదేశీవ్యాపారం**

విదేశీ వాణిజ్యాభివృద్ధి కోసం విజయనగరం రాజులు పోర్చుగీసు వారితో ఒప్పందం చేసుకొని ఓడరేవులను అభివృద్ధిపరిచారు. మొదటి దేవరాయలు కొండవీటి దుర్గాన్ని ఆక్రమించి మోటుపల్లి ఓడరేవులో వర్తకులకు భద్రత, సౌకర్యాలు కల్పించి వసూలు చేసే పన్నుల వివరాలతో కూడిన శాసనం వేయించాడు. పులికాట్ రేవుద్వారా జావా, సుమాత్రా, పెగు ద్వీపంతో విదేశీ వ్యాపారం ముమ్మరంగా సాగింది. అబ్దుల్ రజాక్ సందర్శించే నాటికి సామ్రాజ్యంలో 300 రేవుపట్టణములున్నట్లు, ఒక్కో ఓడరేవు కాలికట్ రేవుతో సమానంగా ఉన్నట్లు పేర్కొన్నాడు. వ్యాపార వాణిజ్యాలు నిర్వహించడానికి గోవా ఓడరేవు కోసం నిరంతరం విజయనగర, బహ్మనీ రాజ్యాల మధ్య ఘర్షణలు జరిగాయి. రత్నాల వ్యాపారానికి విజయనగరం ప్రధాన కేంద్రంగా ఉండడం వలన తూర్పు, పశ్చిమ తీరాల్లో హనోవర్, బట్కల్, కల్లికోట, మంగళూరు,

గోవా, మోటుపల్లి, పులికాట్, నాగపట్నం, మచిలీపట్నం ముఖ్య రేవుపట్టణాలుగా అభివృద్ధి చెందాయి. బర్మా, మలయా నుండి వచ్చే ఓడలు, ఈ రేవు పట్టణాలలో ఆగి భారతీయ సరుకులను నింపుకొని ఎర్రసముద్రం గుండా ప్రయాణించేవి. మేలుజాతి గుర్రాలు, వెండి, బంగారం, పాదరసం, సీసం, తగరం, పట్టు వస్త్రాలు, ముత్యాలు దిగుమతి కాగా నూలుబట్టలు, సుగంధ ద్రవ్యాలు, రత్నకంబళ్ళు, దంతపు వస్తువులు, ఎగుమతి అయ్యేవి. బర్మా, అరేబియా, పోర్చుగల్, పర్షియా, చైనా దేశాలతో వాణిజ్యం జరిగినట్లు బార్బోసా రచనలు తెలుపుతున్నాయి. విదేశీ వ్యాపారం వల్ల రేవు సుంకాల ద్వారా గణనీయంగా ఆదాయం పెరిగింది.

**నీటిపారుదల అభివృద్ధి - చెరువుల నిర్మాణం**

వ్యవసాయరంగాన్ని అభివృద్ధిపర్చడానికి కొత్తగా భూములను సాగులోకి తేవడం, చెరువులను తవ్వటంలో రాజులు, సామంతులు, ఉన్నత ఉద్యోగులు, నాయకరాజులు కృషిచేశారు. చెరువులు, కాలువల నిర్మాణం పుణ్యకార్యంగా భావించి, పూర్వీకులకు స్వర్గ లోకం ప్రాప్తిస్తుందని నమ్మారు. కొండవీడు, ఉదయగిరి, కడప, అనంతపురం జిల్లాల్లో త్రవ్వించిన చెరువులు నేటికీ ప్రధాన జలాశయాలుగా వ్యవసాయాభివృద్ధికి తోడ్పడుతూనే ఉన్నాయి. కడప జిల్లా పోరుమామిళ్ల జలాశయం వీరినిర్మాణమే ఇక్కడున్న శాసనం ప్రకారం ఎక్కడ చెరువు నిర్మించవచ్చో, ఎక్కడ నిర్మించకూడదో వంటి సాంకేతికమైన వివరాలు తెలుపుతున్నాయి. బుక్కరాయల కాలంలో పెనుగొండ దగ్గర శిరువేరు తటాకం, సాలువ నరసింహరాయలు అనంతపురం దగ్గర నరసాంబుధి తటాకం, కొండమరసు కొండవీటి రాజ్యంలో కొండ సముద్రం,ఉదయగిరి రాజ్యంలో అనంతసాగరం, కందెనవోలు రాజ్యంలో సిద్ధవట తటాకాలను తవ్వించారు. గ్రామసభలు, ఆలయ నిర్వాహకులు సైతం తటాక నిర్మాణాలలో, పునరుద్ధరణ కార్యక్రమాలలో శ్రద్ధ కనబర్చారు. శ్రీకృష్ణదేవరాయలు పోర్చుగీస్ ఇంజనీర్ల సహాయంతో తన తల్లి పేరున నాగలాపురం తటాకం, హంపిలో పెద్ద జలాశయాన్ని నిర్మించినట్లు పేస్, న్యూనిజ్‌ల రచనలు తెలుపుతున్నాయి.

**సాహిత్యం**


దక్షిణ భారతదేశంలో విజయనగర పాలనలో జరిగినంత సాహిత్యపోషణ మరే ఇతర రాజుల పాలనలో జరుగలేదు. ముఖ్యంగా తెలుగు భాషకు స్వర్ణయుగమని చెప్పవచ్చు. ఉత్తర హరివంశకర్త నాచన సోముడు మొదటి బుక్కరాయల పోషణలో కొలువుదీరాడు. రెండవ దేవరాయల ఆస్థానంలో శ్రీనాథకవి సార్వభౌముడికి కనకాభిషేకం జరిగింది. పిల్లలమర్రి పినవీరభద్రుడు జైమినీభారతాన్ని సాళువ

నరసింహుడికి అంకితమిచ్చాడు. శ్రీకృష్ణదేవరాయలు స్వయంగా కవి ఆముక్త మాల్యద రచించాడు. ఇతను తెలుగుభాషపై ఎక్కువ మమకారం చూపి "దేశభాషలందు తెలుగులెస్స" అని కొనియాడాడు. ఆంధ్రభోజుడుగా కీర్తించబడి, తన భువన విజయమనే కవితాదర్బారులో పెద్దన, తిమ్మన, మల్లన, ధూర్జటి వంటి అష్టదిగ్గజాలతో సాహితీ చర్చలు జరిపేవాడు. పెద్దన **మనుచరిత్ర**, తెనాలి రామకృష్ణుడు **పాండురంగ మహాత్యం**, ధూర్జటి **కాళహస్తీశ్వర మహాత్యం** రచించాడు. వసుచరిత్ర కర్తయైన భట్టుమూర్తి రామరాయల ఆశ్రయం పొంది రామరాజభూషణుడయ్యాడు. నీతి పద్యకర్త వేమన, ఆంధ్రవాగ్గేయకారులు అన్నమయ్య, త్యాగయ్య, క్షేత్రయ్యలు ఈ యుగంవారే.

### దేవాలయాలు


విజయనగర రాజులు సాహిత్యంతో పాటే వాస్తు శిల్ప కళలు, చిత్రలేఖనం విస్తృతస్థాయిలో ప్రోత్సహిం చారు. హంపి విజయనగరంలోని విరల, హజరారామాలయాలు, దసరాదిబ్బ, పద్మమహల్, గజశాల, ఏకశిలారథం, గొపుర నిర్మాణాలు, నాట్య, కళ్యాణ మండపాలు, లేపాక్షిలోని పార్వతీ పరమేశ్వరుల చదరంగం ఆట, శివతాండవ వర్ణచిత్రాలు నాటి కళానైపుణ్యాన్ని చాటుతున్నాయి.

విజయనగర చక్రవర్తుల్లో శ్రీకృష్ణదేవరాయలు దక్షిణ భారతదేశంలో ఎక్కువ భూభాగాన్ని వశపరచుకొని సుభిక్షంగా పాలించాడు. ఆయన పరిపాలనా కాలం అన్ని రంగాల్లో అభివృద్ధి సంతరించుకొని స్వర్ణయుగంగా భాసిల్లింది. కవులను, కళాకారులను ఆదరించి వరమత సహానాన్ని పాటించి వ్యవసాయాన్ని పోషించి, వర్తక వాణిజ్యాలకు పెద్దపీట వేసి విశాలమైన, ఎత్తైన ఆలయ గోపురాలను నిర్మించి పటిష్టమైన కోటలను కట్టి, చక్కటి రాజనీతితో పాలించాడు.



**దేవాలయం, పుష్పగిరి**


కర్నాటకలోనూ, హంపీలోనే కాక, తెలుగునాట కూడా విజయనగర రాజులు క్రీ.శ. 14-15 శతాబ్దాల్లో చిప్పగిరి, పుష్పగిరిలో దేవాలయాలను నిర్మించారు. చిప్పగిరిలోని బసవేశ్వర, చెన్నకేశవ దేవాలయాలను కంపిలి ప్రభువులు నిర్మించారు.




మల్లికార్జున దేవాలయం, శ్రీశైలం

పుష్పగిరిలోని చెన్నకేశవాలయం త్రికూట పద్ధతిలో నిర్మించబడినది. ప్రతి ఆలయానికి ఒక గర్భగృహం, అర్ధమండపం, రెండు మహామండపాలను కలిగివుంది. సంతాన మల్లేశ్వర, ఉమా మహాలింగేశ్వరాలయాలు, చెన్నకేశవాలయానికి తరువాత జోడించారు ఈ ఆలయాల గోడలపైన, కప్పులపైన రమణీయ శిల్పాలున్నాయి. అధిష్టాన వర్గం, పాదవర్గంలోని కుంభపంజర స్తంభాలు, కోష్టాలు, రామాయణ భాగవత దృశ్యాలతో చెక్కబడినది. విమానం మూడంతస్తులతో ద్రావిడరీతిలో నిర్మించబడినది. శ్రీశైలంలోని మల్లికార్జునాలయానికి ముఖమండపాన్ని నిర్మించారు. సంగమ వంశ రాజులు ఇంకా గోరంట్ల, కోయిలకుంట్ల, కదిరి, ఎగువ అహోబిలం దేవాలయాలను తొలి విజయనగర వాస్తు రీతిలో నిర్మించారు.

తుళువ వంశం వారు కూడా కొద్దిపాటి మార్పు, చేర్పులతో దేవాలయ, మండప, గోపురాలను నిర్మించారు. హంపీతో పాటు, తిరుపతి, లేపాక్షి, పెనుగొండ, వొంటిమిట్ట, అనిమెల, మార్కాపురం, గండికోట, రాయచోటి, తాడిపత్రి దేవాలయాలను నిర్మించారు. దాదాపు చోళుల ఆలయ సాంప్రదాయాలనే పుణికిపుచ్చుకొని, కొన్ని మార్పు చేర్పులతో పరివారాలయాలను కట్టడం ఈ కాలంలోనే మొదలైంది. అమ్మవారికి విడిగా ఒక ఆలయం కట్టడం కూడా ఇప్పుడే మొదలైనట్లు తాడిపత్రి దేవాలయం రుజువుచేస్తుంది. మహామండపం తరువాత వాహనశాలను జోడించడం, ఈకాలపు మరో ప్రత్యేకత. ఇంకా విశాలమైన మహామండపం, వంద స్తంభాల (నూరుకాళ్ళ)



*కోదండరామస్వామి దేవాలయం, ఒంటిమిట్ట, కడప జిల్లా*


మండపం, కళ్యాణ మండపాలు కూడా ఈకాలంలోనే తొలిసారిగా నిర్మించబడినాయి. మార్కాపురం, లేపాక్షి, తిరుపతి, గండికోట ఉదయగిరి, అహోబిల దేవాలయాలు ఇందుకు ఉదాహరణలుగా పేర్కొనవచ్చు.

దేవాలయాలు నిలబడే మొదటి వరుసైన అధిష్ఠానాలను వింతవింతగా భేదాభేదాలతో నిర్మించారు. సోమపాలెం, తాడిపత్రి, గండికోట దేవాలయ అధిష్ఠానాలు ఈ విషయాన్ని రుజువుచేస్తున్నాయి. ఎత్తైన నేలతో నిర్మించిన ఈ మండపాలను చేరుకోవడానికి మెట్లను ఏర్పాటు చేసి అటూ ఇటూ గజ, వ్యాళాలతో బిగించారు. అనేక రకాల మండప స్తంభాలను సృష్టించారు. వీటిలో సప్తస్వరాలనొలికించే ఒక పెద్ద స్తంభం చుట్టూ 5 నుంచి 7 వరకు చిన్న స్తంభాలతో వున్న స్థంభాన్ని ప్రత్యేకంగా పేర్కొనాలి. చిత్రకంఠ, మంచబన్ద, అశ్వపాద, సింహపాద స్తంభాలతో పాటు అనివొట్టి స్తంభాలను కూడా మండపాల నిర్మాణంలో ఉపయోగించుకొన్నారు. స్తంభాలను అశ్వపాదంపై నిలబెట్టి, మధ్యలో విగ్రహభాగం, నాగబంధం, అష్టపట్టం, మధ్య చదరం, కలశం, కుడం, ఫలికాపద్మం, పుష్పపోలికలుంటాయి. కుంభంలోంచి రెండువైపులా తీగెలొస్తున్నట్లు మధ్యలో స్తంభం, దానిమీద పంజరంతో ఉండే కుంభపంజర స్తంభం ఈ కాలపు ప్రత్యేకతల్లో మరొకటి. ఎత్తైన గోపురాలను శ్రీకృష్ణదేవరాయలతో పాటు ఇతర రాజులు కూడా నిర్మించటం వలన వీటికి రాయగోపురాలనీ, రాజగోపురాలని పేరుకలిగింది. శ్రీకృష్ణదేవరాయలు కాళహస్తిలో క్రీ.శ.1516లో నిర్మించిన గోపురం దాదాపు 200 అడుగుల ఎత్తుంది. ఇంకా ఇలాంటి గోపురాలు తిరుపతి, తాడిపత్రి, నాగలాపురం, ఉదయగిరిలో కూడా చూడవచ్చు. సోమపాలెంలో లాగా దీపస్తంభ నిర్మాణం కూడా ఈ కాలంలోనే జరిగింది.


ఇక చివరిదైన ఆరవీటిశాఖ కూడా బాగా అలంకారాలున్న గోడలు, స్తంభాలున్న దేవాలయ, మండప, గోపురాలను నిర్మించింది. స్తంభాలపై జంతువులను, జీవన ప్రమాణాలతో చెక్కటం ప్రత్యేకతగా పేర్కొనవచ్చు. తిరుమలలోని తిరుమలరాయ మండపం, ఇందుకు చక్కటి ఉదాహరణలు. ఇలా విజయనగర కాలంలో మునుపెన్నడూ లేనంతగా విశాల ఆవరణలున్న ఆలయ సముదాయాలు, చక్కటి అలంకరణలున్న కట్టడ భాగాలు, అనేక రకాల మండపాలు నిర్మించబడి యావత్ భారతదేశంలోనే దేవాలయ వాస్తులో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సుస్థిరపరచుకొన్నాయి.



కాళహస్తీశ్వరాలయ మంటపం, చిత్తూరు జిల్లా



శ్రీ రఘునాథాలయం, ఉదయగిరి, నెల్లూరు జిల్లా


శ్రీ కృష్ణ దేవాలయం, ఉదయగిరి, నెల్లూరు జిల్లా

# 8 తరువాతి మధ్యయుగం

## Late Medieval Period

**బహ్మనీ సుల్తాన్‌లు (క్రీ.శ.1347-1528)**

కాకతీయ రాజ్య పతనానంతరం ఢిల్లీ పాలకుడైన మహ్మద్‌బీన్ తుగ్లక్ దక్కన్ రాజ్యాలన్నింటినీ జయించి పాలన కోసం ప్రత్యేక అధికారులను నియమించాడు. దక్కన్ రాజ్యాలలో భూమి శిస్తు వసూలు చేయు అమీర్లందరూ కర్తవ్య నిర్వహణలో విఫలమయ్యారని వారిని అదుపులో పెట్టడానికి వీరిలో కొందరు అమీర్లను ఉరితీయించాడు. దీంతో ఆందోళన చెందిన గుజరాత్, దౌలతాబాద్ ప్రాంతాలలోని అమీర్లు తిరుగుబాటు చేశారు. దౌలతాబాద్ కేంద్రంగా ఇస్మాయిల్ ముఖి నాయకత్వంలో స్వతంత్ర తిరుగుబాటు లేవనెత్తగా తుగ్లక్‌సేనలు, ముఖిని ఓడించగా తోటి అధికార్లతో కోటలో తలదాచుకొన్నాడు. ఈ లోగా గుజరాత్‌లో తిరుగుబాటు తలెత్తగా తుగ్లక్‌సైన్యం దౌలతాబాద్ విడిచి గుజరాత్‌కు వెళ్ళి మరలా రాలేకపోయాడు. ఇదే అవకాశంగా హసన్‌గంగు తోటి అమీర్ల సహాయంతో తిరుగుబాటు చేసి సుల్తాన్ సైన్యాన్ని ఓడించి దౌలతాబాద్ ఆక్రమించాడు. క్రీ.శ. 1347లో అల్లావుద్దీన్ హసన్‌గంగు, బహ్మన్‌షా పేరుతో దక్కన్‌లో స్వతంత్ర బహ్మనీ రాజ్యాన్ని స్థాపించాడు. ఈ రాజ్యాన్ని మొత్తం 18 మంది సుల్తాన్‌లు 180 సంవత్సరాలకు పైగా పాలించారు. బహ్మనీరాజ్య స్థాపన కాలం నుండి విజయనగర సామ్రాజ్యంతో ఘర్షణ అనివార్యమైంది.

బహ్మనీ షా గుల్బర్గాను రాజధానిగా చేసుకొని నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాడు. స్వతంత్ర్య రాజ్య స్థాపనలో సహకరించిన మునునూరి కాపయనాయకునిపై దండెత్తి నిజామాబాద్ జిల్లా కౌలాస్ దుర్గాన్ని ఆక్రమించాడు.

ఇతని రాజ్యం పడమర అరేబియా సముద్రం నుండి తూర్పున భువనగిరి వరకు ఉత్తరాన వైన్‌గంగ నుండి దక్షిణాన కృష్ణానది వరకు విస్తరించింది. ఇతని తరువాత కుమారుడైన మొదటి మహ్మద్‌షా పాలనలో కాపయనాయకుడు దండెత్తి రాగా ఓడించి తరిమేశాడు. విజయనగర రాజైన బుక్కరాయలను ఓడించాడు. తరువాత వచ్చిన ముజాహిద్‌షా, రెండవ మహ్మద్‌షా పాలనలో చెప్పుకోదగ్గ విజయాలేవి లేవు. తరువాత ఫిరోజ్‌షా రాజ్యాధికారాన్ని చేపట్టి విజయనగర రాజ్యంలోని కృష్ణా - తుంగభద్రా నదుల మధ్య ప్రాంతాన్ని తిరిగి సాధించాడు. పెదకోమటి వేమారెడ్డికి సాయంగా వచ్చిన రాజమండ్రి పాలకుడైన కాటయ వేమారెడ్డిని వధించి రాజ్యాన్ని ఆక్రమించాడు. ఇతను ధర్మబుద్ధిగలవాడు, పరమత సహనం కలిగి హిందువులకు ఉన్నత పదవులనిచ్చాడు. గుల్బర్గాలో ఒక మసీదును, భీమా నది ఒడ్డున ఫిరోజాబాద్ నగరాన్ని నిర్మించాడు.

రెండవ అహ్మద్‌షా రాజ్యాధికారాన్ని చేపట్టిన అనంతరం ఓరుగల్లుపై దండెత్తి పద్మనాయక రాజులను ఓడించి తెలంగాణ ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. బీదర్ నగరాన్ని నిర్మించి తన రాజధానిని అక్కడికి మార్చాడు. అజారి కవిచే బహ్మన్‌నామ అనే బహ్మనీ వంశ చరిత్రను రాయించాడు. అనంతరం కుమారుడైన అల్లావుద్దీన్ పాలనలో రెండవ దేవరాయలు రాయచూరుపై దండెత్తగా అతన్ని ఓడించి తరిమివేశాడు. తరువాత రాజ్యాధికారం చేపట్టిన హుమాయున్ బహ్మనీలందరిలోనూ క్రూర మనస్తత్వం కలవాడు. ఇతనిని ప్రజలు జాలిమ్ (నియంత), ప్రాచ్యదేశాల నీరో అని పిలిచేవారు. చివరికి ఇతన్ని అతని సేవకులే వధించారు. ఇతని కుమారుడు నిజాంషా అనంతరం రెండవ కుమారుడైన మూడవ మహ్మద్‌షా పాలనలో రాజ్యం మహోజ్వల దశకు చేరింది. ప్రధాని మహ్మద్ గవాన్, మాల్వా, గోవా, రాజమండ్రి, కొండవీడు, కొండపల్లి, తెలంగాణను ఆక్రమించాడు. అనేక పాలన, ఆర్థిక, న్యాయ, సైనిక సంస్కరణలను ప్రవేశపెట్టాడు. మహ్మదీయుల విద్యాభివృద్ధికై బీదర్‌లో ఒక మదరస (కళాశాల) స్థాపించాడు. గవాన్ కీర్తి ప్రతిష్టలు ఓర్వని స్వదేశీ ముస్లింలు అసూయతో గవాన్‌పై నేరారోపణ చేసి ఉరితీయించారు. రాజ్యంలో అరాచకం ప్రబలగా విజయనగర రాజులు అంతర్వేదిని, గజపతులు కొండవీడును ఆక్రమించారు.

### బహ్మనీ రాజ్య విచ్ఛిన్నం

మూడవ మహ్మద్‌షా మరణానంతరం కుమారుడైన మహమూద్ బాలుడైనందున అమీర్లు తిరుగుబాటు చేసి స్వతంత్ర రాజ్యాలు స్థాపించారు. ఇమద్-ఉల్-ముల్క్ బిరార్ రాజధానిగా ఇమ్మద్‌షాహి వంశంగా, ఖాసిం బరీద్ బీదర్ కేంద్రంగా

బరీదీషాహి వంశంగా, మాలిక్ అహ్మద్ ఉల్ ముల్క్ అహ్మద్‌నగర్ రాజధానిగా నిజాంషాహి వంశంగా, యూసుఫ్ అదిల్‌షా బీజాపూర్ రాజధానిగా అదిల్‌షాహి వంశంగా, కులీకుతుబ్‌షా గోలకొండ కేంద్రంగా కుతుబ్‌షాహి వంశంగా దక్కన్ ప్రాంతాలలో స్వతంత్రరాజ్యాలను స్థాపించారు.

**పాలన**

ఇస్లాం మతానుసారం షరియత్ ఆధారంగా రూపొందిన రాజ్యపాలన వ్యవస్థలో సుల్తాన్ సర్వాధికారి, సర్వసైన్యాధిపతి, అత్యున్నత న్యాయాధిపతి, ప్రధానమత బోధకుడు. సుల్తాన్‌కు పాలనలో సహకరించడానికి మంత్రివర్గం ఉండేది. కాని సుల్తాన్ అభిప్రాయమే అంతిమ శాసనం. మొదటి మహ్మద్‌షాకాలంలో 8 మంది మంత్రులతో కూడిన సభ ఏర్పడింది. వకీల్-ఉస్-సల్తనత్, అమీర్-ఇ-జుమ్లా, వజీర్-ఇ-అష్రఫ్, సాదర్-ఇ-జహాన్, కోత్వాల్, వజీర్-ఇ-కుల్, వజీర్ వంటి మంత్రి పదవులుండేవి. సుల్తాన్ పదవి వారసత్వానికి సమర్థతకు స్థానం లేకపోగా కుట్రలు, కుతంత్రాలతో అధికారాన్ని హస్తగతం చేసుకున్న సందర్భాలే ఎక్కువ.

**రాజ్య విభాగాలు**

రాజ్యాన్ని తరఫ్‌లు లేక రాష్ట్రాలుగా విభజించారు. తరఫ్‌దార్లను సైనిక నాయకుల నుండే నియమించారు. వారు తమ పాలనా కేంద్రాలలో కోటలు నిర్మించుకొని సైన్యాన్ని పోషించారు. బహ్మన్‌షా కాలంలో రాజ్యాన్ని నాలుగు తరఫ్‌లుగా దౌలతాబాద్, గుల్బర్గా, బీదర్, బిరార్‌లుగా విభజించారు. వీటి పరిపాలన నిర్వహించడంకోసం విశ్వాసపాత్రులైన తరఫ్‌దార్లను నియమించారు. తరఫ్ ముఖ్యపట్టణాలలో తానేదార్లు శాంతిభద్రతలు కాపాడేవారు. మహ్మద్‌షా కాలం నాటికి విశాల సామ్రాజ్యం ఏర్పడినందున తరఫ్‌ల వైశాల్యాన్ని తగ్గించి రాజ్యాన్ని 8 సర్లష్కర్లుగా తరఫ్‌లకు తోడుగా వరంగల్లు, రాజమండ్రిలను ఏర్పరచారు. తరఫ్‌దార్లు రాష్ట్ర పాలనతో పాటు మంత్రులుగా ఒకే కాలంలో రెండు బాధ్యతలు కలిగి ఉన్నారు. మహ్మద్ గవాన్, ఖాజా జహాన్ పాలనలో ఒక్కో తరఫ్‌ను కొన్ని సర్కార్లుగా, ఒక్కో సర్కార్‌ను కొన్ని పరగణాలుగా విభజించారు. కొన్ని గ్రామాలతో కూడిన పరిపాలనా విభాగమే పరగణాలుగా ఏర్పరచారు.

**ఇక్తాపద్ధతి**

బహ్మనీలు తమ రాజ్యంలోని ఒక్కొక్క రాష్ట్రంలో సమర్థులైన అమీర్‌లకు, ఉన్నత ప్రభు వర్గాలకు చెందిన వారిని ఇక్తాదార్‌లుగా నియమించారు. వీరి సేవలకు

గాను సుల్తాన్ నుండి జాగీర్‌లు పొంది వాటిపై వచ్చే పన్నుల ద్వారా సైనికులను పోషించి సుల్తాన్‌కు అవసరమైనప్పుడు సరఫరా చేసేవారు. ఈ విధంగా జాగీర్‌లు పొందిన వారే ఇక్తాదార్లుగా పిలువబడ్డారు. వీరు విలాసమయ జీవితాన్ని గడుపుతూ రైతు గోడులను విస్మరించి సుల్తాన్‌కు అండగా నిలిచారు. శాంతి భద్రతల పరిరక్షణలో వీరు తరఫ్‌దార్లకు బాధ్యతవహిస్తూ ఉండేవారు. ఇక్తాదార్లకు తమ ఇక్తాలపై వంశపారంపర్య హక్కు ఉండేది కాదు. సుల్తాన్ విశ్వాసం ఉన్నంత కాలమే వీరికి హక్కులు ఉండేవి. వీరు తమ పరిధిలోని గ్రామాల్లో శిస్తు వసూలుకై ఎక్కువ కౌల్లకు గ్రామాలను ఇవ్వడం ద్వారా రైతులపై భరించలేని శిస్తుభారం పడింది. అసమర్థులైన సుల్తాన్‌ల పాలనలో ఇక్తాలు స్వంత ఆస్తులుగా మారాయి. సుల్తాన్‌లు అధికారాన్ని కాపాడుకోవడానికి కొన్ని సందర్భాలలో హిందువులకు కూడా ఇక్తాలను మంజూరి చేసి ఇక్తాదార్లుగా నియమించారు. దీనిని మధ్య యుగకాలం నాటి ఫ్యూడల్ వ్యవస్థలో అంతర్భాగంగా పరిగణించవచ్చు.

**కుతుబ్ షాహీలు : (క్రీ.శ.1496-1672)**

క్రీ.శ. 1500 సంవత్సరం నాటికి బహ్మనీ రాజ్యం చీలిపోయి అహ్మద్‌నగర్, బీజాపూర్, బీరారు, బీదరు, గోలకొండ అనే ఐదు ముస్లిం రాజ్యాలుగా ఏర్పాటైనాయి. గోలకొండ రాజ్యస్థాపకుడైన సుల్తాన్ కులీకుతుబుల్-ముల్క్ బహ్మనీ సుల్తాన్ మూడవ మహ్మద్‌షా కొలువులో క్రీ.శ. 1486లో కొడంగల్ జాగీర్‌దారుగా, క్రీ.శ. 1496 నాటికి తెలంగాణ తరఫ్‌దార్‌గా పదవిని చేపట్టాడు. అనేక కోటలతో పాటు గోలకొండ కోటను కూడా జాగీరుగా పొందాడు. వరంగల్ నుండి గోలకొండ వరకు గల ప్రాంతమంతా తెలంగాణ తరఫ్‌లో అంతర్భాగంగా ఉండేది. గోలకొండ కోటను పటిష్టపరిచి వెలుపలి ప్రాకారం నిర్మించాడు. గొప్ప సైన్యాన్ని సమకూర్చుకొని తూర్పుతీరంలోని రాజమహేంద్రవరం దుర్గమును, దేవరకొండ కోటను జయించాడు. అనంతగిరి, ఉర్లుగొండ, చిట్యాల, పానగల్లు దుర్గాలను జయించి ఆక్రమించాడు. విజయనగర రాజ్య అధీనంలోని కొండపల్లి, కొండవీడు దుర్గాలను వశపర్చుకొన్నాడు. ఖమ్మం దుర్గాన్ని ఆక్రమించి ఉత్తరాంధ్ర, గోదావరి తీరప్రాంతాలను జయించి సామంతులను నియమించాడు. గొప్పశూరుడు, విజేత, పరిపాలనాదక్షుడైన కుతుబ్-ఉల్-ముల్క్ ప్రజలచే బడా మాలిక్‌గా పిలువబడినాడు. చివరకు మూడవ కుమారుడైన జంషీద్ అధికార కాంక్షతో తండ్రిని, అన్నను చంపి అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడు.

## ఇబ్రహీం కులీకుతుబ్‌షా: (క్రీ.శ. 1550-1580)



ఇబ్రహీం కులీకుతుబ్‌షా

జంషీద్ మరణించే వరకు విజయనగర రాజ్యంలో తలదాచుకొని అనంతరం గోలకొండ చేరి అధికారాన్ని చేపట్టాడు. ఇతనిపై విజయనగర పాలనా ప్రభావముండడం వలన తెలుగుభాషలో కవిత్వం చెప్పే పాండిత్యాన్ని సంపాదించి మల్కిభ రాముడిగా కీర్తిగడించాడు. దక్కన్ సుల్తాన్‌లు పరస్పరం కలహించుకుంటూ, రామరాయల సహాయాన్ని పొందేవారు. తగవుల ఫలితంగా విజయనగర రాజ్యమే లాభపడింది. చివరకు తమ తప్పులను తెలుసుకొని వైరాన్ని పక్కనబెట్టి దక్కన్ సుల్తాన్‌లు కూటమిగా ఏర్పడి రక్కసితంగడిలో జరిగిన యుద్ధంలో రామరాయలను వధించారు. విజయనగర సైన్యం చెల్లాచెదురై పారిపోగా విజయనగర పట్టణం ఆరు మాసాల పాటు యథేచ్ఛగా దోపిడీకి గురైంది. అనంతరం రాజ్యవిస్తరణపై దృష్టినిలిపి రాజమండ్రి, కొండవీడు, వినుకొండ, ఖమ్మం దుర్గాలను ఆక్రమించాడు. ఇబ్రహీం 30 సంవత్సరాల పాలనలో తెలుగునేల శాంతి సౌభాగ్యంతో గోలకొండ మహానగరంగా విస్తరించింది. హైదరాబాద్ - గోలకొండల మధ్య మూసీనదిపై పురానాపూల్ వంతెనను నిర్మించాడు.


## మహ్మద్ కులీ కుతుబ్‌షా: (క్రీ.శ. 1580-1612)



మహ్మద్ కులీకుతుబ్‌షా

ఇబ్రహీం కుతుబ్‌షాకు భగీరధి రాణికి మహ్మద్ కులీ జన్మించాడు. ఇతనిని వారసునిగా ప్రకటించడంలో దక్కన్ ముస్లింలు, రాయరావు సంపూర్ణంగా సహకరించారు. రాజ్యాధికారాన్ని చేపట్టగానే తుంగభద్రానదికి దక్షిణ ప్రాంతాలైన పెనుగొండ, గండికోటలను జయించి శ్రీకాకుళం వరకు రాజ్యాన్ని విస్తరించాడు. రాజమండ్రి, శ్రీకాకుళం, గుంటూరులలో సైనిక కేంద్రాలను ఏర్పరచాడు. విజయనగర కోటలైన ముసలిమడుగు, నంద్యాల, కట్కూరులను ఆక్రమించాడు. ఉత్తరాన బస్తరు నుండి దక్షిణాన గండికోట వరకు 84 దుర్గములు నిర్మించి

రాజ్యాన్ని విస్తరించాడు. మహ్మద్ కులీ విశాల దృక్పథం కలిగి ప్రజాభిమానం చూరగొన్నాడు. మతసామరస్యానికి జీవం పోశాడు. హైదరాబాద్ నగరానికి పునాదులు వేసి సౌందర్యం కోసం అనేక ఉద్యాన వనాలు, భవనాలైన దాద్‌మహల్, నద్దిమహల్, కోహితూర్, ఐన్నత్‌ఘాట్‌లను ఆవాస యోగ్యంగా నిర్మించాడు. ఇంతటి ప్రశాంత వాతావరణం గోలకొండ రాజ్యం నందు ఎప్పుడూ లేదు. మక్కామసీదు నిర్మాణమునకు పునాది వేసినాడు. హైదరాబాద్‌నగర సమీపంలో నూతన నగరమైన సుల్తాన్‌పూర్ నగర నిర్మాణానికి ప్రణాళిక సిద్ధపరచి క్రీ.శ. 1624లో పునాది రాయి వేయించి ఈద్‌గా నిర్మించాడు. ఇతని అకాల మరణం వలన నగర నిర్మాణందు ఆగిపోయింది.



మక్కామసీదు, హైదరాబాద్

నేటి హైదరాబాద్ నగర నిర్మాణానికి క్రీ.శ. 1590-91లో కులీ కుతుబ్‌షా పునాది వేశాడు. గోలకొండలో పెరుగుతున్న జనాభా రద్దీని తగ్గించడానికి ఈ నగరాన్ని నిర్మించాడు. ఈ పట్టణం పేరే భాగ్యనగరమని, బాగ్‌నగరమని పేరుంది. మహ్మద్ కులీకుతుబ్‌షా హైదరాబాద్ నగర ప్రాంతంలోని బాగమతి అనే స్త్రీని ప్రేమించి, పెండ్లాడి ఆమే ప్రేమకు చిహ్నంగా భాగ్యనగరం నిర్మించాడని ఒకవాదం, మరోవాదం ఏమంటే ఇబ్రహీం కుతుబ్‌షా విజయనగర రాజ్యంలో ప్రవాసంలో ఉన్నపుడు భగీరథి అనే యువతిని ప్రేమించి పెళ్లాడాడని, ఆ జ్ఞాపక చిహ్నంగా ఈ నగరం నిర్మించినట్లు ఒక వాదం. ఇంకొక వాదం ప్రకారం భాగ్ అను పర్షియన్ పదానికి అర్థం తోట. అనేక ఉద్యానవనాలు, తోటలతో నిండియున్న నగరం కనుక భాగ్ నగరమైంది.

**అబ్దుల్లా కుతుబ్‌షా: (క్రీ.శ.1626-1672)**



అబ్దుల్లా కుతుబ్‌షా

ఇతను షియా మత సాంప్రదాయాలను మానివేసి సున్నీమత సాంప్రదాయాలను పాటించాడు. రాజకీయ అసమర్థుడిగా నెలల తరబడి పాలనకు దూరంగా ఉండి సుఖభోగాలలో మునిగి తేలేవాడు. ఇతని పాలనలోనే గోలకొండ రాజ్య పతనం ఆరంభమైంది. మొగలుల ఆధిపత్యం, కుటుంబ అంతఃకలహాల కారణంగా రాజకీయ అనిశ్చితి ఏర్పడగా మూడవ అల్లుడైన అబుల్ హసన్ తానీషా వారసుడైనాడు. ఇతని కాలంలో మొగలు సేనానులు, మహారాష్ట్రులు, గోలకొండ రాజ్యంపై దండయాత్రలు చేస్తూ అలజడులు సృష్టించారు.

**అబుల్ హసన్ తానీషా: (క్రీ.శ.1672-1687)**

తానీషా రాజ్యాధికారాన్ని చేపట్టగానే ఔరంగజేబు చక్రవర్తికి సామంతుడిగా విలువైన కానుకలు పంపించాడు. తానీషా పాలనలో చెప్పుకోదగిన విషయం అక్కన్న, మాదన్నలు ఇతని పాలనలో ఉన్నతపదవులు అలంకరించి వన్నెతెచ్చారు. మాదన్న ప్రధానమంత్రి పదవి చేపట్టిన ప్రతిభావంతుడు. అబుల్‌హసన్ తానీషాతో పాటు మచిలీపట్నం, మద్రాసులను పర్యటించి పాశ్చాత్య వర్తకుల అలజడులను అణచివేశారు. కొండవీడు దుర్గాన్ని మరమ్మత్తు చేయించి, కొండపల్లి దుర్గమునందు కొంతకాలం బసచేశారు. అక్కన్న కుతుబ్‌షాహీ సైన్యానికి సర్వసేనాధిపతిగా సేవలందించాడు. మాదన్న మేనల్లుడైన పొదిలి లింగన్న పూనమల్లి గవర్నర్‌గాను, మరో మేనల్లుడు యంగన్న సైన్యంలో ఉన్నతాధికారిగాను, కంచర్ల గోపన్న భద్రాచలం తహశీల్దార్‌గాను నియమించబడినారు. వీరి శక్తి సామర్థ్యాలు, ఔన్నత్యానికి అసూయ



*అబుల్ హసన్*

చెందిన గోలకొండ ముస్లిం అధికారులు, మొగలు అధికారులు వీరి పతనానికి కుట్రపన్నారు. క్రీ.శ. 1686లో మొగలులతో కుదిరిన సంధి ఒప్పందం ప్రకారం అక్కన్న, మాదన్నలు పదవి నుండి తొలగించబడి గోలకొండ వీధుల్లో తరిమి తరిమి కొట్టి చంపబడ్డారు. ఇదే అదనుగా తానీషా విరోధులు గోలకొండ ముట్టడి కోసం ఔరంగజేబుకు వర్తమానం పంపారు. తానీషా చక్రవర్తితో సంధికై పలుమార్లు చేసిన విజ్ఞప్తిని ఔరంగజేబు మన్నించక గోలకొండ కోటను ముట్టడించాడు. ఔరంగజేబు స్వయంగా ముట్టడిలో పాల్గొని సైనికులను ఉత్సాహపరిచాడు. యుద్ధం భీకరంగా సాగుతున్నప్పటికి కోట వశం కాకపోగా, కుతుబ్‌షాహీల సేనాని అబ్దుల్లాఖాన్ ద్రోహబుద్ధితో మొగలులతో కుమ్మక్కై ఒకనాడు రాత్రి మూడు గంటల సమయమున కోట ద్వారం తెరిచి మొగలుల విజయానికి రాచబాట వేశాడు. తానీషాను బందీగా చేసి దౌలతాబాద్ కోటలో ఉంచాడు. అక్కడి నుండి గ్వాలియర్‌కు తరలించగా క్రీ.శ. 1700 సంవత్సరంలో మరణించాడు. గోలకొండ మొగలుల సుబేదార్‌ల పాలనలోకి వచ్చింది. తానీషా సాధారణ స్థితి నుండి ఉన్నత రాజపీఠమలంకరించి, హిందూ ముస్లింలను సమదృష్టితో చూసి ప్రజాభిమానం చూరగొన్నాడు.

**పరిపాలన**

కుతుబ్‌షాహీల పాలనలో సుల్తాన్ సర్వాధికారి. పాలనలో సహకరించడానికి మజ్లిస్-ఇ-కింగాష్ పేరుతో మంత్రిమండలి ఉండేది. ఇందులో వజీర్ (ప్రధాని) పీష్వా (సైన్యాధ్యక్షుడు) ఖజానాదార్ (కోశాధికారి), మజుందార్ (గణకుడు), నజీర్ (పర్యవేక్షకుడు) సభ్యులుగా ఉండేవారు. రాజ్యంలో సుల్తాన్‌కు ఇతర విభాగాధిపతులకు సమాచారాధిపతిగా దబీర్ అనే ఉద్యోగి ఉండేవాడు. కోత్వాలు పోలీసు విధులు నిర్వహించగా సర్‌ఖేల్ రెవెన్యూ పాలన నిర్వహించాడు.

పాలనా పరంగా కుతుబ్‌షాహీల రాజ్యం తానీషా కాలం నాటికి ఆరు సుభాలుగా 37 సర్కార్లుగా, 517 సిమ్తులుగా విభజింపబడింది.

సుభా 1 : మహ్మద్‌నగర్, మెదక్, కౌలాస్, ముల్కనూర్ సర్కార్లు

సుభా 2 : వరంగల్, ఎల్గందల, ఖమ్మం మెట్టు, దేవరకొండ సర్కార్లు

సుభా 3 : పానగల్, ముస్తఫానగర్ (కొండపల్లి) భువనగిరి, ఆకర్‌కర్ సర్కార్లు

సుభా 4 : కోయలకొండ, ఘన్‌పూర్, ముర్తజానగర్ (గుంటూరు), మచిలీపట్నం సర్కార్లు

సుభా 5 : నిజాంపట్నం, ఏలూరు, రాజమండ్రి, సికాకోల్

సుభా 6 : కర్నాటక ప్రాంతం - 16 సర్కార్లుండెను.

కుతుబ్‌షాహీ రాజ్యాన్ని తరఫ్‌లుగాను, సర్కార్లుగా, పరగణాలుగా విభజించారు. పాలనలో గ్రామం చివరి విభాగం. తరఫ్‌ల పాలన నిర్వహణ కోసం తరఫ్‌దార్, సర్కార్ పాలనకై ఫౌజుదార్, హవల్దార్ల సహాయంతో పాలించారు. పరగణా పాలకులుగా దేశ్‌పాండే, దేశ్‌ముఖ్, కులకర్ణి, ధానేదార్, మొదలగు అధికారులు వివిధ ప్రాంతాలలో బాధ్యతలు నిర్వర్తించేవారు. గ్రామపాలన వ్యవహారాలను ముకద్దం, కరణాలు, గ్రామపెద్దలతో ఏర్పడిన సభకు సహకరిస్తూ పరిపాలన నిర్వహించారు.

## సామాజిక, మత పరిస్థితులు

కుతుబ్‌షాహీలు మత సహనం పాటించి హిందూ, ముస్లిం సఖ్యతకు పాటు పడ్డారు. హిందూ సంప్రదాయాలను, విశ్వాసాలను గౌరవించి దురాచారాల నిర్మూలనకు తొడ్పడినారు. సమాజంలో చతుర్వర్ణ వ్యవస్థ ప్రబలంగా ఉండేది. వృత్తుల కారణంగా అనేక కులాలు ఏర్పడ్డాయి కాపులు వ్యవసాయం చేయగా, ఇతర వృత్తులు కమ్మరి, వడ్రంగి, కాసె, సాలె, బోయ వంటి కులాలుగా ఆవిర్భవించాయి. బ్రాహ్మణులలో వైదిక, నియోగ శాఖలు ఏర్పడ్డాయి. ప్రభుత్వ ఉద్యోగాలలో అక్కన్న, మాదన్న, కంచర్ల గోపన్న వంటి నియోగులు ఉన్నత పదవులు అలంకరించగా గ్రామస్థాయిలో కరణాలుగా కూడా బ్రహ్మణులు పనిచేశారు. మహ్మదీయులు పాలకులుగా పదవులను అనుభవిస్తూ, స్థానికాధికారులుగా, అమీరులుగా చలామణి అయ్యారు. వీరిలో సయ్యద్‌లు, మౌల్వీలు, ఫకీర్లు గా పిలువబడే తెగలు ఏర్పడ్డాయి. హిందూ మతం శైవ వైష్ణవ శాఖలుగా విడిపోయాయి. శివయోగులు, సిద్ధులు శైవ మఠాలను స్థాపించారు. వైష్ణవం ఎక్కువ ఆదరణ పొంది ప్రతి గ్రామములో రామాయలం నిర్మించారు. భద్రాచలం, తిరుపతి, అహోబిలం, పొట్నూరులో వైష్ణవాలయాలను పున:రుద్ధరించడం జరిగింది. జైన బౌద్ధమతాలు క్షీణదశలోఉండగా పెనుగొండ, కొలనుపాకలో జైన క్షేత్రాలు కొంత ప్రజాదరణ పొందాయి.

## ఆర్థిక పరిస్థితులు:

రాజ్యానికి ప్రధాన ఆదాయం భూమిశిస్తు. భూమి శిస్తు వసూలు చేయుటకు వేలం పద్ధతి ప్రవేశపెట్టారు. ఎవరైతే ఎక్కువ మొత్తాన్ని శిస్తు చెల్లింపుకు ఇష్టపడతారో వారికి ఆ ప్రాంతంపై శిస్తు వసూలు హక్కు కల్పించారు. ఈ విధానం వలన రైతులు

ఎక్కువ దోపిడీకి గురయ్యారు. భూమి శిస్తుతో పాటు ఇతర సుంకాలు వసూలు చేసే అధికారం కూడా వీరికే ఇవ్వబడింది. ఆయా గ్రామాలలో సివిల్, క్రిమినల్ అధికారాలు కూడా వీరికే ఉండేవి. రేవు పట్టణాలలో కూడా రేవు సుంకాలు వసూలు చేయుటకు వేలం పద్ధతిని పాటించారు. శిస్తు వసూలు చేయడంలో జాప్యం అయినట్లైతే, సక్రమంగా చెల్లించనట్లైతే మధ్యవర్తులకు శిక్షలు కఠినంగా ఉండేవి.

రాజ్యంలో సారవంతమైన తీర భూములు, అటవీ సంపద, అపారమైన సహజ సంపద కలిగియుంది. వ్యాపార పంటలైన పొగాకు, పత్తి పోర్చుగీసు వారు ప్రవేశపెట్టారు. ఓరుగల్లు కేంద్రంగా చేనేత వస్త్రాలు, సన్నని నూలుబట్టలు, మచిలీపట్నం కేంద్రంగా కళంకారి అద్దకం పరిశ్రమ, నిర్మల్ మరియు ఇందల్‌వాయి కేంద్రంగా ఖడ్గములు, బాకులు, ఖమ్మంమెట్టు మరియు నల్గొండ కేంద్రంగా నీలిమందు, నర్సాపురంలో నౌక నిర్మాణం, కొండపల్లి కేంద్రంగా వజ్రముల పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. స్వదేశీ ఉత్పత్తులన్ని మచిలీపట్నం రేవు ద్వారా ఆరేబియా, పర్షియా, పెగు దేశాలకు ఎగుమతి చేయబడేవి. దేశీయ వ్యాపారంలో గొల్కొండ రత్నాలు, వజ్రాలు, కస్తూరి, సుగంధ ద్రవ్యాలకు గొప్ప వ్యాపార కేంద్రంగా విలసిల్లింది.

### సాహిత్యం

ఇబ్రహీం కులీ కుతుబ్‌షా పాలనలో తెలుగు, అరబిక్, పర్షియన్, హిందీ భాషల నుండి దక్కని అనే కొత్త పదాలతో ఒక శైలి అభివృద్ధి చెందింది. మరింగంటి సింగరాచార్యులు, అద్దంకి గంగాధరకవి, పొన్నగంటి తెలగనార్యకవి, కందుకూరి రుద్రకవి, ఇబ్రహీం కులీ ఆస్థాన కవులుగా యుండేవారు. గంగాధరకవితాపతి సంవరణోపాఖ్యానం, పొన్నగంటి తెలగనార్యుడు యయాతి చరిత్ర కావ్యాలను రచించారు. ఇవి నాటి సమకాలీన రాజకీయ, సామాజిక, చారిత్రక విశేషాలను తెలియజేస్తున్నాయి.


మహ్మద్ కులీ కుతుబ్‌షా తెలుగు కవులను, పండితులను గౌరవించాడు. హిందువులైన షామాజి, ధర్మరావు, జగపతిరావు, భావేరావులు ఉన్నత పదవులు చేపట్టారు. దక్కని, ఉర్దూ గేయాల్లో తెలుగు పదాలు ప్రయోగించాడు. తన ఆస్థాన కవిగా పట్టమెట్ట సోమయాజ కవిని, కుతుబ్‌షాహీ రాజ్య ప్రధాన పండితుడిగా గణేశ పండితున్ని నియమించాడు. రామిరెడ్డి అనే కవి శివధర్మోత్తరం, పద్మపురాణం రచించాడు. సారంగు తమ్మయ వైజయంతి విలాసం లేక విప్రనారాయణ చరిత్ర రచించాడు. నేబతి క్రిష్ణయామాత్యుడు నీతిరత్నాకరలెన్ని రచించాడు.

కట్టడాలు

కుతుబ్‌షాహి కాలంనాటి కోటలు, మసీదులు, రాజభవనాలు, సమాధులు నాటి వాస్తు శిల్పుల ప్రతిభాపాటవాలకు నిదర్శనం. వీరి నిర్మాణ శైలికి ఒక ప్రత్యేకత కలదు. వీరి రాజధాని నగరమైన గోలకొండ కోట మూడు ప్రాకారములు కలిగి 7 మైళ్ళ కైవారంతో, 50 వేల గృహాలు, 2.5 లక్షల

*గోలకొండ కోట*


జనాభా నివాస యోగ్యంగా నిర్మించారు. ఆనాడు దీని నిర్మాణ వ్యయం 78లక్షల హొన్నులు. నగరం సాధారణ ప్రజలుండే వీధులు, రాజసౌధములు, నగర ప్రాంతం




అను మూడు విభాగాలుగా ఉండేవి. నగరంలో హబ్షీ కమాన్, మఛిలీ కమాన్, చార్‌కమాన్, కటోరా హౌజ్, గుల్జార్ హౌజ్‌లు నాటి ముఖ్య నిర్మాణాలు రాజమహల్ సమీపాన ప్రభుత్వ కార్యాలయాలు, అమాత్యుల మందిరాలు, సైనికుల వసతి గృహాలు, విశ్రాంతి గృహాలుండెను. గోలకొండ దుర్గం 87 బురుజులు, 8 ద్వారాలలో బంజారా, ఫతే దర్వాజాలు ప్రసిద్ధమైన కట్టడాలు. దివాన్ ఇ-ఖాస్ అనే భవనంలో రాజసింహాసనం ఉండేది. బాలహిస్సార్ సమీపాన దర్బార్‌హాల్, తానీషా గద్దె, అను రెండస్థుల భవనం, నగీనాబాగ్‌లు ఉన్నాయి.

హైదరాబాద్ నగర నిర్మాణం అత్యంత అద్భుతం. క్రీ.శ. 1590-91లో శంకుస్థాపన చేయబడి విశాలమైన భవనాలతో రూపుదిద్దుకుంది. ఈ నగరానికి నాలుగు ప్రధాన ద్వారములైన లాల్‌దర్వాజ, ఢిల్లీ దర్వాజ, గౌలీపుర దర్వాజ మరియు ఫతే దర్వాజలను నిర్మించారు. నగరం మధ్యలో చార్మినార్ నిర్మించి నాలుగు వైపులా దారులు నిర్మించారు. దీనికి పశ్చిమాన దౌలత్‌ఖాన్ కమాన్, తూర్పున నక్కర్‌ఖాన్

బురుజు, గోల్కొండ






బంజారా దర్వాజా, గోల్కొండ

కమాన్, ఉత్తరాన మచిలికమాన్, దక్షిణాన చార్మినార్ కమాన్ నిర్మించారు. ఇది ప్రపంచంలోనే అరుదైన కట్టడంగా గుర్తించబడింది. దీని నిర్మాణానికి రెండు సంవత్సరాల సమయం పట్టగా నిర్మాణ వ్యయం మూడు లక్షల హోన్నులు. ఈ నగరంలో 12 వేల అతిథిగృహాలు నిర్మించబడినాయి. జామే మసీదు ప్రత్యేక నిర్మాణం. ఇది చార్మినార్‌కు ఈశాన్య దిశలో ఉన్నది. దీని ఆవరణలో స్నానశాల, అతిథిగృహము, పెద్ద సత్రశాలలున్నాయి. నాడు ఈ నిర్మాణ వ్యయం 2 లక్షలు. చార్మినార్‌కు పడమర రాజప్రాసాదాలు, దాదామహల్ న్యాయస్థానం, ఉత్తరభాగం రాజగృహం, అంతఃపురం ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించారు. చార్మినార్ నైరుతి వైపున మక్కా మసీదు అతివిశాలంగా సుల్తాన్ మహ్మద్ కుతుబ్‌షాచే నిర్మాణం చేపట్టగా, ఔరంగజేబు పూర్తిగావించాడు. వీరి రాజప్రాసాదములు, భవనములు మొగలు రాజ భవనముల కన్నా పెద్దవని, నగరాన్ని సందర్శించిన విదేశీ యాత్రికుల ప్రశంస నాటి ఐశ్వర్యాన్ని సూచిస్తుంది.


లంగర్‌హౌజ్‌కు కార్వాన్ సరాయికి మధ్య కుతుబ్‌షాహీ వంశీయుల సమాధులున్నాయి. వీటికి ప్రాకారాలను నిర్మించారు. హిందూ, ముస్లిం శిల్ప సమ్మేళనంతో నిర్మించబడ్డాయి. ఇవి నేటికిని చెక్కు చెదరక వారి మరణ తేదీలు, పవిత్ర ఖురాన్ సూక్తులు మనకు దర్శనమిస్తాయి.

చార్మినార్



తెలుగు నేలపై స్థాపించబడిన రాజ్యాలలో కుతుబ్‌షాహీల పాలన సముచిత స్థానం ఆక్రమించింది. వీరు తెలుగు ప్రాంతాలను ఏకం చేసి మాతృదేశంగా భావించి తెలుగు సాహిత్యాన్ని ఆదరించి, కవి పండితులను పోషించారు. తెలుగు సంస్కృతిని పరిరక్షించి హిందూ, ముస్లింలను సమ దృష్టితో

కుతుబ్‌షాహీ సమాధులు



చూసి లలితకళలను పోషించారు. ప్రజోపయోగ నిర్మాణాలు, దేవాలయాలు, మసీదులు, బృందావనాలు, ఆరామాలు, తటాకాలు నిర్మించి తమ కీర్తి ప్రతిష్టలను శాశ్వతంగా ఉండేట్లు చేశారు.

## మొఘలుల పాలనలో తెలుగు ప్రాంతాలు:(క్రీ.శ. 1687-1723)

గోలకొండ కుతుబ్‌షాహీల పతనాంతరం ఔరంగజేబు తెలుగు ప్రాంతాలన్నింటిపై రాజ్యాధికారాన్ని విస్తరింపజేసాడు. అనంతరం బీజాపూర్, గోలకొండ రాజ్యాలను విలీనంచేసి క్రీ.శ 1707 నాటికి దక్కన్ రాజ్యాలను పాలనాసౌలభ్యం కోసం ఖాందేశ్, బీరారు, హైదరాబాదు, మచిలీపట్నం, బీజాపూర్, ఔరంగాబాద్ సుభాలుగా విభజించాడు. బీజాపూర్, హైదరాబాదు సుభాల పాలకుడిగా రాకుమారుడైన కాంబక్ష్‌ను నియమించి సహాయంగా విధేయులైన సేనానులను ఉద్యోగులను సుభాలకు పాలకులుగా నియమించాడు.

సుమారు 36 సంవత్సరాల మొఘలుల పాలనలో మతమౌఢ్యమున్న సైనికులు, పాలకులు అనేక హిందు దేవాలయాలను కూలగొట్టారు. హిందూ స్త్రీలను చెరపట్టి, హైందవ సంస్కృతిని హేళనపరచడమేకాక, శిల్పసంపదను చిన్నాభిన్నం చేశారు. గుళ్ల గోపురాలను పడగొట్టించి దర్గాలు ఈద్గాలు నిర్మించారు. పంటపొలాలను విధ్వంసం చేయడమేగాక విశృంఖలంగా దోపిడీలు చేశారు. ఈ పరిస్థితుల్లో ముస్లిం దురాగతాలను సహించని దేశభక్తులు, యువకులు, నాయకులు దుష్టపాలనను అంతం చేసేందుకు విప్లవసంఘాలను ఏర్పచారు.

## సర్వాయి పాపన్న

అలాంటి వారిలో అసమానశౌర్యంతో మొఘల్‌పాలనను వ్యతిరేకించిన సర్వాయిపాపన్న గోలకొండ, నల్లగొండ, ఓరుగల్లు, కరీంనగర్‌లలోని కొన్ని ప్రాంతాలను స్వాధీనపరుచుకొని కొంతకాలం పాలించాడు. నేటి జనగాం సమీపంలోనున్న తాటికొండ, ఖిలేషాపురం గ్రామాలు కేంద్రంగా తన స్నేహితులను, బంధుమిత్రులను, యువకులను సమీకరించి యుద్ధవిద్యలు నేర్పించాడు. వేములకొండ కొండల నడుమ కోటలను నిర్మించి 12 వేల సైన్యాన్ని సమకూర్చుకొని గొలకొండ కోటను ముట్టడించాడు. ఈ ముట్టడిలో హసన్, హుస్సేన్, ఇమాం, దూదెకులపీరు, కుమ్మరి గోవిందన్న, చాకలి సర్వన్న, మంగలి మాసన్న, మీరాసాహెబుల నాయకత్వం వహించగా, సర్వాయిపాపన్న సర్వసైన్యాధ్యక్షునిగా వ్యవహరించారు. క్రీ.శ 1708లో మొహర్రం పండుగనాడు సర్వాయిపాపన్న గొప్ప సైన్యాన్ని సమకూర్చుకొని ఓరుగల్లు కోటను ఆక్రమించాడు. ఈ యుద్ధంలో కోట అధిపతియైన ఖాజీమహ్మద్‌ను ఓడించి విశేషధనరాశులను కొల్లగొట్టారు. భువనగిరి దుర్గాన్ని ముట్టడించి పెద్దమొత్తంలో ధనాన్ని కొల్లగొట్టి తాటికొండ గ్రామంలో కోటను నిర్మించాడు. ఇట్టి విపత్కర పరిస్థితుల్లో

మొఘల్ చక్రవర్తి బహదూర్‌షా గొలకొండ సుబేదార్ యూసఫ్‌ఖాన్ రుజ్‌బహానీ సర్వాయిపాపన్నను బంధించి తుదముట్టించమని ఆదేశించాడు. ఫలితంగా పెద్దసైన్యంతో దిలావర్‌ఖాన్ తాటికొండ కోటను ముట్టడించగా, పాపన్న 9 నెలలపాటు ప్రతిఘటించాడు. చివరకు పరాజయం తప్పదని భావించిన పాపన్న అనుచరులతో కోటనుండి తప్పించుకొని సర్వాయిపేట గ్రామం చేరి కోటను నిర్మించాడు. బలపడుతున్న సమయంలో మొఘల్ సైన్యం నమ్మకద్రోహంతో పాపన్న శిరస్సును ఖండించి గోలకొండ కోటకు వేలాడదీయించింది. సర్వాయిపాపన్న 36 సంవత్సరాలపాటు తెలుగు ప్రాంతాలతో స్వతంత్ర హిందూ రాజ్యాస్థాపనకు కృషిచేసి నల్లగొండ, జగ్గయ్యపేట, వేములకొండ, భువనగిరి, ఖిలేషాపురం, కరీంనగర్ ప్రాంతాలను జయించి పాలించాడు. పాపన్న అతిసామాన్య కుటుంబంలో జన్మించి బీదప్రజల పాలిట దైవంగా, నాయకునిగా పాలకునిగా ఎదిగి తెలుగుపౌరుషాన్ని చాటిన గొప్పవీరుడు.

**అసఫ్ జాహీలు : (క్రీ.శ.1724-1948)**

అసఫ్‌జా వంశ స్థాపకుడైన మీర్ ఖమ్రుద్దీన్ ఖాన్‌ను (క్రీ.శ.1724-1748) నిజాం-ఉల్-ముల్క్ బిరుదుతో మొగలు చక్రవర్తి ఫరూక్‌షియర్‌ను దక్కన్ సుబేదార్‌గా నియమించాడు. తరువాత రాజ్యానికి వచ్చిన ఢిల్లీ చక్రవర్తి మహ్మద్‌షా ఇతని సమర్థతను గుర్తించి ప్రధానిగా నియమించగా సున్నితంగా తిరస్కరించి దక్కన్ సుబేదార్‌గా కొనసాగుటకు నిశ్చయించుకొన్నాడు. కేంద్రప్రభుత్వం బలహీనత కారణంగా సుబేదార్‌లలో స్వార్థపరత్వం పెరిగి బెంగాల్, అయోధ్య సబేదార్‌లు స్వతంత్రించారు. రోహిలాలు, సిక్కులు, జాట్లు, మహారాష్ట్రులు కూడా స్వతంత్రం ప్రకటించుకున్నారు. ఈ సమయంలో దక్కన్ సుబేదార్‌యైన ఖమ్రుద్దీన్ నామమాత్రంగా మొగలులకు సుబేదార్‌గా ఉంటూ క్రీ.శ. 1724 నాటికి గొప్ప సైన్యాన్ని సమకూర్చుకొని స్వతంత్ర రాజ్యం స్థాపించాడు. క్రీ.శ. 1738లో క్రూరాత్ముడైన నాదిర్‌షా ఢిల్లీ నగరాన్ని ఆక్రమించగా చక్రవర్తి ఆహ్వానం మేరకు ఢిల్లీకి చేరి వినయంతో



**మీర్ ఖమ్రుద్దీన్ ఖాన్**

నాదిర్‌షాను ఢిల్లీ నుండి వెళ్ళిపొమ్మని నిజాం-ఉల్-ముల్క్ కోరాడు. అభ్యర్థనను మన్నించి ధన, కనక, వస్తు, వాహనాలను చక్రవర్తినుండి గ్రహించి స్వదేశం వెళ్ళిపోయాడు. క్రీ.శ. 1743లో నిజాం ఉల్ ముల్క్ తిరుచునాపల్లిని తరువాత బాలకొండ కోటలను జయించి రాజ్యాన్ని విస్తరించాడు. విశాలమైన దక్షిణాపథమును పాలిస్తూ తన రాజ్యభాగం కాపాడుకోవడానికి ఫ్రెంచ్, బ్రిటీష్ వర్తక సంఘాలతో స్నేహపూర్వక సంబంధాలను పెంపొందించుకొన్నాడు. క్రీ.శ. 1747లో ఆఫ్ఘనిస్తాన్ పాలకుడైన అహ్మద్‌షా అబ్దాలి ఢిల్లీ ఆక్రమణకు పాల్పడగా మొగలు చక్రవర్తి నిజాం-ఉల్-ముల్క్‌ను అతన్ని ఎదుర్కొవడానికి సహాయంగా రావలసిందిగా కోరగా ఢిల్లీకి బయలుదేరగా మార్గమధ్యంలోనే అనారోగ్యంతో తన 79వ యేట బురహన్‌పూర్‌లో మరణించాడు.

తండ్రి మరణానంతరం నాసర్‌జంగ్ దక్కన్ సుబేదార్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించాడు. సుబేదార్ పదవిని ఆశించిన మేనల్లుడు ముజఫర్‌జంగ్ నాసర్‌జంగ్‌కు వ్యతిరేకంగా కర్నాటక, కర్నూలు నవాబులను, ఫ్రెంచ్ వారిని సహాయమర్థించాడు. ఈ వారసత్వ పోరులో నాసర్‌జంగ్‌ను బ్రిటీష్ వారు రక్షించ యత్నించి విఫలం కాగా నాసర్‌జంగ్ సైన్యం ఫ్రెంచ్‌వారి కుట్రలో భాగమై యుద్ధంలో పాల్గొనకుండా ఉన్నందున నాసర్‌జంగ్ చంపబడినాడు. పిదప ఫ్రెంచ్ గవర్నర్ డూప్లే ముజఫర్‌జంగ్‌ను దక్కన్ సుబేదార్‌గా ప్రకటించాడు. దీనికి ఫలితంగా ఫ్రెంచ్ వారికి కృష్ణానది దక్షిణ భూభాగంపై అధికారం కల్పించాడు. బుస్సీ నాయకత్వాన ఫ్రెంచ్ సైన్యం పాండిచ్చేరి నుండి వెంటరాగా హైదరాబాద్‌కు పయనమయ్యాడు. మార్గమధ్యంలో మొగలు సైన్యం, పఠాన్‌లు రాయచోటి ప్రాంతంలో కర్నూలు నవాబైన హిమ్మత్‌ఖాన్ అడ్డగించి ముజఫర్ జంగ్‌ను హత్యగావించాడు. బుస్సీ సమయస్ఫూర్తితో వ్యవహరించి నిజాం ఉల్ ముల్క్ మూడవ కుమారుడైన సలాబత్ జంగ్‌ను దక్కన్ సుబేదార్‌గా నియమించాడు. ఇందుకు బహుమానంగా కృష్ణానదికి దక్షిణ భూభాగాలకు తోడుగా కొండవీడు, నిజాంపట్నం, నరసాపురం, మచిలీపట్నం ప్రాంతాలను ఫ్రెంచ్‌వారికి ఇచ్చాడు. ఔరంగాబాద్‌లో ఉన్న ఫ్రెంచ్ సేనలకు జీతభత్యాలు సలాబత్‌జంగ్ చెల్లించే విధంగా బుస్సీ ఒత్తిడి చేయగా ఖజానాలో ద్రవ్యం లేని కారణంగా ఉత్తర సర్కార్ జిల్లాలను సైనిక వ్యయం క్రింద దారాదత్తం చేశాడు. ఉత్తర సర్కార్‌లోని జమీందార్‌లు, రాజులు ఫ్రెంచి అధికారాన్ని సవాలు చేయగా 1757లో బుస్సీతో జరిగిన బొబ్బిలియుద్ధంలో స్థానిక రాజులు పరాజయం కాగా ఫ్రెంచివారికి విజయం చేకూరింది. ఉత్తర కోస్తా ప్రాంతంపై ఫ్రెంచి పాలనను తుదముట్టించడానికి విజయనగరం రాజా, రాబర్ట్‌క్లైవ్ సహాకారాన్ని

అర్థించగా, కల్నల్‌ఫోర్డ్ నాయకత్వంలో ఫ్రెంచివారిపై యుద్ధాన్ని ప్రకటించి రాజమండ్రి వైపు పురోగమించి 1759లో చందుర్తి యుద్ధంలో ఫ్రెంచి సేనలను ఓడించారు. ఇందుకు ప్రతిఫలంగా ఆంగ్లేయులకు నిజాంపట్నం, కొండపల్లి, మచిలీపట్నంలపై అధికారం దక్కింది. 1760లో సోదరుడైన నిజాం అలీఖాన్ సైన్యంతో వెంటరాగా ఉద్గీర్ ప్రాంతంలో మహారాష్ట్రపై దండెత్తి ఓటమి పాలై సంధి చేసుకొని బీజాపూర్, దౌలతాబాద్‌లను వారికి ఇచ్చాడు. నిజాం అలీఖాన్ ఔరంగాబాద్‌కు తిరిగి రాగానే సలాబత్ జంగ్‌ను బంధించి అధికారాన్ని చేపట్టిన తరువాత సలాబత్‌జంగ్‌ను బీదర్ కోటలో ఖైదు చేయగా అతను అక్కడే మరణించాడు.



*నిజాం అలీఖాన్*

నిజాం అలీఖాన్ (1762-1803) అసఫ్‌జా వంశీయు లలో రెండవ నిజాం ప్రభువుగా కీర్తించబడినాడు. అధికారం చేపట్టగానే రాజ్యమంతా పర్యటించి ఆంగ్లేయుల సహాయానికి ఉత్తర సర్కార్‌లైన రాజమండ్రి, ఏలూరు, ముస్తఫానగర్ లపై అధికారం కట్టబెట్టాడు. మహారాష్ట్రులు అసఫ్‌జా రాజ్యభాగాలలో చౌత్, సర్దేశ్‌ముఖ్ వంటి పన్నులను బలవంతంగా వసూలు చేస్తున్నారు. పన్నులు ఆపమని మహారాష్ట్ర పీష్వా అయిన నాన ఫడ్నవీస్‌ను కోరగా అతను నిరాకరించి లక్ష కాల్బలంతో దండెత్తి రాగా నిజాం అలీఖాన్ ఆంగ్లేయుల సహాయం కోరగా సర్‌జాన్‌షోర్ నిరాకరించాడు. క్రీ.శ. 1795లో ఖండాలా వద్ద జరిగిన యుద్ధంలో నిజాం సేనలు ఓడిపోయి మహారాష్ట్రులతో సంధి చేసుకొని తపతీనది పరివాహక ప్రాంతం, దౌలతాబాద్ దుర్గం, యుద్ధనష్టపరిహారం క్రింద మూడుకోట్ల ధనం చెల్లించాడు.

నిజాం అలీఖాన్ ఆంగ్లేయుల పట్ల వైరం పెంచుకొని ఫ్రెంచ్‌వారిని తన రాజధానికి ఆహ్వానించి సైన్య ఖర్చుల నిమిత్తం మెదక్ ప్రాంతాన్ని ఇచ్చాడు. అనంతరం ఆంగ్లేయులు తమ తప్పిదాన్ని గ్రహించి నిజాం అలీఖాన్‌కు దగ్గరయ్యేందుకు దుబాసియైన కాంగ్రేగుల జోగి పంతులు ద్వారా ప్రయత్నాలారంభించారు. నిజాంతో

సైన్య సహాకార సంధి చేసుకొని రెసిడెంటు జేమ్స్ పేట్రిక్‌ను రాయబారిగా పంపించారు. భారతదేశంలో వెల్లస్లీ సైన్యసహాకార సంధిని మొదటగా అంగీకరించిన నిజాం ఉత్తర సర్కార్‌లు, గుంటూరు, రాయలసీమ ప్రాంతాలపై ఆంగ్లేయులకు అధికారాన్ని కట్టబెట్టాడు. సంధి షరతుల ప్రకారం ఫ్రెంచ్ సేనలు వైదొలగగా ఆంగ్లేయులు పూర్తి స్థాయిలో నిజాంకు సహకరించారు. హైదరాబాద్ నగరమున ఆంగ్లేయుల సైన్యానికి హుసేన్‌సాగర్‌కు ఉత్తర ప్రాంతమున వసతులు ఏర్పరచి కుమారుడైన సికిందర్‌జా పేరున సికింద్రాబాద్ నగరాన్ని నిర్మించాడు. దానినే లష్కర్ అంటారు. (లష్కర్ అనగా సైనిక స్థావరం)


*గన్‌ఫౌండ్రి*

క్రీ.శ. 1777లో నిజాం రాజ్యంలో అనావృష్టికి గురికాగా నిజాం అలీఖాన్ ధాన్యాన్ని, ధనాన్ని విరివిగా ప్రజలకందించి ఆదుకొన్నాడు. మూసీ నది వరదలతో ఉప్పొంగి చాలా నష్టం కలిగించగా పురానాపూల్ ప్రాంతం జలమయ మైంది. నగర పునరుద్ధరణ కోసం చాలా ధనాన్ని వెచ్చించాడు. రాజమార్గాల్లో బాటసారుల సౌకర్యార్థం సత్రాలు నిర్మించి బావులను త్రవ్వించాడు. లలిత కళలను ప్రోత్సహించాడు. ఫ్రెంచ్ సైన్యం నిజాం కొలువులో ఉండగా యుద్ధావసరాలకు కావలసిన ఫిరంగులు నిర్మించిన స్థలం హైదరాబాద్‌లో గన్‌ఫౌండ్రీగా పిలువబడుతుంది.


*సికిందర్ జా*

42 సంవత్సరాల సుదీర్ఘ పాలనలో అతి సమర్థుడుగా పేరుగడించాడు. రాజధాని నగరంగా హైదరాబాద్‌ను సుందరంగా తీర్చిదిద్దాడు. ఇతని సేనాని మీర్ ఆలం పేరున మీరాలం చెరువు త్రవ్వించాడు. నగరంలో అందమైన ఉద్యాన వనాలు, రాజభవనాలు, వసతి గృహాలు నిర్మించాడు. ఇతను నిర్మించిన భవనాలలో మోతీమహల్, రోషన్‌బంగ్లా, గుల్షన్‌మహల్, చార్ బంగ్లాలు ముఖ్యమైనవి.

నిజాం అలీఖాన్ తరువాత కుమారుడైన సికిందర్‌జా (క్రీ.శ. 1803 - 1829) రాజ్యాధికారాన్ని

చేపట్టాడు. మహారాష్ట్రులతో బ్రిటీష్ వారికి జరిగిన యుద్ధంలో నిజాం సైన్యం చేసిన సహాయానికి గోదావరి పరివాహక ప్రాంతం సికిందర్‌జాకు దక్కింది. ఇతని పాలనలో నిజాం రాజ్యం పేష్కారుగా చందులాల్ వ్యవహరించిన కాలంలో ఆర్థిక సంక్షోభానికి గురైంది. చివరి పాలనా కాలంలో ఆంగ్లేయ అధికారుల జోక్యం వలన పరిపాలన, పన్నుల సంస్కరణల వలన ఆర్థిక పరిస్థితి చక్కబడింది.

తరువాత కుమారుడైన నాసిరుద్దౌలా (క్రీ.శ. 1829-1857) అధికారాన్ని చేపట్టి, మితిమీరుతున్న ఆంగ్లేయుల జోక్యం తగ్గించాడు. ఇతని పాలనలో మితిమీరుచున్న బ్రిటిష్‌వారి జోక్యానికి వ్యతిరేకంగా ముస్లింలు సికిందర్‌జా మూడో కొడుకైన ముబారిజ్ ఉద్దౌలా నాయకత్వంలో వహబీ ఉద్యమం ప్రారంభమైంది. ఇతనికి తోడుగా కర్నూలు నవాబు గులాంఖాన్ కూడా ఉద్యమాన్ని బలపర్చి చురుకుగా పాల్గొన్నాడు. రాజ్యంలో ఆర్థిక స్థితి క్షీణదశలో ఉండగా బీరారు, ఉస్మానాబాద్, రాయచూర్ జిల్లాలను ఆంగ్లేయులకు ఇవ్వడంతో కొంత రుణం సర్దుబాటయ్యింది. హైదరాబాద్ నగరంలో ఉన్న అరబ్బులు, రోహిల్లాలు ప్రభుత్వానికి అప్పులిచ్చి ఆదుకొన్నారు. దీనికితోడు సమర్థుడుగా పేరున్న మొదటిసాలార్‌జంగ్‌ను దివాన్‌గా నియమించగా సమయస్ఫూర్తితో రాజ్య ఆర్థిక పరిస్థితిని మెరుగు పర్చడానికి పాలనలో అనేక సంస్కరణలు తీసుకువచ్చాడు. పరిశ్రమలను ప్రోత్సహించడానికి క్రీ.శ. 1856లో నగరంలో పారిశ్రామిక ప్రదర్శన ఏర్పాటు చేయించాడు. ప్రభుత్వ ఆదాయానికి అనేక మార్గాలు అన్వేషించి ఆర్థిక పరిస్థితిని చక్కబరిచాడు.

నాసిరుద్దౌలా పెద్దకుమారుడైన అఫ్జలుద్దౌలా క్రీ.శ. 1857లో రాజ్యాధికారాన్ని చేపట్టాడు. ఇదే సంవత్సరంలో బ్రిటీషు వారికి వ్యతిరేకంగా సిపాయిల తిరుగుబాటు ప్రారంభమైంది. దేశభక్తులు, నిజాం రాజ్యంలో కూడా ఆంగ్లేయులకు వ్యతిరేకంగా హైదరాబాద్, ఔరంగాబాద్, ఆదిలాబాద్ ప్రాంతాలలో ఉద్యమం చేపట్టారు. హైదరాబాద్‌లో మౌల్వీ ఇబ్రహీం నాయకత్వంలో ఈ ఉద్యమం కొనసాగింది. ఉద్యమకారులకు నిజాం ప్రభువు సహకరించాలని మసీదు గోడలకు పోస్టర్లు అంటించారు. కోఠి ప్రాంతంలోని రెసిడెంట్ భవనాన్ని ఉద్యమకార్లు ముట్టడించారు. తుర్రేబాజ్‌ఖాన్, మౌల్వీ అల్లాఉద్దీన్, రోహిల్లాలకు, ఉద్యమకారులకు నాయకత్వం



అఫ్జల్ ఉద్దౌలా

వహించారు.  మొదటి సాలార్‌జంగ్ ఉద్యమ అణచివేతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకొన్నారు.  మేజర్ బ్రిక్స్ నాయకత్వాన ఉద్యమకారులపై కాల్పులు జరుపగా అనేకులు మరణించగా తుర్రేబాజ్‌ఖాన్‌ను తూప్రాన్ వద్ద బంధించారు.  చెరసాలనుండి తప్పించుకొని పారిపోయిన తుర్రేబాజ్‌ఖాన్‌ను వారం రోజుల్లో బంధించి కాల్చి చంపారు. హైదరాబాద్ నగరంలో బహిరంగ స్థలంలో అతని మృతదేహాన్ని వేలాడదీశారు.

నిర్మల్ ప్రాంతంలో రోహిల్లాలు రాంజీగోండు నాయకత్వాన వేలాదిమంది గోండు విప్లవ కారులు అలజడులు సృష్టించారు.  నిర్మల్ తాలూకాలో రాంజీగోండును పట్టుకోవడానికి అతను నివసించే ప్రాంతాన్ని చుట్టుముట్టగా రాంజీ గోండు వెంట 200 మంది రోహిల్లాలు, 300 మంది గోండులు ఉండగా చాలా రక్తపాతం జరిగిన పిదప ఎట్టకేలకు రాంజీ గోండును బంధించి నిర్మల్ పట్టణంలో ఉరితీశారు.  ఈ అపత్‌కాలంలో ఆంగ్లేయులకు సంపూర్ణ సహకారాలు అందించిన నిజాం ప్రభువుకు పతాకంతో పాటు స్టార్ ఆఫ్ ఇండియా బిరుదుతో సత్కరించారు.  నిజాం చెల్లించాల్సిన రుణాన్ని కూడా రద్దుచేసి రాయచూరు, గుల్బర్గా జిల్లాలు నిజాం రాజ్యంలో విలీనం చేశారు.

క్రీ.శ. 1858 నుండి భారతదేశ పాలన బాధ్యతలు విక్టోరియా మహారాణి స్వీకరించింది.  ఇదే కాలంలో నిజాం రాజ్యంలో సాలార్‌జంగ్ అనేక పరిపాలనా సంస్కరణలు ప్రవేశపెట్టారు.  జిలాబంది విధానం ప్రవేశపెట్టి రాజ్యాన్ని ఆరు సుభాలు, 17 జిల్లాలు, అనేక తాలూకాలుగా విభజించారు. న్యాయశాఖ, పోలీసు శాఖలను సంస్కరించాడు. రాజ్యంలో పాశ్చాత్య విద్యను ప్రోత్సహిస్తూ అనేక విద్యాలయాలు, ఫారసీ, ఉర్దూ, అరబ్బీ, తెలుగు, మరాఠీ, కన్నడ, అంగ్ల భాషల్లో స్థాపించాడు.


మహబూబ్ అలీఖాన్

తండ్రి మరణానంతరం మహబూబ్ అలీఖాన్ చిన్నవాడై నందున రాజ్యపాలన వ్యవహారాలు చూడడానికి సాలార్‌జంగ్ సహపాలకుడి గా పనిచేస్తూ, పాలనలో బ్రిటీష్ జనరల్‌లను కూడా నియమించాడు. మొదటి సాలార్‌జంగ్ పరిపాలనా సంస్కరణలో భాగంగా అటవీ, తపాలా, రెవెన్యూ, విద్య, వైద్య, ఆరోగ్య శాఖలను ఏర్పాటు చేశాడు.  ఇతని తరువాత రెండవ సాలార్‌జంగ్,

సర్ కిషన్‌ప్రసాద్‌లు ప్రధానమంత్రిగా పదవి చేపట్టారు. మహబూబ్ అలీఖాన్ ఇంపీరియల్ సర్వీస్ అను సైనిక వ్యవస్థను ఏర్పరచాడు. కేబినెట్ కౌన్సిల్ ఏర్పరచి అమాత్యులు, అధికారులు, జాగీర్దారులు, వ్యాపారులను ప్రతినిధులుగా నియమించారు. అప్పటి నిజాం రాజ్యం తెలంగాణ ప్రాంతంలో అత్రాఫ్‌బల్దా, మెదక్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్లగొండ, మహబూబ్‌నగర్‌లుగాను, మహారాష్ట్ర ప్రాంతంలో ఔరంగాబాద్, బీడ్, పర్భిణి, నాందేడ్, ఉస్మానాబాద్‌గాను, కర్ణాటక ప్రాంతంలో గుల్బర్గా, రాయచూర్, బీదర్ జిల్లాలతో కూడిఉంది. మహారాజ కిషన్‌ప్రసాద్ బహదూర్ దివాన్‌గా పాలనా దక్షుడిగా పేరుగాంచి ముస్లిం వనితలను వివాహమాడి మతసామరస్యానికి దోహదపడినాడు. క్రీ.శ. 1906-1907లో మూసీ నది పొంగి హైదరాబాద్‌లో అఫ్జల్‌గంజ్, దివాన్‌దేవుడి, చాదర్‌ఘాట్ ప్రాంతాలు జలమయమై వేల కొలది ప్రజలు నిరాశ్రయులైనారు. వందలాది మంది మరణించారు. నిరాశ్రయులైన వారికి వసతి, ఆహార ధాన్యాలు సరఫరా చేసి నిజాం ప్రభువు తన ఉదారతను చాటుకొన్నాడు.



*మీర్ ఉస్మాన్ అలీఖాన్*

అసఫ్‌జాహీలలో చివరివాడైన ఉస్మాన్ అలీఖాన్ (1911- 1948) రాజ్యాధికారం చేపట్టేనాటికి రాజ్యం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. పరిపాలనా నిర్వహణ కోసం సలహా మండలిని ఏర్పాటు చేశాడు. హైదరీ, అమీన్‌జంగ్, ఇమాముల్క్ సభ్యులుగా రాష్ట్ర ఆర్థిక, పరిపాలన సంక్షేమ కార్యకలాపాలను పర్యవేక్షించడం ద్వారా రాజ్యాభివృద్ధికి తోడ్పడ్డారు. క్రీ.శ. 1914లో ఆరంభమైన మొదటి ప్రపంచ యుద్ధంలో బ్రిటీష్ వారికి సహాయంగా సైనిక, ఆర్థిక సహాయాన్ని నిజాం ప్రభువు అందించినందుకు కృతజ్ఞతగా బ్రిటీష్ చక్రవర్తి ఐదవ జార్జి "నిజాం అత్యంత విశ్వాసపాత్రుడని" గౌరవించాడు.

ఉస్మాన్ అలీఖాన్ తన మంత్రిమండలిని ఏడుగురు సభ్యులతో ఏర్పాటు చేశాడు. సాలార్‌జంగ్, సర్‌హైదర్, కిషన్‌ప్రసాద్ బహదూర్, సర్‌మీర్జా ఇస్మాయిల్‌లు ప్రసిద్ధులు. హైదరాబాద్ నగర కోత్వాల్‌గా రాజబహదూర్ వెంకటరామరెడ్డి పనిచేసిన కాలంలో అనేక విద్యాసంస్థల్ని స్థాపించారు.

## సామాజిక, మత పరిస్థితులు


నిజాం రాజ్యంలో 1901 గణాంకాల ప్రకారం హిందువులు 88.6%, ముస్లింలు 10.4% కాగా మిగతావారు జైనులు, క్రైస్తవులు, పార్సీలు హిందూ మతం నందు 21 కులాలలో 26% కాపులు, 14% అంటరానివారు కాగా, గొల్ల, బ్రాహ్మణ, వైశ్య, గొండ్ల, లంబాడ, గొండు, బిల్లులు వంటి జాతులవారున్నారు. జనాభాలో అధికశాతం హిందువులున్నప్పటికి పరిపాలనలో పాల్గొనే అవకాశం చాలా పరిమితంగా ఉండేది. పాలక వర్గానికి చెందిన స్థానిక ముస్లింలు, ఉద్యోగార్థం వచ్చిన కాయస్థులు మున్నగు వారితో హిందూ, ముస్లింల మధ్య సామరస్య పూరిత వాతావరణం నెలకొంది. వివక్షత లేకుండా చందులాల్, రాజారాం, మహిపతి రాం, మహరాజ కిషన్ ప్రసాద్, రాజబహుదూర్ వెంకట్రాంరెడ్డి వంటి పలువురు నిజాం దర్బారులో ఉన్నత పదవులు చేపట్టారు. భిన్న సంస్కృతుల మధ్య సాన్నిహిత్యం పెరిగి మతాంతర వివాహములు ప్రోత్సాహించబడ్డాయి. మహబూబ్ అలీఖాన్ పాలనలో దివాన్‌గా నున్న మహరాజ కిషన్ ప్రసాద్ ముస్లిం స్త్రీలను వివాహమాడాడు. సామాన్యుల పరిస్థితి మిక్కిలి దుర్భరంగా వెట్టిచాకిరి, అక్రమ వసూళ్ళతో పీడనకు గుర్రైయ్యే వారు, పటేల్, పట్వారీలు, జాగీర్దారులు, జమీందారులు, దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేలు ప్రజల్ని పీల్చి పిప్పి చేశారు. వీరితోపాటు రోహిల్లాలు గ్రామాలను దోచుకొనుచూ ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేసి హింసించారు. నాటి అరాచక పరిస్థితుల వర్ణన 1830 లో ఏనుగుల వీరస్వామయ్య తన కాశీయాత్రలో చక్కగా వర్ణించాడు. జమీందారులు తరచుగా గొడవపడుతూ ఉండడం వల్ల శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడేది.

వీరిపాలనలో మతసామరస్యం పేర్కొనదగింది. నిజాం అలీఖాన్, భద్రాచల రామాలయానికి 40 వేల ఆదాయాన్నిచ్చే జాగీరును మంజూరు చేశారు. నాసీరుద్దౌలా, స్వామి కళ్యాణానికి కానుకలు పంపించేవారు. దివాన్ చందులాల్ శ్రీశైలం, తిరుపతి, అహోబిలం, భద్రాచలం దేవాలయాలకు మాన్యాలు ఇచ్చాడు.

## ఆర్థిక పరిస్థితులు

ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. జాగీర్దారుల దోపిడి ఫలితంగా అతివృష్టి, అనావృష్టిలో సైతం పన్నుల భారం తప్పేది కాదు. వెట్టిచాకిరి, లెవి సమస్య, ఉద్యోగుల దౌర్జన్యం నిత్యకృతంగా భరింపరానిదిగా మారింది. రాజ్యంలో 40% శాతం భూములు జాగీరులే. జాగీరుదారులు పోలీసు, న్యాయ వ్యవహారాలు కలిగి సర్వాధికారాలు చలాయించేవారు. రైతులు సేద్యం చేసే భూములపై పట్టా హక్కు

ఉండేది కాదు. రైతు శాశ్వతంగా కౌలుదారుగా ఉండేవాడు. ఖాల్సా (ప్రభుత్వ) గ్రామాల కంటే వీరి భూములపై 25-30 శాతం శిస్తు అధికంగా వసూలు చేసేవారు.




*హిమయత్ సాగర్, హైదరాబాద్*

వ్యవసాయ రంగాన్ని ప్రోత్సాహించేందుకు మీర్‌ఆలం చెరువు, ఉస్మాన్ అలీఖాన్, ఉస్మాన్‌సాగర్ నిర్మించి మూసి వరద రాకుండా నివారించాడు. వీటితోపాటు నిజాం సాగర్, హిమాయత్ సాగర్ ప్రాజెక్టులు నిర్మించి వ్యవసాయరంగాన్ని ప్రోత్సాహించాడు. రాజ్యంలోని గత పాలకులు నిర్మించిన చెరువులు, పెద్ద జలాశయాలు మరమ్మత్తులు చేసి పున:రుద్ధరించాడు. వ్యవసాయ అభివృద్ధికి నిజాంసాగర్, హిమాయత్‌సాగర్ నిర్మించి పంటకాలువలు త్రవ్వించాడు. సర్ విశ్వేశ్వరయ్య నిజాం సాగర్‌కు రూపకల్పన చేయగా నాటి చీఫ్ ఇంజనీర్ నవాబ్ జంగ్ నిర్మాణ బాధ్యత వహించాడు.

ఉస్మాన్ అలీఖాన్ పాలనలో అనేక పరిశ్రమలు వృద్ధి చెందాయి. గద్వాల, సిద్ధిపేట, ఆదిలాబాద్, ఔరంగాబాద్, వరంగల్‌లో పట్టు, చేనేత పరిశ్రమలు ఏర్పడినాయి. వరంగల్ నవారు, తివాచీలు, జంపఖానాలు, దుప్పట్ల తయారీలను, బోధన్‌లో చక్కెర పరిశ్రమ, సిర్పూర్, బల్హార్షాల్లో సిల్కు, కాగిత పరిశ్రమకు ప్రసిద్ధి చెందాయి. వరంగల్

నందు అజంజాహి బట్టల మిల్లు, హైదరాబాద్‌లో చార్‌మినార్, గోలకొండ సిగరేట్ పరిశ్రమలు, ఆల్విన్ సంస్థ, హిందుస్తాన్ మిషన్ టూల్స్ పరిశ్రమలు ఏర్పడ్డాయి. ఉన్నత రాజసౌధాలు, హైకోర్టు భవనం, ఉస్మానియా వైద్యశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయం, అసఫ్‌జా గ్రంథాలయం, యునాని దవాఖానాలతో పాటు జిల్లా కేంద్రాలలో పరిపాలనా భవనాలు నిర్మించారు. ప్రాచీన కళాసంపద పరిరక్షణకై పురావస్తు శాఖను ఏర్పాటు చేసి ప్రాచీన కట్టడాల రక్షణ, శాసనాల సేకరణ, ప్రచురణ బాధ్యతలను చేపట్టారు. అజంతా, ఎల్లోరా గుహలు, బౌద్ధారామాలు, విహారాలు, చైత్యాలయాలు, కోటలు, రామప్ప, వేయిస్థంబాల గుడి, వరంగల్ కోట, పానుగల్లు, కొలనుపాక, ఏలేశ్వరం, పిల్లలమర్రి, నాగులపాడు, మక్కామసీదు, చార్మినార్, గోలకొండ కోట, కుతుబ్‌షాహీల సమాధులు, భువనగిరి, బీదర్, రాచకొండ దుర్గాల రక్షణకు చర్యలు తీసుకున్నారు.



ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్

నిజాం రాజ్యంలో నిజాం స్టేట్ రైల్వే, నిజాం రోడ్‌ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ ప్రవేశపెట్టారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం 1400 ఎకరాల విస్తీర్ణంలో 1917లో స్థాపించారు. దీనికి అనుబంధంగా వైద్య, విద్య, సాంకేతిక, న్యాయ, వ్యవసాయ కళాశాలలు స్థాపించారు.

ఆంగ్లేయుల ప్రవేశం వలన స్వదేశీ పరిశ్రమలు నిరాదరణకు గురైయ్యాయి.

దివాన్ సాలర్‌జంగ్ పరిశ్రమలు ప్రోత్సాహించడానికి దేశీయ పరిశ్రమల ప్రదర్శన ఏర్పాటు చేశారు. మీర్‌మహబూబ్ అలీఖాన్ పాలనలో దివాన్ సాలార్‌జంగ్ హైదరాబాద్ నుండి సోలపూర్‌కు రాజమార్గం వేయించాడు. హైదరాబాద్ నుండి వరంగల్, మచిలీపట్నం,కర్నూలు, నిజామాబాద్,నాగపూర్‌లను కలుపుతూ రహదారులు బ్రిటిష వారి సహకారంతో నిర్మించారు. ఇవి నాటి రాజ్య భద్రత దృష్ట్యా, సైనిక అవసరాల దృష్ట్యా, నిర్మించారు. హైదారాబాద్ నుండి వాడి వరకు, హైదరాబాద్ నుండి విజయవాడ వరకు, హైదరాబాద్ నుండి చాందా వరకు రైల్వేలు అభివృద్ధిపరిచారు.

**కట్టడాలు**

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన చారిత్రక వారసత్వపు నిర్మాణాలు నిజాం పాలనలో రూపుదిద్దుకొన్నాయి. అడుగడుగున అబ్బురపరచే అనేక అద్భుత కట్టడాలలో ప్యాలెస్‌లు, విశాల భవన ప్రాంగణాలు, సమాధులు, దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు, మిలటరీ జైలు నిర్మాణాలతో అలరారుతూ హెరిటేజ్ సిటీగా హైదరాబాద్ పేరుగాంచింది. జిల్లా కేంద్రాలలో కలెక్టరేట్ భవనాలు, జిల్లా న్యాయస్థానాల భవనాలతో ఇతర (ప్రభుత్వ కార్యాలయాలు), పాఠశాలలు నాటి వాస్తు నిర్మాణ కౌశలానికి నిదర్శనాలు.

అసఫ్‌జాహీల నిర్మాణాలలో హైదరాబాద్ నగరంలోని మక్కామసీదు సమీపంలోని నిజాం ప్రభువుల నివాస భవనం చౌమహల్లా ప్యాలెస్, దిల్‌సుఖ్‌నగర్‌లో వున్న విక్టోరియా హోం, సంతోష్ నగర్ నగర్ జంక్షన్ దగ్గర వున్న పాయిగా ప్రభువుల సమాధులు దక్షిణ భారత తాజమహల్‌గా కీర్తించబడినాయి. మలక్‌పేట దగ్గర వున్న రేమండ్స్ సమాధి, తిరుమలగిరి సమీపంలోని 1858లో నిర్మించిన బ్రిటిష్ వారి మిలటరీ జైలును అండమాన్ దీవుల్లోని సెల్యులార్ జైలు 'కాలాపాని' నిర్మాణ శైలిలో నిర్మించినట్లు చెబుతారు. ఫలక్‌నుమా ప్యాలెస్, తారామతి, బారాదరి, చార్‌కమాన్, సీతారాంబాగ్‌లోని సీతారాముల ఆలయం, ఆల్వాల్ లోని శ్రీ వెంకటేశ్వరాలయం, పబ్లిక్‌గార్డెన్‌లో వున్న పురావస్తు మ్యూజియం భవనం, నేటి అసెంబ్లీ నిర్మాణం సందర్శకులను విశేషంగా ఆకట్టుకొంటున్నాయి.


నిజాం ప్రభువుల కాలంలో మహిళలకోసం ఆరవ నిజాం ప్రభువు మహబూబ్ అలీఖాన్ పేరుమీద మహబూబియా కళాశాలను నిర్మించారు. అల్పసంఖ్యాకులైన పార్శీల అగ్నిదేవాలయం,ఇండో యూరోపియన్ ఆర్కిటెక్చర్‌తో 1904లో నిర్మించబడిన పురాతన కట్టడం. నిజాం ప్రభువులు పరమత సహనాన్ని ప్రదర్శించి అనేక చర్చిల

నిర్మాణానికి అనుమతినిచ్చారు. అబిడ్స్ ప్రాంతంలోని సెయింట్ జార్జి చెర్చి, సికింద్రాబాద్‌లోని సెయింట్ క్రీస్ట్ చర్చి, గన్‌ఫౌండ్రిలోని సెయింట్ జోసఫ్ కేథడ్రెల్‌లు యూరోపియన్ వాస్తుశిల్ప శైలిలో నిర్మించబడినాయి.


నేటి కోఠి మహిళా కళాశాల నాటి బ్రిటిష్ రెసిడెన్సి చారిత్రక విశిష్టత గల పురాతన వారసత్వ సంపద. జమిందార్లు, ఆంగ్లేయ ప్రభువుల పిల్లలకి విశాల ప్రాంగణంలో నిర్మించిన హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ రాచరిక ఠీవికి నిదర్శనంగా నేటికీ అలరారుతోంది. 1400 ఎకరాల సువిశాల స్థలంలో నిర్మించిన ఉస్మానియా విశ్వవిద్యాలయ భవనాలలో 1933లో ఈజిప్ట్ దేశభక్తుడైన ప్రముఖ ఆర్కిటెక్ట్ జాస్పీర్ నేటి ఆర్ట్ కళాశాలను ఇండో సార్సానిక్ శైలిలో భవనానికి రూపకల్పన చేశాడు. 1939 నాటికి భవనాలు పూర్తికాగా, ఏడవ నిజాం ప్రభువు చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. 1925లో 27 ఎకరాల విస్తీర్ణంలో అత్యంత అద్భుతంగా నిర్మించిన అఫ్జల్‌గంజ్‌లోని ఉస్మానియా జనరల్ హాస్పటల్ ధర్మాసుపత్రిగా పేరొంది పేదరోగుల పాలిట వరంగా మారింది. మూసీనదీ తీరంలో నయాపూల్‌కు సమీపాన ఎరుపు, తెలుపు రాయితో రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన శంకర్‌లాల్ ప్రణాళికతో ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ పాలనలో 1920లో హైకోర్టు భవనం నిర్మించబడింది. మతసామరస్యానికి ప్రతీకగా ఈ హైకోర్టు భవనంపై రాం-రహీమ్ వ్రాయబడినాయి. దీనికి సమీపంలోని మరో ప్రధాన కట్టడం సిటీ కాలేజి. ఇది హిందూ-ఇస్లామిక్ నిర్మాణశైలిలో నూరుకు పైగా గదులతో నిర్మించిన భవన సముదాయం. అసఫ్‌జాహీ పాలకుల నిర్మాణాలలో మరో ఆణిముత్యం సిటీ సెంట్రల్ లైబ్రరీ. వేలమంది పాఠకులు చదువుకునేందుకు వీలుగా ఇండో యూరోపియన్ శైలిలో నిర్మించిన ఎత్తైన భవనం. ఎర్రమంజిల్ ప్యాలెస్ భవనం, ఆస్మాన్‌ఘర్ ప్యాలెస్, కింగ్ కోటి ప్యాలెస్, దివాన్ దేవిడి వంటి భవనాలను అసఫ్‌జాహీల కాలంనాటి వాస్తు కళాభ్యున్నత్యానికి అద్దం పడతాయి.

## సంస్థానాల పాలనలో తెలుగు ప్రాంతాలు


తెలుగు ప్రాంతాలన్ని నిజాం రాజ్యంలో దేశ్‌ముఖ్, దేశ్‌పాండే, జాగీర్దార్లులతోపాటు అనేక సంస్థానాలు ఏర్పడి పరిమిత స్వతంత్రంగా పాలనా వ్యవహారాలు నిర్వహించాయి. గద్వాల, అమరచింత(ఆత్మకూరు), జటప్రోలు (కొల్లాపూర్), వనపర్తి, నారాయణపూర్, పాపన్నపేట, దోమకొండ, రాజపేట్, గోపాల్‌పేట, పాల్వంచ విజయనగరం, బొబ్బిలి, వెంకటగిరి, అనెగొంది, పఠాపురం,



ఫలక్‌నుమా ప్యాలెస్, హైదరాబాద్



పాయగా టూంబ్స్, సంతోష్‌నగర్, హైదరాబద్



పాయగా టూంబ్స్ పై కళాత్మకత

మునగాలతోపాటు రాయలసీమలో ముక్త్యాల, చల్లపల్లి, సాలూరు, బనగానపల్లి, పానుగాల్లు, పోలవరం, కాళహస్తి ప్రధాన సంస్థానాలుగా వెలుగొందాయి. ఈ సంస్థానాల పాలకులు కాకతీయులు, విజయనగర రాజవంశాల వారికి సామంతులుగా తెలుగు ప్రాంతాలను పాలించాయి. తరువాత నిజాం పాలనాలోనూ తమ ఉనికి కొనసాగిస్తూ, కవి పండితులను ఆదరించి సాహితీ సాంస్కృతిక వికాసానికి, దేవాలయాల నిర్మాణానికి కృషి చేశాయి.

గద్వాల సంస్థానాధీశులు బీచుపల్లి వద్ద కృష్ణానది మధ్యనున్న ఎత్తైన కొండపై దుర్గాన్ని నిర్మించి, నీటిపారుదల అభివృద్ధికి సంగాల, తంద్రపాటి చెరువులతో, పాటు లింగమ్మ బావిని తవ్వించారు. నిజాం రాజ్యంలోని సంస్థానాల్లో గద్వాల తర్వాత వనపర్తి సంస్థానం ప్రముఖ స్థానమాక్రమించింది. వీరు మొదటి విజయనగర సామంతులుగా నేటి నంద్యాల ప్రాంతాన్ని పాలించి, అనంతరం పానుగల్లు ప్రాంతానికి వలస వచ్చి స్థిరపడ్డారు. వీరిలో రెండో రామేశ్వర్‌రావు సమర్థుడైన పాలకుడు. ఇతని పాలనలో సంస్థాన మహోన్నత దశను అనుభవించింది. ఇతను అనేక ప్రజాహిత కార్యక్రమాలు అమలు చేశాడు. సరళాసాగర్ అనే తటాకాన్ని నిర్మించి నీటిపారుదల అభివృద్ధికి చర్యలు తీసుకొన్నాడు.

ఆత్మకూర్ సంస్థానం కాకతీయుల కాలం నుండి గోనబుద్ధారెడ్డి పాలనా విభాగంగా, కుతుబ్ షాహీ పాలనలో, ప్రముఖ పాత్ర పోషించింది. జటప్రోలు సంస్థానాధీశులు విజయనగర, కుతుబ్‌షాహీలకు, అసఫ్‌జాహీలకు సామంతులుగా నేటి దేవరకొండ, రాచకొండ ప్రాంతాలను పాలించిన పద్మనాయక వంశానికి చెందిన వెలమ రాజులు. వీరి వంశంలోని పాలకుడైన సురభి మాధవరాయలు గొప్పపండితుడు. ఇతను చంద్రికా పరిణయ ప్రభంధకర్త. దోమకొండ సంస్థానాధీశులు కుతుబ్‌షాహీలకు సామంతులుగా బిక్కవోలు కేంద్రంగాను, అనంతరం కామారెడ్డి ఆ తరువాత దోమకొండకు మారారు. పాపన్నపేట సంస్థానం మెదక్ సీమలో ఏర్పడిన ప్రాచీన సంస్థానం. సంస్థాన పాలకురాలైన రాణి శంకరమ్మ చౌత్, సర్దేశ్‌ముఖ్ వసూలు చేస్తున్న మహారాష్ట్రులను ఎదిరించి నిజాం ప్రభువుల మన్ననలు పొంది రాయ్‌బాగన్ (ఆడసింహం) బిరుదును పొందింది.

మునగాల సంస్థానం నేటి కృష్ణా జిల్లా నందిగామ ప్రాంతంలో కాకతీయ రుద్రమదేవి, ప్రతాపరుద్రుని కాలంలో ముకుందప్ప, సూరన్న, నరసన్న సేనానులు గొప్ప పాలకులుగా ఈ ప్రాంతాన్ని పాలించినట్లు ఆధారాలు ఉన్నాయి. పాల్వంచ

సంస్థానం కుతుబ్‌షాహీల పాలన నుండే పద్మనాయక వంశస్థుల అధీనంలో ఉండేది. వీరు పాల్వంచ, అశ్వరావుపేట్, భద్రచలం రాజధానులుగా పాలించారు. వీరి పూర్వీకులైన అప్పన్న కాకతీయ ప్రతాపరుద్రుని సేనానిగా, శంకరగిరి, అసన్‌బాద్ పాలకునిగా పనిచేశాడు. బహామని, కుతుబ్‌షాహీల పాలనలోను వీరు సామంతులుగా పాలించారు. ఆ తరువాత నిజాం పాలనలో సంస్థానాధీశులుగా కొనసాగారు.

కోస్తాంధ్ర ప్రాంతంలో బొబ్బిలి సంస్థానం నాగావళి, స్వర్ణముఖి, వేదవతి నదుల పరివాహక ప్రాంతంలో విస్తరించినది. వీరు రేచర్ల పద్మనాయక వంశానికి చెందిన వెలమలు. బొబ్బిలి, వెంకటగిరి సంస్థానాలకు రావు ధర్మరావు మూలపురుషుడు. వీరు మొగలు పాలన కాలం నుండే పాలకులుగా ప్రముఖపాత్ర పోషించారు. ఫ్రెంచి, బ్రిటీష్ పాలనా కాలం నాటికి ఉత్తర సర్కార్‌లలో వీరి ప్రాభవం ఒక వెలుగు వెలిగింది. అనెగొంది సంస్థానాధీశులు అసఫ్‌జాహీల పాలనలలో ఐదు జాగీరులను పాలించారు. వెంకటగిరి సంస్థానం నెల్లూరు జిల్లా దర్శి, పొదిలి, కొచ్చెర్లకోట, ప్రాంతాలతో వెంకటగిరి రాజధానిగా ఏర్పడిన సంస్థానం అతిప్రాచీనమైనది. వీరు బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీతో 1792లో ఓడంబడిక చేసుకొని విధేయత ప్రకటించారు. వీరు పద్మనాయక వంశస్థులైన వెలమలు. వీరు వంశంలో పినకొండప్పనాయుడు ప్రసిద్ధ పాలకుడు.

విజయనగర సంస్థానం 57 పరగణాలతో కూడి, విజయనగరం, భీమునిపట్నం, శృంగవరపుకోట, అనకాపల్లి, గజపతినగరం, పాలకొండ, విశాఖ, తూర్పుగోదావరిలతో కూడి ఉండేది. వీరు సూర్యవంశీయులు, పూసపాటి అనే ఇంటిపేరుతో పిలువబడినారు. కుతుబ్‌షాహీల పాలనలో కొండపల్లి సర్కారుకు సర్దార్లుగా పని చేశారు.

# 9 తెలుగువారి వారసత్వ కట్టడాలు

## Built Heritage of the Telugu People

క్రీ.శ. 1వ శతాబ్దంలో ప్రారంభమైన ఇటుకరాతి దేవాలయాలు క్రీ.శ. 16వ శతాబ్దికి విశాలమైన ప్రాంగణాలతో రాతితో కట్టిన ఎత్తైన గోపురాలతో అలరారాయి. తెలుగువారంతా పవిత్రంగా భావించే ఆలయాల్లో శ్రీశైలం, సింహాచలం, అలంపురం, అమరావతి, అరసవెల్లి, అన్నవరం, మంగళగిరి, భద్రాచలం, యాదగిరిగుట్ట, వేములవాడ,అహోబిలం, మహానంది, శ్రీకాళహస్తి దేవాలయాలు ముఖ్యమైనవి.


వారసత్వ కట్టడాల్లో దేవాలయాలు, కోటలు, మంటపాలు, గోపురాలు ముఖ్యమైనవి. ఆంధ్రప్రదేశ్‌లో క్రీ.శ. 7-17 శతాబ్దాల మధ్యకాలంలో నిర్మించిన అనేక ఆలయాల్లో చాళుక్యవాస్తును ప్రతిబింబించే అలంపూరు, మహానంది, కడమర కాలువ దేవాలయాలు,కాకతీయ వాస్తు శిల్ప కళ ఉట్టిపడే వరంగల్‌లోని వేయిస్తంభాల గుడి, కోటలోని శంభుని గుడి, పాలంపేటలోని రామప్ప దేవాలయం, ఘన్‌పూర్‌లోని కోటగుళ్ళు, క్రీ.శ. 12-14 శతాబ్దాల నాటి ఆలయ వాస్తు విన్యాసం, శిల్ప కళావైభవానికి దర్పణం పడుతూ సందర్శకుల నాకర్షిస్తున్నాయి. ఉత్తర కోస్తా తీరం వెంబడి విలసిల్లిన మరో వాస్తుశిల్ప శైలి తూర్పుగాంగుల కళింగశైలి. శ్రీకాకుళం జిల్లాలోని ముఖలింగం, జయతి, నారాయణపురం, విశాఖపట్నం జిల్లాలోని సింహాచలం ఆలయాలు నిర్మాణరీతిలోనూ, శిల్పాల అలంకరణలోనూ వైవిధ్యం కలిగి, పర్యాటకులకు ఆనందాన్ని కలిగిస్తున్నాయి. మధ్యాంధ్ర దేశంలో పంచారామాలుగా పేరుగాంచిన అమరావతి, చేబ్రోలు, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట దేవాలయాలు విజయవాడ కనకదుర్గాలయం, తూర్పుచాళుక్యల వాస్తుశిల్పాన్ని ప్రకటిస్తున్నాయి. కాకతీయుల తరువాత ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువ ప్రాంతాన్ని ఏలిన

విజయనగర రాజుల కాలంలో విశాలమైన, ఉన్నతమైన అనేక ఆలయాలు రూపుదిద్దు కొన్నాయి. వాటిలో తిరుపతి, తిరుమల, నారాయణవనం, నాగలాపురం, శ్రీకాళహస్తి, ఉదయగిరి, గండికోట, నెల్లూరు, మార్కాపురం, శ్రీశైలం, మంగళగిరి ముఖ్యమైనవి. శిల్పుల కళానైపుణ్యానికి వాస్తు కళా పరాకాష్టకు ప్రతీకలైన ఈ ఆలయాలు, యాత్రాస్థలాలుగానే కాక పరిశోధకులు, విద్యార్థులు, విదేశీ పర్యాటకులను విపరీతంగా ఆకట్టుకొంటున్నాయి. సంస్థానాల కాలంలో నిర్మింపబడిన జటప్రోలు, దోమకొండ, గద్వాల, వెంకటగిరి, రాచకొండ, కార్వేటినగరం, ప్రాగటూరు, సూగూరు మొదలైనచోట్ల ఆలయాలు, అక్కడున్న రాజప్రాసాదాల శిథిలాలలో తెలుగు జాతి వనరులన్నీ ప్రతిబింబిస్తున్నాయి.

చారిత్రక కట్టడాల్లో ఆలయాలతోపాటు ఆనాటి శౌర్య పరాక్రమాలకు మౌనసాక్షులుగానున్న కోటలు కూడా చేరి ఉన్నాయి. వాటిలో కళ్యాణీ చాళుక్యుల కాలంనాటి భువనగిరి కోట, కాకతీయుల కాలంనాటి వరంగల్లు, గాంధారికోట, ఉర్లుగొండ కోటలు, రెడ్డి రాజుల కొండపల్లి, కొండవీడు కోటలు, వెలమరాజుల రాచకొండ, దేవరకొండ దుర్గాలు, విజయనగర రాజుల ఉదయగిరి, పెనుగొండ, చంద్రగిరి, గండికోటలు, కుతుబ్‌షాహీల కాలపు గోల్కొండ, కోయిల్‌కొండ కోటలను కొద్దిపాటి నిధులతో బాగుచేస్తే సందర్శకుల దృష్టి నాకర్షించే వీలుంది. సంస్థానాధీశుల కోటల్లో, గద్వాల, నిజాంకొండకోట, నూజివీడు, చల్లపల్లి, ముక్త్యాల, వెంకటగిరి, కార్వేటినగరం, ప్రాగటూరు, మునగాల మొదలైన కోటలు ఆనాటి వాస్తుకళకు అద్దంపడుతూ కొద్దిసంఖ్యలో సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. ఇంతేకాక ముస్లిం వాస్తుకు ప్రతిబింబాలైన హైదరాబాద్‌లోని కుతుబ్‌షాహీ సమాధులు, మక్కామసీదు, చార్మినార్, ఇతర ప్రాసాదాలు, క్రైస్తవ కట్టడాల్లో మెదక్ చర్చ్, భీమిలిలోని డచ్‌వారి సమాధులు సందర్శకులకు ప్రధాన ఆకర్షణలు.

## దేవాలయాలు

### శ్రీశైలం



ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైలం కర్నూలు జిల్లాలో కృష్ణానది ఒడ్డునున్న ఒక శైవక్షేత్రం. రాష్ట్రం నుంచే కాక, ఇతర రాష్ట్రాల నుంచి సైతం ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చి శ్రీశైలంలోని

మల్లికార్జున, భ్రమరాంబలను కొలుస్తారు. కళ్యాణచాళుక్యులు, కాకతీయులు, రెడ్డిరాజులు విజయనగర రాజుల ఆదరణను చవిచూచిన ఈ ఆలయానికి ఇప్పటికీ కన్నడిగులు కాలిబాటన రావటం వారి అంకిత భావానికి నిదర్శనం. చుట్టూ ఉన్న అడవి ప్రాంతంలో గల చెంచుజాతి వాళ్లు శివుణ్ణి మల్లన్నగా కొలుస్తారు. శ్రీశైలంలో పాతాళగంగ, హాటకేశ్వరం, శిఖరం, శ్రీశైలం డ్యాం, భీముని కొలను, అక్క మహాదేవి గుహలు ప్రధాన ఆకర్షణలు.

**సింహాచలం**



సింహాద్రి అప్పన్నగా పేరుగాంచిన లక్ష్మీ వరాహనరసింహస్వామి వేంచేసిన సింహాచలం రాష్ట్రంలోని ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం. తూర్పుగాంగ (కళింగ) రాజులచే 13వ శతాబ్దంలో నిర్మింపబడిన ఈ ఆలయానికి రాష్ట్రం నుంచే కాక ఒరిస్సా నుంచి కూడా ఎక్కువ మంది భక్తులొస్తూంటారు. చందనోత్సవానికి, బ్రహ్మోత్సవాలకూ లక్షల సంఖ్యలోనూ, మామూలు రోజుల్లో వేల సంఖ్యల్లో దర్శించుకొంటారు. విశాఖపట్నానికీ 15 కి.మీ. దూరంలో కొండమీద అందమైన ప్రకృతి ఒడిలో ఉన్న ఈ ఆలయం ప్రశాంతి నిలయం. చెన్నై - కొల్‌కతా రైలుమార్గం, ట్రంక్ రోడ్డు ద్వారా సింహాచలం చేరుకొనే పర్యాటకులు విశాఖలోని బీచ్‌లు, హార్బర్, కైలాసగిరి, వుడా పార్కు, కాళీ టెంపుల్ ఇంకా ఇతర పర్యాటక స్థలాలను చూచుకొని స్థానిక సవర చిత్రకళను సొంతం చేసుకోవచ్చు. వీలున్నవాళ్లు అరకులోయ, బొర్రా గుహలను కూడా చూడవచ్చు.


**అలంపురం**



హైదరాబాదుకు 200 కి.మీ., కర్నూలుకు 32 కి.మీ. దూరంలో తుంగభద్రానది ఎడమ గట్టుపై నున్న అలంపురం రాష్ట్రంలోని ఓ ప్రముఖ యాత్రాస్థలం. క్రీ.శ.7-8 శతాబ్దాల్లో బాదామీ చాళుక్యులచే నిర్మించబడిన నవ బ్రహ్మేశ్వరాలయాలు, సూర్యనారాయణ,


నరసింహదేవాలయాలు, శక్తిపీఠాల్లో ఒకటైన జోగులాంబ దేవాలయం, శైవ, శాక్త భక్తులతోపాటు పుణ్యతీర్థ క్షేత్రాల సందర్శనలో అసక్తి గల పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. దక్షిణకాశిగా పేరుగాంచిన అలంపూర్ వద్ద గల తుంగభద్రలో స్నానంచేసి ఆలయాలను దర్శించుకొని, దగ్గరలోని పాపనాశనం దేవాలయాలను చూడవచ్చు.

**అమరావతి**




గుంటూరుకు 32 కి.మీ., విజయవాడకు 45 కి.మీ.ల దూరంలో, కృష్ణానది కుడిగట్టున ఉన్న అమరావతి, అమరలింగేశ్వరాలయానికి ప్రసిద్ధి. క్రీ.శ. 10-11 శతాబ్దాల్లో విశాల ప్రాంగణంలో నిర్మించబడిన గర్భాలయ, అర్ధమండపం, మహా మండపం, రాజగోపురాలతో చూపరులను ఆకట్టుకొనేట్లుండే ఈ ఆలయంలోని రెండో అంతస్తువరకూ పాకిన పొడవాటి శివలింగం రూపంలో ఉన్న అమరలింగేశ్వరుని చూడటానికి, శివరాత్రినాడేకాక మిగతా రోజుల్లో కూడా భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తారు.

**అరసవెల్లి**



శ్రీకాకుళానికి 4 కి.మీ ల దూరంలోనున్న అరసవెల్లి, సూర్యదేవాలయానికి రాష్ట్రంలోనే ఏకైక సూర్యాలయంగా పేరుంది. కళింగ గాంగులచే 13వ శతాబ్దంలో నిర్మింపబడిన ఈ ఆలయం, ఇటీవలే పునరుద్ధరింపబడింది. ఉత్తరాంధ్ర వరకూ యాత్ర చేసే భక్తులు, ఈ ఆలయాన్ని తప్పక దర్శిస్తారు. సంవత్సరంలో రెండుసార్లు సూర్యుడుదయించగానే కిరణాలు నేరుగా, ఆలయంలోని విగ్రహం పాదాల పై పడే ప్రత్యేకత ఉండటంవల్ల దేశం నలుమూలల నుంచి యాత్రీకులొస్తుంటారు.

### అన్నవరం



తూర్పుగోదావరి జిల్లాలో రాజమండ్రికి 70, విశాఖపట్నానికి 120 కి.మీ.ల దూరంలో కొలకతా–చెన్నైరైలు, రోడ్డు మార్గాలపై ఉన్న అన్నవరంలో క్రీ.శ.18వ శతాబ్దినాటి సత్యనారాయణస్వామి దేవాలయం ఉంది. స్థానిక రత్నగిరి పై నిర్మించబడిన ఈ ఆలయంలో రోజూ వేల సంఖ్యలో భక్తులు సత్యనారాయణస్వామి వ్రతాన్ని జరుపుతుంటారు. ఘాట్‌రోడ్ ప్రయాణంలోనూ, కాలినడకతో వెళ్లేప్పుడు ఆహ్లాదాన్ని కలిగించే ప్రకృతి దృశ్యాలను తిలకిస్తూ ఆలయానికి చేరుకోవచ్చు. ఈ ఆలయం రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరుగాంచింది.

### అహోబిలం



కర్నూలుజిల్లా, ఆళ్లగడ్డకు 24 కి.మీ. దూరంలో కొండలమధ్య సుందరభరితంగా నిర్మించిన నరసింహ దేవాలయం గల అహోబలం వైష్ణవుల పుణ్యక్షేత్రం. విజయనగర రాజులు క్రీ.శ. 16వ శతాబ్దంలో నిర్మించిన తొమ్మిది ఆలయాల్లో తొమ్మిది రకాల నరసింహస్వామి విగ్రహాలను ప్రతిష్టించారు. అందుకని అహోబలాన్ని నవనరసింహ క్షేత్రంగా పిలుస్తారు. అహోబలాన్ని దిగువ అహోబలమనీ, 9 కి.మీ. దూరంలో కొండలోనున్న ఆలయాన్ని ఎగువ అహోబలమనీ పిలుస్తారు. చుట్టూ అడవులూ, విజయనగర వాస్తుశిల్పం, జలపాతాలతో పాటు సందర్శకులకు కనువిందు చేస్తాయి.

### కాణిపాకం



చిత్తూరుకు సమీపంలోనున్న వరసిద్ధి వినాయక దేవాలయం, రాష్ట్రంలో పేరుగాంచి, అధిక సంఖ్యలో భక్తులతో కళకళలాడుతోంది. క్రీ.శ. 9వ శతాబ్దంలో నిర్మింపబడి ఇటీవల జీర్ణోద్ధరణ అయిన ఈ ఆలయం ప్రమాణాలకు

ప్రత్యేకం. అంతేకాక ఎలాంటి కోరికలైనా తీరుతాయనే నమ్మకంతో రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు ఆలయాన్ని సందర్శిస్తున్నారు.


**కీసరగుట్ట**



సికింద్రాబాదుకు 30 కి.మీ.ల దూరంలోని కీసరగుట్ట రామలింగేశ్వరాలయం చుట్టుపక్కల వారికి పుణ్యక్షేత్రం. ఆలయం ముందర కొండమీద ప్రతిష్ఠించి ఉన్న అనేక శివలింగాలు, దిగువనున్న చెరువు, క్రీ.శ 4-5 శతాబ్దాలనాటి శివాలయ శిథిలాలు, ఇక్కడి ఆకర్షణల్లో కొన్ని. నగరానికి తక్కువ దూరంలో, కొండమీద ప్రశాంత వాతావరణంలో ఉన్న ఈ దేవాలయానికొచ్చే భక్తులు కాలం గడపటానికి అనేక విశ్రాంతి స్థావరాలు ఉన్నాయి.

**తిరుమల-తిరుపతి**

*తిరుమల-తిరుపతి*



తిరుమలలోని వెంకటేశ్వరస్వామి దేవాలయానికొచ్చే భక్తుల సంఖ్యలోనూ, ఆదాయ వనరుల్లోనూ దేశంలోనే పేరుపొందింది. విజయనగర కాలపు ఈ ఆలయం, మంటపాలు, గోపురాలు, ప్రాకారాలతో విశాలమైన స్థలంలో ఉంది. ఆకాశగంగ, పాపనాశనం, గోగర్భ తీర్థం, అరుదైన శిలాతోరణంగల తిరుమల, ప్రకృతి సౌందర్యం, ఉద్యానవనాలు, తిరుమల కొండను చేరే ఘాట్ రోడ్ ప్రయాణం ఓ మధురానుభూతిని కలిగిస్తుంది. తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయం, రామాలయం, తిరుచానూరులోని అలివేలుమంగ దేవాలయాలను చూడటానికి దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలూ వస్తారు.

## ద్రాక్షారామం

ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ద్రాక్షారామంలోని భీమేశ్వరస్వామి దేవాలయం ఒకటి. అలాగే తెలుగుదేశంలోని మూడు లింగాల్లో ఒకటి. 11వ శతాబ్దంలో నిర్మింపబడిన పంచారామాల్లో కూడా ఒకటైన ఈ ఆలయంలో శివలింగం చాలా ఎత్తుగా ఉంటుంది. పూజలు చేసే భక్తులు రెండో అంతస్తుకు వెళ్లి అభిషేకాలు చేస్తారు. దక్షవాటికగా పేరుగాంచిన ద్రాక్షారామం శైవులకేకాక ఇతర మతాలవారికి కూడా పుణ్యక్షేత్రమే. విశాలమైన




ఆలయప్రాంగణం, పుష్కరిణి, మాణిక్యాంబ దేవాలయం ఇక్కడి ప్రత్యేక ఆకర్షణలు.

## బాసర

ఆదిలాబాద్ జిల్లా బాసరలో వేదవ్యాసునిచే ప్రతిష్టించబడినట్లు చెపుతోన్న జ్ఞానసరస్వతిదేవి ఆలయం ఉంది. దక్షిణ భారతదేశంలో గల ఒకే ఒక ఆలయంగల జ్ఞానసరస్వతి దర్శనం చేయించి పిల్లలకు అక్షరాభ్యాసం చేస్తే వారికి బాగా చదువు అబ్బుతుందని నమ్మే భక్తుల రద్దీ ఇటీవల పెరిగింది. బాసరలో వేదవతీశిల, వ్యాసాశ్రమం, గోదావరినది భక్తులకు ఇష్టమైన దర్శనీయ స్థలాలు.

## భద్రాచలం

పవిత్ర గోదావరీ తీరంలో ఖమ్మం జిల్లాలోనున్న భద్రాచలం రాములవారి ఆలయానికి ప్రసిద్ధి. హైదరాబాదుకు 225 కి.మీ., ఖమ్మంకు 80 కి.మీ. దూరంలోగల భద్రాచలం ఇప్పుడిపుడే పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకొంటుంది.




చివరి కుతుబ్‌షాహి రాజైన తానీషా దగ్గర తహసీల్‌దార్‌గా పని చేసిన కంచెర్లగోపన్న (తరువాత భక్తరామదాసు) ప్రతిష్టించినట్లు పేర్కొంటున్న రాములవారి ఆలయం ఇటీవల విస్తరించబడి దేశంలోనే ఒక తీర్థయాత్రా స్థలంగా పేరుగాంచింది. శ్రీరామనవమి

సందర్భంగా లక్షలాది మంది, రోజూ వేల సంఖ్యలోనూ భక్తులతో కిటకిటలాడే భద్రాచలం వద్ద గోదావరినది పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తుంది. భద్రాచలం నుంచి గోదావరినదిలో పాపికొండల వరకూ పడవ ప్రయాణం మరచిపోలేని అనుభూతిని కలిగిస్తుంది.

**మహానంది**


మహానంది ఆలయం

రాష్ట్రంలోని ప్రధాన శైవక్షేత్రాల్లో ఒకటైన మహానంది, కర్నూలు జిల్లాలో, కొండలు, కోనలు, పచ్చటి పొలాల మధ్య ఉంది. పశ్చిమ చాళుక్యుల కాలంలో నిర్మింపబడిన ఈ ఆలయం ముందరిభాగం నుంచి జారే స్వచ్ఛమైన నీళ్లున్న పుష్కరిణిలో స్నానాలు చేయడం వలన సర్వపాపాలు పోతాయని భక్తుల నమ్మకం. విలక్షణ వాస్తు శైలిలో నిర్మింపబడిన ఆలయ సముదాయంలో కోదండరామాలయం, కామేశ్వరీదేవి ఆలయాలున్నాయి. జీవితంలో ఒక్క సారైనా చూడాలనుకొనే ఈ ఆలయం పవిత్ర పుణ్యక్షేత్రంగా బాసిల్లుతుంది.

**మంగళగిరి**




స్థానికంగా మంగళగిరి పానకాల స్వామి అని పిలుచుకొనే నరసింహాస్వామికి గుంటూరు - విజయవాడ రోడ్డు మీదున్న మంగళగిరిలో కొండమీద, కొండకింద రెండు ఆలయాలున్నాయి. విజయనగర కాలంలో నిర్మించిన కింది ఆలయం, ఎత్తైన ప్రాకారం, చాలా ఎత్తైన రాజగోపురం ఎంతో దూరంనుంచే ఆకర్షిస్తుంటాయి. వైష్ణవులకే కాక దక్షిణ భారత తీర్థయాత్రల్లో భాగంగా అన్ని మతాలు వారు వస్తారు.

**మంత్రాలయం**


తుంగభద్రానది ఒడ్డునున్న మంత్రాలయం, మధ్వశాఖకు చెందిన రుషి రాఘవేంద్రుడు సమాధి పొందిన స్థలం. కేవలం వైష్ణవులేకాక అన్ని మతాలవారూ

మంత్రాలయం సందర్శించి దగ్గరగల తుంగభద్రానదిలో స్నానాలాచరిస్తారు. మధ్వ సంప్రదాయం ప్రకారం ఆలయంలో ప్రవేశించే మగవారు, ఒంటిపై అంగవస్త్రాన్ని ధరించకుండా దర్శనం చేసుకోవటం ఇక్కడి ప్రత్యేకతల్లో ఒకటి. కుంభకోణం సుధీంద్ర తీర్థుల శిష్యుడైన రాఘవేంద్రుడు ద్వైత వేదాంత పద్ధతిలో వైష్ణవమత ప్రచారం చేస్తూ జీవసమాధి అయినాడు. మఠంతోపాటు ఇంకా మంచాలమ్మ, శ్రీనివాస దేవాలయాలు, గురుసార్వభౌమ విద్యాపీఠాలను కూడ పర్యాటకులు దర్శిస్తుంటారు. చేనేతలకు ప్రసిద్ధిచెందిన ఎమ్మిగనూరు బట్టల్ని ఇక్కడికొచ్చే యాత్రీకులు సావనీర్లుగా కొనుక్కొంటారు.

**కొలనుపాక**



నల్లగొండ జిల్లా, ఆలేరుకు 5 కి.మీ. దూరంలోవున్న కొలనుపాక ప్రాచీన శైవక్షేత్రం. స్థానిక సోమేశ్వరస్వామి దేవాలయం విశాలమైన మంటపాలు, తోరణాలతో ఉండి 11వ శతాబ్దంనుంచి రాష్ట్రంనుంచేకాక, కర్ణాటక నుంచి కూడ శైవభక్తుల్ని ఆకర్షిస్తుంది. ఇక్కడ క్రీ.శ. 12వ శతాబ్దికి చెందిన వీరనారాయణస్వామి దేవాలయం, జైన దేవాలయం, అష్టాదశ ప్రజలకు అష్టాదశ మఠాలు, వారి వారి దేవాలయాలతో ఎక్కడ చూచినా గుళ్లేకనబడతాయి. శివరాత్రి రోజు ఘనంగా ఉత్సవాలు జరిగే కొలనుపాకకు రోజూ వందల సంఖ్యలో భక్తులు వస్తూఉంటారు. రేణుకాచార్య సంప్రదాయానికి చెందిన ఈ శివాలయంలో గౌడ మఠం వీరభద్రయ్య కుటుంబీకులు పూజారిగా ఆలయ నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు.



దేశంలోనే ప్రధాన జైన క్షేత్రంగా పేరు గాంచిన శ్వేతాంబర జైన దేవాలయం, పురావస్తు మ్యూజియం ఇక్కడి ఇతర ఆకర్షణలు. వర్ధమాన మహావీరుని ప్రతిష్ఠించిన ఈ ఆలయంలో 24 గురు జైనతీర్థంకరుల విగ్రహాలున్నాయి. చైనా నుంచి దిగుమతి చేసుకొని క్రీస్తుశకం 14వ శతాబ్దంలో జేడ్ రాతితో చెక్కబడిన

మహావీరుని విగ్రహం చూపరులను బాగా ఆకర్షిస్తుంది.  ఇటీవల రాజస్థాన్ నుంచి తెప్పించి, అదే శైలిలో ఆలయాన్ని పునర్నిర్మించటం వల్ల ఆలయం స్థానికేతర వాస్తును ప్రతిబింబిస్తుంది.

**యాదగిరిగుట్ట**

స్థానిక కథనం ప్రకారం యాదవ రాకుమారుడు నరసింహస్వామిని గురించి తపస్సుచేసి, యాదరుషి అయ్యాడు. స్వామి ప్రత్యక్షంకాగా అతని పేరుమీదగానే, ఆ కొండకు యాదగిరిగుట్ట అనిపేరు కలిగింది.  ఎత్తైన కొండమీదగల గుహలో ఉన్న నరసింహస్వామి ఆలయం తెలంగాణాలో ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది.

**విజయవాడ**




కోస్తా ఆంధ్రాలో ప్రముఖ వ్యాపార, విద్యాకేంద్రంగా అభివృద్ధి చెందుతున్న విజయవాడ నగరం కనకదుర్గమ్మ ఆలయానికి ప్రసిద్ధి. విజయవాడలోని ఇంద్రకీలాద్రి పర్వతం మీది కనకదుర్గాలయం, దేశం నలుమూలల నుంచీ రోజూ వేలసంఖ్యలో భక్తులను ఆకర్షిస్తుంది. అమ్మవారి ఆలయం పక్కనే మల్లేశ్వరస్వామి దేవాలయం ఉంది.  ఇందులో ఆదిశంకరులు శ్రీచక్రాన్ని ప్రతిష్ఠించారని నమ్మకం.  మెట్లెక్కి గానీ, ఘాట్‌రోడ్ నుంచిగానీ చేరుకొని దర్శనం చేసుకొని ఆలయం బయటికొచ్చి కొండమీద నుంచి విజయవాడ నగరం, కృష్ణా బారేజీలను చూస్తుంటే తనవితీరదు. విజయదశమికి ఆలయాన్ని అలంకరించి, నదిలో హంసవాహనంపై అమ్మవారికి చేసే తెప్పోత్సవాన్ని లక్షల సంఖ్యలో భక్తులు చూచి తరిస్తారు.  నగరంలో భవానీ ఐలాండ్, సిబార్‌పార్క్ ప్రకాశం బారేజీ, మొగల్రాజపురం, ఉండవెల్లి గుహలు, విక్టోరియా జూబ్లీమ్యూజియం, కొండపల్లికోట విజయవాడ నగరంలోని ఇతర పర్యాటక కేంద్రాలు.

**వేములవాడ**

తెలంగాణాలో ప్రసిద్ధ శైవక్షేత్రంగా గుర్తింపు పొందిన కరీంనగర్‌జిల్లా వేములవాడలోని క్రీ.శ. 9–10 శతాబ్దాలకు చెందిన రాజరాజేశ్వర స్వామి దేవాలయం

కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లోని యాత్రీకులను ఆకర్షిస్తుంది. వేములవాడలోని శివుణ్ణి స్థానికులు 'రాజన్న' 'రాజేశుడు' అని కొలుస్తారు. కోడెదూడలను ఆలయం చుట్టూ తిప్పి కొంతసేపు గుళ్లో కట్టేస్తే మంచి కొడుకు పుడతాడని స్థానికులు నమ్ముతారు. ఇక్కడి పుష్కరిణిని ధర్మగుండంగా పిలుస్తారు. వేములవాడలో ఇంకా బద్దిగ జినాలయం, పోచమ్మ, భీమేశ్వర, విఠలేశ్వర, బాలరాజేశ్వర, సోమేశ్వర, బాలాత్రిపురసుందరీ, ఉమామహేశ్వర, నగరేశ్వరాయాలున్నాయి. సమీపంలోగల నాంపల్లి నరసింహస్వామి ఆలయాన్ని కూడ వేములవాడ యాత్రీకులు దర్శించుటం ఓ ప్రత్యేకత.

**శ్రీకాళహస్తి :**



చిత్తూరుజిల్లాలో, స్వర్ణముఖి నది ఒడ్డున గల ఈ ఆలయనిర్మాణం 10వ శతాబ్దంలో ప్రారంభమై 19వ శతాబ్దం వరకు కొనసాగినా, ప్రధాన కట్టడాలన్నీ విజయనగర కాలంలో నిర్మించినవే. భక్తకన్నప్ప, సాలెపురుగు, పాము, ఏనుగులతో ముడిపడి ఉన్న శ్రీకాళహస్తి పేరు వెనుక ఆసక్తికరమైన కథ ఉంది. 'శ్రీ' అనే సాలెపురుగు, 'కాళ' అనే పాము, 'హస్తి' అనే ఏనుగు ఒకరికి తెలియకుండా ఒకరు భక్తిభావంతో శివుణ్ణి అలంకరించి ఆరాధించేవి. సాలెపురుగు లింగాన్ని చక్కగా అల్లి కాపాడుకోవాలనుకొంటే, పాము పడగవిప్పి కాపాడుకోవాలనుకొనేది. పాము లేనపుడు, ఏనుగువచ్చి లింగం మీద తొండంతో నీళ్లుజల్లి శుభ్రంచేసి, బిల్వపత్రాలనుంచేది. దీన్ని అపచారంగా భావించిన పాము లింగం వెనుక దాక్కొని ఏనుగురాగానే, దాని తొండంలో దూరగా, బాధ భరించలేని ఏనుగు తన శిరస్సును కొట్టుకొంటుంది. పాము, సాలెపురుగు, ఏనుగు ఒకేసారి మరణిస్తాయి. వీటి భక్తికి మెచ్చుకొని శివుడు వాటికి మోక్షాన్ని ప్రసాదించాడనీ, అప్పటినుంచి ఆ ప్రాంతానికి శ్రీకాళహస్తి అని పేరు కలిగిందనీ ఆ కథలో ఉంది.

వాయులింగంగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వరుని దేవి జ్ఞాన ప్రసూనాంబదేవాలయం, కొండమీద కన్నప్ప దేవాలయం, సువర్ణముఖినదులను

దర్శించటానికి తిరుపతి పోయిన యాత్రికులందరూ శ్రీకాళహస్తి కొస్తారు.

**మోపిదేవి-హంసలదీవి**

కృష్ణా జిల్లాలోని దివిసీమ పచ్చటి పొలాలు, కృష్ణా జలాలు, పులిగడ్డ అక్విడక్టు, అవనిగడ్డ రేవు, లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, తలగడదీవి, గణపేశ్వరం, హంసలదీవి ఆలయాలు దర్శనీయ స్థలాలు. తరతరాలుగా యాత్రాస్థలంగా పేరుగాంచి రోజూ భక్తులను ఆకర్షిస్తున్న మోపిదేవి నాగేశ్వరస్వామి దేవాలయం జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం. సముద్ర కరకట్టకు దగ్గరలో నున్న ఈ ఆలయం, గర్భాలయం, మహామండపం, గోపురం, ప్రాకారాలతోనూ, ఈశాన్యంలో విశాలమైన కోనేరుతోనూ ప్రశాంతతనందించే సుందర ప్రదేశంగా రూపుదిద్దుకొంది. కాకతీయ సైనాధ్యక్షుడు, నృత్తరత్నావళి రచయిత అయిన జాయపసేనాని గణపతి దేవుని కాలంలో నిర్మించిన ఈ ఆలయం చూడదగ్గ పుణ్యక్షేత్రం.

**జైన మందిరాలు**


రాష్ట్రంలోని యాత్రా స్థలాల్లో కొలనుపాక, కంబదూరుల్లో ఉన్న చారిత్రక జైన మందిరాలను పేర్కొనాలి. రాష్ట్రంలో స్థిరపడిన జైనులు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే జైనులకు నల్గొండజిల్లా ఆలేరు సమీపంలోని కొలనుపాక (కుల్‌పాక్) జైనక్షేత్రం మౌంట్‌అబూ తరువాత రెండోస్థానాన్ని ఆక్రమించింది. క్రీ.శ.10వ శతాబ్దికి చెందిన ఈ ఆలయాన్ని ఇటీవలే రాజస్థాన్ రాయిలో చక్కటి వాస్తుశిల్పంతో పునర్నిర్మించడమైంది. 24 గురు తీర్థంకరుల విగ్రహాలున్న ఈ ఆలయంలో జేడ్ విగ్రహం ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. 18 కులాలకు 18 మఠాలూ ఉన్న కొలనుపాక శైవ, వైష్ణవ ఆలయాలకు కూడా నిలయం. అలాగే అనంతపురం జిల్లా కంబదూరులో కళ్యాణీ చాళుక్యులు నిర్మించిన చక్కటి జైన మందిరం, అదే జిల్లా గుత్తికి సమీపంలోని కొనకండ్ల జైన క్షేత్రాన్ని, హైదరాబాద్‌లోని చైతన్యపురిలో ఉన్న జైన మందిరాన్ని గుంటూరు-విజయవాడ రోడ్డుమీద నంబూరు వద్దగల జైన మందిరాన్ని రాష్ట్రం నుంచి, వెలుపల నుంచి అధిక సంఖ్యలో వచ్చే జైనులు సందర్శిస్తుంటారు.

ఇస్లామిక్ పిలిగ్రిం టూరిజం అభివృద్ధికి రాష్ట్రంలోని నిజామాబాద్‌లోని దేవల్ మాస్క్, రాజమండ్రిలోని రాయల్ మాస్క్, హైదరాబాద్‌లోని మక్కా మసీద్, జామా మసీద్, హజరత్ బల్ మసీదులు, విజయవాడలోని హజరత్ బల్ మసీదు, నెల్లూరులోని రహమతాబాద్‌లు తగిన వనరులు కలిగి ఉన్నాయి.

రాష్ట్రంలోని క్రైస్తవులకు కూడ కొన్ని పిలిగ్రిమేజ్ సెంటర్లున్నాయి. వాటిలో మెదక్ చర్చి ఫిరంగి పురం, గుణదల, సాగర్‌లోని మేరీమాత ఆలయాలు చుట్టు ప్రక్కల నుంచి వచ్చే క్రైస్తవులకు పిలిగ్రిం - పర్యాటక కేంద్రాలుగా గుర్తింపుకు నోచుకున్నాయి.

**చారిత్రక కోటలు**

చారిత్రక దేవాలయాల తరువాత కోటల్ని చూట్టానికి కూడా పర్యాటకులు ముచ్చట పడుతుంటారు. రాజకీయ-రక్షణ వ్యవస్థను తెలియజేసే కోటలు రాష్ట్రంలో చాలా ఉన్నాయి. శాతవాహనుల ముందు కాలంనుంచి సంస్థానాధీశుల కాలం వరకు వివిధ ప్రాంతాల్లో కట్టిన స్థల, గిరి, జల, వనదుర్గాలు పట్ల పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. స్థల దుర్గాల్లో దంతపురం, ధరణికోట, ధూళికట్ట, బోధన్, వరంగల్ మట్టికోటలు, గిరి దుర్గాల్లో హనుమకొండ, భోనగిరి, గాంధారికోట, కొండపల్లి, కొండవీడు, గోల్కొండ, ఉదయగిరి, గండికోట, పెనుగొండ, చంద్రగిరి రాతికోటలు, జలదుర్గాల్లో నిజాంకొండ కోట తరువాత వనదుర్గాలలో నారాయణవనం, కందూరు పర్యాటకపరంగా ముఖ్యమైనవి.




మెదక్ చర్చి


**స్థల దుర్గాలు**

**దంతపురం**

శ్రీకాకుళంజిల్లా ఆముధాల వలసకు దగ్గరలో నున్న దంతపురం వద్ద దాదాపు 1500 ఎకరాల చుట్టూ 100 అడుగుల విశాలం, 30 అడుగుల ఎత్తుగల మట్టికోట ఉంది. జరిపిన తవ్వకాల వల్ల ఈ మట్టికోట క్రీ.పూ. 4వ శతాబ్దం తరువాత మరింత బలిష్టంగా తయారుచేశారని తెలుస్తుంది. బుద్ధుని దంతధాతు కథతో సంబంధముండటంచేత, కళింగ రాజధానిగా కొనసాగటం చేత, కోటకు ప్రాధాన్యత ఏర్పడింది.




బౌద్ధ స్థూపాలు,
దంతపురం



తవ్వకాల్లో దొరికిన పురావస్తువులు, దంతపురం

### ధరణికోట

గుంటూరుజిల్లా అమరావతిలో క్రీ.పూ. 4-3 శతాబ్దాల నాటి చతురస్రాకారపు మట్టికోట ఉంది. శాతవాహనుల రెండో రాజధానిగా విలసిల్లిన ధరణికోట (ధాన్యకటకం)లోని ఈ కోట అనేక రాజకీయ ఆటుపోటులను చవిచూచింది. తరువాత మధ్యయుగాలవరకూ సామంత రాజుల ఆధీనంలోకి వచ్చిన ఈ కోట ప్రస్తుతం సరైన ఆలనా పాలనా లేక చూడటానికి వీలుగాలేదు. అమరావతి మ్యూజియం, స్థూపం, అమరేశ్వరాలయాలు చూడదగినవి.



అమరావతి స్థూప శిలాఫలకం

**ధూళికట్ట**



*ధూళికట్ట శిల్పం*
*(క్రీ.పూ. 1వ శతాబ్దం)*


కరీంనగర్‌జిల్లా ధూళికట్ట వద్ద శాతవాహనుల కాలపు స్థూపంతోపాటు మట్టికోట గూడా ఉంది. ఇక్కడ తవ్వకాల్లో శాతవాహన కాలపు రాజప్రాసాదం, నాణేలు, మట్టిపాత్రలు, ఇతర పురావస్తువులు బయల్పడటంతో స్థానానికి, కోటకు ప్రాముఖ్యత పెరిగింది.

**బోధన్**


నిజామాబాదుజిల్లాలోని బోధన్ పట్టణం వెలుపల గల ఎత్తైన మట్టికోట గోడ శాతవానుల కాలానికి చెందింది. చుట్టూ కందకం, దానివెంట దాదాపు 100 అడుగుల విశాలం 50 అడుగుల ఎత్తున్న మట్టికోట గోడ చారిత్రక తొలియుగపు రక్షణ వ్యవస్థకు తెలియజేస్తుంది. కోటలోపల కాకతీయుల కాలపు ఆలయాలు, కుతుబ్‌షాహీల కాలపు దేవళ్ మాస్క్‌లు ఇతర ఆకర్షణలు.

**వరంగల్ కోట**


కాకతీయుల శౌర్య పరాక్రమాలకు పెట్టిన కోటగా వరంగల్ కోట ప్రసిద్ధి చెందింది. మధ్యయుగాల నాటి రక్షణ వ్యవస్థలో భాగంగా, నిర్మించిన విశాలమైన మట్టికోట, చుట్టూ కందకం, లోపలి వైపు రాతిగోడలు, పటిష్టము, వ్యూహాత్మకమైన ప్రవేశ ద్వారాలు, శత్రుదుర్భేధ్యమైన కోటగోడలు, కోటలలోపలి కీర్తి తోరణాలు, ఆలయశిథిలాలు, శంభుని గుడి, ఏకశిల, సితావ్‌ఖాన్ పేలస్‌లు పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తున్నాయి.



*కీర్తి తోరణం,*



వేయిస్తంభాలమండపం, హనుమకొండ



*వరంగల్ కోట ద్వారము*

**గిరి దుర్గాలు**


**హనుమకొండ**

కాకతీయుల తొలి రాజధాని అయిన హనుమకొండ వద్ద గల కొండపై రాతితో కట్టిన అందమైన కోట సందర్శకుల దృష్టినాకర్షించలేకపోతుంది. రాష్ట్రకూటుల కాలానికే హనుమకొండ పై రాతికోట ఉన్నట్లు చారిత్రక ఆధారాలు దొరికినా, తొలి కాకతీయ రాజులు ఆ కోటను విస్తృతపరచారు. బస్టాండు వెనుక పర్లాంగు దూరంలో అప్పటి తోరణ ద్వారం గుండా ప్రవేశించి, కొండ మీద కెళ్లిన వారికి రెండు అంచెలుగా, చక్కగా చెక్కిన రాళ్లతో కట్టిన కోటగోడలు ఆశ్చర్యాన్ని కలుగజేస్తాయి. కొండపైన గల మట్టికోట, జైన శిల్పాలు ఇతర ఆకర్షణలు.

**భువనగిరి కోట**

కళ్యాణీ చాళుక్య రాజైన త్రిభువన మల్లుడు నిర్మించిన ఈ కోట,

కాకతీయులు, కుతుబ్‌షాహీలు, మొఘల్, అసఫ్ జాహీల కాలంలో తన వంతు పాత్రను పోషించింది. రెండు అంచెల ఈ కోట లోపల, కొండమీద కుతుబ్‌షాహీల బారాదరి, అప్పటి నీటిని తోడుకొనే విధానం సందర్శకులకు




*భువనగిరి కోట*

అసక్తికరంగా ఉంటాయి. తెలంగాణా వీరుడు సర్వాయి పాపడు కొద్ది రోజులు ఈ కోట నుంచి తన కార్యకలాపాలను కొనసాగించాడు.

**గాంధారి కోట**

ఆదిలాబాద్ జిల్లా, మంచిర్యాల పట్టణానికి 5 కి.మీ. దూరంలో నున్న గాంధారికోటప్రాచీనమైనది. మామూలు కోటల మాదిరిగా కాకుండా, కొండను తొలచి కోటగా తీర్చిదిద్దారు. ప్రవేశం వద్ద తొలచిన చిన్న ద్వారము, కొంచెం దూరంలో పెద్ద ద్వారము, గోడలపై శిల్పాలు, పైకెక్కిన తరువాత గుహాలయాలు, దానిపైన 20 అడుగుల పొడవు, 15 అడుగుల వెడల్పు 10 అడుగుల లోతు గల 3 నీటితొట్లు, ఇంకా కొంచెం పైన, కొండ చరియ పైనున్న రాతియుగపు చిత్రాలు అన్నీ కలిపి పర్యాటకులను వింత అనుభవాలను మిగులుస్తాయి.

**కొండపల్లి**



కొండపల్లి కోట

విజయవాడకు 16 కి.మీ., ఇబ్రహీంపట్నానికి 3 కి.మీ. దూరంలోగల కొండపల్లి కోట రెడ్డిరాజులు, విజయనగర రాజులు, కుతుబ్‌షాహీల కాలంలో శత్రు దుర్భేద్యమైన కోటగా నిలిచింది. రెడ్డిరాజులకాలంలో విశేషమైన

పాత్రను పోషించిన కొండపల్లికోట తరువాత కృష్ణరాయలి వశమైంది. తరువాత గజపతుల చేతిలో కొంతకాలం, అటు తరువాత కుతుబ్‌షాహీల ఆధీనంలో మరికొంతకాలం ఉంది. కుతుబ్‌షాహీల కాలంలో ఈ కోటలో అనేక కట్టడాలు నిర్మించబడ్డాయి. కొంచెం కష్టపడి పైకెక్కగలిగితే ఎత్తైన గోడలు, శిథిలావస్థలో నున్న కట్టడాలు మనల్ని మధ్యయుగాల్లోకి తీసుకెళ్తాయి.

**కొండవీడు**



కొండవీడు కోట

గుంటూరుజిల్లా ఫిరంగిపురం నుంచి చేరుకొనే వీలున్న కొండవీడు, రెడ్డిరాజుల రాజధాని. అనవేమారెడ్డి కాలంలో నిర్మించబడిన ఈ కోట, తరువాత విజయనగర, గజపతులు, కుతుబ్‌షాహీల వశమైంది. విశాలమైన కొండ చుట్టూ బురుజులు, కోటలోపల ఆలయాలు, మండపాలు, నేతి కొట్టు, గజశాల, అశ్వశాల, ఆయుధాగారం, ఇంకా మూడు చెరువులు నాటి జీవన విధానాన్ని అంచనా వేయటానికి తోడ్పడతాయి. మధ్యలో నున్న కుతుబ్‌షాహీల భవంతి, వెలుపలి కొచ్చే దారిపై నిర్మించిన ప్రవేశమంటపం, రెండు వైపులా మెట్లు నాటి నిర్మాణ చాతుర్యాన్ని తెలియజేస్తున్నాయి.


**గోల్కొండ**



గోల్కొండ కోట

హైదరాబాదు నగర శివారులోని గోల్కొండ కోట, కాకతీయుల కాలంలో ప్రారంభమైనా, కుతుబ్‌షాహీల కాలంలో విస్తరించబడి, ధృడతరం చేయబడింది. కొండచుట్టూ కందకం, దాని పక్కనే రాతికోట, నాలుగు దిక్కులా నాలుగు ప్రవేశ ద్వారాలు, పైన రెండు వరుసల్లో కోట గోడలు, లోపలి రాజప్రాసాదం, ఇతర కట్టడాలు, కొండపైని భవంతులు మొగల్ సైన్యం కోటను ముట్టడించిన తీరు చరిత్ర కళ్లముందు కదలాడుతుంది.

**ఉదయగిరి**




*ఉదయగిరి కోట*


నెల్లూరుజిల్లాలోని ఉదయగిరి కోట విజయనగర రాజుల కాలంలో నిర్మించబడింది. ఎత్తైన కోట గోడలు, దేవాలయాలు, మండపాలు, గోపురాలు, ఇతర కట్టడాలు ఒకనాటి వైభవ ప్రాభవాలకు చిహ్నాలు. ఉదయగిరి రాజ్యానికి రాజధానిగా కొనసాగింది.

**గండికోట**

కడపజిల్లా, జమ్మలమడుగు నుంచి వెళ్లే గండికోట, చిత్రావతి నది ఒడ్డున నిర్మింపబడింది. కాకతీయులు, కాయస్థులు, పెమ్మసాని వంశీయులు, విజయనగర, కుతుబ్‌షాహీ, అసఫ్‌జాహీల కాలంలో రాజకీయంగా చతురతను ప్రదర్శించింది. కోట గోడలు, విజయనగర దేవాలయాలు, మండపాలు, పై నుంచి చూస్తే విచిత్రంగా కనిపించే చిత్రావతి నది, పర్యాటకులకు కొత్త అనుభవాలనందిస్తాయి.



*గండికోట గోపురం*




*గండికోట వాచ్ టవర్*

**పెనుగొండ**

అనంతపురంజిల్లా పెనుగొండ మీద విజయనగర రాజుల కాలమునాటి రాతికోట, లోపలగల అనేక ఆలయాలు, గగన్‌మహల్ ఇతర కట్టడాలు పర్యాటక ఆకర్షణలు, దగ్గరలోనే నిర్మించబడిన కుంభకర్ణ విగ్రహం, ఎరమంచి గ్రామీణ పర్యాటక పథకం, పుట్టపర్తి చూడటానికొచ్చే పర్యాటకులు కొద్దిసేపు కొండెక్కి పై కట్టడాలను చూస్తే ఆనాటి శౌర్య పరాక్రమాలు, కట్టడ కౌశలం, భద్రతాపరమైన వ్యూహాలు అర్థమౌతాయి.



పెనుగొండ కోట ముఖద్వారం




గగన్ మహల్

### చంద్రగిరి

చిత్తూరుజిల్లా, తిరుపతికి 14 కి.మీ.ల దూరంలో నున్న చంద్రగిరి, చివరి విజయనగర రాజుల రాజమందిరాలు, కోట, దేవాలయాలకు ప్రసిద్ధి, రాజప్రాసాదాలు దాటి కొండ మీద కెక్కుతూ కోటగోడల్ని చూచే కొద్దీ ఆసక్తికరంగా ఉంటుంది. సాయంవేళలో రంగురంగుల కాంతుల్లో జిగేలుమనే రాజామహల్, రాణీమహల్ల దగ్గర సౌండ్ అండ్ లైట్ కార్యక్రమం తప్పనిసరిగా చూడాల్సిందే.



చంద్రగిరి కోట



రాజమహల్

### జలదుర్గాలు

చారిత్రక, శాసన సాహిత్యంలో చాళుక్య, కాకతీయుల కాలంలో కొల్లేరు, దివిసీమల్లో జలదుర్గాలు (నీటిలో కట్టిన కోటలు) వున్నాయని, వాటిని జయించటం చాలా కష్టతరమని చదువుకొన్నామేగానీ ఆ రెండు దుర్గాలూ కాలగతిన కనుమరుగైపోయాయి. అయితే కర్నూలు-హైదరాబాద్ రోడ్డు మీద బీచుపల్లి వద్ద కృష్ణా నదిలోనున్న నిజాంకొండ మీద దాదాపు 200 సం॥ నాటి కోట ఉంది.

చుట్టూ నీరు, మధ్యలో కొండ, దానిమీద మట్టికోట, బస్సుల్లో ప్రయాణించే వారికి కనిపించే అరుదైన దృశ్యాలు.

**వనదుర్గాలు**

అడవుల్లో వుండే కోటల్ని వనదుర్గాలని అంటారు. నల్లమల అడవుల్లో వున్న మారుగుత్తి దుర్గం, ప్రతాపరుద్రుని కోట, కరీంనగర్ జిల్లాలోని రామగిరి కోట మొదలైనవి వనదుర్గాలకు ఉదాహరణలు.

# 10 తెలుగువారి శాసనాలు, లిపి

## *Inscriptions and Script of the Telugu People*

కర్నూలు జిల్లా ఎర్రగుడి, రాజులమందగిరి వద్ద గల అశోకుని ప్రాకృత శాసనాలు, గుంటూరు జిల్లా భట్టిప్రోలు ధాతుపేటిక శాసనాలే తెలుగునేలపై తొలిశాసనాలని చరిత్రకారులు చెబుతున్నారు. కరీంనగర్ జిల్లా కొటలింగాల తవ్వకాల్లో బయల్పడిన శాతవాహనుల కంటే ముందరి రాజుల నాణేలపై గల లిపి కూడా దాదాపు ఇదే కాలానికి చెందిందే. **గోభద**, నరన, సమగోప, కంవాయ అనే నాలుగు స్థానిక రాజుల నాణేలపై వారి పేర్లున్నాయి. ఇవి కూడా తెలుగు పేర్లకు చాలా దగ్గరగా ఉన్నాయి. విశాఖ జిల్లా కొత్తూరులో దొరికిన బుద్ధ ధాతుపేటిక మూతపైన **తంబ(బా)య దానం** అన్న క్రీ.పూ. 2-1 శతాబ్దాలకు చెందిన బ్రాహ్మీ శాసనం ఉంది. **తంబయ** అనేది ముమ్మాటికీ తెలుగు శబ్దమే. కరీంనగర్ జిల్లా పెద్దబంకూరులో దొరికిన ముద్రికపై 'మహాతలవరస వజసామిక సేవసభా' అన్న క్రీ.పూ. 2వ శతాబ్దికి చెందిన బ్రాహ్మీ శాసనంలో 'తల' అన్న పదం తెలుగు పదమే.

ధ్యానకటక-అమరావతి స్థూపాన్ని అలంకరించిన శిలాఫలకాలపై గల కొన్ని శాసనాల్లో కూడా తెలుగు పదాలున్నాయి. క్రీ.శ. 1వ శతాబ్ది నాటి ఒక శాసనంలో రాజలేఖకుడైన 'బాల' (బాలయ్య) అనే పేరు తెలుగు పేరు. ఇక క్రీ.శ.3వ శతాబ్దిలో శ్రీపర్వత విజయపురి (నాగార్జునకొండ) నుంచి పాలించిన ఇక్ష్వాకుల ప్రాకృత శాసనాల్లో కూడా కొన్ని తెలుగు పేర్లు లేకపోలేదు. నాగార్జున కొండలో దొరికిన ఉపాసిక బోధిసిరి వేయించిన చుల ధమ్మగిరి శాసనంలో **మూల**, (ఇప్పటికీ మూలారెడ్డి అన్న పేరు వాడుకలో ఉంది). **మూలమ్మ**, వీరమ్మ, నాగన్న, వీరన్న మొదలైన తెలుగు పేర్లున్నాయి. దాదాపు క్రీ.శ.3-4 శతాబ్దాల నాటి బృహత్పలాయన జయవర్మ గుంటూరు జిల్లా కొండముది రాగిరేకు శాసనంలో **కుదూరు**, (కోదూరు), **పాంటూరు** (పాతూరు) అన్న గ్రామాల పేర్లు తెలుగులో ఉండటం గమనించదగ్గ విషయం.

క్రీ.శ. 4వ శతాబ్దికే చెందిన పల్లవశివస్కన్దవర్మ మైదవోలు బ్రాహ్మీ రాగి రేకు శాసనంలో ఇద్దరు బ్రాహ్మణులకు విరిపర అనే గ్రామాన్ని దానం చేసినట్లుంది. గుంటూరు జిల్లా నకరేకల్లు మండలంలోని విపర్లే, విరిపరగా గుర్తించటమైంది. విరిపర అనేది కొల్లిపర మాదిరిగా తెలుగు పేరే.

హైదరాబాదు సమీపంలోని కీసరగుట్ట, విష్ణుకుండినుల రాజధాని. అక్కడున్న కోట గోడపై **తులచువాన్డు** (తొలిచేవాళ్లు) అన్న 4వ శతాబ్ది నాటి అచ్చ తెలుగు శాసనముంది విష్ణుకుండిన గోవిందవర్మ తుమ్మలిగూడెం ప్రాకృత శాసనంలో **ఎనమదల, పేణ్కపఱ** అనే తెలుగు గ్రామ ఊర్లపేర్లున్నాయి. అదే వంశానికి చెందిన మాధవవర్మ పాతగండిగూడెం శాసనం ప్రాకృత రాగి రేకు శాసనంలో **కుడూరు** అనే తెలుగు ఊరుపేరు. శాసనాన్ని చెప్పిన గంధర్వ ముత్తురాజు పేరులో ముత్తు కూడా తెలుగు పదమే పృథ్వీశ్రీమూలుని కొండవీటి సంస్కృత శాసనం (క్రీ.శ.5 వ శతాబ్ది)లో **తాలుపాక** (నేటి తూర్పుగోదావరి జిల్లా తాటిపాక) తెలుగు మాటే. క్రీ.శ. 6వ శతాబ్దికి చెందిన కడప జిల్లా కమలాపురం తాలూకా కళమళ్ల చెన్న కేశవదేవాలయంలోని ఎరికల్ముత్తురాజు ధనుంజయుడు రేనాడును ఏలుతున్నపుడు చిఱుంబూరుకు చెందిన రేవన కాలుకు, చెన్నూరు కాజుకు చేసిన దాన వివరాల్లో ఎరికల్ముతురాజు, రేనాణ్డు, ఏళక (ఏలే), చిఱుంబూరు, చెన్నూరు, ఊరిణ్డవారు, **ఊరివారు** అన్నీ తెలుగు పదాలే. అందుకనే దీన్ని తొలి తెలుగు శాసనమన్నారు. తరువాత సత్యాదిత్య మంతెపాడు శాసనం, చోళమహారాజు పులపత్తూరు శాసనం రెండోపులకేశి కొప్పరం రాగి రేకు శాసనంలో (కొండ **వెఱుపూరు** అనే పదం), విక్రమాదిత్యుని ఆముదాలపాడు రాగి రేకు శాసనంలో **మఱ్ణూరు, వంగూరు వాటి విషయం, ఈపఱుంకల్లు** (నేటి వీపనగండ్ల) కోకిల స్వామి, అనే తెలుగు పదాలను గమనించవచ్చు. ఇక అద్దంకి పండరంగని క్రీ.శ.9వ శతాబ్ది శాసనం, యుద్ధమల్లుని బెజవాడ శాసనం, ధవళేయ బాణరాజు బలపనూరు శాసనం, వైదుంబ గండత్రినేత్రుని బందపల్లి శాసనం, ఇంకా కుర్యాల జినవల్లభుని శాసనాల్లో తెలుగు పదాలెన్నో ఉన్నాయి. క్రీ.శ. 10-11 శతాబ్దంలో తెలుగు, కన్నడ, 12 వ శతాబ్ది నుంచి పూర్తి తెలుగు, పూర్తి సంస్కృతి, తెలుగు సంస్కృత శాసనాలొచ్చాయి. కందూరుచోళ, చాళుక్య చోళ, కాకతీయ, రెడ్డిరాజులు, వెలమ విజయనగర, రాజుల శాసనాలే ఇందుకు ఉదాహరణలు.

**తెలుగు లిపి (రాత)**

చేత్తో రంగులతో గీతలు గీయటం శిలా యుగంలో ప్రారంభమైనట్లు చెప్పుకొన్నాం. ఇనుప యుగం నాటికి అక్షారాలను పోలిన గుర్తులు నల్లగొండ జిల్లా రాయగిరి ఇనుపయుగపు సమాధుల తవ్వకాల్లో బయల్పడిన మట్టి పాత్రలపై ఎన్నో

ఉన్నాయి. ఇలా మధ్యరాతియుగపు చిత్రకళలోని గీతలు, ఇనుప యుగానికి రాతలుగా మారాయి.

మన దేశంలో సింధులోయలోని మొహంజోదారో, హరప్పా లాంటి స్థావరాల్లో దొరికిన ముద్రలు, ముద్రికలు, ఫలకాలపై గల బొమ్మ అక్షరాలే మొదటి లిపి. ఆ లిపిని ఇంత వరకూ కనుక్కోలేకపోయారు. ఇక ఆ తరువాత క్రీ.పూ. 3 వ శతాబ్దినాటి అశోకుని శిలా, స్థంభ శాసనాల్లోనే మళ్లీ మనకు రాత కనిపించింది. ఇలా చారిత్రక తొలి యుగంలో ప్రారంభమైన రాతను బ్రాహ్మీ అన్నారు. భాషను ప్రాకృతమనీ, గ్రంథాలను పాళీ అని అన్నారు. సిద్ధార్థుడు క్రీ.పూ. 6వ శతాబ్దిలో పాఠశాల్లో నేర్చుకొన్న లిపుల్లో బ్రాహ్మీ ఒకటని **లలిత విస్తరమనే** గ్రంధంలో ఉంది. కాబట్టి మన దేశంలోనూ, మన రాష్ట్రంలోనూ దొరికిన మొదటి శాసనాలు అశోకునివైతే మొదటి లిపి కూడా ఆ శాసనాలను పొందుపరచిన బ్రాహ్మీ అక్షరాలదే.

తరువాత శుంగులు, శాతవాహనులు, కళింగరాజులు బ్రాహ్మీ లిపినే వాడగా, క్రీ.శ. 4-5 శతాబ్దాల నుంచి దేవనాగరి కూడా వచ్చింది. మన రాష్ట్రంలో అయితే తెలుగు అక్షారాలు రావటానికి క్రీ.శ. 9వ శతాబ్ది వరకూ వేచి ఉండాల్సి వచ్చింది. అవి కూడ కన్నడాక్షరాలకు దగ్గరగా ఉండే తెలుగు అక్షరాలు. అందుకనే వాటి తెలుగు-కన్నడ శాసనాలన్నారు. క్రీ.శ. 11-13 శతాబ్దాల మధ్య అసలైన తెలుగ అక్షారాలు శాసనాల్లోకి వచ్చాయి. తెలుగు లిపి పరిణామాన్ని తేలిగ్గా అర్థం చేసుకోవాలంటే మౌర్యుల కాలపు బ్రాహ్మీ లిపి, శాతవాహనుల కంటే ముందరి రాజులు నాణేల పైగల లిపి, తొలి ఒకరిద్దరు శాతవాహన రాజుల లిపి, శాతవాహన-ఇక్ష్వాకుల లిపిగా క్రీ.పూ. 3- క్రీ.శ. 3 శతాబ్దాల మధ్య కాలపు లిపిని వర్గీకరించి అధ్యయనం చేయాలి. ఇక్ష్వాకుల కాలపు నాగార్జునకొండ బోధిసిరి శాసనంలో అక్షారాలు అందంగానేకాక అలంకారంగా ఉంటాన శంఖ లిపి అన్నారు.

తరువాత క్రీ.శ. 300-700 మధ్య తొలి పల్లవులు, ఆనందగోత్రినులు, బృహత్పలీయనులు, సాలంకాయనులు, విష్ణుకుండినుల వరకూ లిపి దాదాపు ఒకేరకంగా ఉంది. రేనాటి చోళుల కాలంలో మార్పుకు గురైంది. రాష్ట్రకూట, వేంగీచాళుక్య, ముదిగొండ చాళుక్యుల కాలంలో లిపిలో బ్రాహ్మీ స్థానంలో తెలుగు అక్షరాలు రూపుదిద్దుకొన్నాయి. కందూరుచోళ, కళ్యాణీచాళుక్య, కాలపు లిపిని తెలుగు-కన్నడ లిపి అన్నారు. కాకతీయులు, రెడ్డి రాజులు, రాచకొండ వెలమలు, విజయనగర కాలపు లిపిలో పూర్తిగా తెలుగు అక్షరాలే ఉండటం గమనించాల్సిన విషయం.

శాసనాల్లో అంకెల్ని కొన్నిసార్లు మాటలతో సూచిస్తారు. ఉదాహరణకు శరఖేందు భూమి అనే మాట. ఇందులో శర (పంచశరాలు-బాణాలు) 5, ఖ (ఆకారం)

౦, ఇందు (చంద్రుడు) 1, భూమి-1, అంటే 5011. కానీ శాసనాల్లోని అక్షరాలను ఎడమవైపుగా చదవాలి (అంకానాం వామతో గతిః) దీనిని బట్టి పైన చెప్పిన 5011 ను 1105గా అంటే శాతివాహన శకం 1105 వ సంవత్సరంగా తెలుసుకోవాలి. శక సంవత్సరం క్రీ.శ. 78లో ప్రారంభమైంది కాబట్టి 1105ను క్రీస్తు శకంలోకి మార్చుకోవాలి. అందుకు 78 సంవత్సరాలను కలపాలి. అపుడు 1105+78 = 1183వ సంవత్సరం అవుతుందన్న మాట. మీరు కూడ ఇక శాసనాల్ని చదవొచ్చు.


**రాజా కుబిరకుని భట్టిప్రోలు ధాతుపేటిక శాసనాలు**

1. అరహదినసాం గోట్టియ
మజూసహ
షమగో చ తే న కమయేన
కుబీరకో రాజ అంకి.



రాజా కుబిరకుని పర్యవేక్షణలో
చేయించిన మంజూషికను గోష్టికి
చెందిన అరహదత్తుడు
బహూకరించాడు.

**అశోకుని ఎఱ్ఱగుడి శాసనం**
**(క్రీ.పూ. 257)**



కర్నూలు జిల్లా పత్తికొండ తాలూకాలో గుత్తికి దగ్గరగానున్న ఎఱ్ఱగుడి పొలాల్లో గుట్టల్లోని రాళ్లపైనున్న అశోకుని శాసనాలను మొదట 18వ శతాబ్దం చివర్లో మెకంజీ, ఆయన సహాయకులు గుర్తించారు. అయితే 1928-29లో జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండాయాకు చెందిన ఘోష్ అనునతడు వాటి వివరాలను భారత పురావస్తుశాఖకు తెలియజేగా వారు నకళ్లను తీస ప్రచురించిన తరువాత ఎఱ్ఱగుడిలో అశోకుని శాసనాలున్నాయని తెలిసింది. ఇక్కడున్న 14 శాసనాల్లో మచ్చుకు ఒకటో శాసనాన్ని లిపి, భాషలను పరిశీలించడానికి ఇక్కడ పొందుపరచడమైనది

శాసనం


1. (i) దేవానం పియే హేవాయ (ii) అధికాని
2. య హకమ్ ఉపాసకే (iii) నోతు ఖో ఏకం సంవఛరం పకా (ం) తే
3. హుసం (iv) సాతిరేకే చుఖో సవఛరే యం మయా సుఘే ఉపయీ
4. తే బాధంచమే పకంతె (v) ఇమినా చు కాలేన అమిసా (యే) మునిసా
5. దేవేహి తే దాని మిసి భుతా (vi) పకమస హి
6. ఇయం (vii) మహప్తేనేవ సకియే (viii) ఖుదకేన పి పక
7. మమీనేన సకియే విపులే స్వగే అరా ధేతవే (ix) ఏతాయచ అతాయ ఇయం
8. (సా) పనె సావితే (x) అరా ఖుదక మహలకా ఇమం పి (ప) క మెహూ అ(ం)
9. తా చ మే జానెవు చిరథితికా చ
10. ఇయం పకమే హౌత విపులం పిచ వధసితా అపరధియా దియాధియం
11. (xii) వాపితె వ్యూథేన 200 50 6

శాసన వివరాలు:

1. దేవాంనాప్రియుడు (అశోకుడు) ఈ విధంగా చెబుతున్నాడు
2. నేను ఉపాసకుడైన (రెండున్నర ఏండ్లు) గడిచాయి
3. మొదటి సంవత్సరంలో (బౌద్ధమత వ్యాప్తికై) నేను తగిన కృషిని చేయలేక పోయాను
4. నేను దీక్షతో ఇప్పటికి ఒక సంవత్సరము నుంచి సంఘ విషయంలో పనిచేయుచున్నాను
5. అప్పటి వరకును దేవత్వాన్ని పొందనివారు ఈ సంవత్సరంకాలంలో దేవత్వాన్ని పొందాడు
6. ఇది నా ధర్మప్రచార ఫలమే
7. దేవత్వమును పొందగలుగునది ధనికులు మాత్రమే కాదుబో
8. దరిద్రుడు కూడా మనసార ధర్మనిష్ఠతో నడచినట్లైతే స్వర్గాన్ని పొందగలుగుతారు
9. అందుకే నేను ఈ శాసనాన్ని నెలకొల్పాను
10. నా రాజ్యంలోని ధనికులు, పేదవారూ ఈ విధంగా ధర్మాన్ని ఆచరిస్తే, దానిని తెలిపి ఆవిధంగానే ధర్మనిష్టతో నడచుకొనే ఇతర రాజ్యాలవారుకూడా రెట్టింపవుతారు.
11. (నేను) 356 (దినములు) యాత్రను సాగించిన తరువాత (ఈ శాసనాన్ని నెలకొల్పాను)

### పెద్దబంకూరు – ధూళికట్ట ముద్రికలు

కరీంనగర్ జిల్లాలోని పెద్దబంకూరులో క్రీ.పూ.2– క్రీ.శ. 2 శతాబ్దాల మధ్యకాలానికి చెందిన ఇళ్ల పునాదులు, ఇతర పురాణ వస్తువులు, అలాగే ధూళికట్టలో బౌద్ధ స్థూప విహారాలు, ఇతర పురావస్తువులతోపాటు నాణేలు, ముద్రికలు కూడా బయల్పడినాయి. ఆ ముద్రికలపై బ్రాహ్మీలిపిలో అక్షరాలున్నాయి.



[illegible] (ధూళికట్ట)

### శాలిహుండం మట్టిపాత్రల శాసనాలు

శ్రీకాకుళం జిల్లాలోని శాలిహుండం వద్ద జరిపిన తవ్వకాల్లో స్థూప, చైత్య, విహారాలతోపాటు క్రీ.పూ.2– క్రీ.శ.2 శతాబ్దాలనాటి శాసనాలు బయల్పడినాయి. రాళ్లమీదే కాక, కుండలమీద, నాణేలమీద, శంఖాలమీద, ముద్రికలమీద కూడా బ్రాహ్మీలిపిలో శాసనాలున్నాయి. కుండపెంకులు, శంఖాల మీద గల కొన్ని శాసనాలు.

### ధాన్యకటక – అమరావతి శాసనాలు

గుంటూరుకు 35 కి.మీ. దూరంలో కృష్ణానది కుడిగట్టునున్న అమరావతి వద్ద క్రీ.పూ. 4– క్రీ.శ. 14 వరకూ విలసిన ధాన్యకటకమనే బౌద్ధక్షేత్రం ఉంది. మౌర్య, శాతవాహన, ఇక్ష్వాకుల కాలంలో నిర్మాణం, మరమ్మతులకు నోచుకున్న ఇక్కడి మహాచైత్యం వద్ద 1797 నుంచి 1990 వరకూ జరిపిన తవ్వకాల్లో అనేక నాణేలు, బౌద్ధ శిలాఫలకాలు, కట్టడ భాగాలు, శిల్పాలు, శిలాఫలకాల పైన శాసనాలు లభించాయి. అశోకుని శాసనం కూడా ఒకటి దొరికింది, శాతవాహన, ఇక్ష్వాకుల కాలపు అనేక బ్రాహ్మీ శాసనాలు, ఈ మహాచైత్య నిర్మాణంలో పాలుపంచుకున్న ఉపాసక, ఉపాసికలు, భిక్షు, భిక్షుణీలతో పాటు అనేక వృత్తి పనివారు, సామాన్య ప్రజల వివరాలనందిస్తున్నాయి. ఎక్కువ శాసనాలు క్రీ.పూ. 1–క్రీ.శ. 3 శతాబ్దాలకు చెందుతాయి.

### ఇక్ష్వాకుల శాసనాలు


### మహాతలవరి ఛాంతిసిరి నాగార్జునకొండ శాసనం

మహారాజు సిరిఛాంతమూలని, సోదరీ, మహాసేనాపతి, మహాతలవర పుకియ వంశీయుడైన వాసిష్టీపుత్ర కందసిరి భార్య అయిన మహాతలవరిఛాంతిసిరి తమ అల్లుడు మాఢరీపుత్ర ఇఖాకు సిరివీరపురిసదత్తునికి ఆయువు పెరగటానికి, విజయం కలగటానికి మరియూ తమకు, ఉభయలోకాల హితమూ, సుఖాలకోసం. . . దానం చేసిందని ఈ శాసనం తెలియజేస్తుంది.



ధఞకటకప నిగమప

ధాన్యకటక నిగమం (నగరం) యొక్క   (దానం)



రాజ లెఖకప బల

స జాయాయా సొమ దతా


రాజాలేఖకుడైన బలుని భార్య సొమ  (ఇచ్చిన దానం)



ధ వ గి రి వ ఠ వ నా గ బు ధి వ ని య పు తొ  న క సి రి బ హి ని య పు సె...


ధనగిరి వాస్తవ్యుడైన నాగబుద్ధి అనే వర్తకుని కొడుకు నకసిరి ...

1. మగారాజస అసమెధ యాజిస
2. అనేక హిరణ్ణ కోటి పకాయిన సిరి ఛంతమూలస
3. సహొదరా భగిని మహాసేనపతిస
4. మమాలతయ(ప)ర వాసిఠీ పుతస పూకియానం
5. కందసిరిస భరి(యా) మహాతలవరీ ఛాంతిసిరి
6. (అ) పణొ జామీతుకస రమ్ణొ మాథరీపు(త) సిఖాకు (సం)
7. (సిరి) వీరపురిబసదతస అయువధనికె వెజయి (క)
8. (అపణొ) చ ఉభయ లోకహిత సుఖానివాణధనాయ)




శాలంకాయన నందివర్మ కానుకొల్లు శాసనం
మొదటి రేకు

1. విజయ – వేంగిపురా బప్ప – భట్టారక
2. పాద – పరిగ్గహితస్స మహారాజ
3. సిరి – నందివమ్మస్స వచనేన పి –




రెండోరేకు – మొదటి వైపు

4. డిహ – గ్గామె ముత్యదప్ప ముఖొగామొ
5. సవ్వ – సమగ్గొ సవ్వాయొగ – పెసన
6. కులపుత్త భడ – మనస్సొ భానితవ్వా




రెండోరేకు – రెండో వైపు

7. ఇహహి అంహ ధమ్మాయుబలవద్ద
8. ఇత్థ(ం) బాలక – మహారాజ కుమార
9. ఖండ పొత్తస్స యశత్తి సత్థియనం




మూడోరేకు – మొదటివైపు

10. ఇచ్ఛంతెన మయా ఎతస్స సాపాను
11. గ్గహ – సమత్థాస్స నానాగొత్త–చ
12. రణ – తపస్స (ఝా)య – నిరతస్స



మూడోరేకు – రెండో వైపు

13. అగ్గహార – రధకార – చాతువెజ్జస్స
14. ఏస పిడిహ – గ్గామొ అగ్గహారం – ర
15. ధకార – విధానేన సంపదత్తొ తస్సయ




## ఆనందగోత్రిన దామోదరవర్మన్ మట్టిపాడు రాగిరేకు శాసనం (క్రీ.శ.4వ శతాబ్ది)

అప్పటి గుంటూరు జిల్లాలోని ఒంగోలు తాలూకా, మట్టిపాడు గ్రామంలో దొరికిన ఈ రాగిరేకు శాసనాన్ని, నెల్లూరు తహశీల్దారు పరిశీలనకోసం రావుబహదూర్ హెచ్. కృష్ణశాస్త్రికి పంపారు. ఆనందగోత్రుడైన మహారాజ దామోదరవర్మ తన రాజధాని

కందరపురం (గుంటూరు జిల్లా నరసరావుపేట తాలూకా, నకిరేకల్లు దగ్గరున్న చేజెర్ల) నుంచి ఈ శాసనాలను విడుదల చేశాడు. ప్రాకృత, సంస్కృత భాషలలో నున్న ఈ దానశాసనంలో, దామోదరవర్మ సంయక్సంబుద్ధుని పాదారాధకుడనీ, 16 మహాదానాల్లోని గోసహస్ర, వేయి సూడి ఆవులను హిరణ్యగర్భ, బంగారాన్ని దానాలను నెరవేర్చినవాడనీ, తమ కులం బాగుకోసం అనేక సూత్రాలకు, చరణాలకు చెందిన బ్రాహ్మణులకు కంగూరనే గ్రామాన్ని సర్వ బాధా పరిహారంగా దానం ఇచ్చాడని తెలుపుతుంది. కొండిన్న రుద్దజ్జ, కొండిన్న కందజ్జ, కొండిన్న సిరిజ్జ, కొండిన్న భవజ్జ, కొండిన్న ఖందజ్జ, కొండిన్న సవరజ్జ, కొండిన్న అగ్గిజ్జ, కొండిన్న వీరజ్జ, కస్సవదామజ్జ, కస్సవ కుమార్జ, కస్సవవేణుజ్జ, కస్సవదేవజ్జ, కాస్యపనందిజ్జ, వత్స దొణజ్జ, అగస్తి భద్దజ్జలకు ఒక్కొక్క భాగం చొప్పున దామోదరవర్మ తన 2వ విజయరాజ్య సంవత్సరం, కార్తీకమాస శుక్లపక్ష త్రయోదశినాడు దానం చేశాడు.

మొదటిరేకు – రెండోవైపు

1. విజయ కందపురాత్ (భ)గవతః సంయక్సంబుద్ధస్య పాదానుద్యా
2. తస్య ఆనందసగోత్రస్య అ(వంధ్య) గోసహ(స్రాని)క హిరణ్య



### పల్లవ శివస్కంధవర్మ మైదవోలు రాగిరేకు శాసనం

గుంటూరుజిల్లా , నరసరావుపేటకు 20 కి.మీల దూరంలోనున్న మైదవోలు పాటి దిబ్బ దగ్గర 1889లో స్థానికుడైన మైదవోలు జయరామయ్యకు ఈ రాగిరేకు శాసనాల గుత్తి దొరికింది. ఆయన వాటిని మద్రాసు మ్యూజియానికి పంపగా, శాసన పరిశోధకులు జయంతి రామయ్య పంతులు, వెంయ్యాల సహకారంతో డా॥ ఇ. హుల్ష్ వీటిని పరిశీలించి, ఎపిగ్రాఫియా ఇండికా, వాల్యూం 6 లో ప్రచురించాడు.


గుత్తిలోగల మొత్తం 8 రాగిరేకుల్లో 15 వైపుల మాత్రమే శాసనాక్షరాలు ఉన్నాయి. పల్లవవంశం, భరద్వాజ గోత్రానికి చెందిన యువమహారాజు శివస్కంధవర్మ కాంచీపురం నుంచి విడుదలచేసిన, ప్రాకృత భాషలోనున్న ఈ శాసనంలో,

ఆంధ్రపథంలోని విరిపర గ్రామంలోని అగ్నివేశ గోత్రానికి చెందిన పువకోటుజు, గోనందిజునే ఇద్దరు బ్రాహ్మణులకు తమకు జయం, పుణ్యంతోపాటు, ఆయురారోగ్యాలు వృద్ధిగావటానికి దన్నాకడ (ధాన్యకటకం/అమరావతి)లో నున్న తమ ప్రతినిధి ద్వారా ఇచ్చిన దాన వివరాలున్నాయి.

ఈవిరిపర గ్రామానికి బ్రహ్మదేయం ద్వారా సంక్రమించే అన్ని హక్కులను కల్పించటంతోపాటు ఉప్పు త్వకం, ఎడ్లను, ఉప్పుడుబియ్యాన్ని, మట్టికుండలు, మంచాలు, నివాసాలను సరఫరాచేయటం నుంచి మినహాయించటమే కాకుండా ఆ గ్రామంలో రక్షణ భటులుగానీ, సైనిక భటులుగానీ ప్రవేశించకుండా ఆదేశించనట్లు కూడా ఉంది. ఈ నియమాలను పాటించకుండా, ఉల్లంఘించిన వారు శారీరక శిక్షకు అర్హులని కూడా ప్రస్తావించబడింది.


మొదటి రేకు - రెండోవైపు

1. (కం) చీపురతొ యువమహారాజొ
2. భారదాయ - సగొత్తొ పలవాసం




రెండో రేకు - మొదటి వైపు

3. శివఖ(ం)దవమ్మొ దమ్నాకడె
4. వాపతం ఆనపయతి



రెండో రేకు - రెండో వైపు

5. అంహేహి దాని అంహవెజయికె
6. (ధమ్మ) యు బలవధనికె



## విష్ణుకుండిన శాసనాలు


## గోవిందవర్మ తుమ్మలగూడెం

విష్ణుకుండిన మహారాజు ఇంద్రవర్మ మనుమడు మాధవవర్మ కొడుకు అయిన గోవిందవర్మ సంయస్సం బుద్ధుని మార్గాన్ని అనుసరిస్తూ బౌద్ధ భిక్షువులకు, బ్రాహ్మణులకు, నిస్సహాయులకు, యాచకులకు, రోగులకు, బాధితులకు వారి వారి అవసరాలను తీర్చటానికి వేలకొద్దీ గ్రామాలను, భూములను, బంగారాన్ని, ఏనుగులను, గుర్రాలను, గోవులను, ఎడ్లను, శయనాసనాలను, వాహనాలను,

ఆహారపానీయాలను, వసతి, బట్టలు, ఆభరణాలు, కన్యలు, దాసదాసీ జనులను దానం చేయటమేకాక, తన రాజ్యమంతా ఆలయాలు, విహారాలు నిర్మించి, చెరువులు త్రవ్వించి, తోటలు పెట్టించి వాటిని చక్కగా నిర్వహించటానికి తన రాణి నిర్మించిన మహావిహార మరమ్మత్తులకు బౌద్ధ విహారంలోని భిక్షవుల అవసరాల కోసం తను ఇంద్రపురంలో నిర్మించిన బౌద్ధ విహారంలోని భిక్షువలు అవసరాలకోసం ఎన్మదల ప్రేంకపఱు అనే గ్రామాలను వైశాఖపున్నమినాడు సర్వబాధాపరిహారంగా దానం చేశాడని ఈ శాసనం పేర్కొంటుంది.


మొదటి రేకు - రెండోవైపు


1. స్వస్తి జితం భగవతా తేన సంబుద్ధేన కృపాత్మనా నిర్వాణ ప్రాప్తయే యేన సద్యోమార్గః ప్రదర్శితః ॥ సత్వసత్య
2. త్యాగా భిజన నయ వినయోత్సాహాది గుణగణ సంపదా స్వయమధిగత రాజ్యాణం సమ్యక్ప్రజాపాలనాత్ప్ర
3. ధి తావదాత పృథు యశసాం రాజ్ఞాం విష్ణుకుణ్డానా మమల విపుల సకల కుల తిల
4. కేన శ్రీ మహారాజేన్ద్ర వర్మ సత్పౌత్రేణ మహారాజశ్రీ మాధవవర్మణః సుపుత్రేణ స్వతయ
5. భుజబలోత్సాహ ప్రభావానురాగా వాప్త స్వరాజ్యేనశౌర్య ధైర్య ప్రతాపానుభావా ద




## రేనాటి చోళ ధనుంజయుని కలమళ్ళ శాసనం
## Kalamalla Inscription of Renati Chola King Dhanamjaya
## (Ep.Ind.XXVII; IAP. Kadapa Vol.I, NO.2P.1)

1. . . . . . . . . . .
2. కల్ముతురా -
3. ఙు ధనంజ-
4. యుఱు రేనా
5. ణ్డు ఏళన్-
6. చిఱుంబూరి-
7. రేవణకాలు (పం)
8. పు చెనూరుకా(ఞు)
9. అతీకళా ఊరి-
10. (ణ్డ) వారు ఊరిస-
11 . . . . . . . . . .





పరిణామక్రమం



17.1 పటం

# 11 తెలుగువారి నాణేలు

## Coinage of the Telugu People

'చిల్లిగవ్వకు కూడా చెల్లదు' అన్న సామెతను వినని వారుండరు. ఈ సామెతలో తెలుగువారి నాణేల ప్రాచీన చరిత్ర ఇమిడి ఉంది. కొత్త రాతియుగంలో వ్యవసాయోత్పత్తులు పెరిగి, పంపిణీ జరిగేప్పుడు వస్తు మార్పిడి విధానం అమల్లోకొచ్చింది. ఇనుపయుగం నాటికి ఊళ్లు పట్టణాలై, మార్కెటు స్థావరాలు కూడా పుట్టుకొచ్చాయి. వేదాల్లోనూ, తరువాతి సాహిత్యంలోనూ నిష్క, సువర్ణ, కార్షాపణ అనే బంగారు నాణేలు వాడుకలో ఉన్నట్లు తెలుస్తుంది. కానీ అలాంటి వెక్కడా దొరకలేదు. అదే కాలంలో అవుల్ని నగదుగా వాడారు. తరువాత గవ్వలొచ్చాయి. ఉత్తర భారతదేశంలోని 16 మహాజనపదాలు క్రీ.పూ. 6 వ శతాబ్దిలో మొదటిసారి లోహంతో పోతపోసి వాటిపై కొన్ని గుర్తులను ఒత్తిన నాణేలను తొలిసారిగా చలామణిలోకి రావటంతో దేశ ఆర్థిక వ్యవస్థలో మార్పు రావటమేకాక, వినియోగదారులకు ఎంతో సౌలభ్యం జరిగింది.

ఇలా క్రీ.పూ. 6వ శతాబ్దికి చెందిన నొక్కుడు గుర్తులు గల నాణేలు ('పంచ్‌మార్క్‌డ్) ఉత్తరాది ప్రదేశాలైన కౌశాంబి, మధుర, పాటలీపుత్ర, తక్షశిల, హస్తినాపూర్‌లలో దొరికాయి. ఇవి వెండి, రాగిలోహాలతో పోతపోయబడినాయి. తెలుగు నేలపై కూడా క్రీ.పూ. 6వ శతాబ్దంలో తొలిసారిగా నాణేలు విడుదలైనాయి. అవి కూడా వెండి, రాగిలోహాలతో పోతపోయబడి నొక్కుడు గుర్తులుకలిగి ఉన్నాయి.

కరీంనగర్ జిల్లా కోటలింగాల, పెద్దబంకూరు, నుస్తులాపూరు, గుంటూరు జిల్లా అమరావతి, కృష్ణాజిల్లా సింగవరంలలో ఇలాంటి నాణేలు దొరికాయి. సింగవరం నాణేలపై ఏనుగు, రెండు చంద్రబింబాలు, ఒక గుండ్రటి గుర్తూ ఉన్నాయి.

జనపదాలు, మహాజనపదాలు క్రీ.పూ. 7–6 శతాబ్దాలలో విడుదల చేసిన నాణేలే మనదేశపు తొలినాణేలు. చారిత్రక తొలియుగంలో మనదేశంలో 16 మహాజనపదాలు, 100పైగా జనపదాలున్నట్లు చారిత్రక ఆధారాలున్నాయి. అయితే ఇంతవరకు ఆంధ్ర, కోసల, కళింగ, కాశి, మగధ, సౌరాష్ట్ర, సౌరసేన, పాంచాల, కురు, మల్ల, వత్స, అస్మాక, అవంతి, గాంధార, శాక్య, విదర్భ, అసిక, ఛేది అనే 18 జనపదాలు విడుదల చేసిన నాణేలు మాత్రమే వెలుగుచూశాయి. వివిధ జనపదాలు విడుదల చేసిన నాణేలన్నింటి మీద ఆయా జనపదాలకు చెందిన గుర్తులుండటం మామూలే. అయితే ఏనుగుగుర్తు ఒక్కటే అన్ని జనపదాల నాణేలమీద ఉండటాన్ని ఇక్కడ ప్రత్యేకంగా పేర్కొనాలి.

### కోటలింగాల నాణేలు

మౌర్యులు, శుంగులు, కణ్వుల, తరువాత దక్షిణా పథాన్నేలిన గొప్ప రాజవంశాల్లో శాతవాహనులు ముఖ్యులు. సాంచి, అమరావతి స్థూపాలను నిర్మించి, పశ్చిమ భారతదేశంలో బౌద్ధ గుహాలయాలను తొలిపించి, అనేక శిల్పకళాకండాలను తీర్చిదిద్దిందికూడా ఈ శాతవాహనులే. విశాల దక్షణ భారత భూభాగాన్ని దాదాపు మూడు శతాబ్దాలపాటు పాలించిన శాతవాహనుల పుట్టు పూర్వోత్తరాలకు సంబంధించిన అనేక చిక్కు ముళ్లను ఇంకా విప్పాల్సి ఉంది. ఇంతకీ అసలు శాతవాహనులు ఎవరు? పురాణాల్లో పేర్కొన్న ఆంధ్రులూ, శాతవాహనులు ఒకరేనా అన్న ప్రశ్నలు ఇంకా వేధిస్తూనే ఉన్నాయి. వారి పాలన ఎప్పుడు ప్రారంభమైంది? క్రీ.పూ. 230లోనా లేక క్రీ.పూ. 1వ శతాబ్దం చివరలోనా అనే విషయాలపై కూడా ఇంకా సరైన సమాచారం దొరకలేదు. అయితే వారిపాలన క్రీ.శ. 230 ప్రాంతంలో ముగిసందన్న విషయాన్ని మాత్రం అందరూ ఒప్పుకొంటున్నారు. శాతవాహనులు ఎంత కాలం పరిపాలించారు? అందరూ అనుకొంటున్నట్లుగా 456 నుంచి 460 సంవత్సరాలు పాలించారా లేక ఇంకా తక్కువా అన్న ప్రశ్నలకు కూడా సమాధానాలు దొరకటం లేదు. కోస్తా ఆంధ్ర, విదర్భ, పశ్చిమ మహారాష్ట్ర లేక తెలంగాణ ప్రాంతాల్లో ఎక్కడి నుంచి వారి పరిపాలన ప్రారంభమైందో కూడా చర్చించాల్సి ఉంది. 1978లో దొరికిన కోటలింగాల నాణేలు పై అనుమానాల్లో కొన్నింటిని తీర్చగలిగాయి. కోటలింగాల్లో దొరికిన రకరకాల నాణేలు ఆశ్చర్యం గొలపటమే కాక ప్రాచీనాంధ్రదేశ చరిత్రపై కొత్త వెలుగును విరజిమ్మాయి.

కోటలింగాల్లో ఈ నాణేలు బయటపడటమనేది దక్షిణ భారత నాణేల పరిశోధనలో ఒక అపూర్వ సంఘటనగా చెప్పుకోవచ్చు. ఇక్కడ నొక్కుడు నాణేలు,

లిపిలేని నాణేలు, లిపి ఉన్న నాణేలు అనే మూడు రకాల నాణేలు దొరికాయి. లిపి ఉన్న నాణేలు అనే మూడు రకాల నాణేలు దొరికాయి. లిపి ఉన్న నాణేలను, గోబధ, నరన, కంవాయ, సిరివాయ, సమగోప, ఛిముక, సిరిశాతవాహన, మొదటి శాతకర్ణి, సతిసిరి, రెండోశాతకర్ణి, వాసిష్టీపుత్ర పులుమావి, వాసిష్టీపుత్ర శాతకర్ణి అనే రాజులు, మహాతలవర, మహాసేనాపతి అనే సామంత రాజులు విడుదల చేశారు. శాతవాహన రాజుల తరువాత కాలంలో విడుదల చేసిన నాణేలు ఇక్కడ ఒక్కటికూడా దొరకలేదు.

కోటలింగాల్లో దొరికిన నాణేల వివరాలు:

1. **నొక్కుడు గుర్తులుగల నాణేలు:** వెండి, రాగి, లోహాల్లో పోత పోయబడినాయి.
2. **లిపిలేని నాణేలు:** సీసము, పోటీను, రాగి, ఇత్తడితో పోతపోయబడినాయి.
3. **శాతవాహన ముందరి కాలానికి చెందిన లిపిగల నాణేలు:**
   - ఎ) గోబధ నాణేలపై **రణో గోబధస** అన్న లిపితో, సీసము, రాగి, ఇత్తడితో పోతపోయబడినాయి.
   - బి) నరన నాణేలపై **నరినరనన** అన్న లిపితో సీనము, రాగితో పోతపోయబడినాయి.
   - సి) కంవాయ నాణేలపై **కంవాయ** సిరిస అన్న లిపితో సీసము, రాగి ఇత్తడితో పోతపోయబడినాయి.
   - డి) సిరివాయ నాణేలపై **సిరివాయస** అన్న లిపితో సీనము, రాగితో పోతపోయబడినాయి.
   - ఇ) సమగోపుని నాణేలపై **రణో సమగోపస** అన్న లిపితో సీసము, పొటీను, రాగిలోహాలతో పోతపోయబడినాయి.
4. **శాతవాహనుల లిపిగల నాణేలు:**
   - ఎ) ఛిముక శాతవాహనుని రాగి, ఇత్తడి, పోటీను నాణేలపై **రణోసిరి ఛిముక** అని ఉంది.
   - బి) మొదటి శాతకర్ణి పోటీను, సీసము ఇత్తడి, రాగి నాణేలపై **రణోసిరిశతకనిస** అన్న లిపి ఉంది.
   - సి) శత సీసము, రాగి నాణేలపై **సిరిశతస** అన్న లిపి ఉంది.

డి) రెండో శాతకర్ణి పోటీను, సీసము, రాగి, ఇత్తడి నాణేలపై **రణో సిరి శతకనిస** అన్న లిపి ముద్రించబడి ఉంది.

ఇ) వాసిష్టపుత్ర పులుమావి రాగినాణేలపై **రణోసిరి పులుమావిన** అన్న లిపి ఉంది.

**5. సామంతరాజుల లిపిగల నాణేలు:**

ఎ) మహాతలవర సీసపు నాణేలపై '**మహాతలవరస**' అనీ

బి) పెబకుని రాగి నాణేలపై సెబకస అనే అక్షరాలు ఉన్నాయి.

సి) సెబకుని రాగి నాణేలపై సెబకస అనే అక్షరాలు ఉన్నాయి.

**6. రెండోసారి ముద్రించబడిన నాణేలు:** సమగోప, కంవాయల రాగి, సీసపు నాణేలు మళ్లీ ముద్రించబడినాయి.

**శాతవాహన నాణెములు**

మౌర్యుల తరువాత / శాతవాహన ముందరి రాజుల తరువాత తెలుగునేలను పాలించిన శాతవాహనులు రాగి, సీసం, పొటీన్, వెండి నాణేలను విడుదల చేశారు. వీటిపైన కొండలు, చుట్టూ కంచె ఉన్న చెట్టు, ఏనుగు, సింహం, ఎద్దు, గుర్రం, చక్రం, ఓడ మొదలైన బొమ్మలు, వెనుకవైపు ఉజ్జయిని గుర్తులు, ఒక్కోసారి రాజుల బొమ్మలు, బ్రాహ్మీలిపిలో వారి పేర్లు ఉంటాయి. అమరావతి, చేబ్రోలు, అద్దంకి, కోటలింగాల, కొండాపూర్, పెద్దబంకూర్, ధూళికట్ట, ఫణిగిరి, తొట్లకొండ, బావికొండ, పావురాల కొండ, నేలకొండపల్లి, నాగార్జునకొండ మొదలైన చోట్ల ఛిముక, శాతకర్ణి, పులోమావి, శివశ్రీ, యజ్ఞశ్రీ నాణేలు లభించాయి.

గౌతమీపుత్ర శాతకర్ణి నాణేలపై ఆయన తలబొమ్మ, దానిపై బ్రాహ్మీలిపులలో 'రాణో గోతమీపుతస సిరియాన శాతకణిస' అనీ, బొరుసు పై ఐదు కొండలు, దానిపై చంద్రవంక, పక్కన సూర్యుడు, మళ్లీ బ్రాహ్మీలో 'అరహనకు గోతమీపుత కుహిరుయాన మాతకనకు' అని ఉంది. నౌకాయానాన్ని, విదేశీవర్తకాన్ని పోషించిన శాతవాహనులు పడవ / నావగుర్తులున్న నాణేలను కూడా విడుదల చేశారు. గుంటూరు జిల్లా చేబ్రోలులో యజ్ఞశ్రీ విడుదల చేసిన నౌక గుర్తున్న సీసపు నాణేలు దొరికాయి. పడవపై మూడు తెర చాపలు, వాటికి కట్టిన తాళ్లు ఉన్నాయి.

**ఇక్ష్వాకుల నాణెములు**

శాతవాహనుల తరువాత శ్రీపర్వత విజయపురి (నాగార్జున కొండ) నుండి పాలించిన ఇక్ష్వాకు రాజులు సీసపు నాణేలను విడుదల చేశారు. బొమ్మ భాగంలో ఏనుగు, బొరుసు భాగంలో ఉజ్జయినీ గుర్తులు ఉన్నాయి. బొమ్మ భాగంలో రాజుల పేర్లు బ్రాహ్మీలిపిలో ప్రాకృత భాషలో ఉన్నాయి. ఏనుగు బొమ్మ పైన ఛాత (ఛాంతమూలుడు), సిరివీర (వీరపురిస దత్తుడు), సిరిఎహ / సిరిఎహు (ఎహువలఛాంత మూలుడు), సిరిరుద (రుద్ర పరిసదత్తుడు) అని రాయబడినాయి. ఇవి ప్రకాశం జిల్లా అద్దంకి, కృష్ణాజిల్లా పామర్రులలో దొరికాయి.

**విష్ణు కుండినుల నాణెములు**

ఇక్ష్వాకుల తరువాత మొత్తం తెలంగాణా, తీరాంధ్రలో కొంత భాగాన్ని క్రీ.శ.3-6 శతాబ్దాల మధ్య పాలించిన విష్ణుకుండినులు రాగి, ఇనుముపై రాగిపూత పూసిన నాణేలను ముద్రించారు. నాణేల బొమ్మభాగంలో జూలున్న సింహం, నంది, బొరుసు భాగంలో కలశం, దీపస్థంభం, శంఖం, చుట్టూ గుండ్రని వలయంలో చుక్కలు, ఒక్కోసారి కిరణాలు వెదజల్లుతున్నట్లుగానూ ఉన్నాయి. వీరి నాణేలు కీసరగుట్ట, ఏలేశ్వరం, వడ్డమాను, అమరావతి, నాగార్జునకొండ, పెదవేగి, సుల్తానాబాద్, నెల్లిమర్ల, దువ్వూరులలో దొరికాయి. ఏలేశ్వరంలో దొరికిన నాణేలమీద 'వికరమ' (విక్రమేంద్రవర్మ) అన్న బ్రాహ్మీ లిపి ఉంది. పెదవేగిలో దొరికిన నాణేలపై దేవాలయశిఖరం, దానికి రెండువైపులా నాగళ్లు, మరోవైపు సింహం బొమ్మ ఉన్నాయి.

**చోళుల నాణెములు**

తొండై మండలంగా పిలువబడిన చిత్తూరు, నెల్లూరు ప్రాంతాలను చోళులు కొంతకాలంపాటు (క్రీ. 10-11 శతాబ్దాలు) పాలించారు. చోళులు, రాగి, బంగారం, వెండి నాణేలను ముద్రించారు. గమ్మత్తేమిటంటే కొన్ని రాగి నాణేలకు వెండిని, కొన్ని వెండి నాణేలకు బంగారాన్ని పూతపూశారు. శాతవాహనుల తరువాత వెండినాణేలను మళ్లీ చెలామణిలోకి తెచ్చింది చోళులే. వీరి నాణేలపై రాజలాంఛనమైన పులి, ఇంకా చేప, బాణం గుర్తులు కూడా ముద్రించబడినాయి.

ప్రకాశం జిల్లా గిద్దలూరు ప్రాంతంలోని సంజీవరాయుని పేటలో లభించిన రాజరాజచోళుని (క్రీ.శ.985-1018) రాగి నాణెం బొమ్మ భాగంపై నిలబడి ఉన్న రాజరాజు బొమ్మ, బొరుసు భాగంపై చేతిలో శంఖాన్ని ధరించి కూర్చొని ఉన్న రాజరాజు, ఎదురుగా అని దేవనాగరి (సంస్కృత) లిపిలో 'రాజరాజ' ముద్రించబడినాయి. 2.25


సెం.మీ.ల వ్యాసమున్న ఈ నాణెం 8.5గ్రాముల బరువుంది. చోళులు కాలంనాటి మరికొన్ని నాణేలు ప్రకాశం జిల్లా చీరాల దగ్గరున్న మోటుపల్లిరేవు దగ్గర కూడా బయటపడినాయి.

### తూర్పు చాళుక్యుల నాణెములు



వేంగి రాజధానిగా తీరాంధ్రాన్ని పాలించిన తూర్పు చాళుక్యులు వెండి, బంగారు నాణేలను విడుదల చేశారు. వీటిని ద్రమ్మిలనీ, మాడలనీ, గద్యలనీ, గద్యాణాలనీ శాసనాల్లో పిలిచారు. నాణేలపై వరాహముద్ర, దాని చుట్టూ రాజుపేరు ఉంటుంది. రెండోవైపు ఖాళీగా ఉంటుంది. ఉదాహరణకు తూర్పు చాళుక్యవంశ స్థాపకుడైన కుబ్జ విష్ణువర్ధనుని వెండి నాణెం బొమ్మ పై సింహం, బొరుసుపై తెలుగు-కన్నడ లిపిలో 'విషమసిద్ధి' అని అతని బిరుదు ముద్రితమైంది. రాజరాజనరేంద్రుని బంగారు నాణేలపై వరాహం, దీపస్థంభాలు, అంకుశం, గొడుగు, వింజామరలూ, చుట్టూ 'శ్రీరాజరాజ' అన్న తెలుగు అక్షరాలూ ఉన్నాయి. కొన్ని నాణేలపై 'శ్రీచళుక్యరాయణ' శ్రీచళనారాయణ' అని కూడా బిరుదులున్నాయి. (రాజేంద్ర) కులుత్తుంగ చోలుడు (క్రీ.శ. 1070-1118) వేంగి సింహాసనాన్నిధిష్టించాడు. తంజావూరులోని చోళ సింహాసనాన్నధిష్ఠించటానికి ఎవరూ లేనపుడు, ఇతడే చోళ సామ్రాజ్యాధిపతి అయి అవంశాన్ని ఉద్ధరించటాన ఇతనికి కులోత్తుంగ చోళుడని పేరొచ్చింది. ఇతని నాణేల మీద రెండు చేపలు, పులి, విల్లు, గొడుగు, వింజామరలు, పైన చుట్టూ 'కటైకొండచోళం', 'మలైనాడు కొండచోళం' అనే బిరుదులు ఉన్నాయి.

### యాదవుల నాణెములు



కళ్యాణీ చాళుక్యుల అధీనంలోనున్న తెలుగు నేలలోని కొంత భూభాగాన్ని ఆక్రమించిన దేవగిరి యాదవులు క్రీ.శ.13వ శతాబ్దంలో కృష్ణాతీరం వరకూ పాలించారు. జైతుకి కొడుకైన

సింఘనుని బంగారు నాణేలు తెలంగాణాలో దొరికాయి. వీటిపై చుట్టూ కొన్ని గుర్తుల్లో విల్లు, వృత్తాలు, కత్తి, శంఖం, పంది, సింహం, మధ్యలో తామరపువ్వు, కాళియ మర్ధనాన్ని పోలిన నాట్యం చేస్తున్న కృష్ణుడు, 'శ్రీ' 'శ్రీసింఘన' అని నాగరిలిపి ఉన్నాయి. వెనుకవైపు ఖాళీగా ఉంది. సింఘన తరువాత రామచంద్ర దేవుని నాణేలు కూడా సింఘనుని నాణేల మాదిరే ఉంటాయిగానీ, 'శ్రీరామ' అన్న నాగరి లిపి ఉంది. కాని రామచంద్ర దేవుని నాణేల మీద గరుత్మంతుని బొమ్మ, వరాహ లాంఛనాలు కూడా ఉన్నాయి.

**కాకతీయుల నాణెములు**

కళ్యాణీ చాళుక్యుల సామంతులైన కాకతీయులు రెండోప్రోల రాజు (క్రీ.శ. 1110-1158) నుంచి స్వతంత్రంగా పాలన ప్రారంభించారు. తరువాత రుద్రుడు, మహాదేవుడు, గణపతిదేవుడు, రుద్రమదేవి, ప్రతాపరుద్రుడు వరుసగా క్రీ.శ. 1323లో రాజ్యం అంతరించిందాకా పాలించారు. ఈ కాలం సర్వతో ముఖాభివృద్ధిని సాధించటమేకాక సుస్థిర ఆర్థిక వ్యవస్థను కూడా ఏర్పరచారు. మిగతా రాజుల్లా వీరు కూడా నాణేలను విడుదల చేశారు. వీటిని నిష్క, మాద, రూక, అడ్డుగ, పాదిగ, వీసం అనే పేర్లతో పిలిచారు. హనుమకొండ, తేరాల, బీదర్, ఖమ్మంలో కొన్ని కాకతీయుల నాణేలు దొరికాయి.

వరంగల్ చుట్టు పక్కల దొరికిన రాగి నాణేల మీద నాగర లిపిలో **'శ్రీమధుకర కాకతీయ ప్రతాప రుద్రదేవ విజయకటక 2 అంక** అని ఉంది. కొన్ని బంగారు, వెండి నాణేలపై **రాయగజకేసరి, కేసరి'** అన్న బిరుదు ఉండటంతో అవి గణపతి దేవుడు, రుద్రమదేవి విడుదల చేసినవనీ, **'దాయగజకేసరి'** అని ఉన్న నాణేలు ప్రతాపరుద్రునివనీ పరిశోధకులు తెలిపారు. కాకతీయరాజులే కాక వారి అంగరక్షకులైన వెంకలు కూడా నాణేలను విడుదల చేసినట్లు ఖమ్మం జిల్లా కుమ్మరిగూడెం, హనుమకొండలోని పద్మాక్షగుట్ట వద్ద దొరికిన నాణేలు రుజువు చేస్తున్నాయి. ఈ బంగారు నాణేలు కప్పు ఆకారంలో పద్మ దళాలతో ముద్రించబడినాయి. వీటిపై 'వరాహ లేక సింహలాంఛనం, చుట్టూ శ్రీశ్రీ మహాబల కేసరి', 'శ్రీశ్రీ వెంకన సింగాము', శ్రీశ్రీ దారన సింగమ' అనే అక్షరాలున్నాయి. కొన్ని కాకతీయ శాసనాల్లో గద్యాణాలున్న నాణేల ప్రస్తావన ఉంది.

**విజయనగర నాణెములు**

సంగమ, సాళువ, తుళువ, అరవీటి వంశాలు క్రీ.శ. 1336 - 1685 వరకూ దక్షిణ భారతదేశంలో ఎక్కువ భాగాన్ని హంపి, విజయనగరం నుంచి

పాలించినందున వీరిని విజయనగర చక్రవర్తులన్నారు. వీరు విడుదల చేసిన బంగారు నాణేలపై ఒకవైపు ఉమామహేశ్వర, లక్ష్మీనారాయణ, గండభేరుండా, బాలకృష్ణ బొమ్మలు, మరోవైపు నాగరి లేదా కన్నడంలో విడుదల చేసిన రాజు పేరు ముద్రించబడి ఉన్నాయి. సంగమ వంశానికి చెందిన రెండో హరిహరరాయల బంగారు నాణేలపై శివపార్వతులు ఒకవైపు, మరోవైపు



శ్రీప్రతాపహరిహర అన్న నాగర అక్షరాలుండగా, ప్రౌడదేవరాయల బంగారు నాణేల పైన ఉమామహేశ్వరులు, రాగినాణేల మీద ఏనుగు బొమ్మలు ఉన్నాయి. సాళువ వంశానికి చెందిన రాజుల నాణేలు ఇంత వరకూ బయల్పడలేదు.

తుళువ వంశానికి చెందిన శ్రీకృష్ణదేవరాయల రాగి నాణెంపై ఒకవైపు గరుడ, మరోవైపు సంస్కృతంలో శ్రీప్రతాప కృష్ణరాయ' అన్న పేరుంది. సదాశివరాయల నాణేలపై ఒకవైపు లక్ష్మీనారాయణ, మరోవైపు నాగర లిపిలో 'శ్రీసదాశివరాయ' అని ఉంది. చివరి వంశానికి చెందిన మూడో రంగరాయలు విడుదల చేసిన బంగారు నాణెంపై వెంకటేశ్వరుని బొమ్మ, రెండోవైపు శ్రీవేంకటేశ్వరాయనమః అని దేవనాగరి లిపిలో ఉన్నాయి. వీటిని గండికోట వరహాలు, గండికోట అర్ధవరహాలని పిలిచారు. మూడో వెంకటపతిరాయల బంగారు నాణేల పై విష్ణుమూర్తి, శ్రీదేవి, భూదేవి బొమ్మలున్నాయి.

మరోసారి విజయనగర నాణేలను పరిశీలిస్తే మొదట హరిహర, బుక్కరాయలు విడుదల చేసిన నాణేలపై హనుమంతుని బొమ్మ, మొదటి హరిహర బుక్క శ్రీకృష్ణదేవరాయ, సదాశివరాయ, తిరుమలరాయ, మొదటి వెంకటపతిరాయల నాణేలపై గరుత్మంతుని బొమ్మ, మొదటి శ్రీరంగరాయ, మొదటి రెండో వెంకటపతిరాయలు, రెండు, మూడో శ్రీరంగరాయలు, వెంకటపతిరాయల నాణేలపై శ్రీవెంకటేశ్వరుని బొమ్మ, శ్రీకృష్ణదేవరాయల నాణేలపై బాలకృష్ణ దుర్గ మొదట దేవరాయ, సదాశివరాయని నాణేలపై లక్ష్మీనారాయణ రెండో హరిహరరాయల నాణేలపై లక్ష్మీనరసింహ సరస్వతి-బ్రహ్మ, తిరుమలరాయల నాణేలపై శ్రీరాముడు, వరాహరం, రెండో హరిహర, మొదటి రెండో దేవరాయల, శ్రీకృష్ణదేవరాయ, సదాశివరాయల నాణేలపై ఉమామహేశ్వర, రెండో హరిహర, బుక్క మొదటి దేవరాయ, శ్రీకృష్ణదేవరాయ, రెండో రంగరాయల నాణేలపై నంది బొమ్మలున్నాయి.

## బహమనీ నాణెములు

తొలుత గుల్బర్గా, తరువాత బీదరులను రాజధానులుగా పాలించిన బహమనీలు బంగారు, వెండి, రాగినాణేలను విడుదల చేశారు. అల్లాఉద్దీన్ బహుమన్‌షా క్రీ.శ. 1358లో విడుదలచేసిన వెండినాణెం ఒకటి ప్రకాశం జిల్లా గిద్దలూరులో లభించిందని డా॥ వి.వి. సుబ్బారెడ్డి తెలిపారు. ఒకవైపు: సికిందరుత్-ధాని యామినుల్ -ఖిలాఫత్ నాసిన్ అమ్రిల్ ముమునిన్' అనీ, రెండోవైపు: అల్-సుల్తానుల్ అజామ్ అల్లా ఉద్దీనియా ఉద్దీన్ అబుల్ ముజఫర్ బహమన్ షా అల్‌సుల్తాన్' అని పారశీలిపి ముద్రించబడి ఉంది.

గుంటూరు జిల్లా తెనాలిలో రెండో అల్లా ఉద్దీన్ అహమ్మద్‌షా క్రీ.శ. 1435లో విడుదల చేసిన రాగినాణెంపై ఒకవైపు అల్-వతీఖ్‌బి-తడిల్-మాలికిల్ ఇల్వా అబుల్‌జఫర్, రెండోవైపు అహమ్మద్ షాబిన్ అహమ్మద్ షా బహమన్ షా అని పారశీలో ముద్రించబడి ఉంది.

చివరి రాజైన కలీముల్లా వేసిన రాగి నాణెం ఒకటి ప్రకాశం జిల్లా దర్శి దగ్గర డా॥ వి.వి. సుబ్బారెడ్డికి దొరికింది. దానిపై ఒకవైపు అల్‌మువా యద్ - బి-నన్ని-అల్లా' అనీ, రెండోవైపు కలీముల్లా అల్‌సుల్తాన్ అల్‌బహమనీ' అనే పారశీ లిపి ఉంది.

## కుతుబ్‌షాహీల నాణెములు



కుతుబ్‌షాహీలు రాగినాణేలను విడుదల చేశారు. మహమ్మద్ కులీ, మహమ్మద్ కుతుబ్‌షాలు నాణేలమీద 'అబు-అల్-ముజఫర్' అనే బిరుదులను ముద్రించగా మిగతా సుల్తానులు 'సుల్తాన్ ' అని ముద్రించారు. నాణేలపై ఒకవైపు సుల్తాన్ పేరు, రెండో వైపున టంకశాల పేరు, ముద్రణా సంవత్సరాలున్నాయి.


మహమ్మద్ కులీకుత్‌బ్‌షా నాణేలపై 'పెవస్తాబి లానెట్-ఇల్లాహి" తేయి ద్దా-పులూస్-ఇ-షాహి' (నాణేలను లెక్క చేయని వాడిని దేవుడు క్షమించడు' అన్న పారశీ రాతలున్నాయి. రెండోవైపు 'అదల్ మహమ్మద్ కులీకుతుబ్‌షా' 'దార్-ఉల్-సల్తనత్ గోల్కొండ అని ముద్రించబడింది.

**రామ టంకాలు**



ఒకపక్క శ్రీరాముడు అంతఃపురం, మరోపక్క రామలక్ష్మణుల అరణ్యవాస దృశ్యం ముద్రించబడిన వెండి, రాగి నాణేలను రామ టంకాలంటారు. ప్రకాశం జిల్లా కంభంలో వి.వి.సుబ్బారెడ్డి సేకరించిన క్రీ.శ.16వ శతాబ్దినాటి రామ టంకాపై ఒకవైపు కూర్చొని ఉన్న సీతారాములు, రెండోవైపు రామలక్ష్మణులు, చుట్టూ దేవనాగరి లిపిలో 'రామలక్ష్మణ జనక జవల హనమ' అని ఉంది. మొఘల్ చక్రవర్తి అక్బర్ కూడా రామటంకాలను ముద్రించాడు.


**అసఫ్ జాహీ (నిజాం) నాణెములు**



క్రీ.శ. 1803లో మూడో నిజాం నవాబు సికిందర్‌జా హైదరాబాదులోని చార్మినార్ దగ్గరున్న సుల్తాన్ షాహీ (మొగల్‌పుర)లో టంకశాలను ఏర్పాటు చేశాడు. ఇతని నాణేలపై 'సీన్' అన్న పారశీ అక్షరాలున్నాయి. 1857 దాకా నిజాంనాణేలపై ఒకవైపు సాఖ్యముబారక్ షామహమ్మద్ బహదూర్‌షా బాద్షాషఉజీ ఆలం బాద్షాఘాజీ' అనీ, రెండోవైపు జులుస్ మైమనీత్ మనుస్‌జర్బ్ ఫర్ఖుందా బుని యాద్ హైదరాబాద్' అని ముద్రించి ఉంది.

ఆ తరువాత అఫ్జల్-ఉద్-దౌలా 1860 నుంచి విడుదల చేసిన నాణేలపై పారశీలో '92' అసఫ్‌జా నిజామ్-ఉల్‌ముల్క్ బహదూర్, 1275 హిజ్రీ అనీ రెండోవైపు 'జులుస్‌హసమనత్‌మనుస్ హైదరాబాద్ జర్బ్ ఫర్ఖుందా బునియద్' అని ఉంది. ఇతను వెండిరూపాయి, అర్ధరూపాయి, పావలా, బేడ (రెండణాలు) రాగి అర్ధగా, కాణీ విడుదల చేశారు. 1903 నుంచి వెండి, కంచు నాణేలు, 1908 నుంచి బంగారు అష్రఫీలు ముద్రించారు. మీర్ ఉస్మాన్ అలీఖాన్ విడుదల చేసిన రాగి రెండు అణాల నాణెం బొమ్మ భాగంలో చార్మినార్, కుడివైపు' నిజాం-ఉల్‌ముల్క్' అనీ ఇంకా 92 అసఫ్‌జా అన్న బిరుదు, రెండోవైపు బహదూర్ అనీ, 1362 హిజరీ, మానుస్ జర్బిఫర్ కుందా, బునియాద్, హైదరాబాద్, మధ్యలో దో అణా అని ఉంది.

తెలుగునేలను పరిపాలించిన చక్రవర్తులు, రాజులు తమ
పరిపాలనా కాలములో చలామణిలోకి తెచ్చిన నాణెములు



# 12 తెలుగువారి వారసత్వానికి ప్రతిబింబాలు : ప్రదర్శన శాలలు

## Museums: The Mirrors of the Telugu Heritage

### వస్తు ప్రదర్శన శాలలు

వారసత్వ సంపదలో భాగంగా గుళ్లు, గోపురాలు ఇంకా ఇతర విహార స్థలాలతోపాటు చరిత్ర, సంస్కృతులను తెలిపే పాతకాలపు వస్తువుల గురించి తెలుసుకోవాలనుకొంటాం. అందుకోసం తాము వివిధ ప్రాంతాల్లో ఉన్న వివిధ మ్యూజియాలను కూడా చూడాలనుకొంటారు. పాతరాతి యుగం నుంచి మధ్యయుగం దాకా మానవుడు వాడిన వివిధ పనిముట్లు, ఆభరణాలు, నాణేలు, రాతప్రతులు, శాసనాలు మొదలైనవాటిని తవ్వకాల ద్వారాగానీ, గుప్తనిధులు వెలికిరావటంవల్లగానీ సేకరించి ప్రదర్శనశాలల్లో భద్రపరుస్తారు. రాష్ట్రంలో ఉన్న పురావస్తు ప్రదర్శనశాలలు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. వీటితోపాటు సమకాలీన కళాఖండాలను ప్రదర్శించే గాలరీలు, మ్యూజియాలు, ఆర్ట్ గాలరీలు రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖలు, బిర్లా సంస్థ, తిరుమల-తిరుపతి దేవస్థానాలు, కొందరు వ్యక్తుల నిర్వహణలో అనేక మ్యూజియాలున్నాయి.

### కేంద్ర పురావస్తుశాఖ (ఏఎస్ఐ) మ్యూజియాలు

### నాగార్జునకొండ

హైదరాబాదుకు 145 కి.లో. దూరంలో గల శాతవాహన, ఇక్ష్వాకుల కాలపు వస్తు విశేషాలు, లెక్కలేనన్ని బౌద్ధశిల్పాలు గల నాగార్జునకొండ మ్యూజియం ప్రపంచ

ప్రఖ్యాతి గాంచింది. నాగార్జునసాగర్ డ్యాం నిర్మించటం వల్ల ముంపుకుగురైన విజయపురి వద్ద 1954-60 మధ్య పురావస్తు తవ్వకాలు జరిగాయి. క్రీ.శ. 3వ శతాబ్దికి చెందిన అనేక అవశేషాలు, కట్టడాలు వెలుగు చూశాయి. వీటన్నింటినీ భావితరాలకు అందించటానికి, జలాశయంలో ఉన్న ఐలాండ్ మీద బౌద్ధ విహారం మోడల్లో ఒక మ్యూజియాన్ని నిర్మించారు. అందులో ఆదిమ మానవుని ఉనికిని తెలిపే పాతరాతి యుగం, కొత్తరాతియుగం, ఇనుప యుగాలకు చెంది రాతిపనిముట్లు, మట్టిపాత్రలు, ఇక్ష్వాకుల కాలపు మట్టి పాత్రలు, సున్నపు, మట్టి బొమ్మలు, మట్టి, రాతిపూసలు, బుద్ధుని విగ్రహాలు, బుద్ధుని జీవిత సంఘటనలు, జాతక కథలను చెక్కిన అనేక శిలాఫలకాలతోపాటు, మధ్యయుగానికి చెందిన బౌద్ధేతర శిల్పాలు కూడా ఉన్నాయి. మ్యూజియంలోని శంఖ, పద్మనిధులు, మాతృదేవత, బుద్ధుని ప్రతిమ, బుద్ధుని ధాతువులు చూడటానికి పర్యాటకులు పోటీ పడుతుంటారు. సాగర్ నుంచి సాగే 30 నిమిషాల అహ్లాదకరమైన పడవ ప్రయాణంతో నాగార్జునకొండకు చేరుకోవచ్చు.

**కొండాపూరు**

హైదరాబాదుకు 70 కి.లో. దూరంలో జహీరాబాద్ రోడ్డు నుంచి చేరుకొనే వీలున్న మెదక్ జిల్లా కొండాపూర్, శాతవాహన (క్రీ.పూ. 2 - క్రీ.శ. 2 శతాబ్దాలు) కాలానికి చెందిన పురాతన స్థలం, విశాలమైన మట్టికోట ఉన్నాయి. 1930 ప్రాంతంలో నిజాం ప్రభుత్వ పురావస్తుశాఖ జరిపిన తవ్వకాల్లో అనేక పురావస్తువులు వెలికిరాగా వాటన్నిటినీ, అక్కడే నిర్మించిన పురావస్తు ప్రదర్శనశాలలో ఉంచారు. పాత, మధ్య, సూక్ష్మ, కొత్తరాతి యుగపు పనిముట్లు, ఇనుప యుగపు పాత్రలు, పూసలు, శాతవాహన, ముందు కాలానికి చెందిన నాణేలు, మూసలు, మట్టిబొమ్మలు, సున్నపుబొమ్మలు, రకరకాల రాళ్లతో చేసిన పూసలు, నలుపు, ఎరుపు, నలుపు-ఎరుపు రంగుగల మట్టిపాత్రలు, శిలాశిల్పాలు చూపరులను కాలుకదపకుండా చేస్తున్నాయి. బృహత్కథను రచించిన గుణాఢ్యుడు కొండాపూర్ వాసి అనే ప్రచారంవల్ల కొండాపూర్ సందర్శించే పర్యాటకుల సంఖ్య రాను రాను ఎక్కువౌతుంది.

**అమరావతి**

గుంటూరు నుంచి 32 కి.లో.ల దూరంలో కృష్ణానది కుడి ఒడ్డునున్న అమరావతి ఒక గొప్ప బౌద్ధక్షేత్రంగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. అశోకుని శాసనం లభించటంవల్ల ఇక్కడున్న మహాస్థూపము క్రీ.పూ. 3వ శతాబ్దానికి చెందిందని తేలింది

స్థూపానికి కొంచెం దూరంలో ఉన్న ధాన్యకటకం (ధరణికోట) మట్టికోటలో శాతవాహనుల రెండో రాజధాని ఉండేది. మ్యూజియంలో దాదాపు 200 సం॥ల నుంచి ఇక్కడ జరిగిన పరిశోధనల్లో బయల్పడిన బౌద్ధశిలాఫలకాలు, శాసనాలు, మట్టి పాత్రలు, పూసలు, నాణేలు, బుద్ధుని ధాతువుల నుంచిన స్ఫటికపు పేటికలు, అమరావతీ స్థూపం నమూనాలు పర్యాటకులకు పసందు చేస్తున్నాయి.

### చంద్రగిరి

తిరుపతి నుంచి 10 కి.మీ.ల దూరంలో ఉన్న చంద్రగిరి చివరి విజయనగర రాజుల ప్రతాపానికి ప్రతీక. ఇక్కడున్న కోటగోడలు, రాజప్రాసాదాలు, దిగుడుబావి నాటి కట్టడ కౌశలాన్ని తెలియజేస్తున్నాయి. చక్కటి వాస్తు విన్యాసంతో నిర్మించిన రాణీమహల్ విజయనగర సామ్రాజ్య వైభవ ప్రాభవాలకు అద్దంపడుతుంది. ఇందులోని ప్రదర్శితాల్లో వెంకటపతిరాయల కాలానికి చెందిన పెయింటింగ్‌లు హృద్యంగా ఉంటాయి. ప్రాసాదం ఆవరణలో ఉన్ననాటి శిలా శిల్పాలు, దేవాలయ వర్ణాలు, ఇంకా దిగుడు బావి చూచిన సందర్శకులు, కొండ పైకెక్కి కోటగోడల్ని తడిమి చూచి ఒక్కసారి 16-17 శతాబ్దాల్లోకి వెళ్లి మళ్లీ తిరిగొస్తారు. సాయంవేళల్లో దివ్యకాంతుల్లో వెలుగులీనే రాజ ప్రాసాదం ప్రతివారి గుండెల్లో చెరగని ముద్రగా మిగిలిపోతుంది.

### శాలిహుండం


శ్రీకాకుళానికి 15 కి.మీ.ల దూరంలో వంశధార ఒడ్డున ఉన్న శాలిహుండం కొండమీద క్రీ.పూ. 2 - క్రీ.శ. 2 శతాబ్దాలకు చెందిన బౌద్ధ స్థూపాలు, చైత్యాలున్నాయి. 20వ శతాబ్దాం తొలినాళ్లలో వెలుగుచూచిన ఈ కట్టడాలను చూచిన తరువాత, కొంచెం దూరంలో ఉన్న చిన్న మ్యూజియంలో రామతీర్థం నుంచి తరలించిన క్రీ.శ. 9-10 శతాబ్దాలనాటి బౌద్ధశిల్పాలు ప్రత్యేక ఆకర్షణ. అక్కడి శిల్పాల్లో మరీచి, బుద్ధుడు, 10వ శతాబ్దాల వరకూ బౌద్ధం విలసిల్లిందని తెలియజేస్తున్నాయి. వజ్రయాన బౌద్ధ ప్రతిమా లక్షణం తెలుసుకోటానికి శాలిహుండం మ్యూజియంలోని శిల్పాలు ఎంతగానో ఉపయోగపడతాయి.

### రాష్ట్ర ప్రభుత్వ మ్యూజియాలు

### స్టేట్ మ్యూజియం: నాంపల్లిరోడ్, హైదరాబాదు.

పబ్లిక్ గార్డెన్స్‌లో ఉన్న ఏపీ స్టేట్ మ్యూజియంలో రాష్ట్ర చరిత్ర - సంస్కృతికి సంబంధించిన అనేక పురావస్తువులున్నాయి. 1935లో నిజాం, నిర్మించిన,

'డాల్‌హౌస్' తరువాత, పురావస్తు ప్రదర్శనశాలగా మారింది. ఇందులో ప్రీహిస్టారిక్, స్కల్ప్చరల్, బుద్ధిస్ట్, బ్రాంజ్, న్యూమిస్‌మాటిక్స్, టెక్స్‌టైల్స్, చైనీస్‌వేర్, బీద్రీవేర్, గాలరీలు అజంతా, యూరోపియన్, కాంటెంపరరీ ఆర్ట్



గాలరీలున్నాయి. చరిత్ర తెలుసుకోటానికి ఇష్టపడే పర్యాటకులు, ప్రీహిస్టారిక్ గాలరీలు పాత, మధ్య, సూక్ష్మరాతి యుగపు పనిముట్లు, రాయచూరు ప్రాంతం కల్లూరులో దొరికిన తామ్ర శిలాయుగపు యాంటెన్నా కత్తులు, ఇనుప యుగానికి చెందిన ఇనుప పనిముట్లు, మట్టిపాత్రలు, నాటి జీవన విధానంలో క్రమంగా వచ్చిన మార్పులను గమనిస్తారు. మరోవైపు గ్యాలరీలో క్రీ.పూ. 5-క్రీ.శ. 19వ శతాబ్దాల వరకూ విడుదలైన వివిధ రకాల నాణేలు, నాణెప్రియులకు కనువిందు చేస్తాయి.

బుద్దిస్ట్ గాలరీలో, అమరావతి స్థూపం వేదిక భాగాలు, చంధవరం స్థూపం నుంచి తరలించిన బోధివృక్షం, స్థూపం, సింహాసనం, ఉన్న వివిధ శిలాఫలకాలు, బుద్ధాం, అమరావతిల నుంచి తెచ్చిన బుద్ధుని బొమ్మలతోపాటు అమరావతి స్థూపం, నాగార్జునకొండ శిల్పాల నమూనాలను ప్రదర్శించారు. తరువాత స్కల్ప్చరల్ గాలరీలో బ్రాహ్మణీయ, జైన శిల్పాలు చోటుచేసుకొన్నాయి. క్రీ.శ. 8-16 శతాబ్దాల మధ్యకాలానికి చెందిన గణేశ్, సరస్వతి, సప్తమాతలు, విష్ణు, దేవి, భైరవ, నటరాజ, మహిషమర్థిని, వీరశిలలు, జైన శిల్పాల్లో 23, 24వ తీర్థంకరులైన పార్శ్వనాధుడు, మహావీరుని శిల్పాలు మలచిన తీరు మెచ్చుకోదగ్గది.

బ్రాంజ్ గాలరీలో తరతరాల ఆంధ్రదేశపు కాంస్యకారుల (కంచుతో శిల్పాలను పోతపోసే వారు) వనితనాన్ని తెలియజేసే అనేక బొమ్మలున్నాయి. క్రీ.పూ. 2-క్రీ.శ. 18వ శతాబ్దికి చెందిన శిల్పాల్లో, ఎక్కువభాగం దేవతా మూర్తులే. క్రీ.పూ. 2వ శతాబ్దికి చెందిన ధూళికట్ట హారీతి శిల్పం, రాజమండ్రి తవ్వకాల్లో వెలుగుచూచిన యువతి, కొలనుపాకలో బయల్పడిన గంటలు, ఖమ్మం నుంచి తెచ్చిన కాకతీయ దీపసుందరి, నెల్లూరు, బొక్కసంపాలెం, మోటుపల్లి నుంచి తరలించిన రామ, లక్ష్మీనారాయణ, నటరాజ విగ్రహాలు చూడదగినవి. వీటితోపాటు నేపాలుకు

చెందిన తార, సింహం, ఇంకా బుద్ధుని బొమ్మలు చూపరులను ఆకట్టుకొంటున్నాయి.

మొదటి అంతస్తులోగల అజంతా గాలరీలో అజంతా వర్ణచిత్రాల నకళ్లున్నాయి. సయ్యద్ అహ్మద్, జలాలుద్దీన్‌లు చిత్రించిన అజంతా గుహల్లోని వర్ణాచిత్రాల నకళ్లు అసలుకు ఏ మాత్రం తీసిపోకుండా ఉన్నాయి. వీటిల్లో జాతక కథలు, నల్లటి అందగత్తె, పునరాగమనం, హంసజాతకకథా దృశ్యాలు మనసును దోచుకొంటున్నాయి. మరోవైపు ప్రదర్శించిన యూరోపియన్ వర్ణచిత్రాలు వివిధ భావజాలాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఇదే గాలరీలో బీదరీ పాత్ర సామాగ్రి, మధ్యయుగాలనాటి బట్టలు, చైనా పోర్సెలీన్, ఇతర పింగాణీ పాత్రలు కళాత్మక వస్తువుల్లో కొన్ని. మ్యూజియంలోనే మరోవైపున్న గాలరీలో దక్కనీ, రాజస్థానీ మీనియేచర్లతో పాటు సమకాలీన కళాఖండాలున్నాయి. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అబ్దుల్ రహమాన్ చుగ్‌తాయ్, విలక్షణ శైలి వర్ణచిత్రాలు ఈ గాలరీకే హైలైటు. పిటీరెడ్డి, కాపురాజయ్య, వై. బాలయ్య, కొండపల్లి శేషగిరిరావు, పి.ఆర్. రాజు, పైడిరాజు, కృష్ణమూర్తి, ఉల్బి, గిరి మొదలైన ప్రఖ్యాత చిత్రకారుల వర్ణచిత్రాలున్నాయి. మ్యూజియంలో ఆవరణలో ఉన్న క్రీ.శ. 16వ శతాబ్దికి చెంది కొయ్యరథం, కాకతీయ కళామండపం, ఖుతుబ్‌షాహీ, అసఫ్‌జాహీల యుద్ధ పరికరాలను చూచి తీరాల్సిందే. క్రీ.పూ. 4వ శతాబ్దం నుండి అసఫ్‌జాహీల వరకు ఆయా కాలాలలో వాడిన కరెన్సీ నాణేలు, ఈజిప్టు నుండి తెప్పించి ప్రదర్శనలో భద్రపరచిన మమ్మీ సందర్శకులలో ఆసక్తిని పెంచుతాయి.



**శ్రీశైలం పెవిలియన్: పురావస్తుశాఖ ఆవరణ, హైదరాబాద్.**

గన్‌ఫౌండ్రిలో లేపాక్షి ఎంపోరియానికి ఎదురుగా ఉన్న రాష్ట్ర పురావస్తుశాఖ ఆవరణలో ఉన్న శ్రీశైలం పెవిలియన్ మ్యూజియంలో, శ్రీశైల జలాశయ ముంపు ప్రాంతం నుంచి తరలించిన పురావస్తువులను ప్రదర్శించారు. పాత, మధ్య, సూక్ష్మ, కొత్తరాతియుగాలకు చెందిన చేతిగొడ్డళ్లు, బ్లేళ్లు మొనలు పాలిష్ చేసిన గొడ్డళ్లు, విసరురాళ్లు, ఒడిసెలరాళ్లు, ఇనుపయుగానికి చెందిన మట్టి శవపేటికలు, నలుపు,

ఎరుపు, నలుపు-ఎరుపు మట్టిపాత్రలు, ఇనుప పనిముట్లు ఇప్పటికీ ఆశ్చర్యాన్ని గొలుపుతున్నాయి. చారిత్రక తొలియుగా (క్రీ.పూ. 3-క్రీ.శ. 4వ శతాబ్ది)నికి చెందిన మట్టిపాత్రలు, పూసలు, ఇనుప పనిముట్లు, అప్పటి జీవన విధానానికి అద్దం పడుతున్నాయి.

**ఖజానా బిల్డింగ్ మ్యూజియం: గోల్కొండ, హైదరాబాదు.**

గోల్కొండ పెద్దబజారులో పోస్టాఫీసు ప్రక్కనున్న పురాతన భవనం కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీల ట్రెజరీగా ఉండటం మూలాన దానికి ఖజానా బిల్డింగ్ అని పేరు కలిగింది. విశాలమైన భవనంలో రాష్ట్రకూట, వేములవాడ చాళుక్య, కళ్యాణీ చాళుక్య, కాకతీయ, తరువాతి కాలపు శిల్పాలు, కుతుబ్‌షాహీ, అసఫ్‌జాహీల యుద్ధ పరికరాలు ప్రదర్శించబడినాయి. శిల్పాల్లో చిలుకూరు, కొలనుపాక, పటాన్‌చెరువుల నుంచి తరలించిన పార్శ్వనాధ, మహావీర జైన శిల్పాలు, నరసింహ, వినాయక, చండి, చాముండి, సప్తమాతలు, మహిషమర్ధిని, వీరగల్లు శిల్పాలు ముఖ్యమైనవి. ఆయుధాల్లో విల్లు, బాణాలు, తుపాకులు, ఫిరంగి గుళ్లు, కత్తులు, డాల్లు చూడాల్సిన వస్తువులు.

**గోల్కొండ టూంబ్స్ మ్యూజియం: గోల్కొండ.**

గోల్కొండ కోటను, హైదరాబాదు నగరాన్ని నిర్మించిన కుతుబ్‌షాహీ రాజుల సమాధులను చూడటానికి వచ్చే పర్యాటకుల కోసం రాష్ట్ర పురావస్తుశాఖ, ఒక చిన్నపాటి మ్యూజియాన్ని ఏర్పాటుచేసింది. కుతుబ్‌షాహీల చరిత్రతోపాటు ఆనాటి పనిముట్లు, ఇతర వస్తువులను గురించి కూడా తెలుసుకోవటం ఆసక్తికరంగా ఉంటుంది. విలక్షణ ఇస్లాం వాస్తును ప్రతిబింబిస్తున్న సమాధుల నడుమ ఉన్నా ఈ మ్యూజియంలో కుతుబ్‌షాహీలు వాడిన కవచాలు, కత్తులు, కటార్లు, విందారగించిన చైనా పింగాణీ పాత్రలు, నాటి రాతప్రతులు, నాణేలు, ఇంకా సమాధుల ప్రాంగణంలో సమ్మర్ హౌస్ దగ్గర జరిపిన తవ్వకాల్లో బయల్పడిన వస్తువులను ప్రదర్శనలో ఉంచారు. పుస్తకాల్లో చదువుకొనే రాజుల చరిత్రతోపాటు వారి వర్ణచిత్రాలు, వాడిన పరికరాలను తిలకించటం వల్ల చరిత్ర పై మమకారం, వారసత్వ సంపద పై గౌరవాలు పెరుగుతాయి.

**విశాఖ మ్యూజియం: విశాఖపట్నం.**

డెస్టినేషన్ సిటీగా పేరుగాంచిన విశాఖపట్నంలో పొడవాటి బీచ్‌లు, బౌద్ధకట్టడాలు, స్టీల్ ప్లాంట్, హార్బరు, సింహాచలం దేవస్థానాలతోపాటు కైలాసగిరిలాంటి

విహారయాత్రా స్థలాలు కూడా ఎక్కువే. వచ్చే పర్యాటకుల కోసం కొన్నేళ్ల క్రితం నగరపాలక సంస్థ చిన్నవాల్తేరు-బీచ్ మధ్య గల డచ్ బిల్డింగ్‌లో ఏమంత పురాతనం కాని వస్తువులతో విశాఖ మ్యూజియాన్ని ఏర్పాటుచేసింది. ఇందులో విజయనగరం, బొబ్బిలి సంస్థానాధీశుల వస్తువులు, పైడిరాజు, రాజేశ్వరరావుల పెయింటింగ్‌లు, నావల్ యూనిట్ వారి పాత వస్తువులను ప్రదర్శించారు. పురావస్తువులు లేని లోటు కొట్టొచ్చినట్టు కనబడుతున్న ఈ మ్యూజియం ఆవరణలో నగరపాలక సంస్థ సౌజన్యంలో 1999లో రాష్ట్ర పురావస్తుశాఖ ఆర్కియోలజికల్ సెక్షన్‌ను ఏర్పాటుచేసింది. ఇందులో తొట్లకొండ, బావికొండ వద్ద బయల్పడిన బుద్ధ పాదాలు, ఛాత్రపు శకలాలు, హైదరాబాదు నుంచి తరలించిన బుద్ధుని శిల్పం, కాకతీయశిల్పం, పాల-సేన శిల్పాలు, వేణుగోపాల శిల్పం మనోహరంగా ఉన్నాయి. మరో విభాగంలో విశాఖ ప్రాంతంలో బయల్పడిన గుప్తనిధులు, నాణేలు, కంచు విగ్రహాలు, కత్తులు, కటారులను కూడా ప్రదర్శించారు. ఇదే ఆవరణలో నిర్మాణం పూర్తైన మ్యూజియంలో మరో కొన్ని నెలల్లో పూర్తి స్థాయి మ్యూజియం రూపుదిద్దుకోబోతుంది.



**ఆంధ్ర సారస్వత పరిషత్ పత్రిక మ్యూజియం: కాకినాడ.**


స్వాతంత్ర్యం రాకమునుపు ఆంధ్రదేశపు ప్రాచీన సాహిత్యంపై పరిశోధనలు చేసి, నాటి సారస్వత ఔన్నత్యాన్ని నలుగురికీ తెలియజెప్పటానికి ఏర్పడిన ఆంధ్ర సారస్వత పరిషత్తు ఒక పత్రికను స్థాపించింది. విలువైన సాహిత్య విషయాలను వెలువరించుటమే కాక అరుదైన రాతప్రతులు, ముద్రిత గ్రంథాలను పురాతన వస్తువులను సేకరించింది. అలా ఒక్కో రాతిప్రతి ఒక్కో శిల్పం, ఒక్కో వస్తువు చేరి రాతప్రతుల గ్రంథాలయంతోపాటు చిన్నపాటి మ్యూజియం కూడా ఏర్పడింది. పరిషత్తు నిర్వహణలో రామారావుపేటలో నున్న ఈ గ్రంథాలయం, మ్యూజియాలను రాష్ట్ర ప్రభుత్వం స్వీకరించి, ఒక పరిశోధనా సంస్థను కూడా ఏర్పాటుచేసింది. అమూల్యమైన విద్య, అలంకారశాస్త్రం, చారిత్రక సాహిత్యం, పురాణాలు, కావ్యాలు, ప్రబంధాలు, ఆయుర్వేద, వైద్య గ్రంథాలు, పిఠాపురం రాజా బహూకరించిన పుస్తకాలు, రాతప్రతులు

ఎందరో పండితుల దృష్టిని ఆకర్షించాయి.

దూరప్రాంతాల నుంచి వచ్చే సాహితీ, చారిత్రక పరిశోధనలు, ఇతర పర్యాటకుల సౌకర్యార్థం, ఇదే భవనం ఆవరణలో శిలాశిల్పాలు, శాసనాలు, ఇతర పురావస్తువులు కూడా ప్రదర్శనలో ఉన్నాయి. మోర్త నుంచి తరలించిన శివుని బొమ్మ, ఎర్రవరం నుంచి తరలించిన బుద్ధుని ధాతుపేటిక, శాతవాహన కాలపు ఇటుక రాయి, ఇంకా ఇతర ప్రాంతాల నుంచి తరలించిన భైరవ, చండి, మహిషమర్ధిని శిల్పాలు ఒకనాటి కోస్తా ప్రాంత చరిత్రకు సాక్ష్యం పలుకుతున్నాయి. ఏ మాత్రం సందర్శకుల నాకట్టుకొనే రీతిలో లేని ఈ మ్యూజియాన్ని ఆధునీకరంచాల్సిన అవసరాన్ని పర్యాటక, పురావస్తుశాఖలు గుర్తించి, రాతప్రతులపై ఒక కేటలాగును, ప్రదర్శితాలపై ఒక గైడ్ బుక్‌ను పర్యాటకులకు అందుబాటులో ఉంచాలి.

**రాళ్లబండి సుబ్బారావు గవర్నమెంట్ మ్యూజియం: ఉల్లితోట వీధి, రాజమండ్రి.**

ఆంధ్రదేశ చరిత్ర, సంస్కృతిపై పరిశోధన చేయటానికి ఏర్పడిన ఆంధ్రేతిహాసిక పరిశోధక మండలి కార్యదర్శి రాళ్లబండి సుబ్బారావు 1930 ప్రాంతం నుంచి సేకరించిన విలువైన శాసనాలు, శిల్పాలను భద్రపరిచి ఒక మ్యూజియంగా తీర్చిదిద్దారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1967లో దీన్ని స్వీకరించి ప్రభుత్వ మ్యూజియంగా ప్రకటించింది. 1999లో పునర్వ్యవస్తీకరించబడిన ఈ మ్యూజియంలో గోదావరి జిల్లాల నుంచి తరలించిన శిల్పాల్లో మార్కండేయ, కూర్మపీఠం, బుద్ధుని శిల్పం, తాటిపాక మహావీరుని శిల్పం ముఖ్యమైనవి. రాజరాజనరేంద్రుని బంగారు నాణెం, కుతుబ్‌షాహీ, అసఫ్‌జాహీల కాలపు కత్తులు, కటార్లు, నెల్లూరు కొయ్య బొమ్మలు, హైదరాబాదు బీద్రీ పాత్రలు, కంచు బొమ్మలు ముఖ్యమైనవి. గోదావరి వరదల్లో కొట్టుకొచ్చిన ట్రైబల్ స్త్రీ, శివుని తల కొయ్య బొమ్మలు ప్రత్యేకాకర్షణలు. సమీపంలోనున్న సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం భవనంలో ప్రదర్శించిన అతని పడక కుర్చీ, బట్టలు, చేతికర్ర, రాతప్రతులు, రచనలు, ప్రింటింగ్ మెషీన్, ఇంకా వీరేశలింగం భార్య రాజ్యలక్ష్మి నివాసం పర్యాటకులు చూచి తీరాల్సిందే.



**విక్టోరియా జూబిలీ (బాపు) మ్యూజియం: బందర్ రోడ్డు, విజయవాడ.**

విక్టోరియా మహారాణి సింహాసనాన్నధిష్టించి 25 ఏళ్లైన

సందర్భంగా 1887వ సం లో అందుకు గుర్తుగా విజయవాడలో నిర్మించిన భవనంలో మ్యూజియాన్నేర్పరచటంవల్ల దీనికి వీజే మ్యూజియం అని పేరొచ్చింది. నూజివీడు జమీందారు బహూకరించిన ఈ స్థలంలో నిర్మించిన భవనంలో తీరప్రాంతం నుంచి తరలించిన శిల్పాలు, ఇతర ప్రాంతాల నాణేలు, రాతప్రతులు, పెయింటింగ్‌లు, మధ్యయుగాలనాటి ఆయుధాలు, ప్రదర్శనలో ఉన్నాయి. భవనం గోడల మీదున్న ఏనుగులు, ఒంటెల మరుసలు అప్పటి సుధాశిల్ప నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. శిలాశిల్పాల్లో బుద్ధుని సున్నపు రాతిశిల్పం, కొణిదెన, దర్శి పంచవీరశిల్పాలు, ఇంకా చండేశ, వీరభద్ర, ముఖలింగం, మహిషమర్దిని, ద్వారపాలక, సప్తమాతలు, వినాయక శిల్పాలు ముఖ్యమైనవి. నాణేలు, మీనియేచర్ పెయింటింగులు, రాతప్రతులు, రాగిరేకు శాసనాలు చూడాల్సిన వస్తువుల్లో కొన్ని. మ్యూజియం ఆవరణలో డచ్ వారి సిమెట్రీల వద్ద ఉంచిన ఎపిటాఫ్‌లూ, కాలువ తవ్వకాల్లో బయల్పడిన తూర్పు చాళుక్యుల స్థంభాలు ఈ మ్యూజియంలోని ఇతర అకర్షణలు.



**బౌద్ధశ్రీ ఆర్కియోలజికల్ మ్యూజియం: ఏసీ కాలేజీ ఎదురుగా, గుంటూరు.**

విద్యా, వ్యాపార కేంద్రంగా గుర్తింపు పొందిన గుంటూరు మహానగరంగా ఎదిగింది. అనేక విద్యా సంస్థలున్న గుంటూరులో స్థానిక అడ్వకేటు బసివిరెడ్డి కృషి, ఒకప్పటి కలెక్టర్లు భగవాన్‌దాస్, ఎన్. రమేశన్‌ల తోడ్పాటుతో అమరావతి రోడ్డులో ఏసీకాలేజీ ఎదురుగా ఉన్న స్థలంలోని పాతభవనంలో కేవలం రాతిశిల్పాలను భద్రపరచారు. రానురాను పురాతన వస్తువుల పట్ల మక్కువ చూపించే విద్యావేత్తలు, పరిశోధకుల నుంచి వచ్చిన వత్తిడివల్ల రాష్ట్ర ప్రభుత్వం ఈ మ్యూజియం స్థాయిని పెంచింది. చుట్టు పక్కల గల బౌద్ధ స్థావరాల నుంచి సేకరించిన శిలాఫలకాలు, బుద్ధుని బొమ్మలు, ఎక్కువగా ఉండటంవల్ల ఈ మ్యూజియానికి బౌద్ధశ్రీ ఆర్కియోలజికల్ మ్యూజియం అని పేరు కల్గింది. 1992లో ఆధునీకరించబడిన ఈ మ్యూజియంలో, బుద్ధాం, ఏట్రవానిపాలెం, కర్లపాలెం, చేబ్రోలు మొదలైన చోట్ల నుంచి సేకరించిన క్రీ.పూ. 2-క్రీ.శ. 3 శతాబ్దాలకు చెందిన సున్నపురాతి శిలాఫలకాలు, బుద్ధుని శిల్పాలు చూపరులను ఇట్టే ఆకట్టుకొంటున్నాయి. ఖమ్మంజిల్లా నేలకొండపల్లి నుంచి సేకరించిన బుద్ధుని పంచలోహ విగ్రహం ఇక్కడి ప్రత్యేకాకర్షణ. ఆరుబయట

ప్రదర్శించిన క్రీ.శ. 7-17 శతాబ్దాల మధ్యకాలానికి చెందిన శైవ, వైష్ణవ, శాక్త శిల్పాలు పరిశోధక విద్యార్థులు, సామాన్య పర్యాటకుల్లో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. 1999లో కొద్దిపాటి ఆధునీకరణకు నోచుకొన్న ఈ మ్యూజియంలో నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా పనిచేసిన కీ.శే. బి.యస్.ఎల్. హనుమంతరావు జ్ఞాపకార్థం ఒక పరిశోధనా సంస్థను నెలకొల్పి బి.ఎస్.ఎల్ సొంత గ్రంథాలయాన్ని కూడా పరిశోధకులకు అందుబాటులో ఉంచారు.

**జిల్లా పురావస్తు ప్రదర్శనశాల: దర్గామిట్ట, సరస్వతీనగర్, నెల్లూరు.**

విక్రమ సింహపురిగా పేరుగాంచిన నెల్లూరు పట్టణానికి దాదాపు వెయ్యేళ్లకుపైగా చరిత్ర ఉంది. జిల్లా రాతియుగం నుంచి మధ్యయుగాల వరకు ఎన్నో చారిత్రక సంఘటనలకు సాక్షీభూతంగా నిలిచింది. సాహిత్యం, కళలు, దేవాలయాలు, చేతి వృత్తులకు పుట్టిల్లైన నెల్లూరులో ఇటీవలి కాలం వరకూ జిల్లా ప్రాదేశిక చరిత్ర, సంస్కృతిని తెలియజెప్పే మ్యూజియం లేదు. 1999లో జిల్లా నుంచి తరలించిన శిల్పాలు, శాసనాలలో ఆరుబయలు మ్యూజియంగా ప్రారంభమైన జిల్లా మ్యూజియం నిర్మాణంలో ఉంది. రాబోయే సంవత్సరంలో అన్ని హంగులతో ప్రదర్శనశాల రూపుదిద్దుకోబోతుంది. ఉన్న శిల్పాల్లో వినాయక, సప్తమాతలు, వీరభద్ర, వేణుగోపాల, కుంతూరు, దామరాయిల నుంచి తరలించిన బుద్ధుని బొమ్మలు, కర్నూలుజిల్లా పాతకోట నుంచి తరలించిన ఆలయద్వార శాఖలు ప్రత్యేక ఆకర్షణలు.

**స్థానిక ప్రదర్శనశాల: కనుపర్తి, ప్రకాశం జిల్లా.**

ఒంగోలు స్టేషన్‌లో దిగి బస్సుల్లో చేరుకోటానికి వీలున్న కనుపర్తి వద్ద చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తరలించిన శిలాశిల్పాలు, శాసనాలతో ఒక చిన్న మ్యూజియాన్ని ఏర్పాటుచేశారు. క్రీ.శ. 7-17 శతాబ్దాల మధ్యకాలానికి చెందిన అనేక రాతి శిల్పాల్లో నంది, వీరభద్ర, వీరగల్లు శిల్పాలు ముఖ్యమైనవి.

**స్థానిక ప్రదర్శనశాల: చంధవరం, ప్రకాశం జిల్లా.**

ప్రకాశంజిల్లా దర్శి, త్రిపురాంతకంల నుంచి చేరుకొనే వీలున్న చంధవరం గ్రామ శివారులో, గుండ్లకమ్మనది కుడివైపున గల సింగరకొండమీదున్న బౌద్ధ స్థూపం, చైత్య, విహారాల వద్ద 1970లో తవ్వకాలు జరిగాయి. క్రీ.పూ. 2 - క్రీ.శ. 3 శతాబ్దాల మధ్యకాలానికి చెందిన శాతవాహన నాణేలు, మట్టిపాత్రలు, చైత్యాలు, శిలామండపాలు ఆనవాళ్లు లభించాయి. కొండను వివిధ మట్టాల్లో లెవెల్ చేసి నిర్మించుకున్న బౌద్ధ కట్టడాలను తీర్చిదిద్దిన తీరు ప్రశంసనీయం. బయల్పడిన

మహాస్థూపం ప్రదక్షిణాపథం చుట్టూ నిలిపిన నిలువెత్తు శిలాఫలకాలు, స్థూపం పైన గల హార్మికం శాతవాహన కట్టడ కౌశలాన్ని తెలియజేస్తున్నాయి. సాంచీ స్థూపాన్నీ గుర్తుకు తెచ్చే ఈ స్థూపం చుట్టూ పడిపోయి ఉన్న శిలాఫలకాలను ప్రదర్శించే నిమిత్తం ఇక్కడ ఒక చిన్న మ్యూజియాన్ని రాష్ట్ర పురావస్తుశాఖ నిర్మించింది. అందులో బోధివృక్షం, స్థూపం, సింహాసనంలాంటి బొమ్మలున్న అనేక శిలాఫలకాలు మాత్రమే ఉన్నాయి. విసిరేసినట్లు జనావాసాలకు దూరంగా ఉండటమే కాక, గుండ్లకమ్మనదిపై బ్రిడ్జి లేకపోవడంతో ఈ స్థల మ్యూజియాన్ని దర్శించే పర్యాటకుల సంఖ్య చాలా తక్కువేనని చెప్పాలి. సరైన భద్రతలేని కారణంగా ఇప్పటికి రెండుమార్లు విలువైన శిలాఫలకాలు దొంగతనానికి గురికాగా, మ్యూజియంలో నున్న ఇతర శిలాఫలకాలను చంధవరం గ్రామ పంచాయితీ కార్యాలయంలో భద్రపరిచారు.

**భగవాన్ మహావీర్ ప్రభుత్వ మ్యూజియం: కడప.**



జిల్లా ప్రాదేశిక చరిత్ర, సంస్కృతులపై ఆసక్తిగల పర్యాటకులు, పరిశోధకుల కోసం 1981లో రాష్ట్ర పురావస్తుశాఖ, స్థానిక మహావీర జైన సంఘం సహకారంతో కడపలో భగవాన్ మహావీర్ ప్రభుత్వ ప్రదర్శనశాలను ఏర్పాటుచేసింది. జిల్లాలోని ఒకే ఒక బౌద్ధ స్థావరమైన నందలూరు నుంచి తరలించిన బుద్ధ పాదాలు, ఇతర సున్నపు బొమ్మలు, ఇంకా జిల్లా నుంచి తరలించిన జైన, శైవ, వైష్ణవ, శాక్త శిల్పాలు, శాసనాలు సందర్శకులను ఆకట్టుకొంటున్నాయి.

**స్థానిక మ్యూజియం: మైలవరం డ్యాం సైట్, కడప జిల్లా.**

కడపజిల్లా, మైలవరం వద్ద చిత్రావతి నదిపై ఆనకట్ట నిర్మించటంవల్ల ఏర్పడిన జలాశయం ముంపుకు గురైన గ్రామాల నుంచి తరలించిన విలువైన చారిత్రక శిల్పాలు, శాసనాలను భావితరాలకు ప్రదర్శించే నిమిత్తం మైలవరం దగ్గర అప్పటి ఇంజనీరు శివరామకృష్ణయ్య సహకారంతో పురావస్తుశాఖ ఒక మ్యూజియాన్ని ఏర్పాటుచేసింది.

**కల్లూరు సుబ్బారావు గవర్నమెంట్ మ్యూజియం: డి.ఆర్.డి.ఎ. కాంప్లెక్సు, అనంతపూర్.**

స్వాతంత్ర్య సమరయోధుడైన కల్లూరు సుబ్బారావు మ్యూజియం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని విరాళంగా ఇచ్చినందుకు మ్యూజియానికి ఆయన పేరు పెట్టారు. జిల్లా ప్రాదేశిక చరిత్ర, సంస్కృతిని వెల్లడించే పురావస్తువులు, శాసనాలు, శిల్పాలు, ప్రదర్శనలో ఉన్నాయి.



**జిల్లా పురావస్తు ప్రదర్శనశాల: బుధవారపేట, కర్నూలు.**

శ్రీశైలం జలాశయం ముంపుకు గురైన గ్రామాల నుంచి తరలించిన శిల్పాలు, శాసనాలు, ఇతర పురావస్తువులను హంద్రీనది ఒడ్డున నిర్మించిన మ్యూజియంలో ఉంచారు. హైదరాబాదు నుంచి తరలించిన రాతి, ఇనుప, చారిత్రక తొలియుగాలకు చెందిన రాతి గొడ్డళ్ళు, సూక్ష్మరాతి పనిముట్లు, మట్టి పాత్రలు, ఇనుప పనిముట్లు, మట్టి బొమ్మలు, మట్టి, రాతిపూసలు, శిలాశిల్పాలు చూపరులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. జిల్లా నుంచి తరలించిన క్రీ.శ. 7-18 శతాబ్దాలకు చెందిన శిలాశిల్పాల్లో నటరాజ, పద్మపాణి, కుబేర, ఆరుబయట ప్రదర్శించిన మాతృదేవత, సప్తమాతలు, గణేశ, శివలింగం, నంది, శృంగార, శిల్పాలు, మ్యూజియం వెనుకగల ద్వార బంధాలు, పునర్నిర్మించిన పాతకోట దేవాలయం, కొక్కెరంచ, ఎర్రమరం మండపాలు జిల్లాలోని దేవాలయ వాస్తును విడమర్చి చెబుతున్నాయి.

**జిల్లా పురావస్తు ప్రదర్శనశాల: పిల్లలమర్రి, మహబూబ్‌నగర్.**

పట్టణ వాతావారణానికి దూరంగా, సుందరమైన ప్రకృతి మధ్య విశాలమైన విహార స్థలంలో, మహబూబ్‌నగర్‌కు 6 కి.మీ. దూరంలో నున్న పిల్లలమర్రి వద్ద గల మ్యూజియంలో రమణీయ శిల్పాలు, అందమైన ఆలయం, శాఖోపశాఖలుగా విస్తరించిన మర్రిచెట్టు, అటవీశాఖవారి నర్సరీ, పక్షుల సంరక్షణాలయం, జింకల పార్కులతో కళకళలాడుతూ రోజూ ఎంతో మంది పర్యాటకుల్ని



ఆకర్షిస్తూంది. మ్యూజియంలోని జూరాల పెవిలియన్‌లో, ప్రాజెక్టు ముంపుకు గురైన ప్రాంతాలు, ఇతర స్థలాల నుంచి సేకరించిన రాతి యుగం, చారిత్రక తొలియుగానికి చెందిన పురావస్తువులు, మధ్యయుగాలకు చెందిన కంచు విగ్రహాలు, బీద్రీపాత్రలు, ఆయుధ సామగ్రి, చైనా పింగాణీ పాత్రలు, శాతవాహనుల నుంచి అసఫ్‌జాహీల వరకూ విడుదల చేసిన నాణేలు ప్రదర్శనలో ఉన్నాయి. ఆరుబయట పశ్చిమ చాళుక్య, రాష్ట్రకూట, కళ్యాణీ చాళుక్య, కాకతీయ, విజయనగర కాలాలకు చెందిన అనేక అపురూప శిల్పాలున్నాయి. వాటిలో జ్యేష్ఠాదేవి, సప్తమాతలు, మహిషమర్థిని వల్లీసుబ్రహ్మణ్య, కూష్మాండ, గణేశ, చామరధారి, పార్శ్వనాథ, మహావీర శిల్పాలు ముఖ్యమైనవి. ఆవరణలో కృష్ణా తీరగ్రామం ఈర్లదిన్నె నుంచి తరలించి పునర్నిర్మించిన 16వ శతాబ్దికి చెందిన రాజరాజేశ్వరాలయం సందర్శకులకు మరో ఆకర్షణ.

**స్థానిక మ్యూజియం: అలంపూరు, మహబూబ్‌నగర్ జిల్లా.**

బాదామీ చాళుక్య దేవాలయ వాస్తుకు అద్దం పడుతున్న నవబ్రహ్మాలయాలున్న అలంపూరు కర్నూలుకు 32 కి.మీ. దూరంలో ఉంది. రేఖానాగర ప్రాసాదాలున్న అలంపూర్‌లో జోగులాంబ దేవాలయం ప్రక్కన ఓ చిన్న మ్యూజియం ఉంది. కేవలం శిలాశిల్పాలే ఉన్న ఈ మ్యూజియంలోని కళాఖండాలు అంతర్జాతీయ ఖ్యాతి నొందాయి. ఆ మధ్య జరిగిన ఫెస్టివల్ ఆఫ్ ఇండియాకు వివిధ దేశాలకు పంపిన శిల్పాల్లో అలంపూరు శిల్పాలు కూడా ఉండటం గమనార్హం. మ్యూజియంలోని చాళుక్య, రాష్ట్రకూట, కళ్యాణీ చాళుక్యుల కాలపు విగ్రహాల్లో మహిషమర్థిని, అంధకాసుర సంహారమూర్తి నటరాజ, ఉమా మహేశ్వర, సూర్య, నాగిని, శిల్పాలు ముఖ్యమైనవి.



**జిల్లా పురావస్తు ప్రదర్శనశాల: పానగల్లు, నల్లగొండ.**

కందూరు చోళుల రాజధానిగా విలసిల్లిన పానగల్లు, నల్లగొండకు 3 కి.మీ ల దూరంలో ఉంది. ఉదయనచోడుడు క్రీ.శ. 12వ శతాబ్దంలో తవ్వించిన ఉదయాదిత్య సముద్రం, నిర్మించిన పచ్చల సోమేశ్వరాలయాలు, కాకతీయులు నిర్మించిన ఛాయాసోమేశ్వర, వెంకటేశ్వరాలయాలున్న పానగల్లు పర్యాటకులను ఎప్పట్నుంచో ఆకర్షిస్తుంది. చారిత్రక పానగల్లు పట్టణంలో జిల్లా నుంచి తరలించిన

శిల్పాలు, శాసనాలతో పాటు పురావస్తువులతో 1992లో మ్యూజియాన్ని ప్రారంభించారు. జిల్లాలోని దేవరకొండ, నాగార్జునసాగర్, యేలేశ్వరం నుంచి తరలించిన ప్రాక్ చారిత్రక అవశేషాలైన పాత కొత్త, మధ్యరాతి యుగం గొడ్డల్లు, సూక్ష్మరాతి పనిముట్లు, నగీషీ చేసిన చేతిగొడ్డళ్లు, కర్నూలు జిల్లా బెలుంగుహలలో దొరికిన తామ్ర శిలాయుగం (క్రీ.పూ. 2000-1000 సం।) నాటి పెయింటెడ్ పాట్టరీ మొదలైన పురావస్తువులు ఆదిమమానవుని జీవన సరళిని అంచనావేయటానికి ఉపయోగపడతాయి. జిల్లా నుంచి తరలించిన వర్ధమానుకోట బుద్ధుని ప్రతిమ, తిరుమలగిరి, ఫణిగిరి నుంచి తరలించిన క్రీ.శ. 1వ శతాబ్దానికి చెందిన బ్రాహ్మీ శాసనాలున్న బౌద్ధ శిలాఫలాకాలు, మట్టిబొమ్మలు, పూసలు, రాతి పూసలు, నాణేలు, మధ్యయుగాలనాటి పురావస్తువులు ఈతరం కుర్రకారుకు గతకాలపు ఔన్నత్యాన్ని తెలియజేస్తున్నాయి. ఆరుబయలు శిల్పాల్లో కందూరు చోళుల కాలపు కాలభైరవ, శైవ, శాక్త, సామాజిక శిల్పాలు ఎంతో చక్కగా ఉండి అనేక మంది పర్యాటకుల్ని ఆకర్షిస్తున్నాయి. క్రీ.శ. 13వ శతాబ్దికి చెందిన నిలువెత్తు గణపతి ముందు 3 అడుగుల పొడవున్న ఎలుక శిల్పం అందర్నీ అలరిస్తుంది.

**స్థానిక ప్రదర్శనశాల: కొలనుపాక**

దక్షిణభారత దేశంలో పద్దెనిమిది కులాలకు 18 దేవాలయాలు, 18 మఠాలు ఉన్న ఒకే ఒక ఊరు కొలనుపాక, హైదరాబాదుకు 80, ఆలేరుకు 6 కి.మీ.ల దూరంలో ఉన్న కొలనుపాక గొప్ప జైనక్షేత్రంగా పేరుగాంచింది. ఇంకా క్రీ.శ. 9-10 శతాబ్దాల నాటి సోమేశ్వరాలయం, 11వ శతాబ్దినాటి వీరనారాయణ ఆలయం చూడదగినవి. సోమేశ్వరస్వామి అలయ ప్రాంగణంలో క్రీ.శ. 8-18 శతాబ్దాలకు చెందిన అనేక రాతి శిల్పాలున్నాయి. చుట్టు పక్కల గ్రామాల పొలిమేరల్లో పడి ఉన్న శిల్పాలను 1960లో సేకరించి ఒక మ్యూజియంగా తీర్చిదిద్దారు. ఇందులో రాష్ట్రకూట కాలానికి చెందిన చండి, కళ్యాణీ చాళుక్య కాలానికి చెందిన ఉమామహేశ్వర, సప్తమాతలు, భైరవ, గణేశ, మహావీర, వజ్రపాణి శిల్పాలు ముఖ్యమైనవి.

**జిల్లా పురావస్తు ప్రదర్శనశాల: మున్సిపల్ ఆఫీసు వెనుక, వరంగల్**

కాకతీయుల రాజధానులుగా విలసిల్లిన హనుమకొండ, వరంగల్లు పట్టణాల్లోనే కాక తెలంగాణాలో ఎక్కడ చూచినా కాకతీయ దేవాలయాలు, శిల్పాలే. విలక్షణమైన శైలిలో రూపొంది చక్కటి పనితనంతో, చూడటానికి ఎంతో అందంగా కనిపించే శిల్పాలను, శాసన ఫలకాలను జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించి



మ్యూజియంలో భద్రపరిచారు. రాతియుగపు పనిముట్లు, చారిత్రక తొలియుగపు మట్టిపాత్రలు, పూసలు, గాజులు, మట్టిబొమ్మలు జిల్లా చరిత్రను అంచనా వేయటానికి ఉపయోగపడతాయి. గీసుకొండ తవ్వకాల్లో వెలుగు చూచిన శాతవాహన కాలపు నాణేలు, మట్టిపాత్రలు, బొమ్మలు ప్రత్యేక అకర్షణగా చెపుకోవచ్చు. ఇతర గాలరీల్లో మధ్యయుగాలనాటి అయుధాలు, ఫిరంగులు, బీద్రీపాత్రలు, శాసనాలనకళ్లు, నాణేలు ఇంకా సమకాలీన కళారూపాలు ఉన్నాయి. శిల్పాల్లో గొడిశాల చాముండి, బైరాన్‌పల్లి పార్శ్వనాథ, ఘన్‌పూర్ గణేశ, ద్వారపాల, చండి ముఖ్యమైనవి.

**గాంధీ సెంటెనరీ మ్యూజియం: బస్ కాంప్లెక్స్ ఎదురుగా, కరీంనగర్.**

జి.సి. మ్యూజియంగా పిలువబడుతున్న ప్రదర్శనశాలలో జిల్లా నుంచి సేకరించిన ఫాజిల్స్, రాతియుగపు పనిముట్లు, పెద్దబంకూరు, ధూళికట్టల నుంచి సేకరించిన చారిత్రక తొలియుగపు మట్టిపాత్రలు, ఇటుకలు, ఇనుప పనిముట్లు, మట్టి బొమ్మలు, నాణేలు ఉన్నాయి. వీటితోపాటు కాకతీయుల రాగిరేకు శాసనాలు, బీద్రీపాత్రలు, మీనియేచర్ పెయింటింగ్‌లు, శిలాశిల్పాలు కూడా ఉన్నాయి. ధూళికట్ట బౌద్ధ స్థూపం నుంచి తరలించిన శిలాఫలకాలు, పేషిగాం నుంచి తరలించి పునర్నిర్మించిన బౌద్ధ స్థూపం, నిలువెత్తు అంజనేయ విగ్రహం ఇక్కడి ప్రత్యేకతల్లో కొన్ని.



**హెరిటేజ్ మ్యూజియం: గుప్తా గార్డెన్స్, నిజామాబాద్.**

కంఠేశ్వరాలయం, ఖిల్లా రామాలయంలాంటి చారిత్రక కట్టడాలున్న నిజామాబాదు పట్టణంలో మ్యూజియం లేనందువల్ల, 2001 ఇందూరు ఉత్సవాల సందర్భంగా అప్పటి కలెక్టర్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పురావస్తు ప్రదర్శనశాల ఏర్పాటైంది. జిల్లా నుంచి సేకరించిన కొన్ని, హైదరాబాదు నుంచి తరలించిన కొన్ని శిల్పాలను టౌన్ హాలులో ప్రదర్శించారు. వీటితోపాటు రాతియుగం, ఇనుపయుగం, చారిత్రక తొలియుగంనాటి పురావస్తువులు, మధ్యయుగాల కత్తులు, కటార్లు, కంచు విగ్రహాలు, మీనియేచర్ పెయింటింగ్‌లూ, రకరకాల తుపాకులు కూడా ఉన్నాయి. ఆరుబయట నిలబెట్టిన దేవాలయ ద్వారం ఈ మ్యూజియానికి ప్రత్యేక ఆకర్షణ.

**శ్రీ వెంకటేశ్వర మ్యూజియం ఆఫ్ టెంపుల్ ఆర్ట్స్: తిరుపతి.**

తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయం ప్రక్కనే గల నమ్మళ్వార్ గుడిలో నున్న ఈ మ్యూజియం తరతరాల ఆలయ వాస్తు కళకు దర్పణం పడుతోంది. పురావస్తుశాస్త్ర, వాస్తుశిల్పశాస్త్ర విద్యార్థుల్లో ఆసక్తిని రేకెత్తించే వివిధ ఆలయగోపురాల ఫోటోలు, కొయ్యనమూనాలు ప్రధాన ఆకర్షణలు.

**ఎస్వీ మ్యూజియం: తిరుమల.**

తిరుమల సందర్శించే యాత్రిక పర్యాటకులకోసం టిటిడీ, విలక్షణ వాస్తు విన్యాసాన్ని జోడించి నిర్మించిన ఎస్వీ మ్యూజియం రోజూ వేల మందిని ఆకర్షిస్తుంది. రెండంతస్తుల్లో ఉన్న ఈ మ్యూజియంలో తిరుపతి పరిసరాలలో లభించిన వస్తువులు, ఇతర పురావస్తువులు ప్రదర్శనలో ఉన్నాయి.

**అరకు వ్యాలీ మ్యూజియం: అరకు.**

విశాఖ జిల్లాలోని అరకులో ఐటిడిఏ పాడేరు డివిజన్, స్థానికంగా నివసిస్తున్న 33 జాతుల తెగల సంస్కృతి, సంప్రదాయాలు, కళాత్మక వస్తువులు, పనిముట్లను ప్రదర్శించటానికి అరకు వ్యాలీ మ్యూజియాన్ని ఏర్పాటుచేశారు. పచ్చటి పొలాలు, ఎగుడుదిగుడు గుట్టలు, లోయలూ, కోనల్లో తిరిగొచ్చే విహారులకు ఈ మ్యూజియం విసిరేసినట్లు బతుకుతున్న తెగల సృజనాత్మకతను తెగమెచ్చుకొనేట్లు చేస్తుంది.

**నెహ్రూ సెంటెనరీ ట్రైబల్ మ్యూజియం: మాసబ్‌టాంక్, హైదరాబాద్.**


ఆదివాసీల అభ్యున్నతి కోసం పాటుపడిన పండిట్ నెహ్రూ సేవలకు గుర్తింపుగా మాసబ్‌ట్యాంక్‌లోని తెలుగు సంక్షేమ భవన్‌లో నున్న ట్రైబల్ మ్యూజియానికి నెహ్రూ సెంటెనరీ ట్రైబల్ మ్యూజియం అని పేరు పెట్టారు. శ్రీకాకుళం, విజయనగరం,

విశాఖ, ఉభయగోదావరి, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో నున్న మొత్తం 33 ఆదివాసీ తెగల జనాభా దాదాపు 42 లక్షలు. ఆదివాసీల జీవన విధానం, కట్టుబాట్లు, విందులు, వేడుకలు, వ్యవసాయ విధానాన్ని తెలిపే విధంగా ఈ మ్యూజియాన్ని ఏర్పాటుచేశారు. ఇందులో వారి గుడిసెలు, వ్యవసాయ పనిముట్లు, వేట పనిముట్లు, వాద్య పరికరాలు, ఆభరణాలు, ముసుగులు, ట్రైబల్ పంచాయతీ, సంత, ఫోటోలు, ఇంకా ఆదివాసీల సమాచార కేంద్రం ఉన్నాయి.

ఇంకా హైదరాబాద్‌లో బిర్లా, కమలామిట్టల్, నిజాం మ్యూజియాలతోపాటు అనేక ఆర్ట్ గాలరీలలో కూడా తెలుగువారి ప్రాచీన వస్తు సంపద, సమకాలీన వస్తు సంపద ప్రదర్శింపబడుతున్నాయి.

**సాలార్‌జంగ్ మ్యూజియం : చందూలాల్ బారాదరి, హైదరాబాద్.**

దేశంలోని మూడు జాతీయ ప్రదర్శనశాలల్లో ఒకటైన సాలార్‌జంగ్ మ్యూజియంలో సాలార్‌జంగ్ - III వ్యక్తిగతంగా బ్రిటన్, అరేబియా, పర్షియా దేశాలనుండి ఆసక్తితో సేకరించుకొన్న వస్తువులున్నాయి. వాటిలో పాలరాతి శిల్పాలు, స్ఫటికం, గాజు వస్తువులు, చైనా పింగాణీలు, కంచు ఇతర లోహపు వస్తువులు, ఐరోపా, జపాన్ పెయింటింగ్‌లు, రాజస్థానీ మినియేచర్ పెయింటింగ్‌లు మొదలైన ఎన్నో వస్తువులు చూపరుల మనసును దోచుకుంటాయి.




# 13 తెలుగువారి శిల్పం

## Sculpture of the Telugu People

తెలుగు నేలపై మట్టితో బొమ్మల్ని చేయటం కొత్త రాతియుగంలో ప్రారంభమైంది. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నమారూరు, కర్నూలు జిల్లా వీరాపురం, రామాపురంలో మట్టితో చేసిన ఎద్దు బొమ్మలు, రామాపురంలో మనిషి బొమ్మలు బయల్పడినాయి. క్రీ.పూ. 2100–1750 సంవత్సరం మధ్య కాలానికి చెందిన ఈ బొమ్మలే తెలుగ నేలపై రూపుదిద్దుకొన్న బొమ్మలు. క్రీ.పూ. 1000–500 కాలానికి చెందిన ఇనుపయుగంలో కూడా మట్టితో బొమ్మలు చేయటం కొనసాగింది. నిజామాబాదు జిల్లా పోచంపాడులో మూడు జింక బొమ్మలు, మహబూబ్‌నగర్ జిల్లా సేరుపల్లిలో ఒక జింకబొమ్మ, పెద్దమారూరులో దున్నపోతు బొమ్మలు ఇనుప యుగపు సమాధుల నుంచి బయల్పడినాయి. ఇదే కాలంలో చనిపోయిన వారి ఆకారాల (ఆడ, మగ)ను శాలువాకారపు రాతి స్థంభాలపై చెక్కారు. ఖమ్మం జిల్లా గలభగుండెం, కంచన్‌పల్లి, గుండాల, పోలిచెట్టి చెరువు గద్దె వద్ద, వరంగల్ జిల్లా కాటారం దామరవాయి, ఏటూరు నాగారం వద్ద ఇలాంటి మగ, ఆడ శిల్పాలు బయల్పడగా చిత్తూరు, అనంతపురం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మనిషి ఆకారాన్ని పోలిన యాంత్రోపోమోర్ఫ్‌లనే శిల్పాలు చెక్కబడినాయి.

మతపరమైన శిల్పాలను చెక్కడం, చారిత్రక తొలియుగంలో ప్రారంభమైంది. కరీంనగర్‌జిల్లా, ధూళికట్ట, గుంటూరు జిల్లా అమరావతిలో క్రీ.పూ. 1వ శతాబ్దానికి చెందిన బౌద్ధ శిలాఫలకాలు బయల్పడినాయి. మధ్య భారతదేశంలోని బార్హుత్ స్థూపం పై చెక్కిన బొమ్మల మాదిరిగానే ధూళికట్ట



స్థూప శిలాఫలకాలపై యక్ష, యక్షిణి శిల్పాలు తెలుగునేల పై చారిత్రక తొలియుగపు శిల్పకళను తెలియజేస్తున్నాయి. ఈ తొలితరం బౌద్ధశిల్పాల్లో థేరవాద చిహ్నాలైన త్రిరత్నాలు, బోధివృక్షం, బుద్ధపాదాలు, ధర్మచక్రం, వజ్రాసనం, గుర్రం, నాగులు, సింహాలు, ఇంకా ఉపాసక, ఉపాసికలు, యక్షులు లాంటి బొమ్మలు చెక్కబడినాయి. ధాన్యకటకం, ధూళికట్ట, చంధవరం స్థూపాల దగ్గర ఈ శిల్పాలను చూడవచ్చు. మహాయానబౌద్ధంలో, చిహ్నాల స్థానంలో బుద్ధుని ప్రతిమను ఆరాధించటం ప్రారంభమై




బుద్ధ చైత్యాలు నిర్మింపబడినాయి. గాంధార, మధుర శిల్పశైలుల మాదిరిగా అమరావతి శిల్పశైలి ప్రపంచ ప్రఖ్యాతిగాంచింది. సిద్ధార్థ గౌతముని జీవిత గాధలు, జాతక కథలు, సాధారణ జనజీవనం శిల్పాల్లో ప్రతిబింబించాయి. పొడవాటి శరీరం, చక్కటి సౌష్టవంతో అంగాలు, వంటిపైన బట్టలు, అలంకరణలు అందాన్ని ఇనుమడింపజేసాయి. బుద్ధుడు ధర్మచక్ర ప్రవర్తన అభయ ముద్రలలో చెక్కబడి తెలుగు శిల్పకళ తొలినాళ్లలోనే పరిణితి చెందింది. శాతవాహన కాలపు బౌద్ధశిల్పాలను అమరావతి, చంధవరం, ఫణిగిరి, ధూళికట్ట, ఘంటసాల మొదలైన చోట చూడవచ్చు. అమరావతి శిల్పాల్లో కొన్నింటిని అమరావతి, చెన్నై, లండన్‌లోని బ్రిటీష్ మ్యూజియాల్లో చూడవచ్చు. అమరావతిలో ఇటీవల నిర్మించిన కాలచక్ర మ్యూజియంలో బ్రిటిష్‌మ్యూజియంలో ఉన్న శిలాఫలకాల నకళ్లున్నాయి. అలాగే అమరావతి తవ్వకాల్లో బయల్పడిన శివలింగం, ఇంకా గుడిమల్లంలో నున్న శివలింగాలు శాతవాహన బ్రాహ్మణీయ శిల్పాలకు ఉదాహరణలు.

**ఇక్ష్వాకుల శిల్పం (క్రీ.శ.3వ శతాబ్దం)**

శ్రీపర్వత-విజయపురి (నాగార్జునకొండ) నుంచి క్రీ.శ. 3వ శతాబ్దిలో పాలించిన ఇక్ష్వాకులు, అటు కట్టడాల్లోనూ, శిల్పాలల్లోనూ శాతవాహనుల ఒరవడిని కొనసాగించారు. నాగార్జున కొండ, గోలి అమరావతి, ఉపులగొంగులు, చందవరం, గుమ్మడిమర్రు, గుంటుపల్లి, జగ్గయ్యపేట, ఘంటసాల, అల్లూరు, నేల కొండపల్లి






నాగార్జున కుందశిల్పం

మొదలైన చోట్ల స్థూపాలు, చైత్యాలు నిర్మింపబడి, చక్కటి బౌద్ధశిల్పాలు చెక్కబడినాయి. ఒక్క నాగార్జునకొండలోనే దాదాపు 30 బౌద్ధారామాలు వెలుగుచూశాయి బుద్ధుని జీవిత ఘట్టాలు, జాతక కథలు, మాతృదేవత, గృహపతుల శిల్పాలు ఇక్ష్వాకుల శిల్ప శైలికి అద్దం పడుతున్నాయి. సింహళ విహారంలోని బుద్ధ చైత్యంలోనున్న 9 అడుగుల బుద్ధ విగ్రహం ప్రపంచ ప్రఖ్యాతిగాంచింది. ఇంకా శిలాఫలకాల్లో బుద్ధుని ధమ్మచక్ర ప్రవర్తన, నందుని సంఘంలోకి తీసుకోవటం శంఖనిధి, పద్మనిధి, హారీతి శిల్పాలు నాటి శిల్పుల పనితనానికి మచ్చుతునకలు. బ్రాహ్మణీయ శిల్పాల్లో స్కంధుడు, కార్తికేయుడు, దేవసేన, కుబేర, శిల్పాలు తొలిసారిగా నాగార్జునకొండలోనే బయల్పడటం విశేషం. బౌద్ధ శిల్పాల్లో ఒక్కో ఫలకంలో 10 నుంచి 30 వరకూ వ్యక్తుల్ని అత్యద్భుతంగా, హావ, భావాలతో చెక్కినతీరు వర్ణించ అలవికాదు. శ్రీపర్వత-విజయపురి తవ్వకాల్లో బయల్పడిన శిల్పాలు నాగార్జునకొండ, జగ్గయ్యపేట, గోలి శిల్పాలు (వెస్సంతరజాతక దృశ్యాన్ని ప్రత్యేకంగా పేర్కొనాలి) చెన్నై మ్యూజియంలో ఉన్నాయి. మరికొన్ని ఇక్ష్వాకుల కాలపు శిల్పాలు ఘంటసాల మ్యూజియంలోనూ ఉన్నాయి. కర్నూలు జిల్లా వీరాపురం వద్ద జరిపిన తవ్వకాల్లో ఇదే కాలానికి చెందిన మట్టి గణపతి బొమ్మ, రాతి మహిషాసురమర్ధిని బొమ్మ పేర్కొనదగినవి.

**విష్ణుకుండిన శిల్పం (క్రీ.శ. 4-5 శతాబ్దాలు)**



హైదరాబాదు సమీపంలోని కీసరగుట్ట దగ్గర జరిపిన తవ్వకాల్లో విష్ణుకుండినుల కాలపు రాతి గణపతి బొమ్మ, అలాగే గర్భాపాత్ర పైనున్న దిక్పాల శిల్పాలు, నల్లగొండ జిల్లా యేలేశ్వరంలో బయల్పడిన నమూనా దేవాలయ గూడులో చెక్కిన ఉమామహేశ్వర, హరిహరమూర్తి శిల్పాలు, గుంటూరు

జిల్లా కొండమోటులో బయల్పడిన పంచవీర (విష్ణు, ప్రద్యుమ్న, నరసింహ, వాసుదేవ, సంకర్షణ) శిల్పం విష్ణుకుండిన శిల్ప శైలికి నిదర్శనాలు.


**శాలంకాయన శిల్పం (క్రీ.శ. 3-4వ శతాబ్దాలు)**

శాలంకాయనుల రాజధాని పెదవేగి తవ్వకాల్లో శివశక్తి, గణేశ, నాగిని,పంచలింగ, మహిషమర్ధిని,మట్టి గణేశ బొమ్మలు ఇక్ష్వాకుల శైలిలోనే తీర్చిదిద్దబడినాయి.

**పశ్చిమ లేక బాదామీ చాళుక్య శిల్పం (క్రీ.శ. 6-8 శతాబ్దాలు)**




కర్నాటకలోని బాదామి నుంచి పాలించిన బాదామీ చాళుక్యులు, మన రాష్ట్రంలో అలంపూరు, మహానంది, కడమర కాలువ, కూడలి సంగమేశ్వరం, పాణ్యం, సత్యవోలు, అయిజ, తేరాలలో రేఖానాగర పద్ధతిలో ఆలయాలను నిర్మించారు. వీటిలో అలంపూరులోని నవబ్రహ్మాలయాలు చాలా ముఖ్యమైనవి. ఆలయ అధిష్ఠానాలు, పాదవర్గం, కోష్టాలు, కపుల బండలు, శుకనాసిలపై దేవతాశిల్పాలు, దంపతులు, దిక్పాలశిల్పాలు ముఖ్యమైనవి. అలంపూర్ మ్యూజియంలోని 16 చేతుల నటరాజ శిల్పం, మహిషాసురమర్ధిని, ద్వారపాల, విష్ణుమూర్తి, లింగోద్భవమూర్తి, నాగరాజు, పార్వతి, సప్తమాతృకలు, ఉమామహేశ్వర శిల్పాలు, చాళుక్య శిల్పశైలికి అద్దం పడుతున్నాయి. చక్కటి



అలంపూర్ శిల్పం

రూపలావణ్యం, అంగసౌష్టవం చాళుక్య శిల్ప ప్రత్యేకతలు

**తూర్పు లేక వేంగీ చాళుక్యల శిల్పం (క్రీ.శ.7-11 శతాబ్దాలు)**



కుబ్జ విష్ణువర్ధనుని నాయకత్వంలో బాదామీ చాళుక్యుల మరోశాఖ వేంగి నుంచి క్రీ.శ. 621 నుంచి తీర ప్రాంతాన్ని పాలించటంన వీరిని తూర్పు చాళుక్యులనీ, వేంగీ చాళుక్యులనీ పిలిచారు. బాదామీ చాళుక్యుల మాదిరిగనే వీరు కూడా అనేక ఆలయాలను నిర్మించి, దేవాలయాల గోడలు, ద్వారబంధాలు, స్థంభాలపైనేగాక, విడిగా కూడా శిల్పాలను చెక్కారు. కోష్టాలపైన మకర, మయూర తోరణాలను తీర్చిదిద్దారు. పొందుగుల, అమరావతి, చేబ్రోలు, దాక్షారామం, విజయవాడ, భీమవర, సామర్లకోట మొదలైన చోట్ల అనేక దేవాలయాలు నిర్మించారు. వీరు నిర్మించిన పంచారామాలు ప్రసిద్ధిగాంచాయి. విజయవాడ, గుంటూరు, చెన్నై మ్యూజియంల్లోనున్న శిల్పాలు వేంగీచాళుక్య శిల్పానికి ఉదాహరణలు.

ద్రాక్షారామంలోని నమూనా ఆలయాలపై నున్న మహిషమర్దిని, భిక్షాటన, దిక్పాలకులు, దుర్గ, గణేశ, కుమార, వీరభద్ర, నటరాజ, గజసంహారమూర్తి, చండేశానుగ్రహమూర్తి, విగ్రహాలు, దాక్షారామ ముఖమండపం స్థంభాలపై చెక్కిన ఇంద్ర, బ్రహ్మ, నటరాజ, దేవి, కిరాతార్జున, మృగవ్యాధ శిల్పాలు, బిక్కవోలులోని గణేశ శిల్పం, ఈ కాలపు శిల్పశైలికి అద్దం పడుతున్నాయి. తూర్పు చాళుక్య శిల్పాలు తొలుత చాళుక్యరీతిని, తరువాత తూర్పు స్థానిక తీరాంధ్ర సాంప్రదాయాల్ని ప్రతిబింబిస్తాయి.

**కళింగ గాంగ శిల్పం (క్రీ.శ.6-11)**




కళింగగాంగులుగా పేరుగాంచిన తూర్పుగాంగులు, క్రీ.శ. 6వ శతాబ్ది నుంచి 11వ శతాబ్ధందాకా ముఖ లింగం రాజధానిగా పాలించారు. వీరు

ముఖలింగం, దీర్ఘాసి, గలవెల్లి, అరసవెల్లి, జతి మొదలైనచోట్ల అనేక దేవాలయాలను నిర్మించి, వాస్తు-శిల్పకళకు ఎనలేని సేవ చేశారు. దేవాలయ అధిష్ఠానం, పాదవర్గం, ప్రస్తరం, ద్వారశాఖలు, కప్పు, ప్రవేశద్వార తోరణాలపై, దేవతామూర్తులను ఎర్ర ఇసుక-ఖొండలైటు రాతిపై చక్కటి రూపలావణ్యంతో తమదైన రీతిలో చెక్కారు. అప్పటి వరకూ తెలుగు నేలపై రూపుదిద్దుకొన్న బాదామీ చాళుక్య, తూర్పుచాళుక్య పల్లవ శైలుల కంటే భిన్నంగా ఉన్న ఈ శిల్పాలు ఓడిషా శిల్పానికి దగ్గరగా ఉన్నాయి. తూర్పుగాంగుల శిల్ప శైలిని సరిగా అర్థం చేసుకోవాలంటే ముఖలింగంలోని ఒక్కామధూకేశ్వర దేవాలయంపైనున్న శివ, అజేకపాద, ఉమామహేశ్వర, నటరాజ, అంధకాసుర, కళ్యాణ సుందరమూర్తి, లకులీశ, గణేశ, కార్తికేయ, హరిహర, ఉగ్రనరసింహ, వరాహ, దుర్గ, సూర్య, సప్తమాతృక, నవగ్రహాలు, గణాలు, రుషులు, మైధున శిల్పాలు, సాలభంజికలు, భక్తులు, ఇంకా ఏనుగుల, గుర్రాల వరుసలను క్షుణ్ణంగా పరిశీలించాల్సిందే.

విశాలమైన రొమ్ము భాగంతో, పొడవాటి శరీరం, గుండ్రటి కనుబొమ్మలు, కొంచెం పొడుచుకొచ్చిన కళ్లు, చక్కటిముక్కు, వెడల్పాటి పెదవులు, నాజూకైన గెడ్డం, వళ్లంతా ఆభరణాలతో నున్న కళింగగాంగ శిల్పం ప్రత్యేకతను సంతరించుకొంది. తరువాత తూర్పుగాంగరాజుల శిల్పాన్ని ఓడిషాలోని, పూరి, భువనేశ్వర్, కోణార్కలో మనరాష్ట్రంలోని సింహాచలం దేవాలయంలోనూ చూడవచ్చు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలలో మాత్రమే తూర్పుగాంగుల దేవాలయాలు, శిల్పాలున్నాయి.


**రాష్ట్రకూట శిల్పం (క్రీ.శ. 7-10 శతాబ్దాలు)**

బాదామీచాళుక్యుల తరువాత, మాన్యఖేట్‌ను రాజధానిగా పాలించిన రాష్ట్రకూటులు, పశ్చిమాంధ్ర (తెలంగాణా)ను, రాయలసీమలో ఉత్తరభాగాన్ని వశం చేసుకొన్నారు. వారు కర్నూలు జిల్లా రూపాల సంగమేశ్వరం, వెల్దుర్తి, బండతాండ్రపాడు, పాత కోటలలోనూ, కడపజిల్లా జ్యోతివద్దనూ, మహబూబ్‌నగర్ జిల్లా అలంపూరు, సోమశిల,



*నటరాజు, పాటకోట (కర్నూలు మ్యూజియం)*

మల్లేశ్వరం, మియాపురంలలోనూ దేవాలయాలను నిర్మించారు. మహారాష్ట్రంలోని ఎల్లోరాలోని కైలాసనాథాలయం రాతిని తొలిచి మలచిన అత్యద్భుత దేవాలయం. వీరి ఆలయ నిర్మాణంలో పల్లవశైలిని, శిల్పాల కల్పనలో చాళుక్య శైలిని అనుకరించినా, తరువాత తమదైన శైలికి ప్రాధాన్యతనిచ్చారు. రూపాల సంగమేశ్వరాలయం గోడలపైనున్న గంగ, యమున, శివ-నటరాజ, మన్మధ, త్రిపురాంతక, హరిహర, దిక్పాల, సదాశివ శిల్పాలు, పాతకోటలోని నటరాజ, కుబేర శిల్పాలు (ప్రస్తుతం ఇవి



కుబేర శిల్పం, పాటకోట
(కర్నూలు మ్యూజియం)

రెండూ కర్నూలు మ్యూజియంలో ఉన్నాయి. మియాపూర్‌లోని మాతృదేవత, శిల్పాలు రాష్ట్రకూట శిల్పానికి ఉదాహరణలు.

**రేనాటి చోళ శిల్పం (క్రీ.శ.6-10 శతాబ్దాలు)**

కడప జిల్లా పొత్తపి నుంచి పాలించిన తెలుగు చోళులను పొత్తపి చోళులంటారు. వీరు అత్తిరాల, పెదముడియం, ముత్తకూరు, రామేశ్వరం, చిలమకూరు, పుష్పగిరిలలో ఆలయాలను నిర్మించటమేకాక ద్వారబంధాలపైన, స్తంభాలు, గోడలపైనవాటిని శిల్పాలతో అలంకరించారు. చిలమకూరులోని అగస్త్యేశ్వరస్వామి దేవాలయంపై నున్న దక్షిణామూర్తి, మన్మధ, పురాణగాధాశిల్పాలు, శంఖినీ, పద్మిని శిల్పాలు కొంతవరకు తొండైమండల శిల్పాన్ని పోలి ఉన్నాయి.

**కందూరు చోడుల శిల్పం (క్రీ.శ. 11 - 13 శతాబ్దాలు)**

కర్నూలు, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలను పాలించిన కందూరు చోళులు కళ్యాణీ చాళుక్య సాంప్రదాయంలోనే శిల్పాలు చెక్కారు. మహబూబ్‌నగర్ జిల్లా మల్లేశ్వరం, నల్లగొండ జిల్లా పానగల్లు దేవాలయాల వద్ద గల శిల్పం కందూరు చోళ శిల్పానికి ఉదాహరణ. పానగల్లులోని పచ్చల సోమేశ్వరాలయం గోడలు,

స్తంభాలమీదున్న రామాయణ, భాగవత దృశ్యాలు దిక్పాల, నటరాజ, ఉమామహేశ్వర శిల్పాలు మహబూబ్‌నగర్ జిల్లా ఆవంచలోని 25 అడుగుల ఎత్తున్న గణేశ విగ్రహం కందూరు చోళ శిల్పశైలికి అద్దం పడుతున్నాయి.

### నోలంబ శిల్పం (క్రీ.శ. 8-11 శతాబ్దాలు)

ప్రస్తుత అనంతపూర్ - కర్నూలు జిల్లాలున్న ప్రాంతాన్ని (నోలంబవాడి) నోలంబులు లేక నొలంబ పల్లవులని పిలువబడిన రాజవంశీకులు హేమావతిని రాజధానిగా పాలించారు. వీరు పల్లవ వాస్తు శైలికి దగ్గరగా హేమావతి, శివారం, పేలుబండ (అనంతపూర్), వెల్దుర్తి (కర్నూలు) లలో దేవాలయాలను నిర్మించారు. హేమావతిలో వీరు నిర్మించిన దొడ్డేశ్వరాలయం వాస్తు, శిల్పరీత్యా ఎంతో పేరుగాంచింది. ఈ దేవాలయం వద్దగల గంగ, యమున, విష్ణు, కార్తికేయ, ఉమామహేశ్వర శిల్పాలు నొలంబశైలికి ప్రతిబింబాలు. చెన్నై మ్యూజియంలో నున్న ఉమామహేశ్వర, దేవి విగ్రహాలు ఎంతో అందమైనవి. వీరి శిల్పాలు పల్లవ - రాష్ట్రకూట శైలుల సమ్మిశ్రమంగా ఉంటాయి.


### కళ్యాణ చాళుక్య శిల్పం (క్రీ.శ. 10-12 శతాబ్దాలు)

రాష్ట్రకూటుల తరువాత తెలంగాణా ప్రాంతాన్ని పాలించిన కళ్యాణ చాళుక్యులు, కన్నడ శిల్ప రీతుల్ని ప్రవేశపెట్టారు. మెదక్ జిల్లాలోని నందికంది, నల్లగొండ జిల్లా కొలనుపాక దేవాలయాలు, కొలనుపాక, అలంపూరు, మహబూబ్‌నగర్, కర్నూలు మ్యూజియాల్లోని శిల్పాలు చక్కటి భంగిమతో అంగసౌష్టవంతో వున్నాయి. నంది దేవాలయం తోరణం మీది గజలక్ష్మి, రంగమండప స్తంభాలు,కప్పులపైని శిల్పం, మహబూబ్‌నగర్ జిల్లా గంగాపురంలోని చెన్నకేశవాలయ గోడలు, ద్వారాలపైనున్న శిల్పాలు చూడదగ్గవి. శైవ, వైష్ణవ, శాక్త, గాణాపత్య శాఖలు విజృంభించిన ఈ కాలంలో ఎన్నో అపురూప శిల్పాలు చెక్కబడినాయి.


### కాకతీయ శిల్పం (క్రీ.శ.11-14 శతాబ్దాలు)

శాతవాహనుల తరువాత, తెలుగు నేలను ఒక్కతాటిపైకి తెచ్చిన కాకతీయులు తొలుత హనుమకొండ, తరువాత వరంగల్లులను రాజధానులుగా జేసుకొని పాలించారు. రుద్రదేవుడు హనుమకొండలోని వేయి స్థంభాల గుడి (రుద్రేశ్వర)ని, గణపతిదేవుడు వరంగల్లులో శంభునిగుడి, కీర్తి తోరణాలు, రామప్పదేవాలయం, గణపూర్, జాకారం, రామానుజపురం, మంధని లాంటి ప్రసిద్ధ దేవాలయాలను నిర్మించారు. కళ్యాణీ చాళు

క్యుల సామంతులుగానున్న కాకతీయులు తొలుత, ఆలయ నిర్మాణంలోనూ, శిల్పాలను చెక్కడంలోనూ వారినే అనుకరించినా గణపతిదేవుని కాలం నుంచి విలక్షణ వాస్తు శైలి, శిల్పాలతో తెలుగు శిల్పకళలో తమకంటూ ఒక స్థానాన్ని ఏర్పాటు చేసుకొన్నారు. వేయి స్థంభాల గుడి త్రికూటాలయ ద్వారాలపై, శాఖలపై గల నటరాజ, నృత్యనరసింహ, సూర్య విగ్రహాలు, రామప్ప దేవాలయ స్థంభాలు, ద్వారాలు, దూలాలు, కప్పులపై నున్న శిల్పాలు, స్థంభానికీ, కప్పులకు మధ్యనున్న మదనిక, నాగిని శిల్పాలు, నందిమండపంలోని నంది గణపూర్‌లో ఇటీవల బయల్పడిన ద్వారపాల, విష్ణు, శివ విగ్రహాలు, కాకతీయ శిల్పుల పనితనానికి మచ్చుతునకలు. రామప్ప దేవాలయ గోడలపై చెక్కిన నాట్యగత్తెలు, వాద్యగాండ్రు, వేటలో నిమగ్నమైన అందగత్తెలు, జైన తీర్థంకరులు, భిక్షాటనమూర్తి, మకరతోరణాలు, ఆంధ్ర నాట్యానికి పేరిణి



రామప్ప దేవాలయం దూలంపై శిల్పం



స్థంభశిల్పం




ద్వార శాఖ శిల్పం


# కాకతీయ శిల్పాలు




కక్షాసన శిల్పం



స్థంభంపై నృత్య విన్యాసం



రామప్ప, కక్షాసనం పైనున్న సూర్య శిల్పం



సంభ శిల్పం (రామప్ప శిల్పాలు)



గణపతి శిల్పం (వెనుకవైపు)



కాకతీయ నాగినీ శిల్పాలు





నాగినీ శిల్పాలు



వేటగత్తె శిల్పం

శివతాండవానికీ, ఆలయ నృత్యాలకు అద్దంపడుతున్న అర్థమండప ద్వారశిల్పం రమణీయం, అద్వితీయం!

**విజయనగర శిల్పం (క్రీ.శ. 14-16 శతాబ్దాలు)**

క్రీ.శ. 14-16 శతాబ్దాల మధ్య విజయనగర సామ్రాజ్యంలో భాగమైన తెలుగునేలపై ఎన్నో విశాలమైన దేవాలయ సముదాయాలు, ఎత్తైన గోపురాలు నిర్మించబడినాయి. ఆలయగోపుర గోడలపైన, స్థంభాలు, ద్వారబంధాలు, కప్పులపైన, విడిగానూ ఎన్నో శిల్పాలను చెక్కించారు. వీరి కాలంలో తిరుమల, తిరుపతి, కాళహస్తి, నాగులాపురం, నారాయణవనం, కదిరి, మార్కాపురం, తాడిపత్రి, అహోబలం, పుష్పగిరి, లేపాక్షి మొదలైన దేవాలయాలు నిర్మించి అపారమైన వాస్తు శిల్పసేవ చేశారు.

చోళుల సంప్రదాయానికి, కొద్దిగా మెరుగులు దిద్ది పొడవైన శిల్పాలను చెక్కించారు. లేపాక్షిలోని వీరభద్రాలయం విజయనగర శిల్పానికి పతాక సన్నివేశం. దేవాలయ స్థంభాలపై తుంబురుడు, దత్తాత్రేయుడు, బ్రహ్మ, నారద, రంభ, పద్మిని, నటరాజ, నాగలింగం, గణేశ శిల్పాలు, ఊరు బయటున్న పెద్దనంది విజయనగర శిల్పానికి చక్కటి ఉదాహరణ.

విజయనగర రాజుల తరువాత సంస్థానాధీశులు కూడా దాదాపు అదే వరవడిలో శిల్పాలను చెక్కించారు. మహబూబ్‌నగర్ జిల్లా జటప్రోలు, నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి దేవాలయ శిల్పం ఇందుకు ఉదాహరణ.



*బసవణ్ణ (నంది) లేపాక్షి*

# 14 తెలుగువారి చేతి కళలు

## Handicrafts of the Telugu People

అపారమైన సాంస్కృతిక వారసత్వాన్ని అందిపుచ్చుకొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేతికళలు, కళాకృతులు కూడా వారసత్వ సంపదలే. రాష్ట్రంలోని నలుమూలలా ఉత్పత్తవుతున్న వివిధ కళాకృతులు, ఉపాధి కల్పనకు అభివృద్ధికి పరోక్షంగా దోహదం చేస్తున్నాయి. ఏ.పి. హాండిక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, రాష్ట్రంలోని కళలను ప్రోత్సహించి కళాకారుల ఉత్పత్తులకు గిరాకీతోపాటు తగిన ఆదాయాన్ని చేకూర్చటానికి లేపాక్షి ఎంపోరియం ద్వారా కృషి చేస్తుంది. వివిధ కళాకృతుల ఉత్పత్తిలో కొత్తగా వస్తున్న సాంకేతిక మార్పులకనుగుణంగా పనిముట్ల సరఫరా, ముడిపదార్థాల సేకరణ, ఇంకా డిజైనింగ్ వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంచుకోవటంలో శిక్షణ నిస్తూ కళాకారుల పురోభివృద్ధికి పాటు పడుతూ, అంతరించే కళలకు జీవం పోస్తుంది.

తెలుగువారి హస్తకళా ప్రావీణ్యం పెంబర్తి షీట్ మెటల్, బీద్రీవేర్, హైదరాబాద్ పెరల్స్, కొండపల్లి, ఏటికొప్పాక, నిర్మల్ కొయ్యబొమ్మలు, డోక్రా లోహపు కళ, నిర్మల్, చేర్యాల, కాళహస్తి, పెయింటింగ్స్, బంజారా నీడిల్ క్రాఫ్ట్, మాధవమాల ఉడ్ కార్వింగ్స్, నిర్మల్ ఫర్నిచర్, లెదర్ లాంప్ షెడ్స్, నర్సాపురం లేస్ వర్క్, కళాత్మక నూలు, సిల్కు వస్త్రాలు, పోచంపల్లి, పుట్టపాక ఇకత్ డిజైన్లు, తిరుపతి, దుర్గి శిల్పాలు హైదరాబాదు పెరల్స్ ఇలా ఎన్నో రకాల చేతి కళాకృతులు చేరి వున్నాయి.

**నిర్మల్ ఆర్ట్‌వేర్:**

ఆదిలాబాద్ జిల్లాలోని 'నిర్మల్'లో ప్రారంభమైన ఈ రకం ఆర్ట్‌వేర్, కొయ్యపలకలపైన వివిధ రంగులతో అనేక డిజైన్లను, పోర్ట్రైట్‌లనూ, పౌరాణిక, సాంఘిక దృశ్యాలను, ఆకులు, తీగలు, పువ్వులూ, ఇతర డిజైన్లను కళాత్మకంగా


చిత్రిస్తారు. 'నకాషీ' అని పిలువబడే చిత్రకారులు ఈ పెయింటింగ్‌లను మొఘల్ కాలం నుంచి వేనన్నా, తరువాత ఖుతుబ్‌షాహీ, అసఫ్ జాహీల ఆదరణను కూడా పొందారు.



ఈ నిర్మల్ కళాకారులు పెయింటింగ్‌లను సృష్టించటంతో పాటు తేలికపాటి కొయ్యతో ఇంటి పనిముట్లు, రాజస్థానీ, ఫ్రెంచి శైలితో ఉండే ఫర్నిచర్, సోఫాసెట్లు, పార్టిషన్ స్క్రీన్లు, రాకింగ్ చెర్లు, ట్రాలీలు, దీవాన్ మంచాలు, అలంకరణ వస్తువులైన ఫ్లవర్ వేజ్‌లూ, లాంప్ షేడ్‌లూ, ట్రేలు, సిగార్ బాక్సులను కళాత్మకంగా ఉత్పత్తి చేస్తారు. ఫర్నిచర్ పైన కూడా తమదైన శైలిలో నిర్మల్ పెయింటింగ్‌లను చిత్రిస్తారు. ప్రజాదరణ పొందిన పెయింటింగుల్లో ఏక్‌తార వాయిస్తున్న యువతి, డ్రమ్మర్, కమల్ డ్యాన్సర్, శకుంతల, యశోధర, బుద్ధుడు, మహామాయ, పెళ్లిజంట, ఓల్డ్ మ్యాన్, గిరిజన యువతి, నాట్య గణపతి, పద్మావతీ వెంకటేశ్వరులు, హిమాలయ పక్షులు, ఫర్నిచర్‌లో గాజుల పెట్టెలు, సోపాసెట్లు, డ్రెస్సింగ్ టేబుల్స్ మొదలైన వాటిని స్థానికులే కాక దేశీ, విదేశీయులు కూడా కొనుక్కోటానికి తహతహలాడతారు.

**సిద్ధిపేట వాల్ హేంగింగ్స్:**


మెదక్ జిల్లా సిద్ధిపేట బాతిక్ పెయింటింగ్ శైలికి ప్రసిద్ధి. ప్రముఖ చిత్రకారులు కాపురాజయ్య, యాసర్ల బాలయ్య ఈ శైలికి అంతర్జాతీయ గుర్తింపుతెచ్చారు. గోడలకు వేలాడదీసుకొని గానీ, ఫ్రేముల్లో బిగించిగానీ అలంకరించుకొనే పెయింటింగుల్లో వివిధ డిజైన్లు, సీనరీలు, దేవతామూర్తులు చోటు చేసుకుంటాయి. ఇంకా చీరలు, చేతిరుమాళ్లు తయారయ్యే ఈ శైలిలో రంగులు, మైనం ప్రధాన పాత్ర పోషిస్తాయి.



### కొయ్య బొమ్మలు/ఆట వస్తువులు

తేలికపాటి తెల్లపొనికి కర్రతో పిల్లలకు ఆట వస్తువులు, వివిధ బొమ్మలు తయారుచేసి వాటికి వివిధ రకాల రంగులద్ది ఆకర్షణీయంగా తీర్చిదిద్దటం కళకాక మరేమౌతుంది. పిల్లల దగ్గర్నించి, వృద్ధుల దాకా అందర్నీ ఆకర్షించే ఈ కొయ్యబొమ్మలను బొమ్మల కొలువులోనే కాక డ్రాయింగ్ రూం షోకేసుల్లో కూడా అలంకరిస్తూంటారు. తరతరాలుగా వస్తున్న ఈ బొమ్మల తయారీలో ఇప్పటికీ నిర్మల్, ఏటికొప్పాక, కొండపల్లి గ్రామాల్లో దాదాపు 200 మంది కళాకారులు పాల్గొంటున్నారు. తండ్రి లేక గురువు దగ్గర చిన్నప్పట్నించే నేర్చుకొనే ఈ కళ ఇప్పుడిప్పుడే మళ్లీ ఆదరణకు నోచుకొంటుంది. ఎక్కువగా అమ్ముడుబోయే కొయ్య బొమ్మల్లో, కూరగాయలు, పండ్లు, జంతువులు, ఏనుగుపై అంబారీ, గ్రామీణ వృత్తిదార్లు, లక్కతో పెయింటైన పక్షుల బొమ్మలు, గోపికలు-కృష్ణుడు సెట్, పేపర్ కట్టర్‌లూ ముఖ్యమైనవి. ఆదిలాబాద్ జిల్లా నిర్మల్, విశాఖపట్నంజిల్లా ఏటికొప్పాక, కృష్ణాజిల్లా కొండపల్లి కొయ్యబొమ్మల ఉత్పత్తిలో పేరుగాంచాయి.

### వుడ్ కార్వింగ్స్



కొయ్యతో శిల్పాలు చెక్కే ప్రాచీన కళకు చిత్తూరు జిల్లాలోని తిరుపతి, తిరుచానూరు, శ్రీకాళహస్తి, మాధవమాల, కడప జిల్లాలోని శెట్టిగూడ ప్రసిద్ధి. ప్రస్తుతం చిత్తూరుజిల్లా మాధవమాలలో మాత్రమే దాదాపు 250 కుటుంబాలు ఈ కళను కొనసాగిస్తున్నాయి. తలుపులు, ద్వారబంధాలపైన, గోడలకు వేలాడదీసుకునే పానెల్స్, పౌరాణిక గాథలు, యాళి, సింహం, వేణుగోపాల, దశావతారాలు, అష్టలక్ష్మి, గణేశ, సరస్వతి, గజలక్ష్మి మొదలైన బొమ్మలు, రథాలు, టేబుల్లు, అలంకరణ వస్తువులూ వివిధ కర్రలపై ఎంతో కళాత్మకంగా తయారుచేస్తున్నారు. నల్లగొండజిల్లా భువనగిరిలో టేకు, ఎర్రచందనం కర్రతో శిల్పంతో చెక్కే అలంకరణ వస్తు సామగ్రిని తయారుచేస్తున్నారు. బొబ్బిలి, విజయనగరం, పిఠాపురం ప్రాంతాల్లో పనస కర్రతో వీణలు, ఇతర వాద్య పరికరాలు కళాత్మకంగా చేసే దారుశిల్పులున్నారు.

### భోనగిరి కొయ్యశిల్పం

వట్టికొయ్యను సైతం వొయ్యారాలొలికించే శిల్పాలుగా తీర్చిదిద్దే దారు (కొయ్య) శిల్పులు నల్లగొండ జిల్లా భోనగిరిలో ఉన్నారు. నామోజు సత్యాచారి నేతృత్వంలో వుడ్ కార్వింగ్స్‌ను అందిస్తున్నారు. ప్రత్యేక తరహాలో రూపుదిద్దుకొనే కొయ్య శిల్పాలు, అలంకార ఫర్నీచర్‌లకు స్థానిక మార్కెట్ తక్కువే అయినా ముంబై ప్రాంతంలో బాగా గిరాకీ ఉంది.

### ఏటికొప్పాక కొయ్యబొమ్మలు


తేలికపాటి అంకుడుకొయ్యతో గాజులు, కుంకుమభరిణెలు, పిల్లలాడుకొనే బొమ్మలు, లక్కపిడతలు చిన్నసైజు వంటసామాగ్రిని ఏటికొప్పాక (విశాఖ జిల్లా)లో తయారుచేస్తారు. ఏమాత్రం రంగేయని ఈ బొమ్మల్లో గొల్లభామ, జడపిన్నులు, కొవ్వొత్తి స్టాండులు, ఉప్పు నిల్వ ఉంచుకొనే చిప్పలు, మసాలా పెట్టెలు, గిన్నెలు ఉంటాయి.



బెంగుళూరులోని కేంద్ర హస్తకళల బోర్డు, హైదరాబాద్‌లోని కళాంజలి, లేపాక్షి, ఎంపోరియాలందించే డిజైన్లతోపాటు కొంత అడ్వాన్సు తీసుకొని కళాకారులు వివిధ కళాకృతులను చెక్కి పంపిస్తుంటారు. శిల్పారామం లాంటి క్రాఫ్ట్ విలేజ్‌లో జరిగే వర్కు షాపులకు కూడా కళాకారులు హాజరై అప్పటికప్పుడు చెక్కుతూ తమ నైపుణ్యాన్ని చూపుతారు.

### రంపపు పొట్టు బొమ్మలు

సృజనాత్మకత ఉండాలే గాని కళాకారుడు దేనిమీదైనా తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు. కొందరు రాతి మీద, మరికొందరు లోహంతోనూ, ఇంకొందరు కొయ్యమీద శిల్పాలను, కళాకృతులను సృష్టిస్తే నెల్లూరు జిల్లా వరిగొండ గ్రామ కళాకారులు రంపపు పొట్టు, జిగురు కలిపి అలవోకగా తీర్చిదిద్దే బొమ్మల్లో



హిందూ పురాణాల్లోని పాత్రలు ఎక్కువగా ఉంటాయి. అలాగే కరీంనగర్ జిల్లా వేములవాడ ప్రాంతంలో తయారయ్యే పేడ బొమ్మలు కూడా గ్రామీణ కళాకారులకు ఉపాధి కల్పిస్తుంది.

**నెల్లూరు తుంగ చాపలు**

అల్లిక పనుల్లో అందెవేసిన పల్లెవాసులు కుట్టే ఈతచాపలు అంత ప్రజాదరణ పొందకపోయినా, నెల్లూరు, ప్రకాశం జిల్లాల సముద్రతీరాల్లో పెరిగే ఒకరకమైన సన్నటి తుంగతో అల్లేచాపల్ని కొనటానికి స్త్రీలు ముచ్చట పడిపోతుంటారు. తీరిక వేళల్లో ముచ్చట్లు చెప్పుకొనేప్పుడు, విందు వినోదాలు, పండుగ, పబ్బాల సందర్భంగా ఇలాంటి చాపల్ని ఎక్కువగా వాడుతుంటారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణాలు, నగరాల్లో సైతం ఇళ్లల్లో చోటు సంపాదించుకున్న ఈ తుంగ చాపలపై రంగులు అద్ది వివిధ డిజైన్లతో ఆకర్షణీయంగా చేయటంలో నెల్లూరు జిల్లా పేరుగాంచింది. చిన్న చిన్న పూలకుండీలు, అలంకరణ వస్తువులు పెట్టటానికీ, గోడకు వేలాడదీసుకొనే పట్టల్లాంటి చిరు చాపలకు మధ్యతరగతి నుంచి విలాసవంతుల వరకు మంచి గిరాకీ ఉంది.



**లెదర్ లాంప్ షేడ్స్**

బహుళ ప్రజాదరణ పొందిన లాంప్ షేడ్‌లను తయారుచేస్తూ కాలం వెళ్ళదీస్తున్న కళాకారులు ఇపుడిపుడే మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నారు. నిర్మల్ లాంప్ స్టాండ్‌లపైన హంసలు, నెమళ్లు లాంటి పక్షులతో కూడిన డిజైన్లను తోలు మీద కత్తిరించి, రంగులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు.


**తోలుబొమ్మలు**

మరార్వాడా నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని నిమ్మలగుంట గ్రామానికి వలస వచ్చిన 100 మంది కళాకారులు తోలుబొమ్మల తయారీలో నిమగ్నమై, రామాయణ, మహాభారత, ఇతర జానపదగాథల ప్రదర్శన కవసరమైన తోలు బొమ్మలను వివిధ సైజుల్లో ఉత్పత్తి చేస్తున్నారు. ఒకప్పుడు వినోద కార్యక్రమాలనందించిన ఈ



తోలు బొమ్మలాటకు రాజాదరణ కరువు కాగా, కళాకారులు జీవనోపాధికి మామూలు ప్రజలు కూడా ఇష్టపడే అందమైన డిజైన్లను తోలుపై చిత్రించి, కత్తిరించి ఈ కళను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి అందుతున్న నామమాత్రపు ప్రోత్సాహానికి కళాపిపాసులైన ప్రజల తోడ్పాటు వీరికి ఊపిరిపోస్తుంది. అనంతపురం జిల్లా నిమ్మలకుంట, నెల్లూరు జిల్లాలోని డిసీపల్లి, తూర్పుగోదావరి జిల్లా మాధవపట్నంలలో ఇప్పటికీ ఉత్పత్తి అవుతున్నాయి.

**నర్సాపురం లేస్ వర్కు**




పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలో, పేదరికంతో బాధపడుతున్న కొద్దిమంది స్త్రీలకు జీవనోపాధి కల్పించటానికి 19వ శతాబ్దంలో స్కాట్లండుకు చెందిన మక్రో దంపతులు నేర్పిన చేతిపనిగా ప్రారంభమైన లేస్ వర్క్, రానురాను జనాదరణ పొంది "నర్సాపురం లేస్ వర్క్"గా గుర్తింపు పొందింది. ప్రస్తుతం నర్సాపురం, పాలకొల్లు, రాజోలు, రాజమండ్రి, పరిసర ప్రాంతాల్లో దాదాపు లక్షన్నరమంది స్త్రీలకు జీవనోపాధిని కల్పిస్తుంది.

కళాత్మకమైన ఈ లేస్ వర్క్‌లో రూపుదిద్దుకొనే బ్రష్ హోల్డర్స్, హాండిల్ కవర్లు, పర్సులు, గ్లోవ్స్, వెయిస్ట్‌కోట్, ఫ్రాక్‌లు, టీపాయ్ కవర్లు, టేబుల్‌మేట్లు, గుండ్రటి బెడ్ కవర్లకు ఎక్కువగా గిరాకీ ఉంటుంది. విదేశీ పర్యాటకులు ఎక్కువగా ఇష్టపడే ఈ అరుదైన కళాత్మక డిజైన్లను వీలైన నన్ని పర్యాటక కేంద్రాలవద్ద అమ్మకాలకు ఉంచితే కళాకారులకు మరింత జీవనోపాధి లభిస్తుంది.

**వరంగల్ జంపఖానాలు**

వరంగల్ తివాచీ పరిశ్రమ దెబ్బతినటంతో చేతితో నేసే జంపఖానాల




పరిశ్రమ ఊపందుకొని వరంగల్ పరిసరాల్లో ఉత్పత్తిని కేంద్రీకరించింది. టై అండ్ డై, జక్వార్డ్, ఇంటర్‌లాక్ పద్ధతిలో వేసే వీటికి దేశ, విదేశాల్లో ఇటీవలివరకూ గిరాకీ ఉండేది. కస్టమర్లు ఎక్కువగా ఇష్టపడే డిజైన్లలో లహరి, సీతమ్మజడ, మొగ్గ, డైమండ్‌ఫిష్, కమల్,

దిల్‌ఖుష్‌లు ముఖ్యమైనవి. కలంకారీ ప్రింట్లతో తయారవుతున్న జంపఖానాలకు ఇటీవల బాగా గిరాకీ పెరిగింది.

**టై అండ్ డై-ఇకత్ వస్త్రకళ**

ముందుగా రూపొందించుకొన్న డిజైన్ల ప్రకారం, నిలువు, అడ్డం దారాలకు టై అండ్ డై పద్ధతిలో రంగులద్ది, ఆ తరువాత ఒక్కో పోగునే నేసే విధానాన్ని "ఇకత్" అంటారు. ప్రతిభను బట్టి డిజైన్లు వచ్చే ఈ వస్త్రకళకు ఎప్పుడూ గిరాకీ ఉంటూనే ఉంటుంది. నల్లగొండ జిల్లా పుట్టపాక, పోచంపల్లి, కొయ్యలగూడెంలలో ఎన్నో కుటుంబాలు ఆశ్రయించిన ఈ కళ దేశ, విదేశాల్లో ఆదరింపబడింది. వివిధ రకాల రంగులు, డిజైన్లతో ఉండే ఈ వస్త్ర కళలో ఫర్నిషింగ్ మెటీరియల్, బెడ్‌స్ప్రెడ్స్, చీరలు, ఇతర డ్రెస్ మెటీరియల్స్ అందుబాటులో ఉంటాయి. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన ఈ ఇకత్ వస్త్రకళాకారుల నైపుణ్యానికి గుర్తుగా ఎన్నో అవార్డులు కూడా దక్కాయి. పుట్టపాకలో గజం రాములు అనే కళాకారుడు సృజనాత్మకతో నేసే వస్త్రాలు ఇప్పటి ఫ్యాషన్ పోటీలను కూడా తట్టుకొంటున్నాయి.



పోచం పల్లి


నూలును నూనెలో నానబెట్టి, ఆరేసి, కావల్సినట్లు, దారాన్ని తీర్చిదిద్ది, వెజిటబుల్ కలర్స్‌ను దారానికి అద్దిన తరువాత నేసే "తేలియా" రుమాళ్లకు అరబ్ దేశాల్లో మంచి గిరాకీ ఉంది. నూలును నూనెలో నానెయ్యటం వల్ల "తేలియా" అనే పేరొచ్చింది. వివిధ డిజైన్లతో నేసిన ప్రతిదాన్నీ సొంతం చేసుకోవాలనుకొనేట్లుండే 'ఇకత్', 'తేలియా' వస్త్రాలను, రుమాళ్లను రాష్ట్రంలోనేకాక దేశంలోని ఇతర ప్రాంతాలవారు కూడా అదరిస్తున్నారు.

**కలంకారీ వస్త్రకళ**

వెజిటబుల్ డైలతో, కలాన్ని ఉపయోగించి బట్టలపై డిజైన్లను వేయటాన్ని "కలంకారీ" అంటారు. చిత్తూరు జిల్లా కాళహస్తిలో ప్రారంభమైన ఈ వస్త్ర కళ


మొదట ఆలయధ్వజాలను అలంకరించటానికి ఎక్కువగా వాడేవాళ్ళు

రానురాను బెడ్‌షీట్లు, లుంగీలు, ఫర్నీషింగ్ క్లాత్, డెకరేటివ్ వాల్ పానెలింగ్‌కూ, డోర్ కర్టెన్లకూ ఎక్కువగా వినియోగిస్తున్నారు.



కళాహస్తి కలంకారీ

ఎరుపు, పసుపు, ఊదా, ఇండిగో, రంగులను ఎక్కువగా వాడే ఈ పద్ధతిలో తయారయ్యే వస్త్రకళలో, చివరివరకూ దాదాపు 15 దశల పనులు ఇమిడి ఉన్నాయి. సన్నని కొయ్యపెన్నుతో కావలసిన డిజైన్ను అవుట్‌లైన్ వేసుకొన్న తరువాత అవసరమైన రంగులను నింపుకుంటూ పూర్తిచేసే ఈ పద్ధతిలో పురాణగాధలు, రామాయణ, భారత, భాగవత గాధలు గజలక్ష్మి, అష్టలక్ష్మి, దశావతారాలను ఎక్కువగా చిత్రిస్తుంటారు. చీరెలు, ఇంకా ఇంట్లో వాడుకొనే బట్టలపై కూడా కలంకారీని వేయటం ఈ రోజుల్లో మామూలైంది. ఈ పద్ధతి నుంచి పుట్టిన మరో కలంకారీ విధానాన్ని మచిలీపట్నంలో బుక్ బైండింగ్ ప్రక్రియలో కూడా వాడుతున్నారు. టేబుల్ క్లాత్‌లు, బెడ్‌షీట్లు, డ్రెస్ మెటీరియల్స్‌పై సంప్రదాయ డిజైన్లను అద్భుతగా గిరాకీ పెంచుకొంటున్నారు.



**బంజారా ఎంబ్రాయిడరీ**

రాష్ట్రంలోని సుగాలీలు, లంబాడీలు కొనసాగిస్తున్న మరో వస్త్రకళను "బంజారా ఎంబ్రాయిడరీ" అంటారు. హైదరాబాదు, చిత్తూరు జిల్లాల్లో ప్రధానంగా స్త్రీలు చేపడుతున్న ఈ కళలో బట్టలపై అద్దాలనమర్చి వాటి చుట్టూ రకరకాల డిజైన్లను ఎంబ్రాయిడరీ చేస్తారు. కళాత్మకంగా ఉండే ఈ ఎంబ్రాయిడరీ కళలో రంగులు, దారాలదే ప్రత్యేకత. డ్రెస్ మెటీరియల్స్, బ్యాగులు, కుషన్ కవర్లు, బెడ్ కవర్లు, టేబుల్ క్లాత్‌లు, మ్యాగజైన్ హోల్డర్‌లు, బెల్టులు, వెయిస్ట్‌కోట్‌లూ, వాల్

హేంగింగులూ ఆకర్షణీయంగా ఉంటాయి. బంజారా బెడ్‌కవర్లు, నిర్మల్ మంచాలపై పరిస్తే అందంగానే కాకుండా హుందాగా కూడా ఉంటాయి.

### సిరిసిల్ల కాటన్స్


ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కరీంనగర్ జిల్లా సిరిసిల్ల చేనేతలకు ఇటీవల ఆదరణ కరువైంది. కళాకారులు తమ తమ వృత్తులను వదలి కూలీలుగా బ్రతుకు వెల్లదీస్తున్న సందర్భంలో హైదరాబాదులోని నిఫ్ట విద్యార్థులు సిరిసిల్ల చేనేతలకు తమ సృజనాత్మకతను జోడించి, కొత్త కొత్త డిజైన్లను సృష్టించి మార్కెట్‌లో ప్రవేశపెట్టారు. సిరిసిల్ల మగ్గాలపై నేసిన కోరాఫాబ్రిక్స్‌కు బ్లీచింగ్, ప్రాసెసింగ్, డ్రైయింగ్ చేసి, బెడ్‌షీట్లు, పిల్లోకవర్లు కుర్తాలు, చుడీదార్లు, బ్యాగ్‌లూ, మెన్స్, విమెన్స్‌వేర్. టేబుల్ సెట్, దివాన్‌సెట్‌లను అందమైన డిజైన్లలో రూపొందిస్తున్నారు. నిఫ్ట్ విద్యార్థులు, పోచంపల్లి, చీరాల కాటన్లు, శ్రీకాకుళం జనపనారల సమ్మేళనంతో అద్భుతమైన డిజైన్లలో కొత్తరకం డ్రెస్‌మెటీరియల్ తయారుచేస్తున్నారు.

### హిమ్రూ చేనేతలు

గోల్కొండను ఆక్రమించిన తరువాత రాజకుటుంబాలతో తరలి వచ్చిన మొఘల్ సుల్తాన్‌లు తమతోపాటు కాశ్మీర్‌లో పుట్టిన హిమ్రూ దుస్తులను కూడ హైదరాబాదుకు తీసుకొచ్చారు. ఔరంగాబాద్ నుంచి తరలి వచ్చిన కళాకారుల వారసులు ఇప్పటికీ హైదరాబాద్‌లో ఈ కళాత్మక బట్టలను నేస్తూనే ఉన్నారు. కాటన్‌బేస్ మీద, సిల్క్ దారాలతో వన్నెలొలికే డిజైన్లతో తయారయే హిమ్రూ శాలువాలు, షత్రంజులను కొనుక్కోవడానికి కళాపిపాసులు మోజు పడతారు. హైదరాబాదులోని చార్మినార్, మదీనా ప్రాంతాల్లో విరివిగా దొరికే ఈ రకం బట్టలకు ప్రజాదరణ విరివిగా ఉంది.

### నకాషీ చిత్రకళ

వరంగల్ జిల్లా చేర్యాలలో బట్టలపైన సహజమైన రంగులతో బొమ్మలువేసే పద్ధతిని "నకాషీ చిత్రా" లంటారు. నక్ష అనగా పటం, బొమ్మ అనే అర్థంలో రంగులతో బొమ్మలవేసే వాళ్లను నకాషీలంటారు. ఏ మాత్రం చదువులేని, తండ్రి, గురువుల దగ్గర చిన్నతనం నుండే నేర్చుకొని కొనసాగించే ఈ చిత్రకళను పట చిత్రకళ అని కూడా అంటారు. ఇటీవలే నగరవాసులకు తెల్సిన ఈ కళ ఇప్పుడిప్పుడే మార్కెట్లోకి ప్రవేశిస్తుంది. జాంబపురాణం,




మదేల్‌పురాణం, గౌడపురాణం లాంటి కుల పురాణాలతో పాటు రామాయణ, భారత, భాగవత కథలను తమదైన శైలిలో స్క్రోల్స్‌గా చిత్రించటం నకాషీ చిత్రకారుల ప్రత్యేకత.



సవర చిత్రకళ

శ్రీకాకుళం జిల్లాలోని సవర తెగలు తమ ఇళ్లగోడలపైన, వంట గదులపైన వేసే ముగ్గులను పోలిన చిత్రాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. చనిపోయిన తమ పూర్వీకులకూ, బ్రతికున్న తమకూ ఈ చిత్రాలే వారధి అని నమ్మే సవరలు, వారి భాషలో వీటిని "ఎడిసుంగ్" అని పిలుస్తారు. మామిడికొత్త, చుక్కల పండుగ అనే రెండు పండుగల సందర్భంగా జంతుబలుల నిచ్చినపుడు మాత్రమే ఈ పెయింటింగ్స్ వేయటం గమనార్హం. ఆ రోజు గోడలకు ఎర్రమట్టి, జాజిరంగులతో అలికి, పూజారి సాయంతో ఇంటి యజమాని బొంగు పుల్లలతో పెయింట్ వేస్తాడు. పెయింటింగ్ పూర్తయిన తరువాత వాటి మీద రక్తం చిందేట్లు జంతువుని బలి ఇస్తాడు. అలాచేస్తే భూతాలనుంచి తమకు, పంటలకూ రక్షణ కలుగుతుందని వారి నమ్మకం. వేసే పెయింటింగులు వేసినవారి జీవితాన్ని ప్రతిబింబించేట్లుంటాయి. ఇదే చిత్రకళను బట్టలపై వెజిటబుల్ రంగులతో వేసి వాల్ హేంగింగులుగా షోరూముల్లో అమ్ముతున్నారు.

బీద్రీవేర్




పర్షియాలో పుట్టి, కర్ణాటక రాష్ట్రంలోని బీదర్, తరువాత హైదరాబాద్ చేరిన ఈ బీద్రీవేర్ 1:16 నిష్పత్తిలో రాగి, జింకుల మిశ్రమ లోహంతో పోతపోసి, తరువాత కావలసిన డిజైన్లను ఉలులతో చెక్కి అందులో బంగారు, వెండి తీగెలను నొక్కుతారు. తరువాత ఆమ్లజనీకరించి గ్రే కలర్ తెచ్చిన పాత్ర వెండి, బంగారు తీగలు పొదిగిన ప్రదేశం తప్ప మిగిలిన భాగం నల్లగా మారుతుంది. దాన్ని సాల్ అమ్మోనియా, బీదరు పాతకోటలోని మట్టితో ట్రీట్ చేసి ఆకర్షణీయంగా తయారుచేస్తారు.

ఫాన్సీ, కళాత్మక అలంకరణ వస్తువులుగా

ఎక్కువగా అమ్ముడుబోయే బీద్రీ కళాకృతుల్లో సిగరెట్ పెట్టెలు, జాడీలు, వేజ్‌లు, కూజాలు, పెట్టెలు, పేపర్ వెయిట్లు, యాష్ ట్రేలు, చిన్న కత్తులు, గుండీలు, చెవిపోగులు, లోలాకులు, ప్లేట్లు, ట్రేలూ, ముఖ్యమైనవి. వివిధ రకాల డిజైన్లలో పూలు, ఆకులు, చెట్లూ, అలంకార శిల్పాన్ని, ఇంకా పూల్‌జాడి, తర్కాషీ, లాలా డిజైన్లను చెక్కటంలో బాగా తర్ఫీదు పొందిన కళాకారులకు ఇప్పటికీ తగిన పారితోషికం లభిస్తుంది. ఇవి అన్ని లేపాక్షి ఎంపోరియాలలోనూ, శిల్పారామం, గన్‌ఫౌండ్రిలలోని ఆర్ట్ షాపుల్లోనూ దొరుకుతున్నాయి.

### డోక్రామెటల్ కాస్టింగ్స్



మిగిలినపోయిన, వృధా ఇత్తడి ముక్కలను కరిగించి, కళాత్మక వస్తువులను పోతపోసే ఓఝా జాతి తెగల గురించి తెలిసినవారు బహుశా చాలా తక్కువ మందే వుంటారు. ఏ మాత్రం చదువూ, సంధ్యాలేని ఈ తెగవారిని గోండు కంచర్లని కూడా అంటారు. తరతరాలుగా కుల పెద్దలు, తల్లిదండ్రుల వద్ద నేర్చుకొన్న కళ, కావల్సిన విధంగా మైనపు బొమ్మలను తయారుచేసుకొని దానిపై మట్టిపూసి ఎండబెడతారు. మైనాన్ని కరగించి, తొలగించిన తరువాత, అదే మూసలో కరగించి సిద్ధంగా వుంచిన ఇత్తడి లోహాన్ని పోసి చల్లబడ్డ తర్వాత మట్టిమూసను పగులగొట్టి వివిధ వస్తువులను తయారుచేసే విధానం చూచిన వారికి ఆశ్చర్యం కలిగించక మానదు. కళాకృతులను సృష్టించటంలో మగ కళాకారులకు ఆడవాళ్లు ఎంతగానో సహకరించటం ఈ తెగల ప్రత్యేకత. దాదాపు రెండొందల ఏళ్ల నుంచి ఇటీవలి కాలం వరకూ పోతపోసి తయారుచేసిన అనేక కళాత్మక డోక్రా వస్తువులను ఆదిలాబాద్‌లోని రవీంద్రశర్మ సొంతంగా నిర్వహిస్తున్న కళాశ్రమంలో చూడొచ్చు. ఆదిలాబాద్, ఊషగాంలలో డోక్రా ఉత్పత్తి కేంద్రాలున్నాయి.


గోండుకంచర్లు ఉత్పత్తి చేసే వివిధ కళారూపాల్లో వేలాడే గంటలు, డోర్ హ్యాండిల్స్, పూజగంటలు, క్యాండిల్ స్టాండులు, దీపాలు, ఇంకా కాళికాదేవిలాంటి దేవతా మూర్తులు ముఖ్యమైనవి. స్థానిక జాతర్లలో విదేశీ పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. ఆ కళాకృతులపై సన్నగా, చిన్నగా ఉండే డిజైన్లు చూడముచ్చటగా ఉంటాయి.

### బిడితి ఇత్తడి పాత్రలు

ఇత్తడి రాగి లోహాలతో బక్కెట్లు, రింగులు, చుట్టకుదుర్లు, ట్రేలు, పెళ్లిసామగ్రి,

గృహోపకరణాలైన ఇతర పాత్ర సామగ్రిని తయారుచేసే కేంద్రం శ్రీకాకుళం జిల్లా బుడితిలో ఉంది. పాత్రలపై నల్లని మెరుపు తీసుకురావటం బుడితి కాంస్యకారులకే సాధ్యం. నల్లరంగు పూసిన తరువాత పాత్రలపై గీతలను గీయటంవల్ల అవి ఆకర్షణీయంగా ఉంటాయి. ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన బుడితి ఇత్తడి సామగ్రిని అందరికి అందుబాటులోకి తేవాల్సిన అవసరముంది. మరచెంబులను తయారుచేయడం బుడితి ప్రత్యేకత.

### పెంబర్తి ఇత్తడి కళ




వరంగల్ జిల్లా పెంబర్తిలో ఇత్తడి రేకులనుపయోగించి కళాత్మక వస్తువులను తయారుచేసే ఓ కళాశ్రమముంది. నిపుణతగల కళాకారులు, రేకుపై కావలసిన డిజైన్లను చెక్కటంలో పేరు తెచ్చుకొన్నారు. ఆలయ శిల్పానికి ఆదరణ కరువైన తరువాత, ఇళ్లు, ఆఫీసులు, హోటళ్లలో అలంకరణ కోసం వివిధ ఫలకాలను వివిధ సైజుల్లో అందిస్తున్నారు. ఇటీవల మెమోంటోలను విగ్రహాలను ఎక్కువగా తయారుచేస్తున్న పెంబర్తి కళకు ఆదరణ పెరిగింది.

### చండూరు ఇత్తడి పాత్రలు



నల్లగొండ జిల్లా చండూరు, నేరడ, విరాట్‌నగర్, కుర్నపల్లి గ్రామాల్లో తరతరాలుగా ఇత్తడితో తళతళలాడే కళాత్మక వస్తువులను తయారుచేస్తున్నారు. నల్లగొండకు 32 కి.మీ.దూరంలో నున్న చండూరులో ఇంట్లో వాడుకొనే కడపలు, బిందెలు, గంగాళాలు, బక్కెట్లు, పళ్లేలు, పూలబుట్టలు, పూజాసామగ్రి, ఇతర అలంకరణ వస్తువులను నగిషీగా ఇత్తడిని పుత్తడిగా తీర్చిదిద్దే కళాకారులు దాదాపు వెయ్యిమంది వరకూ ఉన్నారు. బొమ్మోజు రవీంద్రాచారి, పోలోజు అమరయ్య, దార్చి అచ్చయ్యలు ఇత్తడి వస్తువులను కాంతులీనేట్లు తయారుచేయటంలో సిద్ధహస్తులు. ముందుగా ముడి ఇత్తడిని సేకరించుకొనిగానీ, రేకులను తెచ్చుకొనిగానీ రెండుమూడు దశల్లో కొలిమిలో అతికి, సైనేడుతో శుభ్రంచేసి, వంకర్లు తీసి, మెరుగులు పెట్టే ప్రక్రియలో మగ కళాకారులకు



స్త్రీలు కూడా సహాయపడుతుంటారు. కంచు లోహాన్ని కరిగించి వివిధ వస్తువులను తయారుచేసే వారిని కంచర్ల అని పిలుస్తారు. చందూరులో ఇత్తడి కళాకారులతోపాటు కంచర్ల కూడా గణనీయమైన సంఖ్యలోనే ఉన్నారు. ఇత్తడి, కంచు పాత్రలపై నగిషీ, అలంకరణ, డిజైన్లను వేయటంలో వీరికి మరెవ్వరు సాటిరారు.

**మినియేచర్ ఇత్తడి బొమ్మలు**

ఒక్కో ప్రాంతం ఒక్కో కళకు గుర్తింపు పొందటం సహజం. అయితే రాష్ట్రంలో ఒకే లోహాన్ని వివిధరకాల కళాత్మక వస్తువులను ఉత్పత్తి చేసే అనేక కేంద్రాలున్నాయి. మాకావారిపాలెం దీపపు సెమ్మలకు, బుడితి ఇత్తడి పాత్రలకు, పెంబర్తి మెమెంటోలకు ప్రసిద్ధి చెందితే మినియేచర్ ఇత్తడి బొమ్మలకు చిత్తూరు జిల్లాలోని దోర్నకంబాల, పెరుమాళ్లపల్లి, తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కళాకారులు గుర్తింపు తెచ్చుకొన్నారు. అందరికీ అందుబాటులో ఉండే ధరలకు చిన్నచిన్న దేవతామూర్తుల విగ్రహాలను పెద్ద సంఖ్యలో ఉత్పత్తిచేసి తిరుపతి, కాళహస్తి, అన్నవరం, సింహాచలం, శ్రీశైలం, మహానంది లాంటి దేవస్థానాలలోనేగాక అన్ని ప్రధాన నగరాలలో అందుబాటులో ఉన్నాయి.


**సిల్వర్ ఫిలిగ్రీ వస్తువులు**


సన్నటి వెండి తీగలతో కళాత్మకంగా తీర్చిదిద్దే చేతి కళను 'ఫిలిగ్రీ' అంటారు. కరీంనగర్ ప్రాంతంలో మాత్రమే ఉత్పత్తి చేస్తున్న ఈ రకం వస్తువుల్లో పాన్‌దాన్, అత్తర్ డబ్బాలు స్పూన్లు ముఖ్యమైనవి. సృజనాత్మకత, వృత్తిపట్ల అంకితభావం, ఓపిక అవసరమైన ఇలాంటి ఫిలిగ్రీ వస్తువులు కొంచెం ఖరీదే అయినా ప్రాంతీయ కళను కాపాడుకోవటానికి కళాహృదయులు చేయూతనందించాలి.

**మాకావారిపాలెం దీపాలు**

ఎత్తుగా ఉండే భజనదీపాలు, ఇతర పోత సామగ్రికి మాకావారిపాలెం ప్రసిద్ధి. చిన్న చిన్న ఇత్తడి రేకులను కత్తిరించి కావలసిన డిజైను ప్రకారం జాయింట్ చేస్తూ చేసే 4 నుంచి 6 అడుగుల ఎత్తుండే ఈ దీపాల బరువు 35 కిలోల వరకూ ఉంటుంది. చెట్టు ఆకారంలో కళాత్మకంగా తయారయ్యే ఇత్తడి దీపపు స్థంభంలో

ఒక్కోసారి 25 దీపాలవరకూ ఉంటాయి. కరెంటులేని రోజుల్లో సామూహిక కార్యక్రమాలకు ఎంతగానో ఉపయోగపడిన ఈ దీపాల ఉత్పత్తి ప్రస్తుతం బాగా తగ్గిందనే చెప్పాలి.





**శిల్పకళ**

దాదాపు రెండు వేల సంవత్సరాల చరిత్రగల శిల్పకళకు ఆంధ్రప్రదేశ్‌లో సరైన ఆదరణ ఉందనే చెప్పాలి. ఆలయాల్లో ప్రతిష్టలకోసం, ఆఫీసుల్లో, ఇళ్లల్లో, గార్డెన్స్‌లో డెకరేటివ్‌గా ఉంచుకోవటం కోసం శిల్పాలు తయారవుతున్నాయి. సంప్రదాయబద్ధమైన శిల్పాలు తిరుపతి, తిరుచానూరు, ఆళ్లగడ్డ, తెనాలి, చిలకలూరిపేట, దుర్గి, బేతంచర్ల, రామడుగు మొదలైన చోట్ల, ఆధునిక శిల్పాలు వరంగల్, విశాఖ, హైదరాబాదుల్లోనూ తయారై పర్యాటకులకు అందుబాటులో ఉంటున్నాయి. వివిధ రకాల, రాళ్లపై తయారయ్యే శిల్పాలను విదేశీ పర్యాటకులు ఎక్కువగా కొనుగోలు చేస్తారు.

**హైదరాబాద్ పెరల్స్**

దేశంలోనే ముత్యాలకు మంచి మార్కెట్‌గా పేరుగాంచిన హైదరాబాద్‌లో మంచి ముత్యాలంటే మక్కువపడ్డ నిజాం, ఇక్కడ ముత్యాల వ్యాపారాన్ని ప్రోత్సహించాడు. ఇప్పటికీ ఇతర ప్రాంతాల పర్యాటకులు హైదరాబాదొచ్చినప్పుడు ముత్యాలు కొనకుండా వెళ్లటం అరుదు. సంగారెడ్డి సమీపంలోని చందంపేటలో 500 కుటుంబాలు ముత్యాల హారాల తయారీపైనే జీవిస్తున్నాయి. మంచి రంగు ముత్యాలను వేరుచేసిన తరువాత, మిగిలిన వాటిని కాచి, గాలిసోకని సీసాల్లో దాచి, తరువాత ఎండబెడతారు. బ్లీచ్ అయిన తరువాత మెరుపుతో అవి ఆకర్షణీయంగా తయారౌతాయి.

దేశంలోనేగాక విదేశాలలోను ఆదరణ పొందిన తెలుగువారి హస్తకళలు అంతరించిపోకుండా ప్రభుత్వం కళకారులకు చేయూతనిచ్చి ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉపాధి కల్పన కోసం గాక కళాపోషణకోసం ఉత్పత్తి అయిన సామాగ్రిని ఒకేచోట అమ్మకాలు జరిగేటట్లు చూడాలి. అమ్మకపు పన్ను మినహాయించి, కళాకారులకు ఆర్థికసహకారం అందించడం ద్వారా హస్తకళలను కలకాలం నిలుపుకోవచ్చు.

# 15 తెలుగువారి కళారూపాలు, ప్రదర్శనలు

## Art Forms and Performances of the Telugu People

తెలుగువారి కళారూప ప్రదర్శనల్లో నృత్యాలు, నాట్యాలు, నాటకాలు, పగటి వేషాలు ఇమిడి వున్నాయి. నృత్యాల్లో గిరిజన నృత్యాలు, జానపద నృత్యాలు, సాంప్రదాయక నృత్యాలని మూడు రకాలు.

**ఆదివాసీ కళారూపాలు**

చుక్కలాకాశం కింద చిమ్మ చీకట్లోనో, నిండువేసవి పండువెన్నెల్లోనో, పల్లెపల్లెకూ వచ్చిన పాటల్ని పల్లె వేసుకొంటూ, చిరుగజ్జల సవ్వడితోనో, కిన్నెర, జమిడిక, పంబశబ్దాల పరంపరంలోనో ఆదివాసీలు ప్రదర్శించే కళారూపాలను చూచి ఆనందించే భాగ్యం పల్లెటూళ్లకే దక్కింది. మారుతున్న కాలంలో నిలబడలేక అంతరిస్తున్న ఆదివాసీ కళారూపాలను బతికించుకుంటే బయటినుంచి వచ్చే పర్యాటకులు సైతం ఎంతో ఆనందిస్తారు. పంట కల్లాల్లోనో, ఇళ్లముంగిళ్లలోనో, జాతర్ల నడిఝాముల్లోనో ప్రదర్శిస్తారు.

రాష్ట్రంలో ఉన్న ఆదీవాసీల్లో అంధ్, బగత, భిల్లు, చెంచు, గదబ, గోండు, జాతపు, కట్టునాయక, కొలాం, మన్నెంవాళ్లు, కొండదొరలు, కొండకాపులు, కొండరెడ్డి, కోటియా, కోయ, కులియా, మాలి, మూకదొర, రెడ్డిదొర, రొన, సవర, సామంత, సుగాలి, తోటి, వాల్మీకి, ఎరుకల, యూనాది తెగలు తమ తమ సంస్కృతులను కాపాడుకొంటూ కొందరు కొండల్లోనూ, మరికొందరు అడవుల్లోనూ, ఇంకొందరు మైదానాల్లోనూ జీవిస్తున్నారు. వేడుకల సందర్భంగా ఆదివాసీలు ఆడిపాడే కళారూపాలు నాగరికులకు వింత గొల్పుతాయి. ఆదివాసీ తెగలైన కోయ, గోండునాయకపోడు, లంబాడా, ఎరుకలు, చెంచులు, యానాదులకు వారి వారి

కుల పురాణాలు, దొరపురణాలు, కథలు, ప్రదర్శిస్తారు. అయా సందర్భాల్లో వాయించటానికి కింకిరి, సారంగి, రవాబ్, ఏకతంత్రీ వాద్యాలున్నాయి. అయితే ఈ ఆదివాసీ కళారూపాలను ప్రధాన పోషక తెగలపై ఆధారపడిన ఉపతెగలవారు ప్రదర్శించటం విశేషం.

## రేల రేలారే... రేలాట నృత్యం



రాష్ట్రంలో గిరిజనులకు చెందిన మరో నృత్యం రేల నృత్యం. నలుగురి కంటే ఎక్కువమంది కోయస్త్రీలు జత గూడి ఆడే ఈ రేలాటను రేల చెట్టుకింద చేస్తారు. గాబట్టి దీనికి రేల నృత్యం అనీ, రేలాటనీ పేరుగలిగింది. ముందు ఒకరు ప్రారంభించిన పాటను మిగతా వాళ్లు శృతి కలుపుతూ సాగే ఈ నృత్యం మెల్ల మెల్లగా మొదలై క్రమేపీ ఊపందుకొంటున్నకొద్దీ ఆసక్తికరంగా ఉంటుంది. సంప్రదాయబద్ధంగా కట్టే ఎర్రంచు తెల్లచీర, 'బుజ్జెడ'లతో అలంకరించుకొని, కాళ్లకు గజ్జెలు గట్టి చేసే రేల నృత్యం చిన్నపిల్లల్నేకాక వయసుమళ్లిన వారిని కూడా ఆకర్షిస్తుంది. బాగా ప్రచారంలోనున్న భద్రాచలం మన్నెం ప్రాంతంలోనేకాక ఇతర పర్యాటక కేంద్రాల్లోకూడా ఈ నృత్యాన్ని ఏర్పాటు చేయడం ద్వారా కళారూపాలను సజీవంగా కాపాడుకోవచ్చు.

## థింసా నృత్యం

విశాఖ జిల్లాలోని గిరిజన తెగలవారు ఆనందోత్సాహాలతో, 15-20 మంది గిరిజన స్త్రీలు గుండ్రంగా ఏర్పడి స్థానిక దేవతను కీర్తిస్తూ చేసే నృత్యం. సంప్రదాయ గిరిజన దుస్తులు, ఆభరణాలను ధరించి, తమదైన శైలిలో కొప్పుల్ని అలంకరించుకొని వేసే వారి అడుగుల విన్యాసానికి, పాటలను చూచేవాళ్లు మంత్రముగ్ధులు



కావలసిందే కొమ్ములు, బొంగులు, తోళ్లతో చేసిన వాద్యపరికరాల నేపథ్యంలో, కొండ ప్రాంతాల్లో జరిగే ఈ నృత్యం విశాలమైన మైదానాలున్న నగర, పట్టణ ప్రాంతాల్లోనూ, సందర్శకులు ఎక్కువగా ఉండే పర్యాటక క్షేత్రాల్లోనూ, జాతరలలో ఏర్పాటు చేస్తే మరింత మంది ఈ కళారూపాన్ని కళ్లారా చూచే వీలు కలుగుతుంది. అందరూ ఆడాళ్లుండే ఈ నృత్యం అరకులోయను సందర్శించే పర్యాటకులకు ఒక ప్రత్యేక కానుక లాంటిది.

### మయూరి నృత్యం



ఖమ్మం-పశ్చిమ గోదావరి సరిహద్దుల్లోనూ, తూర్పు గోదావరి ఏజన్సీ ప్రాంతాల్లోనూ నివసించే తెగలు, తలకు కొమ్ములను ధరించి, వాద్యపరికరాలను వాయిస్తూ ఆనంద పారవశ్యాలతో చేసే నృత్యమే మయూరి నృత్యం. పచ్చటి అడవులు, జాలువారే సెలయేళ్ల సమీపంలో హృద్యంగా సాగే ఈ నృత్యాన్ని, చక్కటి స్టేజీ ఏర్పాట్లున్న హోటళ్లు, సాంస్కృతిక కేంద్రాల వద్ద ఏర్పాటు చేస్తే పర్యాటకులకు అదనపు ఆకర్షణగా ఉంటుంది.

### గుసాడి నృత్యం

ఆదిలాబాద్ జిల్లాలో నివసించే గోండులది ఒక ప్రత్యేక జీవనశైలి. వారి మాట, ఆట, పాట విలక్షణంగా ఉంటాయి. దీపావళి ముందురోజు, నెమలి పింఛాలను ధరించిన గోండు గిరిజనులు గుంపులు గుంపులుగా ఒక గ్రామం నుంచి మరో గ్రామం తిరుగుతూ చేసే ఈ నృత్యం ఎంతో హాయిగొల్పుతుంది. తామే తయారుచేసుకొన్న వాద్యపరికరాలను వాయిస్తూ, ఒక పద్ధతి ప్రకారం కాళ్లను ఆడిస్తూ



చేసే గుసాడి నృత్యాన్ని చూచే ప్రతివాళ్ళూ కదంకలపాల్సిందే, గొంతు విప్పాల్సిందే.



**కూచిపూడి నృత్యం**

కృష్ణా జిల్లాలో విజయవాడకు 30 కి.మీ. దూరంలో నున్న కూచిపూడి అనే గ్రామంలో పుట్టి, ఒక డాన్స్ డ్రామాగా రూపుదిద్దుకొని భరతనాట్యం, కథక్ నృత్యాల స్థాయిని అందుకొన్న ఈ ప్రక్రియ ప్రపంచ ప్రఖ్యాతిని పొందింది. కూచిపూడి నాట్యాన్ని నేర్చుకోవటం, ప్రదర్శించటం ఒక స్టేటస్ సింబల్ గా మారింది. భక్తితత్వంలోంచి పుట్టిన ఈ నృత్యంలో భక్తి ప్రధాన దృశ్యాలే ఎక్కువగా ఉంటాయి. ఈ నృత్యాన్ని ప్రముఖ పుణ్యక్షేత్రల్లో పర్యాటక కేంద్రాలన్నింటిలో ఏర్పాటుచేస్తే విదేశీ పర్యాటకులు కళాకారుల వేష, భాషలు, అభినయం, హావభావాలపట్ల ముగ్ధులవటం నిజం. వేదాంతం సత్యనారాయణశర్మ, వెంపటి చినసత్యం, శోభానాయుడు, ఆలేఖ్య, వనజ, సుమిత్రా పార్థసారథి, జొన్నలగడ్డ అనూరాధ, అనుపమా కైలాష్, స్వాతీ సోమనాథ్, ముదపాక వెంకటేశ్వరరావు, వేదాంతం రామలింగశాస్త్రి, చింతా రామనాథం, సరళకుమారి, ఉషా గాయత్రి మొదలగువారి ప్రదర్శనలు, ప్రోత్సాహం ద్వారా పేరుగాంచిన కూచిపూడి నృత్యాన్ని, తగిన కళాకారులను గుర్తించి, శిక్షణ ఇస్తే సంస్కృతకాభివృద్ధికి నృత్య సేవలను నాణ్యమైన రీతిలో అందించవచ్చు.

**పేరిణి శివతాండవం**



శివుని ఆరాధ్యదైవంగా భావించి నటరాజ విగ్రహం ముందుగానీ, శివాలయాల్లోగానీ, సైనికులు యుద్ధానికి వెళ్లేముందు ఆవేశంతో ప్రదర్శించే నృత్యం. ఊపిర సలపనంత ఉత్కంఠతతో సాగే ఈ మగవారి నాట్యం ఆడుతున్నంత సేపూ మనల్ని మనం మరిచిపోవలసిందే. వరంగల్ ప్రాంతంలో బాగా ప్రాచుర్యం పొందిన ఈ కళారూపాన్ని మిగతా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో కూడా ఏర్పాటుచెయ్యొచ్చు. పద్మశ్రీ నటరాజ రామకృష్ణ శిష్యులు పేరిణి శ్రీనివాస్, పేరిణి రమేష్, కళాకృష్ణ, కుమార్, శ్రీధర్ ఈ ప్రక్రియలో ప్రపంచ ఖ్యాతిని గడించారు

**ఆంధ్రనాట్యం**

ఆలయనృత్యాల్లో ఒకటిగా పేరుగాంచిన ఆంధ్రనాట్యం దేవదాసీల 'ఆరాధన' నృత్యమే. ఆగమనర్తనం, కర్ణాటకం, దర్బారీ ఆటం అనే మూడు విధాలుగా సాగే ఈ నాట్యం అంతరించిపోతున్న నేపథ్యంలో కొద్దిమందికైనా శిక్షణనిచ్చి ప్రముఖ దేవాలయాలవద్ద సాయంవేళల్లో ఏర్పాటుచేస్తే దేశీ, విదేశీ పర్యాటకులకు కొత్త అనుభూతులను కలిగించటమేకాకుండా, ఈ నాట్యాన్ని బతికించుకొన్నవాళ్లమవుతాం. ఒకరో ఇద్దరో మాత్రమే నేటికీ మిగిలి ఉన్న దేవదాసీలను ప్రభుత్వంగానీ, స్వచ్ఛంద సంస్థలుగానీ ప్రోత్సహించి కొద్దిమంది యువతులకైనా ఈ నృత్య ప్రక్రియను నేర్పించాల్సిన అవసరముంది.

**తోలుబొమ్మలాట**



సినిమాలు రాని రోజుల్లో ప్రజలకు రాత్రివేళల్లో వినోద కార్యక్రమంగా తోలుబొమ్మలాట ప్రజాదరణ పొందింది. తోలుబొమ్మలను తయారు చేయటం ఒక ఎత్తైతే, వాటి ప్రదర్శించటం మరో ఎత్తు. ఈ తోలుబొమ్మలాట రామాయణ, భారత గాధలను ప్రదర్శించటానికి ఉద్దేశించింది. శిక్షణ పొందిన కళాకారులు తెరవెనుక దీపాలను పెట్టుకొని, బొమ్మలను ఆడిస్తూ కథలను ప్రదర్శించే తీరు చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఇందుకు చక్కటి గాత్రం, సమయస్ఫూర్తి మాటకారితనం, కొద్దిపాటి హాస్యం ముఖ్యం. కేతిగాడు, గాందోలిగాడు అనే హాస్యగాని తోలుబొమ్మ తెరమీద కన్పించినప్పుడెల్లా ప్రేక్షకుల్లో నవ్వుల జల్లులు

కురుస్తాయి. రాయలసీమలో ఇప్పటికి ఆదరించబడుతున్న ఈ కళారూపాన్ని ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల్లోను ప్రదర్శించడం ద్వారా బతికించుకోవచ్చు.

### తప్పెటగుళ్లు

తూర్పు గోదావరి జిల్లాలో ప్రధానంగా ప్రదర్శించబడే ఈ నృత్యంలో 10 మందివరకూ కళాకారులుంటారు. కాళ్లకు, చేతులకు గజ్జెల దండలు ధరించి, మెడకు వేలాడేసుకొన్న చిన్న తప్పెట్లను మోగిస్తూ, ఆడుతూ, పాడుతూ చేసే ఈ నృత్యం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఉత్సవాలు, పండుగల సందర్భంగానేకాక, ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో అరగంట సేపుండే కార్యక్రమాలను రూపొందిస్తే మంచి ఆదరణ లభిస్తుంది. కళాకారులకు జీవనోపాధి దక్కుతుంది.

### వీరనాట్యం

డప్పు, గజ్జెల చప్పుళ్ల కలగలుపు సంగీతంలో ఆడిపాడే వీరనాట్యాన్ని చూస్తున్న వాళ్లకు  ఒళ్లు జలదరించి అణువణువూ పులకరించాల్సిందే. సంప్రదాయ దుస్తులు ధరించిన వీరశైవభక్తులు కాళ్లకు గజ్జెలు కట్టి, పంచెకట్టు పై నల్లవి కండవాను చుట్టి, వళ్లంతా విభూతి పట్టలతో అలంకరించుకొని చేసే లయ తప్పని వీరనాట్యం వినోదాత్మకంగా ఉంటుంది. పసుపు పచ్చని చీరలు, ఎర్రని జాకెట్లు, నడుముపై వడ్డాణం, వేపాకులదండలు, తలపై లలాటపట్టాలను ధరించి చేతులు పైకెత్తి చేసే నాట్య విన్యాసాలు వారికే సొంతమేమో అనిపిస్తుంది. తంబూర, శూలం, డోలు, వీరణం లాంటి వాద్యాలను వాయించే వాద్యకారులు సైతం రంగురంగుల బట్టలు, తలపాగాలతో ఆడుతూ, వంతపాడుతూ కలియదిరిగే దృశ్యం ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది.

శైవమతానికి కేంద్రమైన ఆంధ్రదేశంలో మధ్యయుగాల నుంచి కొనసాగుతున్న వీర నాట్యం. దక్షయజ్ఞం సందర్భంగా అవమానానికి గురైన శివుడు కోపంతో తన జడల్లో నుంచి ఒక వెంట్రుకను లాగి వీరభద్రున్ని సృష్టించగా, ఆ సందర్భంలో పుట్టుకొచ్చిన నాట్యంగా వీర నాట్యాన్ని అభివర్ణిస్తారు. వీరభద్రుని మూల పురుషునిగా కొలిచే వీరముష్టి వాళ్ళు ఈ నాట్య సంప్రదాయాన్ని వేష, భాషల్ని, వాద్య పరికరాల్నీ, ఆభరణాలనూ కాపాడుకొంటూ వస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా దాక్షారామాన్ని వీరభద్రుడు పుట్టిన దక్షవాటికగా నమ్ముతున్న వీరముష్టులు ఈ సంప్రదాయానికి రూపకల్పన చేసి, ఈ నాట్యాన్ని ఇంకా కొనసాగిస్తున్నారు.

**బుట్టబొమ్మలు**

ఎత్తైన బొమ్మలు ధరించి, జానపద రీతిలో సాగే ప్రదర్శన తిరునాళ్లు, జాతరల్లో ప్రత్యేక ఆకర్షణ. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు కేంద్రంగా ఉన్న బుట్టబొమ్మల నృత్యంలో నాట్యగాళ్లు, వాళ్లు కనిపించకుండా, ప్రదర్శించే పాత్రల ముసుగు (బుట్ట) లను ధరించటం ఇందులోని ప్రత్యేకత. రంపపుపొట్టు, ఎండుగడ్డి, పేడలతో చేసే ఈ బుట్టలు ఒక్కోసారి పది అడుగుల ఎత్తు కూడా ఉంటాయి. వీటిని తయారుచేసే కళాకారులు వంశపరంపరంగా తర్ఫీదుపొంది, తల, భుజాలు, నడుము భాగం వరకూ తయారుచేసి, వివిధ రంగులతో పాత్రలకు తగినట్లుగా తీర్చిదిద్దుతారు. వాద్యపరికరాల వింత శబ్దాల నేపథ్యంలో అటూ ఇటూ తిరుగుతూ చేసే నృత్యం ఊరేగింపుల్లోనూ, ఉత్సవ సందర్భాల్లోనూ వేడుకగొలుపుతుంది.

**డప్పునాట్యం**

మేకతోలుతో చేసిన వాద్యపరికరమైన డప్పులను పుల్లలతో కొడుతుంటే పుట్టుకొచ్చే నాద ప్రభంజనం, చూచే వారిని కూడా నాట్యం చేయిస్తుంది. 15-20 మంది గల నాట్యబృందం కాళ్లకు గజ్జెలు కట్టి డప్పులను వాయిస్తూ చేసే నాట్యాన్ని ఉత్సవాలు, ఊరేగింపులకు ముందుగా ఏర్పాటు చేస్తారు. తెలంగాణా ప్రాంతానికే పరిమితమైన ఈ రసవత్తర నాట్యాన్ని రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలలో వినోద కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించాలి.

**చిందుభాగవతం**


పల్లె వాతావరణంలో రంగురంగుల దుస్తులు ధరించి, ముఖాలకు రంగులు పూసుకొని తట్ల, తాళం, హార్మోనియాల లయబద్ధమైన సంగీతానికి అనువుగా ఎగురుతూ, నృత్యంచేసే జానపదుల ఆటకు నిజామాబాదు పుట్టిల్లు. గ్రామీణులకు వినోదాన్నందించే చిందు భాగవతంలో పౌరాణిక, ఐతిహాసిక గాధలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించే కళాకారులు తమకు కావలసిన వాద్య పరికరాల్ని, మేకప్ సామాగ్రిని, బట్టల్ని వారే సమకూర్చుకొంటారు. తెలంగాణా అంతటా పాకిన చిందు భాగవతంలోని రసవత్తర ఘట్టాలు కొన్నింటిని ఆకాశవాణి రేడియో, దూరదర్శన్ కేంద్రాల్లో ప్రసారం చేయాలి.

తెలంగాణాలోని నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో చిందుభాగవతాన్ని ప్రదర్శించే అనేక

కళాబృందాలున్నాయి. మాదిగకులంపై ఆధారపడిన దక్కలివారు ప్రదర్శకులుగా, వాద్యకారులుగా చిందుభాగవత కళారూపాన్ని కొనసాగిస్తున్నారు. నల్లగొండ జిల్లాలోని తుక్కాపురానికి చెందిన గడ్డం రాజలింగం, ఆలేరు మండలం సాయిగూడేనికి చెందిన పిల్లుట్ల సంజీవ, కాటేపెల్లికి చెందిన జి.స్వామి, సోమారానికి చెందిన బాలనర్సయ్య సుద్దాలకు చెందిన గడ్డం యాదగిరి, వెంకటాపురానికి చెందిన గడ్డం స్వామి బృందాలు ఇప్పటికీ ఈ ప్రక్రియను కొనసాగిస్తున్నాయి. ఎల్లమ్మను ఆరాధ్యదైవంగా కొలిచే ఈ కళాకారులు ప్రదర్శించే ఇతిహాస, సాంఘిక యక్షగానాల్లో సారంగధర, ప్రహ్లాద, మహిరావణ, విధిమాంధాత, లవకుశ, భీమాంజనేయ, రామాంజనేయ, పాండవవనవాసం, కృష్ణార్జునయుద్ధం, సతీతులసి, సత్యవర్మ, గాంగేయోపాఖ్యానం, బాలనాగమ్మ, చిరుతొండ, హరిశ్చంద్ర, అల్లీ-అర్జున, సతీసావిత్రి ముఖ్యమైనవి. చిందుకళాకారులు విధిగా ప్రదర్శించే రూపకాల్లో జాంబపురాణం ఒకటి. 18 మంది కళాకారులుండే ఈ ప్రదర్శన ఎల్లమ్మ దర్శనంతో ప్రారంభమవుతుంది. డప్పులు, కొమ్ములు, వొలిపెనలు ధరించి చిందులు తొక్కుతూ, పళ్లనములుతూ, తాళం, హార్మోనియం, మువ్వల సంగీతంతో జాంబవంతుని ప్రవేశం ఎంతో ఆకట్టుకొంటుంది. చిందుభాగవతంలో పాత్రలను హాస్యంగా పరిచయంచేసే బుడ్డన్‌ఖాన్ పాత్ర ముఖ్యమైంది. ఈ కళాకారులు ఎరుపు, తెలుపు, పసుపురంగులను, పొణికి కర్రతో చేసిన నగల్ని ధరించి ఎవరిపాత్రకు వారే వేషధారణ చేసుకొంటారు. వారే రాసుకొని పాడే ఈ రూపకాల్లోని రాగాలు వంశపారంపర్యంగా నేర్చుకొన్నవే.

### పగటి వేషాలు

ఒకనాటి యక్షగానాలే ఆదరణ లేక పగటి వేషాలుగా ప్రదర్శింపబడుతున్నాయి. వినోదం, అభ్యుదయం, తామసం అనే మూడు అంశాలను ప్రతిబింబించే పగటివేషాలు 33 రకాలు. వాటిలో లంబాడీ, చాకలి, బుడబుడకల, మందులవేషం, పటాన్‌వంతులు, ఫకీరు, అర్ధనారీశ్వర, కోమటి, లింగబలిజ, బోడిబాపనమ్మ, వడ్డెర, గొల్లబోయిన,



మహాదేవర, విడిబ్రాహ్మణ, భోగం, వైష్ణవ, జంగమదేవర, సోమయాజులు-సోమిదేవమ్మ, కాశీనారల్లు, కొజ్జా, దేవరపెట్టె, మాదిగ, సుంకాలమ్మ, కొమ్ముదాసరి, పిట్టలదొర, సిద్ధి, ఎరుకల, బైరాగి, కోమ, కాటికాపరి, దాస్టీకపంతులు, బాలింత, కన్న, బోయ, బహూన్ వేషాలు ముఖ్యమైనవి కాగా వీటిలో కేవలం 15 వేషాలే బాగా ప్రచారంలో ఉన్నాయి. ఈ ప్రదర్శనలిచ్చి బ్రతుకులీడ్చే కళాకారులకు ప్రజలిచ్చే చందాలే సంపాదన. వీటిలో చక్కగా, వినోదాన్ని, హాస్యాన్ని పండించే కొన్నింటిని ఎంపికచేసి కళాకారులకు శిక్షణనిచ్చి ప్రముఖ పర్యాటక కేంద్రాలవద్ద ఏర్పాటు చేయటానికి సాంస్కృతిక, పర్యాటక శాఖలు కృషి చేయాలి. కడపజిల్లా మైదుకూరుకు సమీపంలోని పార్వతీనగర్‌లో పగటివేషాలు, యక్షగానాలను ప్రదర్శించే కళాకారులకు చెందిన 50 కుటుంబాలున్నాయి. కర్నూలు జిల్లా ఆత్మకూరు దగ్గరి కొత్తబనకచర్ల, నంద్యాల సమీపంలోని పొన్నాపురం, నందికొట్కూరు, బిజినవేముల, కడపజిల్లా పొద్దుటూరు, దువ్వూరిదగ్గరి మీర్జాగానిపల్లె, అనంతపురం జిల్లాలోని హిందూపురం, తూంకుంట, కొత్తచెరువు, తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి, పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు, తాడేపల్లిగూడెం, కృష్ణాజిల్లా గుడివాడ దగ్గరి బిళ్లపాడు, గుంటూరు జిల్లాలోని తెనాలి, ప్రకాశం జిల్లాలోని చీరాల, ఇంకా కర్నాటక రాష్ట్రంలోని చిక్‌బళ్లాపూర్, బాగేపల్లిల్లో ఉన్నారు.

**బోనాలు**

భక్తిపారవశ్యంతో ఆటపాటలతో సాగే మరో జానపదనృత్యం బోనాలు. గ్రామీణ ప్రాంతాల్లోనేకాక, పట్టణాల్లో సైతం కొనసాగే బోనాల సందర్భంగా, మహంకాళి అమ్మవారికి సమర్పించటానికి నైవేద్యాలు నింపిన కుండల్ని నెత్తిన బెట్టుకొని ఊరేగింపుగా వెళుతూ మేళతాళాల కనుగుణంగా స్త్రీలు నాట్యం చేస్తూ సాగిపోతుంటారు. రంగురంగుల బట్టలు, సంప్రదాయ అభరణాలతో అలంకరించుకొని, రంగులు దిద్ది, అమ్మవారి బొమ్మలను రాసిన బోనాలు వాటిపైన వేపమండలతో కొందరూ, ప్రత్యేకంగా తయారుచేసిన ప్రభలను భుజాలపై



మోస్తూ మరికొందరూ ముందుకు వెళుతున్న దృశ్యం ఆకట్టుకొంటుంది.

## లంబాడీ నృత్యం

వరినాట్లు, కోతలు ఇంకా ఇతర వ్యవసాయ పనుల్లో మునిగితేలే బంజారాలు ఎదమరచి వేడుకగా చేసే నృత్యమే లంబాడీ నృత్యం. రంగురంగుల గుడ్డముక్కల్ని అతుకుతూ, అద్దాలు, పూసలు కుట్టిన బట్టల్ని, వెండి, దంతం, ఇత్తడి ఆభరణాలను ధరించి పంటపొలాల్లో కాళ్ల గజ్జెలు, చేతి కంకణాల సవ్వడిలో లయబద్ధంగా చేసే లంబాడీ నృత్యంలో స్త్రీలు పాడే పాటలు వినసొంపుగా ఉంటాయి. తెలంగాణా ప్రాంతంలో పెళ్ళిల్లు, తీజ్, హోళీ, సంక్రాంతి, ఏరువాక సందర్భాల్లో ప్రదర్శించే ఈ నృత్యాన్ని ప్రత్యేక పర్యాటకోత్సవాల్లో కూడ ఏర్పాటు చేస్తే ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు తమను తాము మైమరచి వంతపాడుతు గంతులు వేస్తారు.



*లంబాడీ నృత్యం, తెలంగాణ*

# 16 తెలుగు వారి ఆటలు - పాటలు

## Music,Dance and Pastimes

తీరిక సమయాల్లో ఉల్లాసంగా ఉండటం కోసం ఆటలాడుకోవడం తెలుగు వారికి కొత్తేమీ కాదు. అమాటకొస్తే శిలాయుగపు చిత్రకళలో వేటతోపాటు కలసి కట్టుగా ఆటలాడుకొన్న ఆధారాలు కూడా తెలుగు నేల మీద దొరికాయి. చారిత్రక తొలియుగంలో చిన్న పిల్లల కోసం మట్టి బొమ్మలు, పెద్దవారి కోసం పాచికలు అందుబాటులో ఉన్నాయి. పెద్దబంకూరు, ధూళికట్ట, కొండాపూరు, ధరణికోట తవ్వకాల్లో మట్టి బిళ్ల చక్రాలు దొరికాయి. ధూళికట్ట, కోటిలింగాలలలో దంతంతో చేసిన పాచికలు దొరికాయి. నాగార్జునకొండ దగ్గర ఒక రాతిపై క్రీ.శ. 3వ శతాబ్ది నాటి పులి-జూదం పటం చెక్కబడింది. అక్కడి శిల్పంలోనే కోడి, పొట్టేలు పందాలు, మల్లయుద్ధం మొదలైన వినోద ప్రధానమైన ఆటలున్నాయి. మధ్యయుగాలనాటికి వయసుతో సంబంధం లేకుండా, ఇంటా, బయట, ఒంటరిగా జంటగా, కలసికట్టుగా జట్లు కట్టి ఎన్నో రకాల ఆటలాడారు.

**తెలుగు సాహిత్యంలో క్రీడావినోదాలు** అన్న అంశంపై విస్తృత పరిశోధన గావించిన డా వఝ్ఝా సుబ్రహ్మణ్యం తెలుగువారి వారసత్వ అటల గురించి ఎన్నో వివరాలనందించారు.

**చిన్న పిల్లల ఆటలు:** చిన్న పిల్లల ఆటల్లో ఆడ మగ పిల్లలు ఎక్కువభాగం ఆటపాటలలో అక్కిబిక్కిదండ, అచ్చనగండ్లు, అందలం, అరుగాటలు, అల్లోనేరళ్ళు, ఉడుమాట, ఉయ్యాల, ఒత్తొత్తివారొత్తి ఒప్పులకుప్ప, కనుమూసిగంత, కర్రగానుగత్రిప్పుళ్ళు, కాలికంచం, కాళ్ళాగజ్జి, కుందికాళ్ళు, కుప్పిగంతులు, కుమ్మరసారెలు, గాలిపటాలు, గిలకలు, గీరనగింజలు, గుజ్జనగూళ్ళు, గుడు గుడుగుంచం, గుమ్మడికాయలు,

చిట్లపొట్లకాయ, చిప్పచిప్పగోళ్ళు, చీకటిమొట్టికాయ, జీరుకుబండలు, తన్నుబిల్ల, తాటాకుచక్రాలు, తాటియాకుల చిలుకలు, తాళ్ళపాము, తిక్కబిళ్ళలు, తిరుగుడుబిల్లల త్రిప్పుళ్ళు, తుమ్మెద రేవుళ్ళు, దాగుడుమూతలు, దాయాలు, దోబూచి, నాలుగుస్తంభాలాట, నిలాయనక్రీడ, పచ్చాకు, పరుగు పంతం, పారిగంతులు, పిచ్చుకగూళ్ళు, పింపిళ్ళు, పిల్లదీవులు పిల్లమెరములు, పుట్టచెండ్లు, పులియాట, పోకలాట, బిల్లగోడు, బువ్వంబంతులు, బెచ్చెలాటలు, బెండ్లకండ్లు, బొంగరాలు, బొమ్మరిల్లు, బొమ్మలపెళ్ళిళ్ళు, మంటిగూళ్ళు, మైనపు తేళ్ళు, రూకలకుప్పలు, వింద్లమ్ములాటలు, వెన్నెలకుప్పలు, సరిబేసులు, సాదుగోదు, సింగన్నదాటులు, హరిణక్రీడ అనే ఆటలు ముఖ్యమైనవి.

### యుక్తవయస్సులో ఆడే ఆటలు




అంజి, అష్టచెమ్మ, అమ్మనములు, అశ్వక కందుకక్రీడ, ఉడుమూట, ఉప్పనబట్టెలు, ఉవ్వలపోటి, ఊదుంగ్రోవులు, ఏలపాటలు, ఒడ్డువిడుములు, ఓమలగుంటలు, కట్టెపుట్టచెండ్లు, కందుకశిలాది ప్రక్షేపణం, కుండబంతి, కుందికట్టు, కుబేరాక్షకేళి, కొక్కు కోతికొమ్మచ్చులు, కోలాటం, గువ్వాజూదం, గాలిపటాలు, గొండ్లి, గోలీలు, చదరంగం, చెడుగుడు, చెరుకులపందెం, జీరుకుబండలు, జూదం, తరుముడుచెండు, తుమ్మెద రూపుళ్ళు, నాలుగుస్తంభాలాట, నిలాయనక్రీడ, పచ్చీసు, పరుగుపందెం, పికిలిపిట్టల పోట్లాటలు, పిడిగ్రుద్దులాటలు, పిల్లదీవులు, పులిజూదం, పొట్టేళ్లపోరు, పోకలాటలు, బిల్లగోడు, బువ్వంబంతులు, బెచ్చెలాటలు, బొమ్మరిండ్లు, బొమ్మలపెళ్ళిళ్లు, భక్ష్యములపోటీ, రాగుంజుపోగుంజులాట, రుకలకుప్పలు, వైకుంఠపాళీ, సరిబేసులు, సింగన్నదాటులు, సొగటాలు, హరిణక్రీడలు ముఖ్యమైనవి.

### పెద్దవారు ఆడే ఆటలు

అత్తకోడలియాట, అష్టచెమ్మలు, ఓమన గుంటలు, కోడిపందేలు, కోలాటం, గంజీఫా, గవ్వలాటలు, గొండ్లి, గొబ్బిళ్ళు, జూదం, పచ్చీసు, భక్ష్యములపోటీ, మృగయావినోదం (వేట), వైకుంఠపాళీ, సిడి, సొగటాలు మొదలైనవి.

**ఆడవాళ్లు మాత్రమే ఆడే ఆటలు**





అక్కిబిక్కిదండ, అచ్చనగండ్లు, అంజి, అట్టచెమ్మ, అత్త కోడలియాట, అప్పళం, అవ్వనవరం, అమ్మనలు, అల్లోనేరేళ్లు, ఈనెగాజులు, ఉయ్యాల, ఒప్పులకుప్ప, ఓమనగుంటలు, కనుమూసిగంతులు కాళ్లాగజ్జి, కుందికాళ్ళు, కుప్పఆట, కూర్చోవదినా! ఆట, కోలాటం, గవ్వలాటలు, గీరనగింజలు, గుజగుజ రేకులు, గుజ్జెనగూళ్ళు, గుంటచాళ్ళు, గొండ్లి, గొబ్బిళ్ళు, గోరంటలాట, చిటెకలు మొటికెలు, చిట్లపొట్లకాయ, చింతపూవులు, చీకటిమొట్టికాయ, చెడుగోరింపులు, చెమ్మచెక్కలు, చేబంతులు, జలక్రీడలు, జీరుకుబందలు, తన్నుబిల్ల, దాగుడుమూతలు, దాయాలు, దోబూచి, నాలుగుమూలలాట, నాలుగుస్తంభాలాట, నెత్తము, నెత్తిమీదగోరింక, పచ్చీసు, పింపిళ్ళు, పుణికిళ్ళు, పేరణి, బువ్వబంతులు, బొమ్మరిల్లు, బొమ్మలపెళ్ళిళ్ళు, వెన్నెలకుప్పలు, వైకుంఠపాళీ, సరిబేసులు, సిడి సొగటాలూ మొదలైనవి బాలికలూ, యుక్తవయసువచ్చిన ఆడపిల్లలూ, స్త్రీలూ (పెద్దవాళ్లు) ఆడే ఆటలు.


**మగవాళ్ళు ఆడే ఆటలు**


అందలం, అశ్వికకందుక క్రీడ, ఈలలు, ఉడుతలు–ఉడుములు, ఉడుమాట, ఉప్పనబట్టెలు, ఉవ్వలపోటీ, ఊదుగ్రోవులు, ఏలపాటలు, ఒక్కసికొక్కు, కట్టెగుర్రం, కట్టెపుట్టచెండ్లు, కందుకశిలాది ప్రక్షేపణం, కర్రగానుగత్రిప్పుళ్ళు, కుండబంతి, కుందికట్లు, కుందికాళ్ళు, కుందెనగుడి, కుప్పిగంతులు, కుమ్మరసారెలు, కోడిపందేలు, కోతికొమ్మచ్చులు, గంగిరెద్దులాటలు, గాలివటాలు, గుంటచాళ్ళు, గోటదొర్లుడుకాయ(గోలీలు), చక్రాలత్రిప్పుళ్ళు, చిటితాళం, చిందు, చిర్రుబుర్రులు, చెడుగుడు, చెరుకులపందెం, జూదం, తగరులవిడుపులు, తరుముడుచెండు, తాటాకుచక్రాలు, తాళ్లపాము, తిక్కుబిళ్ళలు, తిరుగుడుబిళ్ళల తిప్పుళ్ళు: తుమెమ్మదరేవుళ్లు, దిగుదిగుదిక్కొనునాట, దూపుదాటులు, నారికేళఫల పందెం, నిలాయనక్రీడ, పరుగుపందెం, పికిలిపిట్టలపోట్లాట, పిడిగుద్దులాటలు, పులి పందెం, నిలాయనక్రీడ, పరుగుపందెం, పికిలిపిట్టలపోట్లాట, పిడిగుద్దులాటలు, పులి జూదాలు, పులియాట, పొట్టేళ్లపోరు, బిల్లగోడు బెచ్చెలాటలు, బొంగరాలు, భక్ష్యములపోటీ,











మంటిగవాళ్ళు, మృగయావినోదం, మైనపుతేళ్ళు, రాగుంజుపోగుంజులాట, రూకలకుప్పలు, వింధ్లమ్ములాటలు, సరిగుంజులాట, సరిబేసులు, సాదుగోదు, సింగన్నదాటులు, హరిణక్రీడ–మొదలైన ఆటలను మగవాళ్లు ఆడతారు.

**ఆడ, మగ ఇద్దరూ కలిసి ఆడే ఆటలు**

స్త్రీలూ, పురుషులు కలసి ఆడేఆటలు, వేడుకలు, వినోదాలు – ఈ క్రీడావినోదాలలో బాలబాలికలుకానీ స్త్రీ పురుషులుకానీ కలిసి పాల్గొంటారు. అట్టచెమ్మ, అప్పవిందులయాట, అరుగాటలు, ఉయ్యాల, ఒడ్డువిడుపులు, ఒత్తొత్తి వారొత్తి, ఓమనగుంటలు, కోలాటం, గంజికాలు, గవ్వలాటలు, గిలకలు, గీరనగింజలు, గుడుగుడుగుంచం, గుమ్మడికాయలు, గూఢరత్నసికతాన్వేషణం, చదరంగం, చిప్పచిప్పగోళ్ళు, చిమ్మనగ్రోవులు, చీకటిమొట్టికాయ, చేబంతులు జలక్రీడలు, జీరుకబండలు, తోలుబొమ్మలాటలు, దాగుడుమూతలు, రాయాలు, దొంగాట దోబూచి,

పచ్చీసు, పిల్లదీవులు, పిల్లమెరములు, పుట్టచెండ్లు, పొడుపటికతలు, పోకలాటలు, రాటనములు, వెన్నెలకుప్పలు, వెన్నెలపులుగంబులు, వైకుంఠపాళి, సయ్యాట మొదలగునవి స్త్రీ పురుషపరమయిన క్రీడా వినోదాలు.

సామాన్యమయిన రోజులలో ఉత్సాహ పూర్వకంగా ఆడుకునే ఆటలను ఉత్సాహాంకాలుగా, ఏదైనా ఒక పండు రోజునో ఒక ఉత్సవం రోజునో ఆడుకునే ఆటలనూ, చేసుకొనే వేడుకలనూ, వినోదాలనూ తిలకించే వినోదాలనూ ఉత్సవంగా పేర్కోనవచ్చు

**ఒంటిగా, జంటగా, ఎక్కువమందితో ఆడే ఆటలు**

ఆకుపీకెలు, ఈనెగాజులు, ఈనెగుర్రం, ఈలకూతలు, ఊచుగ్రోవులు, ఏలపాటలు, కట్టగుర్రం, కాలికంచం, కీచుబుర్రలు, గాలిపటం, బంతులు, చొప్పబెండ్లమంచం, జరుగుడుబండలు, తన్నుబిల్ల, తాటాకుచక్రాలు, తాళ్ళపాము, తిరుగుడుబిల్లలత్రిప్పుళ్ళు, పిచ్చుకగూళ్ళు, పులిజూదం, బొంగరాలు, వానాలప్ప మొదలైన ఆటలు, ఒక్కరే ఆడతారు.

ఇద్దరు లేక అంతకంటే ఎక్కువమంది ఆడే ఆటల్లో అరుగాటలు, ఉడుమాట, ఒత్తొత్తి వారొత్తి, కనుమాసిగంత, కుందికాళ్ళు, కోతికొమ్మచ్చులు, చిటికెలుమెటికలాట, చీకటిమొట్టికాయ, దాగుడుమూతలు, దొంగాట, నాలుగుమూలలాట, నాలుగుస్థంభాలట, పులియాట, బొంగరాలు, సాదుగోదు, సింగన్నదాటులు.

అచ్చనగండ్లు, అష్టచెమ్మ, ఉడుతలు-ఉడుములు, ఉప్పనబట్టెలు, ఒక్కసికొక్కు ఒడ్డువిడుపులు, ఒప్పులకుప్పలు, ఓమనగుంటలు, కట్టెపుట్టచెండ్లు, కందుక శిలాదిప్రక్షేపణం కుండబంతి, కుందికట్టు, గోలీలు, చదరంగం, చెబుగుడు, చెమ్మచెక్క జూదం, దూరపుదాటులు, పిల్లదీవులు, పులిజూదం, బిల్లగోడు, బెచ్చెలాటలు, రాగుంజుపోగుంజులాట, రూకలకుప్పలు, వెన్నెలకుప్పలు, వైకుంఠపాళి, సరిగుంజులాట, హరిణక్రీడ మొదలైన ఆటలు ముఖ్యమైనవి.

**కలిసి కట్టుగా ఆడే ఆటలు**

అక్కిబిక్కిదండం, అల్లోనేరళ్ళు, ఉయ్యాల, కాళ్లాగజ్జి, కోలాటం, గాలిపటాలు, గీరనగింజలు, గుజగుజరేకులు, గుజ్జనగూళ్ళు, గుడుగుడు గుంచం, గుమ్మడికాయలు, జలక్రీడలు, జీరుకుబండలు, నెత్తిమీదగోరింక బువ్వం బంతులు, బొమ్మరిళ్ళు, బొమ్మలపెళ్ళిళ్ళు మొదలైనవాటిని అందరూ కలిసి ఆడతారు.

### ఏదో ఒక ఆట వస్తువులతో ఆడే ఆటలు

ఈనెగాజులు, ఓమనగుంటలు, కట్టెపుట్టచెండ్లు, కందుకశిలాదిప్రక్షేపణం, కర్రగానుగ త్రిప్పళ్ళు, కీచుబుర్రలు, కుండబంతి, కోచికొమ్మచ్చులు, కోలాటం, గవ్వలాటలు, గాలిపటాలు, గీరనగింజలు, గుప్పిటగురిగింజ, గూఢరత్నసికతాన్వేషణం, గోలీలు, చదరంగం, చెరుకులపందెం, జూదం, తన్నుబిల్ల, తోలుబొమ్మలాటలు, నెత్తిమీద గోరింక, పచ్చీసు, పుట్టచెండ్లు, పులిజూదం, పోకలాటలు, బిల్లగోగు, బెచ్చెలాటలు, బొంగరాలు, భక్ష్యములపోటీ, రూకలకుప్పలు, వింఢ్లమ్ములాటలు, వెన్నెల కుప్పలు, వైకుంఠపాళి, సరిబేసులు, మున్నగు క్రీడావినోదాలలో కర్రలుగానీ గవ్వలు గానీ, గులకరాళ్లుగానీ, చింతపిక్కలుగానీ ఉపయోగించి ఆడతారు.

### ఎలాంటి వస్తువులు లేకుండా ఆడే ఆటలు

అక్కిబిక్కిదండ, అందలం, అరుగాటలు, అల్లోనేరెళ్ళు, ఉడుతలు-ఉడుములు, ఉప్పనబట్టెలు, ఒప్పులకుప్ప, కాలికంచం, కాళ్ళాగజ్జి, కుందికట్టు కుందికాళ్ళు, కుప్పిగంతులు, గుజగుజరేకులు, గుడుగుడుగుంచం, గుమ్మడికాయలు చిట్లపొట్లకాయ, చీకటిమొట్టికాయ, చెమ్మచెక్క, జలక్రీడలు, దాగుడుమూతలు, గ్రుద్దులాటలు, పిల్లమెరములు, సాదుగోదు, సింగన్నదాటులు, హరిణక్రీడ మొదలైన ఆటల్ని ఏ వస్తూవూ లేకనే ఆడొచ్చు.

### ఆలోచనతోకూడిన కొన్ని ఆటలు

అష్టచెమ్మలు, ఓమనగుంటులు, చదరంగం, పులిజూదం సరిబేసులు మొదలైనవి బుద్ధికి సంబంధించిన ఆటలు. వేలినో, నడిమివేలినో ఆడిస్తూ, మరోచేతితో బెల్లం ముక్కలనుగానీ, వేయించిన శనగపప్పు లేక వేరుశనగపప్పు గానీ నోటికి చేతికి విరామంలేకుండా పోటీకి పెట్టినవి పూర్తిగా తినాలి. వేలుఆడటం అర్థాంతరంగా ఆగిపోయినా, తినడం మరచిపోయినా ఆట ఓడిపోయినట్లే.

### సంప్రదాయ బద్ధమైన ఆటలు

అట్లతద్దె, అల్లోనేరేళ్ళు, ఉండ్రాళ్ళతద్దె ఉట్లపండుగ, తోలుబొమ్మలాటలు, దశావతార ఆట, బువ్వంబంతుతు, బొమ్మలపెళ్ళిళ్ళు, వైకుంఠపాళి, సిడి, సూదుపట్టె మొదలైనవి హిందువులు ఎక్కువగా ఆడతారు.

**పరిసరాలను బట్టి ఆడే ఆటలు**

ఏలపాటలు పాడుకోవడం, ఒత్తొత్తివారొత్తి, కనుమూసి గంత, కుండబంతి, కుప్పఆట, కుప్పిగంతులు, గాలిపటాలు, గూఢరత్నసికతాన్వేషం, జలక్రీడలు, దూగిలాట, దూరపుదాటులు, దోణిబిళ్లాట, పిచ్చుకగూళ్ళు, పిల్లమెరములు, బొమ్మరిల్లు, వెన్నెలకుప్పలు, సింగన్నదాటులు మొదలైన ఆటలను సాధారణంగా తీరప్రాంతంలో, ఇసుకతిన్నెలున్న చోట్ల ఆడతారు.

**ఇంటిలోపల ఆడే ఆటలు:**

అచ్చనగండ్లు, అంజి, అట్టచెమ్మలు, ఒప్పులకుప్పలు, ఓమనగుంటలు, కాళ్ళాగజ్జి, గవ్వలాటలు,గీరనగింజలు గుజగుజరేకు, గుజ్జనగూళ్ళు, గుడుగుడుగుంచం, చదరంగం, చెమ్మచెక్క, జూదం, పచ్చీసు, పులిజూదాలు, బొమ్మరిల్లు, బొమ్మల పెళ్ళిళ్లు, రూకలకుప్పలు, వైకంఉరపాళి, సరిబేసులు, సాదుగోదు-వంటి ఆటలు, ఇంటిలోపల ఆడే ఆటలు.

**ఇంటి బయట ఆడే ఆటలు:**

అక్కిబిక్కిదండ అందలం, అమ్మనములు, అరుగాటలు, అల్లోనేరళ్ళు, అశ్వక కందుకక్రీడ, ఉడుమాట, ఉప్పనబట్టెలు, ఉయ్యాల, కనుమైసిగంతలు, కందుకక్రీడలు, కాలికంచం కుండబంతి. కుందికాళ్ళు, కోడిపందేలు, కోతికొమ్మచ్చులు, కోలాంటం గాలిపటాలు, గూఢరత్నసికతాన్వేషణం, గోలీలు, చిమ్మనగ్రోవులు, చెడుగుడు, చెరకులపందెం, జేరుకుబండలు, తన్నుబిల్ల, తోలుబొమ్మలాటలు దాగుడుమూతలు, నాలుగుస్తంభాలాట, పరుగుపందెం, పిల్లదీవులు, బిల్లగోడు, బొంగరాలు, వెన్నెలకుప్పలు, సింగన్నదాటులు, హరిణక్రీడ ఆరుబయట ఆడే ఆటలు.

**పౌరాణిక గేయాలు**

జానపద గేయాలకు పురాణేతిహాసాల నుంచి కథావస్తువు స్వీకరించి జానపద గేయాలలో పొందుపరచారు. కూచకొండ రామాయణం, ధర్మపురి రామాయణం, శారదా రామాయణం, రామ కథా సుధార్ణవం, మోక్షగుండ రామాయణం, సంక్షేప రామాయణం, గుత్తెలదీవి రామాయణం, చిట్టి రామాయణం, శ్రీరామ దండకములు, రామాయణ గొబ్బిపాటలు, శ్రీరామ జావిలి, అడవి, శాంతపెండ్లి, గోవిందనామాలు మొదలైనవన్నీ పూర్తి రామయణ గాధలే. శాంతాకళ్యాణం, పుత్రకామేష్టి, కౌసల్య బైకలు, శ్రీరాముల ఉగ్గుపాట, రాఘవకళ్యాణం, రాములవారి అలుక, సుందరకాడ

పదము, ఋషుల ఆశ్రమం, సుగ్రీవవిజయం, కోవెల రాయభారం, అంగదరాయభారం, లక్ష్మణమూర్ఛ, లంకాయాగం, గుహభరతుల అగ్నిప్రవేశం, శ్రీరామపట్టాభిషేకం, లక్ష్మణదేవర నవ్వు, ఊర్మిళాదేవినిద్ర, కుశలాయకం, కుశలవ వారికి ముఖ్యంగా స్త్రీలకు సీతమ్మ ఆరాధ్య దైవతం. సీత పుట్టుక, సీతాకళ్యాణం, సీతనత్తవారింటికంపుట, సీతసమర్త, సీతశుభగోష్టి, సీతగడియ, సీతవామనగుంటలు, సీతమ్మవారి అలుక, సీతవసంతం, సీత దాగిలిమూతలు, సీతసురటి, సీతముద్రికలు, సీత ఆనవాలు, సీత అగ్నిప్రవేశం, సీతవేవిళ్లు, సీతచెర, మాయలేడిపాట మున్నగునవి సీతాదేవిని గురించిన పాటలు.

రామాయణం తర్వాత భారత నలచరిత్ర, దేవయానిచరిత్ర, సుభద్రాకళ్యాణం, సుభద్రసారె, ధర్మరాజు జూదం, ద్రౌపతివల్వలు, వందుపాట, విరాటపర్వం, పద్మవ్యూహం, విశ్వరూపం, భగవద్గీత, సావిత్రిపాట, శశిరేఖా పరిణయం, గయోపాఖ్యానం, పరాశరమత్స్యంధీ సంవాదం మొదలైనవి బహుళ ప్రచారం పొందిన భారత కథలు. విరాట, కర్ణ, శల్య పర్వముల పాటలు, ఉత్తర దక్షిణ గోగ్రహణ పాటలు, ఇవి పెద్ద పదములు ముఖ్యమైనవి.

భాగవతసంబంధమైన పదములు కూడా వున్నాయి. ప్రహ్లాదచరిత్ర, వామనవిజయం, వామనచరిత్ర, అంబరీషోపాఖ్యానం, గజేంద్ర మోక్షం, శ్రీకృష్ణజననం, కాళిందిమడుగు, శ్రీకృష్ణుని చల్దులు, బాలకృష్ణలీలలు, గుమ్మడుపాట, యశోదకొంగపాట, జలక్రీడలు, రుక్మిణి కళ్యాణం, చిలుకరాయభారం, సత్యభామ సరసం, రుక్మిణిదేవి ముచ్చట, రుక్మిణిదేవి సీమంతం, పారుదాతపల్లవి, ఉషాస్వప్నం, కుచలోపాఖ్యానం, భ్రమరగీతలు మొదలైనవి భాగవత సంబంధమైన గీతాలు. సత్య హరిశ్చంద్రపాట, అనసూయపాట, గోవుపాట, దత్తాత్రేయ జననం, దక్షయజ్ఞం, గంగావివాహం, గంగాగౌరీ సంవాదం, లక్ష్మీ పార్వతుల సంవాదం, త్రిపురాసుర సంహారం, సవతుల కయ్యం, ఈశ్వర భృంగీవాదగం, మేనకా పార్వతీసంవాదం, సురాభాండీశ్వరం, మార్కండేయజననం, సిరియాళరాజు చరిత్ర, భల్లాణ రాయచరిత్ర, కొమిరెల్లి మల్లన్న కథ, వరదరాజుపెండ్లి పాట, ఆండాల్ చరిత్ర, శ్రీరంగమహాత్యం, తారుమంతంకీపాట, దశావతారములపాట, లక్ష్మీదేవి స్వగతాలు, వెంకటేశ్వర్ల వేట, చెంచితకథ ఏకాదశిమహాత్యం, వరాహవతార చరిత్ర, మున్నగునవి ఇతర పురాణాలకు మతపరమైన కథలకు స్థానిక గాథలకు సంబంధించినట్టివి. జానపదులు ఆ గాథలలోని పాత్రలతో అవినాభవసంబంధం ఏర్పరచుకోవడం గమనించవచ్చు. ఈ గేయాలకు

సంస్కృతం లేదా తెలుగు మాతృకతో పోల్చి చూసినట్లయితే జానపదుల చిత్తవృత్తులు పౌరాణిక వ్యక్తులపట్ల వారికి గల ప్రేమాభిమానాలు వెల్లడవుతాయి. వీరగీతాలు కేవలం వినోదానికి, ఉల్లాసానికి మాత్రమే కాదు అవి బ్రహ్మనాయుడు, ఖడ్గతిక్కన వంటి మహా యోధులు, బాలచంద్రుడు, కుమార రాముడు వంటి సాహస మూర్తులు రుద్రమదేవి, మాంచాల, పార్వతిదేవి, రాశిశంకరమ్మ వంటి వీరనారీమణులు ప్రభవించారు. తెలుగువారికి వీరాభినివేశం మెండు. అందుచేతనే వీరోత్సవాలు, వీరపూజలు, తెలుగు నాట పాదుకొన్నాయి. కారెంపూడి తిరునాళ్ళలో పల్నాటి వీరారాధన, నెల్లూరు, గంజాతరులు తెలుగు ప్రజల పవిత్ర వీరపూజ సంప్రదాయాన్ని వెల్లడిస్తాయి.

మియాసాబ్ కథ, సోమనాద్రి కథ, రామేశ్వరరావు కథ, రాణిశంకరమ్మ కథ, సర్దై వెంకటరెడ్డి కథ, సదాశివరెడ్డి కథ, పర్వతాలమల్లారెడ్డి కథ, సర్వాయి పాపని కథ, బల్లూరి కొండల్రాయుని కథ, కుమార రాముని కథ, తెలంగాణాలో బహుళ ప్రచారం పొందిన వీర గీతాలు, పల్నాటి వీరులకథలు. కాటమరాజుకథ, దేశింగురాజుకథ, బొబ్బిలికథ, పెద్దాపురం కోడిపందేల కథ, అల్లూరి సీతారమరాజుకథ, మొదలైనవి ఆంధ్రప్రాంతమంతటా ప్రచారం పొందినాయి. బంగారుతిమ్మరాజు కథ, ఆరెమరాటీల కథ, బళ్లారి కొండలరాయుని కథ, అస్పష్ట చారిత్రక గీతాలని చెప్పవచ్చు

## పారమార్థిక గేయాలు

తత్వాలు పోతులూరి వీర బ్రహ్మంగారి కాలజ్ఞానతత్వాలు, సిద్ధప్పపాటలు, లింగమూర్తి పాటలు, ఆత్మ బోధామృత్వాలు, సీతపాట, రామ రామ శతకము, నారాయణ శతకము, కందార్థ దరువులు, శ్రీరామగీత, గురుగీత, తారకామృతసారము, రాజయోగిపాటలు మొదలైనవి వేదాంత సంబంధమైన గీతాలు వైదిక నియమనిష్టలు, యజ్ఞయాగాదికర్మలు సామాన్య ప్రజలకు అందుబాటులో లేవు. కాని కర్మమార్గం ద్వారా, మోక్షసాధనపట్ల వారికి విశ్వాసమున్నది. ఈకర్మ సంబంధమైన నోములు, వ్రతాలరూపంలోను పాటలు స్త్రీలపై ఎక్కువ ప్రచారంలో వున్నాయి. చిలుక ముగ్గా పాట, నిత్యానందము పాట, దీపధానం పాట, మోచేటి పద్మము, నోముపాట, కృత్తిదీపాలపాట, పెండ్లిగుమ్మడిపాట, వరలక్ష్మిపాట, శ్రావణశుక్రవారపు పాట, తులసీపాట, లక్షవత్తులపాట, కామేశ్వరీపాట మొదలైనవి నోముల పాటలు. బొడ్డెమ్మ పాట, బతకమ్మపాట, తెలంగాణాలో బహుళ ప్రచారం పొందినట్టివి.

### స్త్రీల పాటలు

కట్నముల పాటలు, నలుగు పాటలు, అలుక పాటలు, తలుపు దగ్గర పాటలు, బంతుల పాటలు, బువ్వము పాటలు, వధూవరుల పాటలు, ముఖము కడుగుపాటలు, కట్నాలపాటలు, మిధున విడెముల పాటలు, అవిరేణిపాటలు, ఉయ్యాలవారి పాటలు, అప్పగింత పాటలు వంటివన్నీ పెండ్లి పాటలే. ప్రేమ వివాహాలు అధికంగా సాగుతున్న ఈ రోజుల్లో ఈ పాటలు శీఘ్రగతితో మరుగున పడుతున్నాయి. గృహజీవనం సక్రమంగా జరిగి ఏ యిబ్బంది ఉండదు. యిందుకు భిన్నంగా ఉన్నట్లయితే భర్త, అత్తగారు, ఆడపడుచులు పెట్టే బాధలతో ఇల్లాలి జీవితం నరక ప్రాయమవుతుంది. దీనిని వర్ణించే పాటలున్నాయి. ఈ పాటలన్నిటిలో తెలుగువారి సాంఘిక, సాంస్కృతిక జీవనం పూర్తిగా అవిష్కృతమవుతుంది. సీతసమర్త, సీతగడియ, సీతమ్మవారి వసంతం, సీతవామనగుంటలు, సుభద్రసారె, రుక్మిణజదేవి సీమంతం, కౌసల్య బారసాల మొదలైనవి అతి రమణీయములు.

### శృంగార గేయాలు

సేతగడియ, ఊర్మిళాదేవి నిద్ర, సీతమ్మం వారి అలుక, సీతాదేవి వేవిళ్లు, సీతాదేవి ఆనవాలు మొదలైనవి ఉదాత్త ప్రేమను చిత్రించిన గేయాలకు చక్కటి ఉదాహరణలు. సుభద్రాకళ్యాణం, నల చరిత్ర పదము, శశిరేఖాపరిణయము, గోపికా స్త్రీల జల క్రీడలు, ఉషా స్వప్నం, రుక్మిణీదేవి ముచ్చట, చిలుక రాయభారం, సత్యభామా సరసం, పారిజాత పల్లవి, భ్రమర గీతాలు మున్నగువాటిలో ఉత్తమ శృంగార భావాలు వర్ధిలములయ్యాయి. లక్ష్మమ్మ కథ వంటి కరుణ రస ప్రధాన గీతాలలో ఉత్తమ యిల్లాండ్ర పవిత్ర ప్రేమ వెల్లడవుతుంది. గంగా వివాహం, కామిరెల్లి మల్లన్నకథ, వరద రాజు పెండ్లి పాట, అండాళ్లు చరిత్ర, చెంచిత కథలతో చక్కటి శృంగారభావాలు ద్యోతకమవుతాయి. చల్మోహనరంగ పాట, వెంకయ్య చంద్రమ్మ పాట, నారాయణమ్మ పాట, సిరిసిరిమువ్వ పాట, కాముని పదాలు, జాజర ఆపటలు, గోంగూర పాట మొదలైనవి సాధారణ జానపదులు ప్రేమ గీతాలకు మచ్చు తునకలు.

### అద్భుతరస గేయాలు

పిల్లలమాదిరే జానపదులకు అద్భుత రసాభినివేశం అధికం. అద్భుత కథలలో కానవచ్చే మానవాతీత శక్తి పట్ల వారికి భక్తి భావం మెండు. ఈ కథలలో కష్టాలు ఎదురైనపుడు దివ్వశక్తులు అవతరించి వాటిని తొలగించి నట్లే తమకు కూడ అటువంటి దివ్యశక్తులు తోడ్పడగలని వారి నమ్మకం. బాలనాగమ్మ కథ, గాంధారి కథ, పసల

బాలరాజు కథ, ధార్మంగద పాము పట్ల చాలా ప్రచారం పొందాయి. సత్యం, రుజు వర్తనం చివరకు జయించగలవని ఈ పాటలు చాటి చెబుతాయి.

**కరుణరస గేయాలు**

పేరంటాండ్ల పాటలలో కామమ్మ కథ, లక్ష్మమ్మ కథ, సన్యాసమ్మ కథ, మండపేట పాపమ్మ కథ, ఎరుక్మ కథ, తిరుపతమ్మ కథ, వీరరాజమ్మ కథ మొదలైనవి భర్తల చితులపై ఆహుతి అయిన పుణ్య స్త్రీల కథలను వివరిస్తున్నాయి. ఎరుకల నాంచారమ్మ కథ, రాములమ్మ పాట, సరోజనమ్మ పాట, మూసీ పొంగే పాట మున్నగునవి తెలంగాణాలో ప్రచారంలో వున్న కరుణ రస గేయాలు.

**తెలుగు వారి నృత్యాలు**

సూత్రధారుడు, నర్తకులు, పాటకులు, వాద్యకాండ్రు - వీరందరినీ కలిపి బృందము లేదా మేళము అంటారు. ఈ మేళం రెండు విధాలు - నట్టువ మేళం, నాట్య మేళం, ఏకపాత్ర -అందునా స్త్రీ నర్తించే బృందం నట్టువమేళం, ఇంక బహుపాత్రలు, ఒక్కొక్కప్పుడు స్త్రీ పురుషులు కలిసి కూడా నర్తించే బృందం నాట్యమేళ. ఇప్పుడింక ఆయా నృత్య సంప్రదాయాలను వివరిస్తాను.

**నట్టువ మేళాలు**

**దేవదాసీ సంప్రదాయం**

భారతదేశంలో, ప్రాచీన కాలం నుంచీ లలిత కళలన్నింటికీ దేవాలయాలే పట్టుగొమ్మలు, అట్లా, దేవాలయాల ఆదరణలో పెంపొందిన లలిత కళలలో నృత్య మొకటి. యజ్ఞం చేసే సమయంలో ఋత్విజులు, యువతులు నృత్యంచేసే ఆచారం ఉన్నట్లు ఋగ్వేదాన్ని బట్టి తెలుస్తున్నది. భగవంతుని ఆరాధించే సమయంలో కూడా నృత్యం చేయటం ప్రాచీన సాంప్రదాయమే. ఈ ఆలయ నృత్యకళలో శైవ-వైష్ణవ సంప్రదాయాలున్నవి అంటే ఆయా పూజా విధానాలను నిర్దేశజంచే శాస్త్రాలను అనుసరించి నృత్యాలు రూపొందించబడినవన్నమాట, ఆలయంలో స్వామి సన్నిధిని, అంటే బలిపీఠం మీద జరిగేవి. ఆరాధనా (పూజా) నృత్యాలు! ఇంక కళ్యాణ మంటపంలో వేడుకగా జరిగేవి కేళికా నృత్యాలు. ఇవి రెండూ నట్టువమేళ సంప్రదాయానికి చెందినవి. ఇందులో బలిపీఠం మీద జరిగేది ప్రధానంగా నృత్తము, ఇంక కల్యాణ మంటపంలో జరిగేది ప్రధానంగా నృత్యము, ఈ నృత్యము, ఈ నృత్త-నృత్యాలను దేవదాసీలు నిర్వహిస్తారు, అందునా, స్వామి సన్నిధిని బలిపీఠం మీద నర్తించే అర్హత అధికార ముద్రలను పొందిన దేవదాసీలకే ఉంటుంది. అచ్చట నర్తించే అర్హత ఇతరులకు లేదు.

### బొమ్మలాటలు

ఈ కళారూపాన్ని శాతవాహనులు, పల్లవులు, చాళుక్యులు, కాకతీయులు పోషించి పెంపొందించారు. విజయ నగర చక్రవర్తులు, తంజావూరు ప్రభువుల ఆదరణలో ఇది ఆదరించబడింది.

తెలుగుదేశంలో కొయ్యతోనూ, తోలుతోను, చేసిన ఆటబొమ్మలు ఉపయోగిస్తారు. కొయ్యతో చేసిన బొమ్మల ప్రదర్శనను ఆయా ప్రాంతాలలో "కొయ్యబొమ్మలాట", "కట్టెబొమ్మలాట" అని వ్యవహరిస్తారు.

### తొడుగు బొమ్మలు

ఆంధ్ర ప్రాంతంలోనూ, ఒరిస్సా రాష్ట్రంలోనూ వూరారా తిరిగి బిచ్చం ఎత్తుకునే వాళ్లు ఈ తొడుగు బొమ్మలను ఆడిస్తారు. ప్రదర్శనలో రెండు బొమ్మలను ఒక్కొక్క చేతికి ఒక్కొక్క బొమ్మను తొడుగుకుని ఆడిస్తూ ఆ రెండు బొమ్మల మధ్య సంభాషణ నడిపిస్తారు. బొమ్మను ఆడించే సూత్రధారుడు తన బొటన వ్రేలు వాటిలోనాకి పోనిచ్చేందుకు వీలుంటుంది. ఈ బొమ్మలను చేతి మేజోడు తొడుక్కున్నట్లుగా వ్రేళ్లకు తగిలించుకొని ఆడిస్తారు. బొమ్మ తాలూకు, తల, చేతులు సూత్రధారుడు తన వ్రేళ్ళ సహాయంతో కదిలేటట్లు చేసి ఆడిస్తాడు. బొమ్మను ఆడించేటప్పుడు సూత్రధారుడు తన ముంజేతిని ఎప్పుడూ నిటారుగానే వుంచుతాడు. కాబట్టి బొమ్మ నిలబడినట్లు వుంటుంది.

రంగస్థలాన్ని ఏర్పాటు చేసి చేతిబొమ్మలను చట్రంతో ప్రదర్శిస్తారు. దీనికి మూడువైపుల తెర లుంటాయి. ముందు వైపు పైకీ క్రిందకి కదిలే చిన్న తెరవుంటుంది.

### త్రాళ్ల బొమ్మలు

త్రాళ్ల సహాయంతో ఆడించే బొమ్మలను కొయ్యతోనూ ఇతర పదార్థాలతోనూ చేస్తారు. వాటి ప్రదర్శనను 'బొమ్మలాట' అని వ్యవహరిస్తారు. బొమ్మలను కొయ్యతో చేసినట్లయితే బొమ్మను ఆడించటానికి వీలుగా బొమ్మ తలకు రెండు ప్రక్కలోనూ, మెడ క్రిందనూ, చిన్న రంధ్రాలు చేసి త్రాళ్లు అమరుస్తారు. బొమ్మలు ఆడించేవారు బొమ్మలకు వెనుకగా నిలబడతారు. అందువలన బొమ్మలు, సూత్రాలు, సూత్రధారుడు అటుయిటు కదలేందుకు వీలుంటుంది. కాగడాల రంగస్థలానికి తగిన కాంతి నిస్తాయి. ఈ కాగడాలనున అగ్ని ప్రమాదగం జరగకుండా రంగస్థలానికి కొంతదూరంలో వుంచుతారు.

# 17 తెలుగువారి పండుగలు - జాతర్లు

## Fairs and Festivals of the Telugus

ప్రత్యేకతను సంతరించుకొన్న మన పండుగలు, జాతర్లు తెలుగువారి సాంస్కృతిక వారసత్వాన్ని నేటి తరానికి అందించడమేగాక, దేశీ, విదేశీ పర్యాటకులకు విశేషంగా ఆకర్షిస్తున్నాయి. తెలంగాణా ప్రాంతంలోనే విశేషంగా జరుపుకొనే బోనాలు, బతుకమ్మ, సమ్మక్క-సారక్క, ఏడుపాయల, అయినవోలు, కొమురవెల్లి జాతరలు, ఉత్తరాంధ్రలో జాయ, గుంటూరు జిల్లాలో కోటప్పకొండ తిరునాళ్ళు, ఆయా సందర్భాల్లో జరిగే సాంస్కృతిక ప్రదర్శనలు జనాన్ని ఆకట్టుకొంటున్నాయి. తిరుపతిలోని గంగజాతర చాలా వేడుగ్గా జరుపుకోవటం గమనించదగ్గ విషయం.

రాష్ట్రంలో కాలాలు (రుతువులు) మారినపుడు, వ్యవసాయోత్పత్తులు ఇంటికొచ్చినపుడు, వేసవి నుంచి మళ్లీ వేసవి వరకూ ఎన్నెన్నో పండుగల్ని ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. తెలుగువారి ఆచార వ్యవహారాలను తెలుకోవటానికి పండుగలు, జాతర్లు ఎంతగానో ఉపయోగపడతాయి. కొన్ని కొన్ని పండుగలు, జాతర్లను జరుపుకొనే తీరులో తేడాలున్నా ప్రధానాంశాలన్నీ ఒకే మాదిరిగా ఉంటాయి. పశ్చిమ, తూర్పుదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు మనం జరుపుకునే పండుగలు, ఉత్సవాలు వింతగానూ ఆసక్తికరంగానూ ఉంటాయి.

పండుగలు సంప్రదాయబద్ధమైనవీ, సాంస్కృతికపరమైనవీ అని రెండు రకాలు. ఉగాది, శ్రీరామనవమి, వినాయకచవితి, కృష్ణాష్టమి, దసరా, దీపావళి, సంక్రాంతి, శివరాత్రి మొదటి కోవకు చెందితే, పర్యాటకులను ఆకర్షించటానికి జరుపుకునే పతంగుల పండుగ, కాకతీయ ఉత్సవం, డెక్కన్ ఫెస్టివల్, లుంబినీ ఉత్సవం, విశాఖ ఉత్సవం, విజయనగర్ ఫెస్టివల్, రాయలసీమ ఫుడ్ అండ్ డాన్స్

ఫెస్టివల్‌లు రెండో కోవకు చెందిన పర్యాటకోత్సవాలుగా పేర్కొంటారు. రాష్ట్రంలో ఇంకా, బౌద్ధులు బుద్ధజయంత్యుత్సవం, జైనులు మహావీర్‌జయంతి, ముస్లిములు రంజాన్, బక్రీద్‌లు, క్రిస్టియన్‌లు క్రిస్టమస్, గుడ్‌ఫ్రైడే ఉత్సవాలను జరుపుకుంటారు.

## సంప్రదాయ పండుగల్లో కొన్ని

### ఉగాది



చైత్ర శుద్ధ పాడ్యమి (మార్చి-ఏప్రిల్) నాడు జరుపుకొనే ఉగాది తెలుగువారి తొలి పండుగ. తెల్లవారంగనే స్నానం చేసి, కొత్త బట్టలు కట్టుకొని మామిడికాయ, చింతపండు, బెల్లం, వేపపూలు, నీళ్లు, కొంచెం ఉప్పు కలిపి నూరిన ఉగాది పచ్చడి రుచి చూస్తారు. జీవితం సుఖదుఃఖాలమయం అనే విషయాన్ని రుచి చూచే పచ్చట్లోని పులుపు, చేదు, తీపిరుచులు సూచిస్తాయి. ప్రజలందరూ ఆలయాల వద్దకు చేరుకొని, పండితులు చెప్పే పంచాంగ వివరాలను తెలుసుకొని రాబోయే ఏడాదిపాటు తమ అదృష్టాన్ని, దురదృష్టాల్నీ అంచనా వేసుకొంటారు. ఉగాది తరువాత యువతీయువకులు వరుసలు మరచి ఒకరిపై ఒకరు రంగునీళ్లను చల్లుకొంటూ ఆనందంతో గంతులువేసే వసంతోత్సవాన్ని కూడా జరుపుకుంటారు.

### శ్రీరామనవమి

శ్రీరామునికీ, సీతకు పెండ్లి జరిగిన నవమి రోజున ఈ పండుగ జరుపుకొంటారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, పట్టణం, నగరాల్లోని రామాలయాల్లో కళ్యాణోత్సవాల్ని ఘనంగా జరుపుతారు. ఖమ్మం జిల్లాలో గోదావరీ తీరానగల భద్రాచలంలో శ్రీరామనవమి ఉత్సవాలు, కల్యాణోత్సవం కన్నులపండుగగా జరుపుతారు. మార్చి-ఏప్రిల్ మాసాల్లో జరిగే ఈ వేడుకల్లో ఎంతోమంది భక్తజనంతోపాటు రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొని ప్రభుత్వం తరపున పట్టుపీతాంబరాలు, ముత్యాల తలంబ్రాలను రాములవారికి సమర్పించటం విశేషం. కుతుబ్‌షాహీల కాలం నుంచి వస్తున్న ఈ ఆనవాయితీని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ పాటించటం సంతోషించదగ్గ విషయం.

### కృష్ణాష్టమి

ఆగస్టు-సెప్టెంబరు మాసాల్లో వచ్చే కృష్ణాష్టమిని ఋతుపవనాల రాక సందర్భంగా తెలుగు ఆడపడుచులు ఉత్సాహంగా జరుపుకొంటారు. శ్రావణమాసంగా పిలిచే ఈ నెలలోని అన్ని మంగళవారాల్లో మంగళ గౌరీవ్రతాలను ఆచరిస్తారు. పున్నమికి ముందు శుక్రవారం నాడు మాత్రం వరలక్ష్మీవ్రతం చేస్తారు. స్త్రీలంతా రంగురంగుల బట్టలు ధరించి, ఇంటింటికి వెళ్లి, ఆడపడుచుల్ని తమ ఇళ్లకు ఆహ్వానించి ప్రసాదాలను పంచుతారు. కొన్నిచోట్ల ఉత్తరభారత సంప్రదాయంలో కృష్ణ-గోపికల కోలాటాన్ని ప్రదర్శిస్తూ, ఉట్లను పగలగొడుతూ రాత్రంతా పాటలు, భజనలతో కాలం గడుపుతారు. నగర ప్రజలకోసం హైదరాబాదులోని శిల్పరామంలో కృష్ణాష్టమి వేడుకల్ని వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో మేళవించి జరుపుతారు.

### వినాయక చవితి

భాద్రపద శుద్ధచవితి (ఆగష్టు-సెప్టెంబరు) నాడు రాష్ట్రమంతటా ఆనందోత్సాహాలతో జరుపుకునే మరో పండుగ వినాయకచవితి. పార్వతీపరమేశ్వరుల కుమారుడైన గణపతిని, తమ ప్రయత్నాల్లోగానీ, పనుల్లోగానీ అడ్డంకులు కల్పించవద్దని వేడుకొంటూ పండుగను జరుపుకొంటారు. పొద్దున్నే నిద్రలేచి, స్నానాలు చేసుకొని ఊరు బయటి పొలాల్లోంచి 21 రకాల ఆకులను తెచ్చి, మట్టితో చేసిన వినాయకుని బొమ్మను ఇంట్లో అందంగా అలంకరించి, పూజలు చేస్తారు. విద్యార్థులు పుస్తకాలను, పెద్దలు పాయసం, వడపప్పు, చలిమిడి, కుడుములు, ఉండ్రాళ్ళను వినాయకుని ముందుంచి పూజిస్తారు. సాయంత్రం వినాయక వ్రతకల్పంలోని కథను చదివి, అపనిందలు రాకుండా చూచుకొంటారు. ఇటీవల ప్రతిచిన్న గ్రామంలోను పెద్ద వినాయక విగ్రహాన్నుంచి తొమ్మిది రోజుల పూజ తరువాత స్థానిక చెరువులో నిమజ్జనం చేసి పండుగను ముగిస్తున్నారు. హైదరాబాదులో కొన్నివేల గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి, తొమ్మిదో రోజున ఊరేగింపుగా వెళ్లి హుస్సేన్‌సాగర్‌లో గానీ సమీపంలోని చెరువుల్లోగానీ నిమజ్జనం చేసి వస్తున్నారు. కొన్ని కిలోమీటర్ల పొడవున సాగే గణేశ్ ప్రతిమల ఊరేగింపు రాష్ట్ర ప్రజలనేకాక, విదేశీ పర్యాటకుల్ని సైతం విశేషంగా ఆకట్టుకొంటుంది.

### బతుకమ్మ పండుగ

ప్రతి ఏడాది ఆశ్వయుజమాస పెత్రమాసనాడు ప్రారంభమయి అష్టమినాడు ముగుస్తుంది. ఈ పండుగలో మొదటిరోజు బతుకమ్మను తంగేడు, గునుగు, గుమ్మడి పూలతో పేర్చి గౌరమ్మగా పూజ చేస్తారు. గౌరమ్మ శివుడు భార్య పార్వతికి మరోపేరు



కాబట్టి మొదటిరోజు శివాలయాల్లో బతుకమ్మలు ఆడుతారు. రెండో రోజు నుంచి చివరిరోజు వరకు చెరువులు, దేవాలయాలవద్ద బతుకమ్మలు ఆడి నిమజ్జనం చేస్తారు. బతుకమ్మను నిమజ్జనం చేసే తొమ్మిదవ రోజును సద్దులబతుకమ్మ అని అంటారు. బతుకమ్మకు సద్దికట్టి పంపుతూ, మళ్ళీ వచ్చే ఏడాదికి రమ్మని ఆహ్వానం పలుకుతారు. బతుకమ్మ పండుగలో మరోఆసక్తికరమైన అంశం ఏమంటే వాయనం ఇచ్చిపుచ్చుకోవడం అంటే ఒకరిదిఒకరు పంచుకొంటారు. బతుకమ్మకు ఆరగింపుచేసే ఫలహారంతోపాటు (సత్తుపిండి, పల్లిపిండి, సజ్జపిండి, బెల్లం నెయ్యి కలిపిన పిండిముద్దలు) అనుభవాలను అనుభూతులను పంచుకుంటారు. ఈ పండుగ పల్లెజీవన శైలితోపాటు, సహజసిద్ధంగా జరుపుకుంటారు.

తెలంగాణాలో దసరాపండుగకు ముందు స్త్రీలంతా అంకితభావంతో సద్దుల 'బతుకమ్మ' పండుగ జరుపుకొంటారు. తెలుగుదనం ఉట్టిపడేలా పట్టుచీరలు ధరించి బతుకమ్మల నెత్తుకొని ఊరూ, వాడా కలిసి మహిళా సముద్రంలా కనిపించే స్త్రీలు చప్పుళ్లతో వెళ్లి బతుకమ్మలను గుండ్రంగా పెట్టి లయబద్ధంగా చప్పట్లుకొడుతూ, గౌరమ్మను స్తుతిస్తూ పాటలు పాడుతారు. ఆతరువాత చెరువుల్లో నిమజ్జనం చేస్తారు.

### దసరా

ఆశ్వయుజ (సెప్టెంబర్-అక్టోబర్) మాసంలో తొమ్మిది రోజులపాటు రాష్ట్రమంతటా 'దసరా' లేక 'దేవీనవరాత్రులు' జరుపుతారు. దుర్గ లేక స్త్రీశక్తిని, మహిషాసురమర్థినిగా తొమ్మిదిరోజులు, తొమ్మిదిరకాల అలంకారాలతో పూజిస్తారు.

దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమి రోజుల్లో విశేషంగా పూజిస్తారు మహాభారత, రామాయణ కాలాలనుంచి ఆచారంగా వస్తున్నట్లు పేర్కొంటున్న దసరా రోజున విజయవాడ కనకదుర్గ, వరంగల్ భద్రకాళి దేవాలయాల్లో ఘనంగా ఉత్సవాలను జరుపుతారు. ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో, దేవిని అన్ని ఆభరణాలతోనూ అలంకరించి చేసే ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచీ భక్తులు విపరీతంగా వస్తారు. కృష్ణానది జలాశయంలోను, భద్రకాళి చెరువులోను జరిగే హంసవాహన తెప్పోత్సవం పర్యాటకుల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది. వివిధరకాల వృత్తి పనివాళ్లు, కార్మికులు, తమతమ పనిముట్లకు ఈరోజు పూజలు చేయటం ఆనవాయితీ. వరంగల్‌లోని రంగలీల మైదానంలో దుష్ట సంహారానికి ప్రతీకగా రావణాసురుని విగ్రహాన్ని ఏర్పాటుచేసి బాణా సంచాలతో పేల్చుతారు. ఈ సంబరాలు చూడటానికి పరిసర ప్రాంతాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటారు ఈ సాంప్రదాయం రాష్ట్రంలోని అనేక ఆచారాలతోను నిర్వహించబడుతుంది.

**దీపావళి**



కార్తీకమాసం (అక్టోబర్-నవంబర్) లో వచ్చే దీపావళిని రాష్ట్రంలోని ప్రజలంతా వేడుకగా, ఆనందోత్సాహాలతో జరుపుకొంటారు జీవితాల్లోని చీకట్లను పారదోలి వెలుగులు నింపే ఈ పండుగనాడు, సత్యభామ, నరకాసురుని జయించిందనీ, జనాన్ని బాధలు పెట్టిన నరకుడు చనిపోయినందుకు ఆనందంతో దీపాలను వెలిగించి ఉత్సవాన్ని జరుపుకొనడంతో ఈ పండుగ ప్రారంభమైందనీ ప్రజలు నమ్ముతారు. ఉదయం స్నానాలు ముగిసిన తరువాత లక్ష్మీదేవిని పూజించి, సాయంత్రం దీపాలతో ఇళ్లన్నీ అలంకరించుకొని, టపాకాయల మోతల్లో కాకరపువ్వొత్తులను, చిచ్చుబుడ్లను వెలిగించి తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తారు. పిల్లలూ, పెద్దలూ పటాసులు పేల్చటానికి పోటీపడుతూ, నవ్వుతూ జరుపుకొనే ఈ పండుగనాడు, వ్యాపారస్తులు తమ కొత్త ఖాతా పుస్తకాలను తెరుస్తారు. కేదారేశ్వర వ్రతాన్ని, లక్ష్మీపూజలను కూడ జరుపుతారు కొత్త అల్లుళ్లను ఆహ్వానించి కొత్త బట్టలు, కూతుళ్ళకు బంగారం కానుకగా ఇస్తారు.

## సంక్రాంతి

గ్రామీణ ప్రాంతాల్లో వేడుకగా జరుపుకొనే మరో పండుగ సంక్రాంతి. కొత్త పంటలు చేతికివచ్చిన ఆనందంలో జరుపుకొనే సంక్రాంతి తెలుగువారి పెద్ద పండుగల్లో ముఖ్యమైనది. జనవరి నెల 13, 14, 15 తేదీల్లో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలుగా మూడు రోజులపాటు జరిపే ఈ వేడుకల్లో అందరూ కొత్త బట్టలు కొనుక్కొని, ఇళ్లన్నీ అలంకరించుకొని వ్యవసాయోత్పత్తులు ఇంటి నిండా కనిపిస్తుండగా, కొత్త అల్లుళ్లను ఇంటికి ఆహ్వానించి కొత్తబట్టలు పెట్టి, కొత్తబియ్యంతో పొంగలి చేసుకొని విందారగిస్తారు. వ్యవసాయదారులు తమ ఎద్లను అలంకరించి పూజిస్తారు. గంగిరెద్దులను ఊరంతా తిప్పుతూ మోగించే సన్నాయి, డోళ్లు పండుగ వాతావరణాన్ని కల్పిస్తాయి. స్త్రీలు ముగ్గులు వేయటంలోనూ, పిల్లలు గొబ్బెమ్మలను పెట్టటంలో మునిగిపోతారు. హరిదాసుల కీర్తనలు, చెక్కభజనలతో వీధులన్నీ మారుమోగుతుంటాయి. పొద్దున్నే పిల్లలు గాలిపటాలనెగరేయటంలో ప్రారంభమయే వేడుకలు పెద్దల్ని కూడ పాల్గొనేట్టు చేస్తాయి. రంగురంగుల కాగితాలు, ప్లాస్టిక్ మెటీరియల్‌తో వింత వింత ఆకారాల్లో వివిధ సైజుల్లో తయారుచేసిన గాలిపటాలు ఒకదానితో ఒకటి పోటీపడుతూ కొన్ని తెగిపోతూ మరికొన్ని ఎగిరిపడుతూ సరదా కలుగజేస్తుంటాయి. అంతర్జాతీయ గాలిపటాల ఉత్సవాలు మరింత పండుగ వాతావరణాన్ని కలుగజేస్తాయి.

## శివరాత్రి

శివునికీ, పార్వతికి కళ్యాణం చేసే శివరాత్రిని పండుగను ఫిబ్రవరి–మార్చి నెలల్లో జరుపుకొంటారు. స్నానాలు చేసి శివాలయాలకు వెళ్లి పూజలు నిర్వహిస్తారు. పగలంతా ఉపవాసం, రాత్రికి జాగరణముండే ఈ పండుగనాడు, శివాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించడమేకాక, ఆలయాలచుట్టూ, ఎత్తైన ప్రభ బళ్లు తిరగటం మహాసరదాగా ఉంటుంది. చుట్టు ప్రక్కల ఊళ్లు ఒకదానితో ఒకటి పోటీపడి, పొడవైన ప్రభలను నిర్మించి, అలంకరించి తమ గొప్పతనాన్ని చాటుకొంటాయి. రాష్ట్రంలోని ప్రధాన శివాలయాలైన శ్రీకాళహస్తి, మహానంది, శ్రీశైలం, వేములవాడ, కాళేశ్వరం, ద్రాక్షారామం, కీసరగుట్ట, అమరావతి, కోటప్పకొండల వద్ద శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. గుంటూరు జిల్లాలోని కోటప్పకొండ వద్ద జరిగే శివరాత్రి ఉత్సవాల్లో ఎడ్ల పందాలు, ప్రభలు, భజనలు, డాన్సు పోటీలు జరుగుతాయి.

**బుద్ధ జయంతి**

సిద్ధార్థుని పుట్టుక, జ్ఞానసముపార్జన, బుద్ధుని మహాపరినిర్వాణం జరిగిన బుద్ధపూర్ణిమ (వైశాఖపూర్ణిమ) నాడు రాష్ట్రంలోని బౌద్ధులు అత్యంత ఉత్సాహంతో, భక్తిశ్రద్ధలతో బుద్ధ జయంతిని జరుపుకొంటారు సికింద్రాబాదు మహేంద్రహిల్స్‌లోనున్న ఆనంద బుద్ధ విహారంలో ఉదయం బుద్ధవందనం, పంచశీల పఠనం, ధమ్మోపదేశనం జరుగుతాయి. అలాగే నగరంలోని త్రైలోక్య, జేతవన, నాగధమ్మ బుద్ధవిహారాలు, విశాఖపట్నంలోని విశాఖ బుద్ధవిహారం, రాజమండ్రి, కాకినాడ, ఆదుర్రు, విశాఖ దగ్గరి పెంబర్తి ఏలూరుల్లోని బుద్ధవిహారాలు బుద్ధజయంతిని ఘనంగా జరుపుకొంటారు.

ప్రభుత్వపరంగా హైదరాబాదులోని బుద్ధపూర్ణిమ, లుంబినీపార్కు, హుసేన్‌సాగర్‌లోని బుద్ధవిగ్రహం వద్ద ప్రత్యేక కార్యక్రమాలతో పాటు నెక్లెస్‌రోడ్డులో బుద్ధుని ధాతువులు, రాష్ట్రంలోని బౌద్ధ కట్టడాలు, సంస్కృతిపై ఫోటోప్రదర్శన, మూడురోజులపాటు బౌద్ధ సంబంధమైన సాంస్కృతిక కార్యక్రమాలు, అలాగే నాగార్జునసాగర్, అమరావతిలో కూడ బుద్ధజయంత్యుత్సవాలు జరుగుతాయి.

**మహావీర్ జయంతి**

జైనతీర్థంకరుడైన వర్ధమాన మహావీరుని జన్మదినాన్ని మహావీర్ జయంతిగా రాష్ట్రంలోని జైనులు అత్యంత వైభంగా జరుపుకొంటారు మహావీరుని త్యాగమయ జీవితాన్నీ, బోధలను గుర్తు చేసుకొంటూ, నల్లగొండ జిల్లాలోని కొలనుపాక, అనంతపురం జిల్లాలోని కొనకండ్ల, హైదరాబాదులోని చైతన్యపురి, గుంటూరు జిల్లాలోని మంగళగిరి వద్దగల (హీంకార తీర్థం) జైనదేవాలయాల వద్ద పూజలు నిర్వహించి ఊరేగింపులతో మహావీర్ జయంతిని జరుపుతారు.

**రంజాన్**

కఠిన నియమాలతో నెలరోజులపాటు ఉపవాసముండే ముస్లింలు రంజాన్ పండుగను గొప్పగా జరుపుకొంటారు. ఈ సందర్భంగా బీదవారికి బట్టలు, డబ్బు దానం చేస్తారు. ఉపవాసదీక్ష వంటికి మంచి చేయటంతోపాటు, కుటుంబసభ్యులు, ఇతర మానవులు సుఖసంతోషాలతో బతికేట్లు చేస్తున్న దేవునికి కృతజ్ఞతలు తెల్పే వ్రతంగా కూడా రంజాన్‌ను పేర్కొంటారు. బక్రీదు పండుగను కూడా రాష్ట్రంలోని ముస్లింలంతా భక్తి, శ్రద్ధలతో జరుపుకొంటారు.

**క్రిస్మస్**

జీసస్‌క్రీస్తు జన్మదినమైన క్రిస్మస్‌ను రాష్ట్రంలోని క్రైస్తవలందరూ తమ ఇళ్ళపై నక్షత్రాలతో అలంకరించుకొంటారు చర్చిలను రంగురంగు విద్యుద్దీపాలతో

అలంకరించి ఆనందోత్సాహాలతో జరుపుకొంటారు. స్నేహితులు, ఇతర మతాల వారిని తమ ఇళ్లకు ఆహ్వానించి, విందులనిచ్చి జరుపుకొనే క్రిస్‌మస్ క్రైస్తవుల ముఖ్యమైన పండుగ.




**మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర**

మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర భారతదేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగడించింది. మన రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండేగాక మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిషా, చత్తిస్‌ఘడ్ రాష్ట్రాలనుండికూడ భక్తులు అధికసంఖ్యలో పాల్గొంటారు. ఈ జాతరకు వచ్చే భక్తుల్లో గిరిజనులతోపాటు గిరిజనేతరులుకూడా అమ్మలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకొంటారు. ఈ జాతరను రాష్ట్రప్రభుత్వం 1996 ఫిబ్రవరి 1న స్టేట్ ఫెస్టివల్‌గా ప్రకటించి జాతరను ప్రభుత్వమే నిర్వహిస్తుంది.

ప్రతి రెండెళ్ళకోసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజులలో మూడు రోజులపాటు ఆదివాసీ గిరిజనుల సంస్కృతి ఆచార, సంప్రదాయాలతోపాటు కులం కట్టుబాట్లు ఆధారంగా విగ్రహాలు లేకుండా కేవలం గద్దెలపై పసుపు కుంకుమ, బంగారం (బెల్లం) సమర్పించి పూజిస్తారు. కులమతాలకు అతీతంగా భక్తులు దర్శించుకుంటారు. సహజసిద్ధంగా లభించే ఇప్పపువ్వు నుంచి తీసిన స్వచ్ఛమైన ద్రవాన్ని అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించిన తరువాత పూజారులు ఆద్రవాన్ని సేవించి తన్మయం పొందుతారు.

జాతరకు సంబంధించిన చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే, కాకతీయుల కాలంలో మేడారం ప్రాంతం గిరిజన కోయ రాజైన పగిడిద్దరాజు ఆధీనంలో ఉండేది. వీరి పాలనలో వరుసగా నాలుగేళ్లపాటు కరువు సంభవించగా కప్పం కట్టడానికి పగిడిద్దరాజు నిరాకరించాడు. కోపోద్రిక్తుడైన కాకతీయ ప్రతాపరుద్రుడు పగిడిద్దరాజును అణచడానికి పెద్దసైన్యాన్ని పంపగా గిరిజన సేనలు సంపెంగ వాగు వద్ద కాకతీయ సేనల దాడికి తట్టుకోలేక గిరిజన సైన్యం నిలువలేకపోయింది. ఈ యుద్ధంలో పగిడిద్దరాజుతో పాటు కుమార్తెలైన నాగులమ్మ, సారలమ్మ, అల్లుడు గోవిందరాజులు వీరమరణం పొందారు. కుమారుడు జంపన్న కాకతీయ సేనలను నిలువరించలేక శత్రువు చేతిలో మరణం అవమానమని తలంచి సంపెంగ వాగులో దూకి ఆత్మహత్య చేసుకొన్నాడు. నాటి నుండి ఈ వాగు జంపన్నవాగుగా



పిలువబడుతుంది. తరువాత కుమార్తె సారలమ్మతో కలిసి సమ్మక్క యుద్ధరంగంలో అపరకాళిలా విజృంభించి కాకతీయ సేనలను మట్టుపెట్టుచుండగా, కాకతీయ సైనికుడు దొంగ చాటుగా సమ్మక్కను బళ్ళెంతో పొడిచాడు. గాయంతో సమ్మక్క యుద్ధభూమి నుండి ఈశాన్య దిశగా చిలుకలగుట్టవైపు వెళ్ళి అదృశ్యమైంది. గిరిజన సైనికులు ఆమె కోసం వెతకగా నాగవృక్షం క్రింద పుట్టదగ్గర పసుపు, కుంకుమలతో కూడిన భరిణె వారికి లభించింది. నాటి నుండి భరిణెను సమ్మక్క గుర్తుగా భావించి ప్రతి రెండెళ్ళకోసారి కష్టాలు కడతేర్చే దేవతగా కొలుస్తూ పూజలు చేయనారంభించారు. అదే సమ్మక్క, సారలమ్మ జాతరగా, లక్షలమందిని ఆకర్షిస్తుంది.

**గంగ జాతర**

ప్రతిసంవత్సరం మే – జూన్ మాసాల్లో 9 రోజుల పాటు నిర్వహించే గంగ జాతర రాయలసీమ జిల్లాల్లోని చిత్తూరు జిల్లాలో ఘనంగా నిర్వహించబడతాయి. ఊరిలో ప్రతిష్ఠించబడిన గంగశిల వద్ద పాత్ర పెట్టి ఊరిప్రజలందరూ రాగిఅంబలి, ఉల్లిగడ్డ, మజ్జిగతో కలిపిన పదార్థాలను పాత్రలో పోస్తారు. దీనిని ప్రసాదంగా భావించి గ్రామస్తులందరూ సేవిస్తారు. ఇది సాధారణంగా మంగళవారం ప్రారంభమై తొమ్మిది రోజులు పాటించబడుతుంది. ఈ జాతరలో వివిధ రకాలైన విచిత్ర వేషధారణలు వేసుకొని ఒళ్ళంతా గంధం పూసుకొని, వేపాకులు ధరించి దేవతకు తమ మ్రొక్కులు చెల్లించుకుంటారు మరికొందరు బైరాగి వేషం ధరిస్తారు. మగవారు ఆడవేషం కూడా ధరించటం ఇక్కడి ప్రత్యేకత. రాత్రి కలలో వచ్చిన వేషాలను మరునాడు ధరిస్తారు.



ఈ జాతరలో జంతుబలి నిషేధం. ఈ జాతర ప్రధానంగా తిరుపతి, పలమనేరు, కుప్పం, అవిలాల ప్రాంతాలలో జరుతుంది. ఇవే కాకుండా ద్రౌపది తిరునాళ్ళు, మాతమ్మ కొలుపులు కూడా బహుళ ప్రాచుర్యంలో వున్నాయి.

## ప్రభల తీర్థం

కోనసీమ తలమానికంగా భక్తులు నిర్వహించుకొనే జాతరలో ప్రభల తీర్థం ఒకటి. ముఖ్యంగా అంబాజీపేట గ్రామంలో ఘనంగా నిర్వహించబడుతుంది. ఈ గ్రామానికి చుట్టుప్రక్కల గ్రామాలనుండి షోడశ రుద్రుల పేరుతో శివుని ప్రతిష్ఠించి 11 ప్రభల బండ్లను లాగుతూ కౌశికీ నది ఒడ్డున ఈ జాతర జనసంద్రంగా జరుగుతుంది.





మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర

ACC No. 118756

ఏ ప్రాంత చరిత్ర, సంస్కృతుల పట్ల ఆ ప్రాంత ప్రజలకు మక్కువ వుంటుంది. మమకారం కూడా వుంటుంది. అయితే వారి పుట్టుపూర్వోత్తరాలు, సంస్కృతి, సంప్రదాయాల గురించి అందరికి అవగాహన ఉన్నపుడే ఘనమైన వారి వారసత్వాన్ని కాపాడుకోవాలన్న తపన పుడుతుంది. విద్యార్థిదశ నుంచే గ్రామాలు, పట్టణాలు, నగరాల చరిత్రను, కట్టడాలను,కళలను గురించి వివరించినప్పుడే వారసత్వ పరిరక్షణలో అందరూ భాగస్వాములౌతారు. విద్యార్థులను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే. అందుకనే ముందుగా ఉపాధ్యాయులకు వారసత్వ సంపద గురించి తెలియజెప్పి, వారి ద్వారా విద్యార్థులకు తెలియజేయాలన్న సంకల్పంతో ఉపాధ్యాయ, విద్యార్థులకు చేదివ్వెగా ఉపయోగపడాలన్న ఉద్దేశ్యంతో తెలుగు వారి వారసత్వం అన్న పుస్తకాన్ని తీసుకురావటం నాకెంతో సంతోషంగా వుంది.

– **చెన్నూరు ఆంజనేయరెడ్డి,** ఐ.పి.యస్.(రి)

PSBH
ప్రజాశక్తి బుక్‌హౌస్